UNIVERSAL LIBRARY
OU_204300
UNIVERSAL LIBRARY

OUP 881 -5-8-74 -15,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 294.1 Accession No. T 938

Author

Title

This book should be returned on or before the date last marked below

ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల. 31.

# శివపురాణము,

## (రెండవసంపుటము.)

వేంకటపార్వతీశ్వరకవులచే
ఆంధ్రీకరింపఁబడినది.

మొదటికూర్పు, 2000,

అడ్డేపల్లి లక్ష్మణస్వామి,
ప్రెసిడెంటు. ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయము,
రాజమంద్రి.

1922

వెల రు 1—8—0.

శ్రీరామచంద్ర

# విజ్ఞాపనము.

---

కారణాంతరములచే మేమీగ్రంథనిలయమును కాకినాడకు మార్చవలసివచ్చుటవలన నీరెండవసంపుట మాఱుమాసములక్రిందటనే ముద్రితమైనను చందాదారులకుఁబంపుట కింత యాలస్యమైనది. ఇప్పుడీగ్రంథనిలయమును కాకినాడకు మార్చినాము. సక్రమముగ గ్రంథములు వెలువడుటకుఁ దగినయేర్పాటులుజరిగినవి. ఇంతటినుండి మాచందాదారులు ఉత్తరప్రత్యుత్తరములు కాకినాడకు మా పేరనే జరుపఁగోరుచున్నారము.

చైత్రమాసమునుండి భాషావిషయికముగ "సురాజ్యాలోకము" అనుమాసపత్రికను బ్రకటించుచున్నారము. దానికిసం॥ రపుచందా రు 3-0-0. మా ఆంధ్రప్రచారిణీచందాదారులకు రు2-8-0లుమాత్రమే. వలయువారుచందాదారులుగాఁ జేరఁగోరెదము.

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము,
కాకినాడ.

వేంకటపార్వతీశ్వరకవులు,
5-3-23.

# రాజపోషకులు.

మ. రా. శ్రీ  శ్రీమహారాజా రావువేంకటకుమారమహీపతి సూర్యా
రావు బహద్దరువారు, శ్రీపీఠికాపురము
మహారాజావారు, పిఠాపురము.

... శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు,
ఉయ్యూరువగైరా యెస్టేట్ల జమీందారుగారు,
నూజవీడు.

... శ్రీ రాజా నాయని వేంకటరంగారావు బహాద్దరు జమీం
దారువారు, మునగాల.

... శ్రీ రాజా బలుసు బుచ్చిసర్వారాయుడు బహద్దరువారు,
కపిలేశ్వరపురము, కేశనకుర్రు వగైరా యెస్టేట్ల
జమీందారుగారు, కపిలేశ్వరపురము.

... శ్రీ రాజా కందుకూరి లక్ష్మీప్రసాదరావు బహద్దరువారు,
జమీందారు, ఉర్లాం.

... శ్రీ రాజా సురభి లక్ష్మారావుబహద్దరువారు, రాజా ఆఫ్
జటప్రోలు.

... శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడుప్రసాద్ బహద్దరు
బి. ఏ. గారు, కుమారం రాజావారు, చల్లపల్లి.

... శ్రీ రాజా ఋనుగంటిసూర్యప్రకాశ రావుగారు, ఉండూరు.

... శ్రీకలిదిండి వేంకట రామరాజుగారు, భీమవరము.

... శ్రీకొవ్వూరి సూర్యనారాయణరెడ్డిగారు, జమీందారు,
కాకినాడ.

... శ్రీకర్రి చినవేంకటరెడ్డిగారు, మర్చంటు, రంగూన్.

## రాజపోషకులు.

మ. రా. శ్రీ శ్రీ రాజా వత్సవాయి వేంకట సుభద్రయ్యమ్మ జగపతి బహద్దరు జమీందారిణీవారు, తుని.

---

## రాజపోషకులు.

మ. రా. రా. శ్రీ కోనాల చినవేంకటరెడ్డిగారు, రంగూన్.

... ముత్యాల సుబ్రహ్మణ్యంగారు, రంగూన్.

... వనచర్ల సత్తెయ్యగారు, రంగూన్.

... బత్తుల బసవయ్యగారు, రాజమండ్రి.

... వెలగల గోవిందరాజులు గారికుమారులు వెంకటరెడ్డిగారు, ఇతిహాసతరంగిణీగ్రంథమాలా సంపాదకులు, రంగూన్.

# పోషకులు.

మ. రా. రా. శ్రీ పండా్రిజు వీరా్రిజుగారు, కాకినాడ.

... కొప్పూ్వారి వేంకటరెడ్డిసోదరులు, పిట్టలవేమవరము.

... కర్రి పల్లారెడ్డిగారు, మారుటేరు.

... తేతల గంగిరెడ్డిసోదరులు. పెనుగొండ.

... అర్జి వెంటయ్యగారు, నరసాపురము.

... టి. యల్. నరసింహారావుగారు, మారుటేరు.

... వామదేవు ఆదినారాయణగారు, రంగూన్.

... మామిడి ఆదినారాయణగారు, రంగూన్.

... కర్రి వేంకటరెడ్డిగారు, రంగూన్.

... చిర్ల అమ్మిరెడ్డిగారు, రంగూన్.

... చిత్తూరు నారాయణస్వామిగారు, రంగూన్.

... సి. హెచ్. వి. సుబ్బారెడ్డిగారు, మారుటేరు.

... పులగం వెంకన్నగారు, మారుటేరు.

# పోషకులు.

మ. రా. రా. శ్రీ దివాన్ బహదూర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణ మూర్తినాయుడుగారు, కాకినాడ.

... వాడ్రేవు వేంకటరత్నముపంతులుగారు, పిఠాపురం.

... చ్యాగంపూడి రామారెడ్డిగారు, అనపర్తి.

... గోర్తిణమురాజు వేంకటరమణారావుపంతులుగారు, మొఖాసాదారు, తణుకు.

... సారంగు రామసుందరరావు పంతులుగారు, బి. ఏ. ప్లీడరు, తణుకు.

... మల్లెల శివరామకృష్ణయ్యగారు, ప్రొప్రయిటరు, రాయపూడి.

... బందా సూర్యనారాయణగారు, బి. ఏ. యల్. టి. కర్నూలు.

# విన్నపము.

ఇది శివపురాణమునకు రెండవసంపుటము. ఇందు జ్ఞానసంహిత యందలి శిష్టభాగంబును, విద్యేశ్వర కైలాససంహితలు సంపూర్ణము లుగను బ్రకటింపఁబడియెను. తక్కిన సనత్కుమారసంహిత, వాయవీయసంహిత, ధర్మసంహిత యను మూఁడుసంహితలును గ్రమంబుగ నిట్లే సంపుటములుగఁ బ్రకటించెదము. శాశ్వతంబగు పురాణవాఙ్మయము నాంధ్రభాషాప్రపంచమున సుస్థిరంబుగ నెలకొల్పుటకై మాకావించు సత్ప్రయత్నం బీవిధంబుగఁ గ్రమాభివృద్ధిఁ గాంచుచున్నం దులకు మేమానందించుచున్నాము. శ్రవణమననాదులచే నిరంతర గ్రాహ్యంబులును సర్వధర్మవిశిష్టంబులునగు పురాణంబుల ప్రయోజ నంబును భాషాభిమానులగు మాచందాదారులు గ్రహించి మాకుఁ బ్రోత్సాహముఁ గల్పించుచున్నందులకు మేము వారికిఁ గృతజ్ఞులమై యున్నాము.

ఆంధ్రభాషాపోషకులును, ప్రభువులును భాషాభిమానులును చిరకాలమునుండి భాషాసేవచేయుచున్నమాయుద్దేశము నామోదించి మాపరిశ్రమంబును సార్థకంబుగావింతురని నమ్మియున్నాము.

పరమపవిత్రంబును, బరమధర్మంబును, బరమంబునగు నీమహ కార్యంబు నిరంతరాయంబుగ సంపన్నంబు గావించునట్లు సర్వనియంతయు, సర్వరక్షకుండును, సర్వజ్ఞుండునగు సర్వేశ్వరునిఁ బ్రార్థించు చున్నాము.

వెంకటపార్వతీశ్వరకవులు.

# అభినందనము.

సనాతనధర్మప్రియులును, ఋజుమార్గప్రవర్తకులును, విశాఖపట్టణంబున సుప్రసిద్ధన్యాయవాదులును, ధనాఢ్యులును, నస్మదీయహితాకాంక్షులును నగు బ్రహ్మశ్రీ మహారాజశ్రీ ఆకెళ్ళ సూర్యనారాయణరావు పంతులుగారు పురాణాంధ్రీకరణమునందలి మాయుత్సాహప్రయత్నముల నాదరించి, మాయుద్యమంబు సఫలంబగుట కాశీర్వదించి, మాకుఁ బ్రోత్సాహకరంబుగ నిలయమునకు రాజపోషకులుగానుండుట కంగీకరించి యెల్లవిధంబుల నిమ్మహత్కార్యంబునకుఁ దోడ్పాటుఁ గూర్చెదమని మాటయిచ్చినందులకు మేము వారి నెంతయు నభినందించుచున్నారము.

సర్వరక్షకుం డగుపరమేశ్వరుండు సత్కార్యాచరణపరాయణులగు శ్రీపంతులుగారి కత్యధికాయురారోగ్యైశ్వర్యంబుల నొసంగుఁగాక !

వేంకటపార్వతీశ్వరకవులు.

# విషయసూచిక.

## విద్యేశ్వరసంహిత.


| | | | |
|---|---|---|---|
| 1. | నృసింహావతారము | ... | 253 |
| 2. | హిరణ్యకశిపువధ | ... | 259 |
| 3. | నలదమయంతుల పూర్వవృత్తాంతము | ... | 267 |
| 4. | పాండవులు దుర్వాసుని బ్రీతుంజేయుట | ... | 271 |
| 5. | పాండవులకు వేదవ్యాససాక్షాత్కారము | ... | 272 |
| 6. | అర్జునునకు వ్యాసోపదేశము | ... | 273 |
| 7. | పార్థునకింద్రుండు ప్రసన్నుండగుట | ... | 277 |
| 8. | కిరాతార్జునీయము | ... | 280 |
| 9. | శివభృత్యార్జునసంవాదము | ... | 284 |
| 10. | శివార్జునుల ద్వంద్వయుద్ధము | ... | 288 |
| 11. | పార్థివ శివపూజావిధి | ... | 292 |
| 12. | బిల్వేశ్వరమహాత్మ్యము | ... | 296 |
| 13. | విష్ణునకు సుదర్శనచక్రప్రాప్తి | ... | 299 |
| 14. | శివరాత్రి వ్రతమహాత్మ్యము | ... | 301 |
| 15. | శివరాత్రి వ్రతోద్యాపనవిధి | ... | 308 |
| 16. | వ్యాధచరిత్రము | ... | 311 |
| 17. | వేదనిధిచరిత్రము | ... | 319 |
| 18. | ముక్తిలక్షణము | ... | 323 |
| 19. | బ్రహ్మనిరూపణము | ... | 324 |
| 20. | జ్ఞానప్రశంస | ... | 327 |
| 21. | సాధ్యసాధనాది నిరూపణము | ... | 338 |
| 22. | మననాది స్వరూపనిరూపణము | .. | 336 |
| 23. | లింగపూజా సాధనకథనము | ... | 337 |
| 24. | బ్రహ్మవిష్ణువుల పరస్పరయుద్ధము | ... | 340 |
| 25. | తేజోమయలింగప్రాదుర్భావము | ... | 343 |
| 26. | భైరవుండు బ్రహ్మశిరంబును ఖండించుట | ... | 346 |
| 27. | బ్రహ్మవిష్ణువులు శివుని బూజించుట | ... | 348 |
| 28. | శివతత్త్వోపదేశము | ... | 351 |

29. కృత్యపంచకలక్షణము ... 352
30. ప్రణవస్వరూపకథనము ... 353
31. శివలింగప్రతిష్ఠాపన విధానము ... 356
32. తీర్థక్షేత్రప్రశంస ... 362
33. సదాచారనిరూపణము ... 366
34. పంచమహాయజ్ఞకథనము ... 374
35. దినవిశేషంబున దేవపూజావిధి ... 375
36. దేశకాల విశేషపూజాఫలము ... 378
37. పార్థివప్రతిమాపూజావిధి ... 384
38. ప్రణవమహాత్మ్యము ... 393
39. జపయోగిలక్షణము ... 396
40. బంధముక్తిస్వరూపకథనము ... 406
41. లింగక్రమకథనము ... 409
42. శాంతిక్రియాకథనము ... 415

కైలాససంహిత.

43. ప్రణవార్థనిరూపణము ... 422
44. ప్రణవయంత్రవిధానము ... 431
45. ప్రణవోద్ధారణము ... 434
46. శంకరపూజావిధానము ... 440
47. గురుపూజావిధానము ... 441
48. గణసహిత శివపూజావిధి ... 441
49. సూతుని పునరాగమనము ... 454
50. కుమారవామదేవ సంవాదము ... 457
51. ప్రణవోపాసనవిధానము ... 460
52. నాందీశ్రాద్ధవర్ణనము ... 462
53. హోమాదివర్ణనము ... 468
54. షడ్విధార్థపరిజ్ఞానము ... 474
55. యోగపట్టాదికథనము ... 490
56. ముక్త్యుపాయవర్ణనము ... 496

శ్రీరామచంద్ర.

# శివపురాణము.

## రెండవ సంపుటము.

## విద్యేశ్వరసంహిత.

—: నృసింహావతారము. :—

మునులారా! అనంతరము హిరణ్యకశిపుండు భ్రాతృవినాశన దుఃఖంబునకుఁ బ్రతీకారంబు సేయందలంచి యయుతవత్సరంబులు బ్రహ్మనుద్దేశించి తపంబు గావించెను. ఆతపస్సమయంబున నాతని శరీరంబున వృక్షంబులు జనియించెను. ఆవృక్షంబులపైఁ బక్షులు కులాయంబులు గట్టుకొనియెను. అట్లయ్యును నిష్ఠాగరిష్ఠుండై యద్దానవుండు దుష్కరతపంబు సేయుచునేయుండెను. అప్పుడు బ్రహ్మదేవుండు సకలదేవతల ననుమతింపఁజేసి యయ్యసురేంద్రునకు సాక్షాత్కరించి వరప్రార్థనంబు గావింపుమనియెను. అంత హిరణ్యకశిపుండు వినయవినమితుండై నమస్కారపూర్వకంబుగ నిట్లు ప్రార్థించెను. స్వామీ! నీవు సృష్టించిన స్థావరజంగమాత్మకంబగు నీజగంబునం దేవస్తువుచేనైనను నాకుఁ జావు లేకుండునట్లు వరంబును బ్రసాదింపుము. అని యిట్లు హిరణ్యకశిపుండు వేఁడుటయు బ్రహ్మ యాతని కవ్వరంబు నొసంగి యంతర్థానుండయ్యెను. అనంతర మాహిరణ్యకశిపుండును శోణితపురంబునకు వచ్చి చతుర్దిశలనుండియు సకలదానవుల నచ్చటికిఁ బిలిపించి పృథ్వీమండలం బంతటను దనశాసనంబును బ్రచారంబు గావించెను. ఆతఁ డవ్విధంబుగఁ దనయాజ్ఞ ననుకరించినవారిని రక్షించుచుఁ దిరస్కరించినవారిని శిక్షించుచు సమస్త

భూమండలమును దనవశంబు గావించుకొని పరిపాలించుచుండెను. క్రమంబుగ హిరణ్యకశిపుండు త్రిభువనంబులను జయించి యాత్మ రాజ్యంబుగఁ జేసికొని భ్రాతృనిధనంబు కారణంబుగ హరిద్వేషియై జగంబున సనాతనధర్మలోపంబు గావించుచు నిరంకుశుండై సంచరించుచుండెను. అనంతరము కొంతకాలంబున కాతనికిఁ బరమవైష్ణవుండగు ప్రహ్లాదుండను నొక తనయుండుదయించెను. ఆకుమారుండు రోదనసమయమునం దైనను హరిసేవను మఱచువాఁడు కాఁడు. ఆప్రహ్లాదుండు పంచవర్షవయస్కుండగుటయుఁ దండ్రిచే విద్యాశిక్షణార్థము గురుసమీపంబునకు నియోజితుండయ్యెను. అప్పు డక్కుమారుండు మంగళవాద్యంబులతోడను సాధువాదంబులతోడను గురుగృహంబున బ్రవేశించెను. గురుం డాతనికిఁ గ్రమంబుగ నాసురవిద్యం బోధింపఁగడంగెనుగాని ప్రహ్లాదుండుమాత్రము సకలపాఠంబులయందును "నమోనారాయణాయ" యను మంత్రమునే యుచ్చరింపందొడంగెను. ఎంత వారించినను నాతఁ డట్లే పఠియించుచుండుటయు గురుండు విసిగికొని యాతని నింటికిఁ బొమ్మనియెను. కాని ప్రహ్లాదుం డెప్పుడును హరినామంబుదక్క మఱియొక్కటిచదువును జపపుట లేదు. ఒకనాఁడు తండ్రియగు హిరణ్యకశిపుండు కొడుకును దొడలపైఁ గూర్చుండఁజేసికొని గురువులయొద్ద నీవేమిచదివితివని ప్రశ్నించుటయుఁ బ్రహ్లాదుండు నమోనారాయణాయ యను పాఠము నుచ్చరించెను. అప్పుడు హిరణ్యకశిపుండు నివ్వెఱపడి దురాత్ముండగు గురుండీబాలున కెట్టిశిక్షణముం గావించినాఁడని యనుకొనుచు గురునిం బిలిపించి యోరి దురాత్మా! నీవు నాకుమారున కిట్టివిద్య నేల కఱపితివి? అజ్ఞుండగు నీబాలకుండు నీమూలంబునం జెడిపోయెనని ధిక్కరించుటయు గురుండిట్లనియెను. మహారాజా! ఈ దురాత్ముఁడే యందఱుబాలకులను జెఱుపుచున్నాఁడు. విశేషించి యేమని మనవి

చేయుదును? అని విన్నవించుటయు దైత్యేంద్రుండు కుమారునిఁజెక్క పట్టుకొని ప్రియురాలగు కయాధుం గాంచి దేవీ! నీకుమారుం డెట్టి యధ్యయనముం గావించెనో యాకర్ణింపు మనియెను. అప్పుడా కయాధువు తనకొమరుని వాక్యంబు నాలకించి యోకుమారా! నీవిట్లు చేసినచో రాజ్యమును బడయఁజాలవు. పైతృకంబగు రాజ్యము నీకు లభింపకున్నచో నీదుఃఖమున కవధి యుండదు. కావున నీవిక హరి నామమును బరిత్యజించి యసుర దేవతారాధనంబు గావింపుమను టయుఁ బ్రహ్లాదుండు జనని కిట్లనియెను.

తల్లీ! నేనెన్నటికిని హరిభజనమును బరిత్యజింప జాలను. భద్రగజంబెప్పటికైనను మశకభయంబున రాజద్వారమును బరిత్యజించునా? నేను సామాన్యవ్యక్తులవలని భయంబున హరిసేవనంబు విడువఁజాలను. నాజిహ్వయును, కర్ణంబులును, మస్తకంబును, హస్తంబులును, పాదంబులును, సకలేంద్రియంబులును హరిసేవనంబున సార్థకంబు లైనవి. ఏమైన నగుఁగాక! నేనెప్పటికిని హరిసంకీర్తనంబు మానఁజాలను. అనుటయుఁ గయాధువు కుమారుని దృఢవచనంబులకు దుఃఖితయై భర్తంగాంచి యీబాలకుఁడెంత చెప్పినను వినకున్నవాఁడు. ఏమిచేయుదు ననియెను. అప్పుడు రాక్షసేంద్రుండు క్రోధాతిరేకంబున మంత్రులను రావించి యమాత్యులారా! ఇక్కుమారుండు నావంశమునం దగ్నిశిఖంబోలి యుదయించినాఁడు. కులదూషకుండగు నీతఁ డెల్లవిధంబుల హంతవ్యుండు. మీరీక్షణంబున వీనింగొనిపోయి యగ్నిచే దహించిగాని, శస్త్రంబులచే ఛేదించిగాని, విషంబును బ్రయోగించి గాని, జలంబులఁ ద్రోయించిగాని, మఱియేయుపాయంబుననైనను నిధనంబు నందింపుఁడు. ఇది దృఢనిశ్చితంబగు నాజ్ఞగా నెఱుంగుఁడు. ఈబాలుండు హరినిగాని తనప్రాణమునుగాని విడనాడుం గాక! అని యాజ్ఞాపించుటయుఁ బ్రధానులు రాజాజ్ఞానుసారంబుగ నాబాలకుని

హింసించుట కారంభించిరి. కాని ప్రహ్లాదకుమారుని హరినామసంకీర్తనంబున నగ్ని శీతలంబయ్యెను; జలంబు స్థలంబయ్యెను; విషం బమృతంబయ్యెను; శాణితాస్త్రంబులు కుసుమకోమలంబు లయ్యెను. అవి యేవియు నాతని కెట్టియపకారమును జేయజాలకపోయెను. అప్పుడు ప్రహ్లాదుండు శ్రీహరి యనుగ్రహంబుననే సర్వంబునకు భద్రంబగునని పంచభూతంబులను బ్రబోధించుచు నించుకంతయును దుఃఖింపక పరమానందానుభవముం గాంచుచుండెను. అట్లు నిరుపద్రవుండై యున్న యా ప్రహ్లాదకుమారుం గాంచి మంత్రు లత్యాశ్చర్యాన్వితులై యీతం జేయుపాయంబునను వశించువాఁడు కాఁడు. ఇఁకఁ బోవుదము. ఈవిధంబుగఁబోయి మహారాజు నెట్లు సంతర్పింపఁగలమని పరాభవచింతాసంతప్తులు కాఁజొచ్చిరి. అప్పుడు వారింగాంచి ప్రహ్లాదుం డిట్లనియెను. మంత్రులారా! మీ రేల విస్మితు లయ్యెదరు? సకలబాధానివారకంబగు సద్వస్తువు నాసమీపమునందున్నది. జలంబు శాపనాత్పరుండగు నారాయణునకు శయ్య. అగ్ని ముఖంబు; జగన్మాతయగు లక్ష్మితోఁ గూడఁబుట్టిన విషంబు నాకు మాతులసన్నిభంబు. ఇవి యన్నియు నాకాత్మీయంబులే కావున నెట్టియపకారంబును జేయలేదు. ఈధరాదేవి నాస్వామియగు నారాయణునిచే ననేక సమయంబుల యందుద్ధరింపఁబడి యమ్మహోపకారమును విస్మరింపఁజాలదు. కావున భూదేవి జగజ్జనకుండగు నద్దేవుని యానతికి విరుద్ధముగ నేమియుం జేయఁజాలదు. ఓమతిమంతులారా! సర్వంబును బరాధీనంబు; స్వతంత్రతఁ యెవ్వరికున్నది? అని యిట్లు కుమారుండు చెప్పుటయుఁ బ్రధానులు విఫలప్రయత్నులై మహారాజునొద్దకుంబోయి మహారాజా! ఇట్టివింత యెన్నఁడును గని విని యుండలేదు. ప్రహ్లాద కుమారుండమరుండు. ఏవిధంబుచేనైనను నాతనికి యాతనయనుమాటయే లేదు. కావున మంచిమాటలచే నాతని నెటులైన మరలింపఁబ్రయత్నింపుమని

సర్వవృత్తాంతమును నివేదించుటయు నసురేంద్రుండు దుఃఖితుండై తనయుని ధనాదిసకలసౌఖ్యంబులకు విశ్వేశ్వరారాధన [illegible] పనులయందు ప్రయత్నించియు విఫలుండయ్యెను.

ప్రహ్లాదుం డెప్పటికిని హరినామ స్మరణమును విడువకుండెను. సంసారసుఖంబులు స్వప్నసదృశంబులుగ భావించు విజ్ఞానసంపన్నులు నిశ్చలహృదయంబున శ్రీహరి భజనంబును, సేవయుఁ బూజయు, ధ్యానంబును, స్మరణంబును నూత్రమే యనంత సుఖంబులని భావించుచుఁ బ్రాణభయంబునందైనను ధర్మపథభ్రష్టులు కాఁజాలరు. ప్రహ్లాదకుమారుండు నట్టి వివిధ యాతనల ననుభవించియు ధర్మపథంబును విడువకుండెను. అనంతరము హిరణ్యకశిపుండు మరలఁ గుమారుని గురుమందిరంబునకుఁ బంపించెను. గురుండు నక్కుమారుని దన యొద్ద నుంచుకొని బాలకులతోఁగూడ విద్యాభ్యాసంబు సేయించుచు నిట్లుపదేశించెను. బాలకా! నీవిట్లు చదువుకొనుచుండినచో మాటుము. నీవును హరివలె నధ్యయనంబు గావింపుము. అందువలన నీ తండ్రి నీయెడల సంతుష్టుండగును. జనకుని యాజ్ఞను బరిపాలించుటయే పుత్రునకు పరమోత్కృష్టంబగు నవశ్యధర్మంబు. అట్లయినచో నీవు పైతృకంబగు రాజ్యంబు ననుభవించెదవు. అని యిట్లు గురుండు బోధించుటయుఁ బ్రహ్లాదుండు హరినామస్మరణంబు గావించుచు నందలి బాలకులకును నామమంత్రంబు నుపదేశించి యుపాధ్యాయుండు లేనిసమయంబున విద్యార్థులకందఱకును జ్ఞానోపదేశంబు గావింప నుద్యోగించి యిట్లనియెను.

బాలకులారా! తల్లిదండ్రులుగాని, యన్నదమ్ములుగాని, భార్యగాని, బంధువులు గాని, మిత్రులు గాని, హరినామ కీర్తనంబున లభించునంతటి యసమానసుఖంబును గల్పింపఁజాలరు. ఈ సంసారసుఖంబులు స్వప్నసుఖంబులంబోలి క్షణికంబులై యుండును. కావున

శాశ్వతసుఖంబునకు హరిభజనంబ యేకాధారంబై యున్నది. అని యిట్లు ప్రహ్లాదుండు బోధించుటయు బాలకులందఱును నగమానంద భరితులై హరినామసంకీర్తనంబు సేయందొడంగిరి. అది యంతయును విని గురుండు క్రుద్ధుండై ప్రహ్లాదకుమారు ననేకవిధంబుల దూషించుచు గలపంతముగ నాతని బ్రతాడితుని జేయుచు నికంత్యకాలము సమీపించినదని తిట్టసాగెను. క్రోధమూర్తియగు గురునిచేఁ దాడితులై యితరబాలకులు మరల నెప్పటివలె నైరి గాని ప్రహ్లాదుండు మాత్రము హరిభజనంబు సేయుచునే యుండెను. అప్పుడు గురుండు కన్నులెఱ్ఱజేసి యోరి ప్రహ్లాదా! నిన్ను నీతండ్రిని లక్ష్యము చేయుట లేదు. హరినామస్మరణము విడువవేని నిన్నుఁ జావగొట్టెద ననుటయు ప్రహ్లాదుం డిట్లనియెను. మీరు చెప్పినదంతయును సత్యమే. సర్వదుఃఖనివారకుండును బరాత్పరుండును నగు జగజ్జనకు నెఱుంగనంతవఱకు నేను నాజనకు నలక్ష్యము చేయలేదు. సూర్యతేజము లభింపనంతవఱకు జనులు దీపశిఖామాలమున నానందించు చుందురు. సూర్యసందర్శనంబైనతరువాత నిఁకఁ దీపములతోఁ బనియేముండును? అట్లే జగత్పితను బొందిననాకు జనకుం డిఁక సుఖకరుండు గాఁడయ్యెను. లోకంబునం గలపుత్రుల కందఱకును నిజపితృకార్యమే యవశ్య కర్తవ్యంబైనచో వరుణానందనుం డగునగస్త్యుండు సముద్రోదక పానంబును జేసియే యుండఁడు. ఆ వివేకసంపన్నుండు పితృవ్యతిరిక్తంబైనను జగత్పితృకార్యమును నిర్వహించి ధన్యుండయ్యెను. ఓవిప్రా! ఏయుపాయంబున శాశ్వతపదంబు లభించునో యదియే పురుషున కవశ్యకరణీయంబు గాని మఱియేదియును గాదు. ఇది కారణంబుగ నన్ను మీరెంత దూషించినను బాధించినను నేను నిషేధించువాఁడను గాను. నా తండ్రియెవ్వఁడో యాతఁడే నన్ను రక్షించునుగాక! నాప్రాణములనైనఁ బరిత్యజించెదను గాని హరిసంకీర్తనమును విడువజాలను. అను

టయు గురుండు కుపితుండై ప్రహ్లాదుని బోధింపందొడంగెను గాని శ్రీహరిప్రభావంబున నాకుమారునకించుకంతయును బాధ కలుగ దయ్యెను. అంతగురుండు విఫలప్రయత్నుండై ప్రహ్లాదుని రాజసమీపంబునకుం గొనిపోయి యిట్లని నివేదించెను. ఓదైత్యరాజా నీకుమారుని నీయొద్దనే యుంచుకొనుము. ఈతఁడు నాశిష్యుల నందఱను దనయంతటివారినిగాఁ జేసినవాఁడు. కావున నీతనితో నాకుఁ బ్రయోజనంబులేదు. నీయిచ్చవచ్చినట్లు చేసికొనుము. అని గురుండు పలుకుటయు హిరణ్యకశిపుండు మిగులదుఃఖితుండయ్యెను.

—: హిరణ్యకశిపువధ :—

అనంతరము హిరణ్యకశిపుండు మంత్రికుమారులంబిలిపించి పితృవాక్యపరిపాలకులై కర్తవ్యములం గావించుచున్నమీరు ధన్యులని వారిని బ్రశంసించి మీరు నాకుమారున కెట్లైన బోధించి సన్మార్గవర్తనునిం గావింపుఁడని యాజ్ఞాపించెను. వారును వల్లెయని ప్రహ్లాదకుమారుని నిర్జనస్థానమునకుం దీసికొనిపోయి యిట్లని ప్రబోధింపనారంభించిరి. ఓమిత్రుఁడా! నీవు మాచెప్పినమాటల నాకర్ణించి యాప్రకారమాచరింపుము. నీతండ్రి యింద్రాదిదేవతలకుఁగూడ నతిభయంకరుఁడు. ఆతనికిఁ గ్రోధముం గల్పించినచో నీకెట్టిసుఖంబునులేదు. కావున నీవు నిజజనకుండు చెప్పినట్లు సర్వదా సంచరించుచుండుము. నీహితంబుగోరి మేమిట్లు చెప్పుచున్నాము. నీయిచ్చవచ్చినట్లు చేయుము. అని యిట్లువారు బోధించుటయుఁ బ్రహ్లాదుండిట్లనియెను. మిత్రులారా! మీరు మనసుంచి వినవలయును. ఈజగంబునందుఁ దండ్రియుఁ దల్లియు, సోదరులును, భార్యయు, బంధువులు నందఱునుగూడ స్వార్థపరాయణులే. సాయంకాలంబున వివిధంబులగు పక్షులొకవృక్షము నాశ్రయించి యొక్కచో శయనించి ప్రాతఃకాలమున లేచి తమ తమ ప్రయోజనంబులకై యెగసిపోవునట్లే దేహధారులకు బరస్పరము

సంయోగ వియోగములు కలుగుచుండును. మానవులు దైవవశం బునఁ దమతమ కర్మఫలంబుల ననుభవించి పోవుచుందురు. ఈప్రపం చంబునందలి దృశ్యమానంబులగు సుఖంబులన్నియు స్వప్నతుల్యంబులు. ఇందెంతమాత్రమును సంశయము లేదు. దివాభాగంబునఁ బాపపుణ్య వశంబునం గోరుచుండు మనోరథంబులే రాత్రికాలంబున స్వప్నగతంబు లగుచుండును. ఈ సంసారసుఖంబుఁగూడ నట్టిదియే యని భావింపవల యును. మీరీసంగతిని దెలిసికొని సర్వదా హరిభజనంబు సేయుఁడు. హరిభజనంబు సేయనివారు యమపాశబద్ధులై పతితులగుదురు. ఈ తల్లిదండ్రు లెన్నిసారులు జనించిరో, యీకుమారులు ఎందఱ కెన్నిపర్యాయములు కుమారులుగ నుండిరో నెవ్వరు నిశ్చయింపఁ గలరు? జీవులు కర్మసూత్రబద్ధులై [illegible] సుఖ దుఃఖములను బొందుచు సంసారంబునఁ బరిభ్రమించుచుందురు. అట్టిజీవు లకుఁ దమతమపాపంబున నరకంబును, పుణ్యంబున స్వర్గంబును, పాప పుణ్యసంసర్గంబున భవంబును గలుగుచుండును. పాపపుణ్యక్షయం బునఁగాని ముక్తి లభింపదని నిశ్చయముగ నెఱుంగుఁడు. కర్మసూత్ర బద్ధుండై యున్నంతవఱకు జీవుండు ముక్తుండు కాఁజాలఁడు. కావునఁ గర్మవినాశంబునకై సర్వదా హరిభజనంబు గావింపవలయును. హరి భజనంబువలనఁగాని కర్మక్షయంబు గాదు.

6. బాలకులారా! దేహభోగంబులను, గృహక్షేత్రాదుల వలనను బుత్రకళత్రలాభంబు సంభవింపవలయును. అట్లు కానిచో మరల నాతండు సంసారపంకంబున మునిఁగి పోవును. పాపకల్మషుండగు జీవుండు హరి భజనంబునఁ బవిత్రుండగును. బాలిశులగు మీరు రాజాజ్ఞ నెల్లవిధం బుల సర్వాంగీకరింపుఁడు. నేనుమాత్ర మట్లు చేయఁజాలను. పరమానందం [illegible] అని యిట్లు ప్రహ్లాదుండు తిరస్కరించుటయు మంత్రిపుత్రులు రాజు

నొద్దకుం బోయి యంతయును నివేదించిరి. అప్పుడు హిరణ్యకశిపుండు కుమారుని దనయొద్దకుం బిలిపించి స్వయంబుగ నిట్లు ప్రబోధింపం దొడంగెను. కుమారా! అవివేకంబు విడిచి నామాట వినుము. మానవులకు హరిభజనంబునం గలుగు మనోరథంబు లన్నియును నీకు నావలననే లభియింపంగలవు. నేనే హరినని యెఱుంగుము. సకల దేవతలును, వాసవులును, గంధర్వులును బ్రధానులగు నాగులును, ఋషులును, సమస్తజీవులును గూడ నాకు వశీభూతులై యున్నారు. కావున నాకంటె నధిక హరియను నెవ్వఁడున్నాఁడు? నన్ను నిరంతరమును సేవించుచుండు హరి యెవ్వఁడో చెప్పుమా! నేను నిగ్రహానుగ్రహసమర్థుండను. సర్వశక్తిమంతుండను. నాకంటె హరి యెవ్వఁడును లేఁడు. సర్వజీవులు నాయాజ్ఞ వహించియున్న నన్ను గొలువకయుండనయ్యె నీవేల భజియింపవో తెలుపుము? అని యుగ్రతఁ గద్దించి యడుగుటయుఁ బ్రహ్లాదుం డిట్లనియెను.

దైత్యేంద్రా! నేనే విష్ణుండ నని నీవేల చెప్పెదవు? హరికిని నీకును మణికాచంబులకును, కోకిలకాకంబులకును, చందనకర్దమంబులకును, సాత్త్వికతామసంబులకును, ప్రద్యోతనఖద్యోతంబులకును, వేదవచనగ్రామ్యవచనంబులకును, స్వర్ణలోహంబులకును, గోసూకరంబులకును గలయంతటి విశేషభేదంబున్నది. నీవహంకారపరాయణుండవు, విశ్వద్రోహకల్మషుండవు; కాముకుండవు; మదాభిమానపరతంత్రుండవు; క్షుద్రుండవు; పరదూషకుండవు; అశాశ్వతుండవు. నిన్ను సంతుష్టుం జేసినను ముక్తి నొసంగఁజాలవు. శ్రీహరి సంతుష్టుం డయ్యెనేని మోక్షంబును బ్రసాదించును. నేను విష్ణుదేవుండ నని చెప్పుకొనుటకు నీకు సిగ్గు లేకున్నది? దైత్యోత్తమా! భద్రగజారోహకుం డెవ్వఁడును శునకసృగాలాద్యారోహంబున కిచ్ఛగింపఁడని నిశ్చయముగా నెఱుంగుము. కావున నేను నిరంతరమును హరినే భజించెదను. నీ యిచ్ఛ

వచ్చినట్లు గావింపుము. అని యిట్లు కుమారుండు తిరస్కరించుటయు నసురేంద్రుండు మరల ప్రహ్లాదు నుద్దేశించి యోరీ! నీవు సేవించుచుండెడు హరి యెందుండెనో చెప్పు మని క్రోధాతిరేకంబున గర్జించి యడిగెను. అప్పుడు ప్రహ్లాదుండు మృదులస్వరంబున నిట్లనియెను. దైత్యేంద్రా! పరాత్పరుండగు విష్ణుదేవుండు సముద్రంబుల యందును, పర్వతముల యందును, వృక్షముల యందును, దేవతల యందును, నదులయందును, గ్రామములందును, నగరముల యందును, వనముల యందును, నుపవనములయందును, సర్వభూముల యందును, నాకాశ్య నందును. జగంబునంగల స్థూలసూక్ష్మరూపంబులగు సకల వస్తువుల యందును నిండియున్నవాఁడు. అద్దేవుండు నిశ్చయంబుగ నీయందును నాయందునుగూడ నున్నాఁడు. ఆ శ్రీహరి భూతభవిష్యద్వర్తమాన రూపంబగు ననంతకాలమునందును విలీనుండై యున్నవాఁడు. ఆ భగవానుని దివ్యరూపంబును వర్ణించుటకు నేనెంతవాఁడను. అని పలుకుటయు హిరణ్యకశిపుఁడు కుమారా! నీవు చెప్పినదంతయు విశ్వసింపఁ దగినదియే గదా యనుటయుఁ ప్రహ్లాదుండు దృఢస్వరంబున శ్రీహరి సర్వవ్యాపకుండనియును, నాతండులేనితావెద్దియును లేదనియును వచించెను. అంత దానవేంద్రుండు విష్ణుఁడు సర్వవ్యాపకుండైనచో నీ స్తంభంబునం జూపింపు మని ధిక్కరించుటయు నక్కుమారుండు నిశ్చయంబుగ శ్రీహరి యీ స్తంభ మధ్యంబునఁగూడ నున్నవాఁడనియెను. అనుటయు హిరణ్యకశిపుండు క్రుద్ధుండై పూజసేయుండగు నీహరిని సంహరింపుమని పలుకుచుఁ గ్రోధరక్తనయనుండై దంతసంఘర్షణంబు గావించుచుఁ గరవాలంబు నందుకొని సింహాసనంబునుండి దిగ్గనలేచి చూడుము పూజింపుమని కుమారుని గర్జించుచు స్తంభంబునఁ గృపాణాఘాతంబు గావించెను. ఆ స్తంభంబున ఖడ్గాఘాతంబగునంతనే పర్వతంబున వజ్రపాతం బగునంతటి భయంకరశబ్దం బగు

నాయుఁ దత్క్షణంబ యాస్తంభంబునుండి దేవదేవుండగు శ్రీమహా విష్ణుండు క్రోధభరంబున సకలదానవదుర్నిరీక్ష్యుండై యావిర్భవించెను. ఆదివ్యమూర్తి పూర్వార్ధంబున మానవాకృతియుఁ బరార్ధంబునఁ బంచాననాకృతియుం దాల్చియుండెను.

ఆదేవదేవుం డిట్లు నృసింహావతారంబు దాల్చి ప్రళయకాలాంభోధరంబు వలెను మాటిమాటికిని భయంకరగర్జారవంబు గావింపం దొడంగెను. అప్పు డాదివ్యమూర్తి కంటకితకుటిల కేసరవిఖండితమేఘమండలుండును, భయంకరగర్జాప్రతిధ్వనిత దశదిశావకాశుండును, ముఖతేజోనలజ్వాలాసంతాపిత సకలదానవానీకుండును, రాక్షసీగర్భసంపాతహేతుఘోరభయంకరహుంకారుండును, వజ్రసన్నిభనిశితనఖభీకరనగమ్యాకారుండునునై ప్రళయకాలరుద్రునింబోలి యతిభయంకరుం డగుటయు నద్దేవుని దర్శనమాత్రంబున సకలదానవులును భయప్రకంపితులై పరస్పరసహాయంబున ధైర్యంబు గల్పించుకొని మహారణం బనఁగాఁ బొనరించిరి. భగవంతుండగు నృసింహుండు తత్క్షణంబ యారాక్షసులనందఱం దననిశ్వాసమాత్రంబున నిహతులం గావించెను. అప్పుడు రాక్షసేశ్వరుండగు హిరణ్యకశిపుండు పిఱుతివియని బీరంబున నృసింహదేవునిం దలపడి ఘోరంబుగఁ బోరం దొడంగెను. అమ్మహారణసంరంభంబున సకల భూమండలంబును సంశయాపన్నంబయ్యెను, సప్తసముద్రంబులును సంక్షుభితంబులయ్యెను. నక్షత్రసహితంబుగ నంతరిక్షమండలంబును నట్టిట్టయ్యెను. కులపర్వతంబులు ఘూర్ణిల్లెను. ఇట్లొకముహూర్తకాలం బయ్యసురకు నతిదారుణంబగు రణంబు ప్రవర్తిల్లెను. అనంతరము నృసింహదేవుండు జగద్భయంబగు ననుసంశయంబున సంధ్యాసమయంబున స్తంభమధ్యంబున నాహిరణ్యకశిపు నాకర్షించి యుత్సంగంబున నదిమిపట్టి నిజనిశితనఖంబులచే నద్దానవుని హృదయవిదారణంబు గావించి భయంకరంబుగ గర్జిం

చుచుఁ గర్ణోష్ఠరక్తపానంబు సేయుచు నాతనిప్రేవులంబెకల్చి కంఠమాలికలుగా గ్రహియించెను. ఇట్లా నృసింహదేవునిచే సకలలోకభయంకరుండగు హిరణ్యకశిపుండు నిహతుండగుటయు సకలదేవతలును జయజయధ్వనులం గావించుచు నృత్యగీతవాద్యంబుల నానందించుచు నాదేవదేవునిపైఁ బుష్పవృష్టిం గురియింపసాగిరి. అప్పుడా నృసింహదేవుని క్రోధానలంబున ననేకదానవు లాహుతియగుటయు హతశేషులు పలాయితులగుటయును గారణంబుగ భూమండలము దానవశూన్యంబయ్యెను జగదుపద్రవంబు శాంతంబయ్యెను. అఖిలలోకంబులకునానందం బయ్యెను. ఆసమయంబున లక్ష్మీదేవి విష్ణుదేవునిం దర్శించి యభూతపూర్వంబును నద్భుతంబునగు నాథునిరూపంబునకు విస్మితురాలయ్యెను. అప్పుడు దేవతలందఱును విజయదుందుభిధ్వానముం గావించుచుండిరి. హిరణ్యకశిపుని దేవియగు కయాధువు దుఃఖాక్రాంతచిత్తయై కుమారుండగు ప్రహ్లాదు నూఱడించుచుండెను. అప్పుడు ప్రహ్లాదుండును విస్మితుండై స్వామియగు నృసింహదేవునిం బ్రశంసించుచుండెను. హిరణ్యకశిపుం డట్లు నిహతుండైనను గోధమూర్తియగు నృసింహదేవుని తేజశ్శిఖలు శాంతింపకుండుటచే సమస్తజగంబు నెప్పటివలె వ్యాకులపడఁజొచ్చెను. అప్పుడు దేవతలందఱును మరల నేమగునోయను భయంబునఁ దేజోదుర్నిరీక్ష్యుండగు నద్దేవుని సమీపింపఁజాలక నీవు ముందుఁబొమ్ము నీవు ముందుఁబొమ్మని యొండొరుల నెచ్చరింపందొడంగిరి. అట్లే మహేంద్రుని బ్రహ్మదేవునింగూడఁ బ్రార్థించుటయు నయనభంగభయంబున నింద్రుండును, శ్మశ్రుదాహభయంబున బ్రహ్మదేవుండును నృసింహదేవుని యుగ్రసందర్శనంబున కోపఁజాలరైరి. భగవంతుని యిట్టి యద్భుతస్వరూపం బే నెన్నండును దిలకింపలేదు గావున నిప్పుడెట్లు సమీపించి సందర్శింపగలదాననని జగన్మాతయగు నిందిరాదేవియును సంశయించెను. మహర్షులును బోవంజాల

రై రి. దేవతలునుసమీపింపలేరైరి. అప్పుడందఱునుగలసిప్రహ్లాదునొద్ద కుంబోయి నీవిమ్మహాదేవుని శాంతింపంజేయుమని ప్రార్థించుటయు సత్కు మారుం డగ్రగామియై యద్దేవుని సమీపించి సందర్శించెను. అప్పుడు నృసింహదేవుండు ప్రహ్లా[illegible] గాంచి [illegible] చలంబున నాతని యంగస్పర్శనంబు గావించుచు దుఃఖించుచున్న యాబాలకు నంకతలయందుటఁ ప్రశంసించుచుఁ గౌగలించుకొని హృదయ శీతలత్వంబు నాపాదించుచు నిట్లనియెను. వత్సా! దుష్టుండగు నీ తండ్రి త్యుండు నాహృదయంబు నతిశయ సంతాపితంబు గావించినాఁడు. నీ సంశ్లేషంబున నాహృదయంబిప్పుడు శీతలంబైనది. పుత్రాశ్లేషణంబు జనకసుఖకారణంబుగదా! కుమారా! నాకుఁ బరమానందాశ్లేషంబు నొసంగిన నీకు సద్గతి యగుంగాక! నీవు నాకుఁ బుత్రుండవైతివి. నీకుఁ బుత్రపౌత్రాభివృద్ధి యగుంగాక! నీవంశంబున జనియించినవా రెవ్వరును నాచే వధింపఁబడకుందురుగాక! అని యిట్లక్కుమారునకు వరప్రదానంబు గావించి పూత్కార విమోచనంబు గావించెను. అంతకుమునుపే దేవతలు గణేశ్వరుని సందర్శించి బుద్ధిమంతుండవగు నీవు నృసింహదేవుని శాంతింపఁజేయుమని ప్రార్థించుటయు గణనాథుండు ప్రసన్నవదనుండై మూషికారూఢుండై యద్దేవునిం దర్శింప వచ్చుచుండెను.

ఆగజాననుండు స్థూలదేహుండును, లంబోదరుండును, మూషికవాహనుండు నగుటచే నప్పుడాతనిరూపము హాస్యరసోద్దీపకంబుగా నుండెను. విలక్షణం బగునాతని యాకృతింగాంచి యప్పుడు సకల దేవతలును విస్మితులై వర్ణింపందొడంగిరి. ఆ సమయంబునకు సరిగ నృసింహదేవుఁడు పూత్కార విమోచనంబు గావించుటయు గణనాథుని వాహనంబగు మూషికము భయభ్రాంతంబై వెలికలంబడుటయు లంబోదరుండును వాహనపతితుం డయ్యెను. అదియంతయుంగాంచి

దేవతలందఱును బకపక నవ్వనారంభించిరి. నృసింహ దేవుండును నవ్వందొడంగెను. ఆదేవదేవుని హాసవదనముం గాంచి యప్పుడు దేవత లించుక స్వస్థచిత్తులైరి. కాని యప్పటికిని నరహరి తేజశ్శిఖ శాంతింపదయ్యెను. అందువలన దేవతలు దుఃఖితులై మహాదేవునకు శరణాపన్నులై లోకసుఖంబుం గోరి యమ్మహాదేవుని స్తోత్రంబు చేయందొడంగిరి. ఓ మహాదేవా! నీవు సముద్రమథనసమయంబున దేవతలచేఁ బ్రార్థింపఁబడి రత్నాదులను వారలకొసంగి హాలాహలమును స్వీకరించి నీలకంఠుండనఁ బ్రసిద్ధుండ వైతివి. దుఃఖనిమగ్నులగువారు నిన్నాశ్రయించి దుఃఖదూరులగు చున్నారు. ఓ సదాశివా! ఇప్పుడు నృసింహదేవుని దుస్సహతేజోనలము జగంబులఁ బీడించు చున్నది. ఆజ్వాలను శమింపఁజేయుటకు నీవొక్కండవే సమర్థుండవు. అని యిట్లు దేవతలు ప్రార్థించుటయు శంభుండిట్లనియెను. ఓ దేవతలారా! మీరూరడిల్లుడు. నేను మీదుఃఖమును శాంతింపఁ జేయుదును. దుఃఖమును శాంతింపఁజేయుటయే నావ్రతము. నన్నాశ్రయించినవారు నిశ్చయంబుగ దుఃఖదూరులగుదురు. అని శివుం డానతిచ్చుటయు దేవతలు పరమానంద భరితులైరి. అప్పుడు శివుం డనేక విధంబుల నాలోచించి యద్భుతం బగుశరభమూర్తిం దాల్చి నృసింహదేవునియొద్దకుం బోయెను. నృసింహుండును దూరమునుండియే యాశరభేశ్వరుని భీకరాకారముంగాంచి యిప్పుడు సకలదేవతలును రక్షింపంబడిరనియెను. అప్పుడు శంభుండు జయజయశబ్దంబులతో నా నృసింహదేవునకు నమస్కరించి యంతర్హితుండై పోయెను. ఆసమయంబున నృసింహదేవునియెదుట దివ్యవాద్యంబులును నృత్యంబులును గీతంబులు నయ్యెను; పుష్పవర్షంబు గురిసెను. అప్పుడా నృసింహదేవుని శాంతవచనంబులచే దేవతలు పరమానందభరితులై శివునకును విష్ణునకును భక్తశేఖరుండగు ప్రహ్లాదునకును నమస్కారంబులఁ

గావించుచు నృసింహదేవుని యద్భుతరూప వర్ణనంబుఁ గావించుకొనుచుఁ దమతమ నివాసంబులకు వెడలిపోయిరి. సదాశివుం డట్లంతర్హితుండగు సమయంబున నృసింహుండు మీ సకలాభీష్టములను సిద్ధింపం జేయునని దేవతల నాశ్వాసించెను. ఈ దివ్యచరిత్రంబును భక్తిశ్రద్ధలతో నాకర్ణించువారికి సకలాభీష్టంబులును సిద్ధించును. ఇందెంతమాత్రమును సంశయంబులేదు.

—♦ నలదమయంతుల పూర్వవృత్తాంతము. ♦—

మునులారా! శివారాధనంబు సర్వశ్రేయస్సాధనంబు. పితామహుండగు బ్రహ్మయును, బ్రహ్మమానసపుత్రులగు పరమర్షులును, ప్రాచీనులగు నితరమహర్షులును, గశ్యపాదులును, శివారాధనంబు గావించిరి. పండితులు మృణ్మయంబులును, సువర్ణాది ధాతుమయంబులును, మనోమయంబులు నగు శివమూర్తులం గల్పించుకొని పూజించి సిద్ధులగుచుందురు. నేనుగూడ నిత్యంబును శివారాధనంబు గావించుచున్నాఁడను. పూర్వకాలంబున నారదుండును, ఋషిశ్రేష్ఠుం డగు వసిష్ఠుండును, పతివ్రతయగు నరుంధతియు, మునిప్రవరుం డగు కశ్యపుండును, నదితియుఁ బ్రతిదినంబును నియమానుసారంబుగఁ బార్థివలింగపూజం గావించిరి. స్వాయంభువాది మనువులును, స్వాయంభువ పుత్రుండగు ప్రియవ్రతుండును, నిక్ష్వాకుండును, మాంధాతయు, సగరనహుషదిలీపాది మహారాజులును, దశరథుండును సర్వోత్తమ శివారాధకులై యుండిరి. రాజగు దశరథుండు సంతానంబు లేక చింతాకులుండై యపత్యముం గోరి పార్థివలింగ పూజనంబును బుత్రేష్టియును గావించెను. అప్పు డాతనికి విష్ణుదేవుండు చతుర్మూర్తులతోఁ బుత్రరూపంబున నుదయించెను. వసిష్ఠాదిమహర్షుల యాదేశంబునఁ బతివ్రతయగు కౌసల్యయును, శ్రీరామచంద్రుండును నిత్యశివపూజా పరాయణులై యుండిరి. శ్రీరామవంశంబున నుదయించిన రాజకుమారులందఱును బరమశివ

పూజా ధురంధరులే. ఇళానందనుండగు పురూరవుండును నతిపవిత్ర భావంబున మహాదేవుని బూజించెను. సుద్యుమ్నుండు పార్వతీ శాపంబున నిళయను కాంతయై సదాశివకృపావశంబున మరల బురుషుండయ్యెను. ఆ సుద్యుమ్నుండు పార్థివలింగపూజా మహిమంబున నేకమాసంబు యువతియు, నేకమాసంబు పురుషుండు నయ్యెను. భరతుండును, యుధిష్ఠిరాది పాండవులును శివారాధకులు. అర్జునుండు వ్యాసోపదేశంబున శివు నారాధించెను. భగవానుం డగు కృష్ణుండు వటుకనామకం బగు పర్వతంబున సప్తమాసంబులు ప్రతిదినంబును శంకరు నారాధించుటయు నమ్మహాదేవుండు ప్రసన్నుండై యనేకవరంబులం బ్రసాదించుటచే కృష్ణుం డీసమస్తజగంబును నాత్మాధీనంబు గావించుకొనియెను. ఆ కృష్ణుండు రాణీకృతంబు లగు బిల్వపత్రంబులచే శంకరుని బూజించెను. ఆ దేవునిచే బూజింపంబడిన మహాదేవుండు బిల్వేశ్వరుండనం బ్రఖ్యాతుం డయ్యెను. నలుండు పూర్వజన్మంబున శివపూజం గావించుచు నొక్కయతిని సంరక్షించిన పుణ్యవిశేషంబున నుత్తరజన్మంబున జక్రవర్తి యయ్యెను. ఆపావనచరిత్రంబు దెలిపెద నాకర్ణింపుడు. అర్బుదాచలంబున నాహుకుం డను నొక భిల్లుండు వాసము చేయుచుండెను. ఆతని పత్నియగు నాహుక నిరంతర స్వామి సేవాపరాయణయై యుండెను. ఆసాధ్వి నిరంతరమును గోటీశ్వర శివలింగము నభిషేకించి పూజించుచుండెను. ఆ శివపూజాబలంబున నయ్యుభయ దంపతులును సుందరాకారులై ని[illegible] సుఖోపభోగంబులం బరమానందముతో ననుభవించు చుండిరి. ఒకనాఁడు స్వామి యగు నాహుకుండు శివారాధనంబునకుం బోవుటయు నాహుకి [illegible] స్వస్థానంబున [illegible] సమయంబున జటాధరుండగు నొకయతీంద్రుండు నాటిరాత్రి కాయుంటకుం శంకరారాధనంబుగావించుకొని పోవలయునను నుద్దేశముతో నచ్చటికివచ్చి నాహుం

టికి తెత్తైయై యింటనున్న సుందరీమణి యగు నాహులకిం గాంచి భయసం శయావిష్టహృదయయై నిలువంబడిపోయెను. అప్పుడు సతీమణి యగు నాహులకి యతీంద్రునిహృదయభావమును గ్రహించి తండ్రీ! రమ్మని పిలిచి యయ్యతివరేణ్యున కించుకమనస్థైర్యముం గల్పించెను. ఆసమయంబున గృహస్వామియును వచ్చి యాజటిశిఖామణికి విధ్యుక్తంబుగ నతిథిపూజం గావించి వినతస్వరంబున మహాత్మా! నీయుక్తంబుఁ దెలుపు మని ప్రార్థించెను. అప్పుడు యతీంద్రుండు నేఁడు నీయింట నుండుట కంగీకరింపనలయుననియు మహాదేవసందర్శనంబును గావించుకొని ప్రాతఃకాలంబునఁ బోయెద ననియును వాంఛించెను. అంత నాహుకుండో మహాత్మా! నాకుటీరం బతిక్షుద్రంబైనది. ఇందు మా యిరువురికంటె నొండొకరుండ టుండఁ దగినతావు లేదు. ఉన్నచో మీవంటివారి కొసంగుట కభ్యంతర మేముండును? అని చెప్పియు యతీంద్రుండటనుండి పోనుద్యోగించుచుండ భిల్లపత్నియగు నాహులికి మహాత్మా! నీవు వెడలిపోయినచో మాగృహస్థధర్మము విధ్వస్తంబై పోవునని యయ్యతివరునిగమనంబు నాఁపి భర్తనుద్దేశించి యిట్లనియెను. నాథా! వీరిరువురకు గృహంబునం దుండుఁడు! నేనస్త్రములం దాల్చి వెలుపల జాగరూకత్వ కాచుకొనియుందును. అనుటయు నాహుకుండేకాకిని యగునబలను వెలుపలనుంచి తాములోపలనుండుట యుక్తంబుగాదనియు, నేనే వెలుపలనుండి, యతీవరుని నాపత్నిని గృహంబునందుంచి యీరాత్రి కాపాడెద ననియు నిశ్చయించుకొని యాప్రకారంబు గావించి తానాయుధపాణియై కుటీరంబుచుట్టును దిరుగుచుఁ గ్రూరమృగంబుల నుండి యిక్కట్టి బాధయును గలుగకుండఁ గాపాడుచుండెను. అప్పుడాకుటీరంబునం దేకశాయి యగు యతీంద్రుండు ధ్యాననిష్ఠాగరిష్ఠుఁడై యుండెను. గృహిణి యగు నాహులకి నిద్రించెను. ఆహుకుఁడు గృహంబుచుట్టును దిరుగుచునే యుండెను. క్రమముగ నా రాత్రి యనేకంబులగు క్రూరజం

తువులు వచ్చి యాహుకుని బీడింప నారంభించెను. ఆహుకుండు యథాశక్తిని క్రూరజంతువు ను బారందోలుటకు సర్వవిధంబులఁ బ్రయత్నించెనుగాని తుదకాతఁడు భయంకరవ్యాఘ్రంబుల వాతఁబడియెను. అనంతరము ప్రాతఃకాలంబున యోగీంద్రుండు లేచి యాహుకుండు మరణించుటం గాంచి విచారించుచుండ సాధ్వీమణి యగు నాహుకి యతిం గాంచి యిట్లనియెను. ఓ సాధూ! నీవేల విచారించెదవు! ఇది కారణంబుగా నానాథుండు కృతార్థుండయ్యెను. ఆతఁడు ధన్యుఁడు నేను నాస్వామితో సహగమనంబు గావించెదను. ఇది సతులకు సనాతనంబగు ధర్మంబు గదా! కావున నిదియే నాకు బరమహితంబగుకార్యము. అని యిట్లు చెప్పుచు స్వయముగఁ జితిం బేర్చి పతిదేహంబు నందుంచి తానును దనహితంబుకొఱకుఁ జితానలంబునఁ బ్రవేశించెను. ఆసమయంబున నాసతీమణియెదుట సదాశివుఁడు సాక్షాత్కరించి యోధన్యురాలా! సతీమణీ! అనఘాత్మురాలా! నేను నీయెడలఁ బ్రసన్నుండనైతిని. ఈజన్మంబున నీ వెట్టిసుఖంబు ననుభవించి యుండలేదు. కావున నీవింకొక జన్మంబు నంది యప్పుడు ముక్తి నందఁగలవు. ఈయతీంద్రుండును హంసరూపంబున జన్మించి మరల మీయిద్దరకును బరిణయసంబంధంబు సంధిల్లం జేయఁగలఁడు. భిల్లవంశసంభూతుండగు నీనాథుండు సుందరమగు నిషధనగరంబున మహారాజగు వీరసేనుని తనయుండు నలుండై జనియింపఁ గలఁవాఁడు. నీవును విదర్భనగరంబున భీమరాజునకు గుణవతియగు తనయవై యుద్భవించి దమయంతీనామంబునం బ్రవర్తిల్లం గలవు. అట్లు మీరిరువురును గలసి సార్వభౌమత్వంబున సకలసామ్రాజ్యభోగంబుల ననుభవించి యంతంబున యోగిజనదుర్లభంబగు ముక్తిలాభముం బడయఁగలరు. అని శంకరుండిట్లనుగ్రహించి భక్తజనసంరక్షణమునం దవిచలుండగుట కారణంబుగ నచలేశ్వరుండనఁ బ్రసిద్ధుండయ్యెను. ఆభిల్లదంపతు లిరువురును శంకరాదేశంబున నలదమయంతులై జన్మించి సమస్తభోగంబుల ననుభవించిరి.

—: పాండవులు దుర్వాసుని ప్రీతుం జేయుట :—

ధర్మరాజాదులగు పాండవులు అక్షక్రీడయందు దుర్యోధనునిచేఁ బరాజితులై పతివ్రతయగు ద్రౌపదితోఁ గలసి ద్వైతవనంబునకుఁ బోయియుండిరి. అందు వారు సూర్యప్రసాదంబగు స్థాలీమూలంబున నాహారంబు గావించుకొనుచు సుఖంబుగఁ గాలయాపనంబు సేయుచుండిరి. అప్పుడు దుర్యోధనప్రేరితుండై దుర్వాసుండు దశసహస్ర శిష్యగణంబులతోఁ బాండవులను వంచించుటకై యచ్చటికి వచ్చి ద్రౌపదిం గాంచి మాకందఱకును నిష్టమృష్టాన్నంబులఁ బ్రసాదింపవలయునని ప్రార్థించెను. అప్పుడు పాండవులు దుర్వాసుని స్నానార్థంబుఁ బంపి యత్యసాధ్యకార్యంబునకు దుఃఖితులై ప్రాణత్యాగంబు గావించుకొన నుద్యుక్తులగుటయు ద్రౌపది వారల నాశ్వాసించి శ్రీకృష్ణుని స్మరించుకొన్నంతమాత్రమున నాభగవానుం డచ్చటఁ బ్రత్యక్షుండై స్వయంబుగ శాకభక్షణంబు గావించి సశిష్యుండగు దుర్వాసునకు సంతృప్తిం గలిగించెను. దుర్వాసుండు తనపదివేలశిష్యులనుగూడ నాహారసంతుష్టులగుటను భావించి పలాయితుండగుచు భగవదనుగ్రహంబు గలవారలకెన్నటికిని బరాభవంబు గలుగదనియు వారలే కృతార్థులనియు ననుకొనుచుఁ బరమానందభరితుండయ్యెను. పిమ్మటఁ బాండవులు కృష్ణునింగాంచి మహాత్మా! బలవంతుం డగు శత్రునిమూలంబున నింకను మాకేమి కానున్నదో? నీయనుగ్రహంబు లేక మేమేమి చేయఁగల మనుటయుఁ గృష్ణుం డిట్లనియెను. పాండునందనులారా! నామాటల నాకర్ణించి తదనుసారంబుగఁ గార్యయుక్తులు గండు! నేను శత్రుబాధానివారణంబున కాలోచించుచు నొకప్పు డుపమన్యుమునీంద్రునిచే నుపదేశింపఁబడి వటుకనామకంబగు పర్వతంబున సప్తమాసంబులు యథావిధిగ శంకరు నారాధించుటయు నమ్మహేశ్వరుండు ప్రసన్నుండై నాకభిలషితవరంబుల నొసంగి పర్వతగుహామధ్యంబునఁ బ్రవేశించెను.

నేనా సదా శివానుగ్రహంబుననే యింతటి సమర్థుండనైతిని. ఇప్పటికిని భోగమోక్షప్రదుండగు నాదేవదేవుని నేను సేవించుచున్నాను. మీరును సకలసుఖప్రదంబగు శివపూజం గావింపుండు. అని వారల నాశ్వాసించి శ్రీకృష్ణుండు ద్వారకానగరంబునకు వెడలిపోయెను.

—: పాండవులకు వేదవ్యాససాక్షాత్కారము. :—

అనంతరము పాండవులు దుర్యోధనుని గూఢసంభాషణంబులం బరిశీలించివచ్చుటకై యొకభిల్లుని హస్తినగరంబునకుం బంపించిరి. ఆభిల్లుం డంతయుం దెలిసికొని వచ్చి రాజ్యపాలనంబున దుర్యోధనుని సద్గుణంబులంగూర్చి పాండవులకు నివేదించెను. పాండవు లాభిల్లవాక్యంబుల నాలించి దుర్యోధనుని సచ్చరిత లనావిధానంబునకు సముద్విగ్నహృదయులై యింక నంతటివానిని సత్యపాశబద్ధులమగుమేము జేయంగలమని విచారింపందొడంగిరి. ఆసమయంబున జటాజూటవిభూషితుండును, నపరధర్మస్వరూపుండును, తేజోరాశియు నగువేదవ్యాసుండు వారలకు సాక్షాత్కరించెను. పాండవు లమ్మునిశ్రేష్ఠుని దర్శించి సంప్రీతచేతస్కులై యాతనియెదుట నిలువంబడి యావేదవ్యాసునకుం గుశాజినశోభితం బగుశుభాసనం బొసంగి పూజించి యథావిధిగ నానాప్రకారంబుల వినుతించుచు నాతని సంతుష్టాంతరంగునిం గావించి యిట్లనిరి. పితామహా! మేము ధన్యులమైతిమి. మాజన్మంబులును, మాసమస్తకార్యంబులును సఫలంబులైనవి. దేవతలందఱు నిప్పుడు మాయెడలం గరుణించిరి. బ్రాహ్మణాశీర్వాదంబులు సత్యసంపన్నంబు లయ్యెను. అస్మదీయంబులగు తపోదానయోగంబులు సార్థకంబులైనవి. ప్రభూ! నీదర్శనంబున సకలదుఃఖంబులును దూరీభూతంబులైనవి. క్రూరకర్ములగుదుర్యోధనాదులు మాకనేకకష్టంబులం గల్పించిరి. ఇప్పుడు నీదర్శనంబగుట కారణంబుగా నట్టిదుఃఖంబులన్నియును వినష్టంబులు కాంగలవు. అట్లుకానిచో నింక నెప్పటికిని మాకు దుఃఖవిముక్తి కలుగదని

మేము భావించుచున్నాము. సమస్తకార్యకరణసమర్థుండగు మహా పురుషుని యాశ్రయంబు లభించినను దుఃఖవినాశనంబు కాదేని నది యదృష్టదోషంబని నిశ్చయము సమంజసము. [illegible] కారణం బగుచు దారిద్ర్యము తొలఁగిపోఁగలదు. దీనజనపరిపాలనము మహాత్ములకు స్వభావముగదా! మహాత్ముల సుగుణగణంబులను లెక్కించుటకు సమర్థుం డెవ్వండును లేఁడు. మహాపురుషు లెట్టిబుద్ధులకు నంద రాని మహిమాసంపన్నులై యుందురు. దీనసంరక్షణమే యుత్తమ స్వభావము. లోకంబున దరిద్రప్రతిపాలనమే యతిశుభకరం బైనది. మహాత్ములను సేవించుటయే పురుషులకు ఫలసాధనంబున కేకమాత్రోపాయము. అందువలనఁగూడ దుఃఖవినాశనంబు గలుగదేని దురదృష్టమే కారణంబనుకొనవలయును. అప్పటికిని బురుషునిదోషం బెంత మాత్రమును లేదు. కావున స్వామీ! నీసందర్శనంబున మాకు నిశ్చయంబుగ సమస్తశుభంబులును లభింపఁగలవు. నీయాగమనమాత్రముననే మాహృదయంబులు పరమానందభరితంబులైనవి. అని విన్నవించుటయు వేదవ్యాసుం డిట్లనియెను.

—: అర్జునునకు వ్యాసోపదేశము :—

పాండవు లట్లు వినయమధుర వచనంబులఁ బ్రశంసించుటయుఁ గృష్ణద్వైపాయనుం డిట్లనియెను. కుమారులారా! సత్యధర్మపరిపాలకులగు మీరు ధన్యులు. ప్రాణభయంబునందైనను బవిత్రధర్మమును బరిత్యజింపకుండుటయే సజ్జనస్వభావము స్వర్గాదిఫలసాధనంబు లన్నియును గేవల సత్యమునే యాశ్రయించి యుండును. మఱికి మీరును దుర్యోధనాదులును సమానులే అయినను బండితపక్షపాతమును ధర్మపరుల యెడలనే విశేషించి యుండును. దురాత్ముండగు ధృతరాష్ట్రుండు ప్రప్రథమమునందే తన కన్నులతోఁగూడ ధర్మంబును బరిత్యజించివైచినాఁడు. అతఁడే ప్రలోభవశంబున మీరాజ్యము నపహరించినాఁడు.

ఆతనికి మీరును దుర్యోధనాదులును గూడఁ బుత్రులే. మీరు పితృహీనులైనా
నంతరము బలవంతుండగు గాంగేయుండు మిమ్ములను బాల్యావస్థయందు
మిగుల గారాబముతోడనే పెంచియుండెను. కాని యాతఁడు మిమ్ము
ద్వేషించుచున్న తన తనయుండగు దుర్యోధను నొకప్పుడును వారింప
జాలకపోయెను. దానంజేసి మీకిట్టియనర్థంబు సంఘటిల్లినది. ఇంతఁ
గావలసినది కాకమానదు. ఆధృతరాష్ట్రుం డతిదురాత్ముఁడు. మీరు
ధర్మపరాయణులును సత్యవాదులునై యున్నారు. శుభక్రియాచర
ణులు కెల్లప్పుడును శుభఫలంబులే కలుగుచుండును. లోకంబున బీజాను
సారంబుగనే యంకురోత్పత్తి యగుచుండును. కావున మీరు దుఃఖింప
వలదు. మీకెప్పుడును శుభం బగునని యెఱుంగునది. అనుటయుఁ
బాండవు లిట్లనిరి. స్వామీ! మీరు సత్యమును వచించితిరి. దురాత్ము
లగు దుర్యోధనాదులు మాకిన్నానంబున మాటిమాటికిని క్లేశంబును
గల్పించుచున్నారు. కావున మాదుఃఖోపశమనంబునకై మంగళజనకం
బగునేదేనొక యుపదేశంబు ననుగ్రహింప వలయును. పూర్వ మొక
ప్పుడు శ్రీకృష్ణుండు శంకరారాధనంబు గావింపవలయు నని మాకుపదే
శించి యుండెనుగాని మేమట్లు గావింపలేదు. ఇప్పుడు మాకవశ్యకర్తవ్యం
బెద్దియో నీవు నిర్దేశింపవలయును. అని యిట్లు పాండవులు వేఁడుకొను
టయు బాదరాయణుం డిట్లనియెను. ఓ సాధువులారా! నేను నిత్యమును
శివుని సేవించుచుంటిని. మీరును నట్లు సేవించినచో సుస్థిరసుఖసంపన్ను
లయ్యెదరు. అని ప్రబోధించి పారాశర్యుండు పాండుకుమారులలో
నర్జునుండు శివారాధనంబునకు యోగ్యుండనియు, నాతఁడు పురాతనులగు
నరనారాయణ మునీంద్రులలో నొక్కరుం డనియు భావించి శివారాధ
నంబునకు స్థలనిశ్చయంబు గావించి యక్కిరీటి నుద్దేశించి యిట్లనియెను.
కుమారా! మీకు మంగళకరంబగు నుపాయముం దెలిపెద నాకర్ణింపుము.
బ్రహ్మాదితృణపర్యంతమును నీజగంబునం గల సమస్తవస్తువులును శివస్వ

రూపములని యెఱుంగుము. దృశ్యంబును ధ్యేయంబునగు సర్వంబును శివాకృతియే. సకలదుఃఖవినాశకుండగు శంకరుం డెల్లరకును బూజనీయుండు. విష్ణుండు శంకరుని యద్భుతరూపాంతరుండే యని విశ్వసింపుము. అవ్విష్ణుండు చిరకాలసేవనంబునంగాని ప్రసన్నుండు కానేరఁడు. శివుండుమాత్ర మచిరకాలంబుననే సంతుష్టుండై యఖిలభోగంబులను, మోక్షంబును సులభఁ బ్రసాదింపఁగలఁడు. కావున భోగమోక్షార్థులగు వారు సర్వదా సదాశివారాధనంబు గావింపవలయును. ఇంద్రుండు ప్రసన్నుండైనచో క్షత్రియాదులకుఁ బరోక్షంబున హితసాధకుండై విఘ్ననివారణంబు గావించి శివమంత్రంబు నుపదేశించుచుండును. కావున నీవిప్పు డింద్రమంత్రంబును జపించుచు మహేంద్రారాధనంబు గావింపుము. అని ప్రబోధించి యవ్విజయునకు వేదవ్యాసుం డైంద్రంబగు మంత్రంబు నుపదేశించెను. అర్జునుండును, సుస్నాతుండై పూర్వాభిముఖుండుగ నుండి మహాసాత్యవతేయునియొద్దనుండి యవ్విద్యమంత్రంబును గ్రహించెను. అనంతరము పారాశర్యుం డప్పార్థునకుఁ బార్థివలింగపూజావిధి నుపదేశించి యిట్లనియెను. ఫల్గునా! నీవు మొదట దేవేంద్రు నారాధింపుము. అనంతరము శతముఖు నానతిం గాంచి సదాశివు నారాధింపుము. నీవిప్పుడే యచ్చటనుండి శుభసంపన్నంబగు నింద్రకీలపర్వతమునకుం బోయి యచ్చట భాగీరథీతీరంబున నుండి తపంబు గావింపుము. నీవు నిరంతరము నస్త్రశస్త్రధారివై యుండి తపోవిఘ్నకారుల నిర్బంధములను నివారించుకొనుచు శివమంత్రమును జపించుకొనుచుండుము. అని యిట్లు వ్యాసభగవానుం డర్జునునకు గోపనీయంబును హితజనకంబు నగునమ్మహావిద్య ననుగ్రహించి పిమ్మటఁ బాండుకుమారులనందఱ నాశీర్వదించుచు నిట్లనియెను. కుమారులారా! మీరు సర్వదా ధర్మము నాశ్రయించి యుండుఁడు. ఎల్లయెడల మీకభీష్టసిద్ధి యగుఁగాక! నేను చెప్పినట్లుగా మీకుశుభప్ర

ప్రవర్తించుచుండవలయును. అని ప్రబోధించి సత్యవతీనందనుం డంతర్హితుండగుటయు మంత్రోపదేశప్రభావంబున నర్జునుండు దీప్తిమంతుండై విరాజిల్లుచుండెను. ఆతేజోమూర్తిం గాంచి యుధిష్ఠిరాదులు నీవే యిమ్మహాకార్యమును సాధించుటకు సమర్థుండవు కావున వ్యాసాదేశానుసారంబుగ జీవితంబును సఫలంబు గావింపుమని హెచ్చరించి యంతనియాసన్నవిరహంబున కించుక విచారించుచు నతికష్టంబున నర్జును నింద్రకీలపర్వతంబునకుఁ బ్రయాణంబు చేసిరి. అప్పుడు ద్రౌపది దుఃఖితయై కన్నీటి నద్దుకొనుచు నర్జునుని ప్రయాణంబునకుఁ బ్రోత్సహించి నాథా! నీవతిప్రయత్నంబున నీశుభకర్మాచరణముం గావింపుమని వీడుకొలిపెను. పిమ్మటఁ బాండవు లర్జునవిరహంబును భరింపం జాలక ద్రౌపదీ సహితులై తమలోఁ దామిట్లు సంభాషించుకొనఁ దొడంగిరి. దుఃఖసమయంబునఁ బ్రియవస్తుసమాగమంబు లభియించినచో నట్టిదుఃఖము దూరంబై పోవును. కాని ప్రియవస్తువిచ్ఛేదంబైనచో నది ద్విగుణీకృతం బగుచుండును. కావున మన మిప్పు డెట్లు ధైర్యముతో నుండగలము? అని యొండొరు లిట్లు చెప్పుకొనుచు దుఃఖించుచుండ వ్యాసదేవుండు వారికి మరల సాక్షాత్కరించుటయుఁ బాండునందను లమ్మహాముని కాసనాద్యుపచారములం గావించి పూజించి ప్రణామంబు లాచరించుచు నిట్లనిరి. ఓమునిచూడామణీ! మేము దుఃఖదగ్ధుల మగుచుండియు భవద్దర్శనంబునఁ బరమానందభరితులమైతిమి. మహాత్మా! మాకు దుఃఖశాంతికొఱకు నీవిందుఁ గొంతకాలము నివసించి యుండవలయును. అని ప్రార్థించుటయు వేదవ్యాసుండు పాండవుల సుఖంబుకొఱ కందుండుట కంగీకరించి నానావిధ కథాప్రసంగంబులచేఁ బాండవుల దుఃఖవిమోచనంబు గావించుచుండెను. అట్లుండ నొకప్పుడు ప్రసంగవశంబున ధర్మనందనుండు వ్యాసభగవాను నుద్దేశించి యిట్లనియెను. మహాత్మా! మామనస్తాపంబు నీకు నివేదించుకొన్నచో మాకు దుఃఖ

శాంతియగును. పూర్వ కాలంబున నెవ్వరును మావలె నింతటిదుఃఖము ననుభవించిన వారుండరని తలంచెదము. అనుటయు వేదవ్యాసుం డిట్లనియెను. ధర్మనందనా! మీదుఃఖం బత్యల్పమాత్రంబైనది. తొల్లి మహాత్ముండగు నలుండును, హరిశ్చంద్రుండును, శ్రీరామచంద్రుండును ననుభవించిన కష్టంబులను వర్ణించుటకు సమర్థుం డెవ్వండును లేడు. ఈ జీవితమే దుఃఖమయంబని యెఱింగి నీవిప్పుడు దుఃఖమును బరిత్యజింపుము. దేహధారు లందఱును దుఃఖము ననుభవింప వలసినదే మొట్టమొదట మాతృగర్భంబున జన్మగ్రహణ రూపంబులగు నానావిధ క్లేశంబులును, పిమ్మట యౌవనంబున వివిధ ప్రియవస్తుకాంక్షలచే, ననేకప్రకార దుఃఖంబులును గలుగుచున్నవి. దినంబులు వచ్చుచు బోవుచుండును. కాని జీవులు తమ జీవికానిర్వహణ ప్రయత్నములయం దాసక్తులై నిరంతరము నాయుస్సంక్షయం బగుచున్నదను సంగతి నించుకంతయు నెఱుంగకున్నారు. తుదకతిదుఃఖ రూపంబగు మరణము కలుగుచున్నది. అంతకంటెను మించిన దుఃఖంబిఁక నేమున్నది? కావున నియ్యసద్విషయంబును బరిత్యజించి సత్యకర్మానుష్ఠానపరుండవు కమ్ము! సకల జీవులును సదాశివుండు సంతుష్టుండగునట్టి సత్కర్మంబుల నాచరించుట సముచితము. శంకరారాధనంబున సర్వదుఃఖంబులును వినష్టంబులగును. అని యివ్విధంబుగ బారాశర్యుండు పాండవులను బ్రబోధించెను. ఇట్లు నిరంతరమును బాండునందను లభిమతార్థ సిద్ధికొఱకును, జ్ఞానలాభంబునకును దగిన యుపాయంబులను గూర్చి పెద్దల వలనం గ్రహించుచుఁ గాలక్షేపముం గావించుచుండిరి.

—: పార్థున కింద్రుండు ప్రసన్నుం డగుట. :—

అర్జునుండు శుభసూచకంబు లగుశకునంబులం గాంచుచు సందువలనఁ దప్పక శత్రుక్షయంబగునని భావించుకొనుచు రమణీయంబులగు ప్రదేశంబుల నవలోకించుచు హర్షాన్వితుండై యుత్తమ్మం బగుని

ఇంద్రకీలపర్వతమునకుం బోయి యట గంగాతీరంబున నతిసుందరంబును, స్వర్గసదృశంబు నగు నశోకకాననంబున నవస్థితుండై గురూపదేశంబును స్మరించుకొని, గురుప్రణామంబాచరించి గురూపదేశంబుననుసరించి వేష భూషణంబులం దాల్చి యెట్టయెదుట సమసూత్రనిర్మితంబగు పార్థివ శివలింగమును స్థాపించుకొని తేజోరాశి యగునమ్మహాదేవుని సర్వదా ధ్యానించుచు విధ్యుక్తంబుగ నమ్మహేశ్వరునారాధించుచు నతిఘోరంబుగ నింద్రునిగూర్చి తపంబు చేయందొడంగెను. అప్పు డప్పార్థుని యుత్తమాంగమునుండి తేజఃపటలము వినిసృతంబు గాఁజొచ్చెను. దేవతలా తేజముం గాంచి భయకంపితులై యీతపస్వి యేవేళ స్వర్గమునం బ్రవేశించునో యని సంశయాపన్నులై దేవేంద్రునియొద్దకుం బోయి యిట్లు నివేదించిరి. మహాప్రభూ! మీ యశోకవనంబున దేవతయో, మహర్షియో, సూర్యుఁడో మఱియెవ్వఁడో మహాపురుషుఁడు తపంబు గావించుచున్నాఁడు. ఆతని మేమెఱుంగజాలకున్నారము. ఆతని తేజోనలంబునఁ బ్రతప్తులమై మేమందఱమును మీ దర్శనంబునకు వచ్చితిమి. అని విన్నవింపుటయు నింద్రుండు తన కుమారుండగు నర్జునుని యభీష్టము నెఱింగినవాఁడయ్యును దేవతలయొద్ద గోపనముం గావించి వారిని బంపివైచి తానద్భుతంబగు రూపముం దాల్చి యర్జునుని సమీపమునకుం బోయెను. దండధారుండును, నతివృద్ధుండును, జటాధరుండును, మృగచర్మోత్తరీయుండును, ప్రకంపితపదుండును నై వచ్చినయా దేవేంద్రుం గాంచి విజయుండు వినీతుండై పూజాద్యుపచారంబులఁ గావించి యెదుట నంజలిబద్ధుండై నిలువఁబడి యనేకవిధంబుల స్తవంబు గావించుచు మీరెచ్చటనుండి యిచ్చటకు దయచేసితి రని ప్రశ్నించెను. అప్పు డింద్రుండర్జునునకు ధైర్యంబు గల్పించుటకై యిట్లనియెను. ఓస్వామీ! నీవిప్పు డిట్టినవీనవయస్సునం దెందుకొఱకుఁ దపంబు గావించుచుంటివి. ఈ నీ తపంబు ముక్తికో

ఱకుఁ గాదు. నిశ్చయంబుగ విజయంబుకొఱ కాచరించుచుంటివని తోఁచుచున్నది. అనుటయు నర్జునుండు తన యభిప్రాయమంతయు నాతనికి నివేదించెను. ఇంద్రుం డప్పు డయ్యర్జునుని యభిప్రాయము నెఱింగి యాతని బ్రశంసించుచు నీవిప్పుడు సుఖంబుకొఱకుఁ దపంబు చేయుచుంటివి కాని యది యుచితముకాదు. లౌకికంబగు సుఖంబు స్వప్నతుల్యంబు కావున నట్టిసుఖంబుకొఱకుఁ దపంబుచేయుట సమంజసము కాదు. మోక్షంబు నాకాంక్షించితివేని నీవు తపంబు గావింపుము. ఇంద్రుండు కేవలమును సుఖప్రదానంబు గావించుటకుమాత్రమే సమర్థుం డగుంగాని ముక్తి నొసంగఁజాలఁడు. కావుననో సువ్రతా! నీవెల్లవిధంబుల మోక్షంబుకొఱకుఁ దపంబు సేయఁ బ్రయత్నింపుమని యింద్రుండు ప్రబోధించెను. అప్పు డర్జునుండు క్రోధపరవశుండై నేను రాజ్యంబును మాత్రమే యభిలషించుచుంటిని. మోక్షంబు నపేక్షించుటలేదు. నీవేల యిట్లు బోధించెదవు. నేను వేదవ్యాసాదేశానుసారంబుగ నిట్టితపంబు గావించుచున్నాఁడను. అట్టినాతపంబున కంతరాయముంగల్పింపఁజూచెద వేల ? దయయుంచి యిటనుండి వెడలిపొమ్మనియెను. అంత నింద్రుండు ప్రసన్నుండై యథార్థరూపంబున నాతనికి సాక్షాత్కరించెను. అప్పు డర్జునుం డమ్మహేంద్రుని సందర్శించి లజ్జితుండగుటయు నింద్రుం డాతని నాశ్వాసించుచు మరల నిట్లనియెను. నీవు ధన్యుండవు. కృతకృత్యుండవు. నీహృదయంబు నిశ్చలంబైనది. మీ శత్రువులగు దుర్యోధనాదు లతిబలిష్ఠులు. అందు ద్రోణభీష్మకర్ణాదులు కేవలము నజేయులు. వారిని జయించుటకు నాకును సాధ్యంబు గాదు. కావున నెల్లవిధంబుల నీకుహితంబు దెలిపెద నాకర్ణింపుము. శివుండుదక్క మఱియెవ్వండును వారిని జయించుటకు సమర్థుండు కాఁజాలఁడు. కావున నీవిప్పుడు శంకరు నారాధింపుము. భోగమోక్షఫలప్రదుం డగుశంభుండు సర్వకార్యంబులను సంపన్నంబులుగఁ

జేయఁగలఁడు. నేనును బ్రహ్మాది సమస్తదేవతలును, సకలవరప్రధాన సమర్థుండగు విష్ణుండును, మఱియు జయాకాంక్షితుల మగు మేమందఱమును శివుని బూజించుచుందుము. కావున నీవిప్పటినుండి నామంత్రమును బరిత్యజించి సదాశివుని భజింపుము. పార్థా ! నీవు పార్థివలింగపూజావిధానంబున ధ్యానంబునను, సకలోపచారంబులచేతను శివునారాధింపుము. అట్లయినచో సుస్థిరంబుగ నీయభీష్టసిద్ధి కాఁగలదు. అని యిట్లింద్రుండర్జునునకుఁ బ్రబోధించి యనేకవరంబుల నొసంగి మరలనిట్లనియెను. కుమారా ! నీవు సావధానుండవై తపోనుష్ఠానముం గావించుచుండుము. ఎప్పుడును బ్రమత్తుండవై యుండవలదు. శుభకార్యంబుల కంతరాయములు మెండుగనుండును. నీవెంతటిధైర్యముతోనుండిన నంతటిరక్షణముం గాంచఁగలవు. సదాశివుండు నీయభీష్టఫలప్రదానంబు గావించుననుటకు సందియంబు లేదు. అని యింద్రుం డాదేశించి యంతర్హితుండయ్యెను. అదిమొదలుగ నర్జునుండు శివునుద్దేశించి తపంబు చేయందొడంగెను.

## —♦ కిరాతార్జునీయము. ♦—

అర్జునుండు యథావిధిగ స్నాతుండై న్యాసాదికంబు గావించుచు వ్యాసోపదేశానుసారంబుగ ధ్యానంబు చేయుచుఁ బరమయోగివలె నేకపాదంబున నిలిచి సూర్యునియందు దృష్టిని నిక్షేపించి మంత్రమును జపింపందొడంగెను. అప్పు డర్జునునితపస్తేజంబు జగంబునఁ బరివ్యాప్తం బగుటయు సకలదేవతలును నివ్వెఱపడి శివసాన్నిధ్యమునకుం బోయి యిట్లు నివేదించిరి. ప్రభూ ! అర్జునుండు నీకొఱకుఁ దపంబు చేయుచున్నాఁడు. ఆతని యభీష్టమును నీవేల ప్రసాదింపఁ గూడదు ? అని చెప్పి యనేకవిధంబుల వినుతించుటయు శివుండు మీయుద్దేశము ననుసరించి యట్లే కావించెద నని చెప్పి వారిని బంపివైచెను. ఆ సమయంబున మూకుం డనురాక్షసుండు శూకరరూపముం

దాల్చి దుర్యోధనుని ప్రోత్సాహంబున నర్జునుండు తపంబుగావించు చున్న తావునకుఁ జనుదెంచెను. అవిధాకారాకృతిని యొకవరాహాకారదైత్యుం డు పార్థుండు తపంబుసేయుచున్నచోటికి నతిరయంబునం జెలఁగి యెగ్గోసమా ర్గంబున బహుతరంబులగు వృక్షములను భేదించుకొనుచు వికృతశబ్దం బులం గావించుచు నతివేగంబున సమీపించుచుండెను. విజయుండు నావరాహరూపదైత్యుం గాంచి తనమనంబున నిట్లు వితర్కించుకొని యెను. ఈతఁ డెవ్వఁడు? ఎక్కడనుండి వచ్చుచున్నాఁడు. దర్శనమా త్రంబుననే యీతఁడు క్రూరకర్మరతుం డని బోధయగుచున్నది. ఈ తఁడు నిశ్చయముగా నాకు ఘోరతరంబగు విపత్సంఘటనంబు గావిం పవలయు నని వచ్చుచున్నట్లు తోఁచుచున్నది. కావున నీతఁ డెట్లును నాకు శత్రుం డనుటకు సందేహము లేదు. అని నిశ్చయించుకొని విచారకుశలుండగుపార్థుండు మఱియు నిట్లు చింతింపం దొడంగెను. పూర్వము నేననేకదైత్యులను సంహరించియుంటిని. వారియాత్మీయుల లో నొక్కండు డీరూపంబునఁ బగదీర్చుకొనుటకై యిట్లు వచ్చుచున్నట్లు బోధపడుచున్నది. అట్లు కాదేని దుర్యోధనహితాకాంక్షియగు నెవ్వండే నిట్లు వచ్చియుండనోపును. ఎవ్వనిసందర్శనమాత్రంబున మనంబు ప్రస న్నం బై యుండునో యాతఁడు నిశ్చయంబుగ హితసాధకుం డగు సన్మిత్రుం డగును. దర్శనమాత్రంబున మనఃకాలుష్యంబుం గల్పించు నాతఁడు నిక్కంబుగ శత్రుండగును. ఆచారంబునుబట్టి యాభిజాత్యం బును, శరీరంబునుబట్టి భోజనంబును, వచనంబులంబట్టి శాస్త్రజ్ఞానం బును, లోచనంబులనుబట్టి స్నేహభావంబును నెఱుంగనగును. ఆకార గమనచేష్టావచనాదులం బట్టి పరేంగితంబును నిశ్చయింపవచ్చును. ఉజ్జ్వలంబును, సరసంబును, వక్రంబును, నారక్తంబునని నయనంబులు, నలుదెఱంగులై యుండు. నేత్రంబు మిత్రదర్శనంబున నుజ్జ్వలంబును, పుత్రదర్శనంబున సరసంబును, గామినీసందర్శనంబున వక్రంబును,

శత్రుదర్శనంబున జాగ్రత్తంబుననై యుండుము. ఈతనిదర్శనంబున నామ నంబు కలుషితంబగుటచేఁ దప్పక యీతండు నాకు శత్రుండైయై యుండును. విఘ్నకారకులగు దురాత్ములు నీకుఁ గష్టములం గూర్చెద రుగావున నట్టివారి నెల్లవిధంబుల సంహరించి నీవు నిరంతరాయంబుగఁ దపంబుఁ గావింపుమని మహాదేవుం డగు వ్యాసుండు నన్నుఁ బ్రబోధించియున్నాఁడు. నేనింతకుమున్నె యాయుధధారినై యున్నవాఁడను. అని వితర్కించుకొనుచు ధనువునందు బాణమును సంధించి జాగరూకుఁడై యుండెను. అప్పుడు శివుండు గణసహితముగ కిరాతాకృతిం దాల్చి యర్జునుని నక్షించుకొనుటకును నాతని ధైర్యమును బరీక్షించుటకును బయలుదేరి వచ్చుచుండెను. ఆ సమయంబున శంకరుండు కౌపీనధారియు, లతాబద్ధశిరోరుహుండును, ధనుర్బాణపాణియు, శ్వేతరేఖాకలితశరీరుండును, దూరీరయుతుండును నై తనవలెనే వేషభూషణాలంకృతు లగు ప్రమథులతోఁ గలసి బయలుదేరెను. ప్రమథులు వ్యాధులుగను, శివుండు వ్యాధప్రభుండుగను బయనమై వచ్చుచుండ నప్పు డతిభయంకరం బగుశబ్దం బుత్పన్నం బయ్యెను. శూకరరూపుం డగుమూకదైత్యుని వేగగమనశబ్దంబును, కిరాతసేనాప్రచారశబ్దంబునుగలసి దిగంతములఁ బ్రతిధ్వనించుచు సకలజీవసంక్షోభంబు గల్పించుచుండెను. అప్పు డర్జును డదియంతయుం గాంచి యిట్లని చింతించెను.

ఏమది? శివుండు శుభకరుండగుఁగాక! సదాశివుండు మంగళదాయకుండని నేనిదివఱకే వినియుంటిని. కృష్ణుండును నురలఁ జెప్పియున్నాఁడు. వ్యాసభగవానుండు నట్లేయుపదేశించి యుండెను. స్మృతులును, శాస్త్రంబులును, వేదములునుగూడ నట్లే చెప్పుచున్నవి. శివుండు భోగమోక్షప్రదుండనుట కించుకంతయును సంశయము లేదు. శివనామమును జపించువారికి సకలశుభంబులును లభియించును. అమ్మహాదేవు నెల్లయెడల భజించువారి దుఃఖములు దూరములై పోవును.

పూర్వకర్మవశంబున ననుభావ్యంబు లగు నధికదుఃఖంబులుకూడ శివానుగ్రహంబున నల్పంబు లగుచుండును. ప్రారబ్ధవశంబునంగలుగు దుఃఖములు విధాయకముగ ననుభవింపఁ దగినవిగా నైనను శివుండు కరుణించినచో నట్టి దుఃఖములనుగూడ నల్పంబులుగఁ జేయంగలఁడు. ఆ దేవుఁ డిచ్ఛయించినచో ప్రారబ్ధకర్మఫలంబులనుగూడ నశింపఁజేయ గలఁడు. ఆశివుండు తలంచినచో నమృతము విషం బగును; విషం బమృతంబు కాఁగలదు. ఆతనికిఁ జేయరానిపని యేదియును లేదు. ఆమహాదేవు నడ్డగించువా రెవ్వరును లేరు. శివుండు భక్తపాలన దీక్షితుఁడు. ఆశ్రితజనశుభఫలప్రదానపరతంత్రుఁడు. ఆతనియను గ్రహంబున నాకు శుభం బగుఁగాక! పురాతనప్రపన్ను లెల్లగు నిట్టి శివతత్త్వంబు నెఱుంగుదురు. భావిభక్తాగ్రేసరు లందఱు నిట్లు భావిం చుట శుభకరంబు. నాగ్రంథనిశ్చయం బిదియు. సిరి తొలంగినను, జావున మీపించినను, జనులు తెగడినను, బొగడినను, గష్టములు వచ్చినను సకలసమయములయందును శంకరుండె రక్షకుఁడు. అమ్మ హాదేవుం డొక్కొక్కప్పుడు పరీక్షార్థము దుఃఖంబులఁ గల్పించుచుం డును. ఆతఁ డెట్టి యూహించునాప్పునఁ బరిణామమున సుఖప్రదాత యగును. అగ్నిపుటంబులచే సువర్ణంబు పరిశుద్ధం బైనట్లు కష్టంబు లచే భక్తుండు పవిత్రాంతఃకరణుం డగునని వ్యాసదేవునిచే నుపదే శింపఁబడి నేనిట్లు శివు నుపాసించుచున్నాఁడను. కావున నాకిప్పుడు శుభంబగుఁగాక! అని యిట్లు ప్రాణత్యాగపర్యంతము సుజ్ఞానుం డాలో చించుకొనుచుండెను. అంతలో నాశూకర మాతని సమీపించెను. శివుండును దాని వెన్నంటిగా వచ్చుచుండెను. అప్పు డాశూకరము శివా జ్ఞానులకు నడుమఁ బర్వతశిఖరంబున నుండెను. ఈశూకరము నా భక్తుని హింసింపకుండఁ జేయునుగాక యని శివుండు శీఘ్రగమనం బున నేతెంచుచుండెను. ఆసమయంబున శివుండును సుజ్ఞానుండును

గూడ నేకకాలంబున బాణప్రయోగంబు గావించుటయు శివునిబాణ మాశూకరంబునకుఁ బుచ్ఛభాగంబునను, నర్జునుని యస్త్రము ముఖ భాగంబునను సంలగ్నంబులయ్యెను. శివునిబాణ మావరాహపుచ్ఛ ప్రదేశంబునందగిలి ముఖమునుండి బహిర్గతంబై ధరణీగర్భమున విలీనం బయ్యెను. అర్జునునిబాణము ముఖమునుండి పుచ్ఛపర్యంతమును దూసికొని యవ్వలికింబోయి పార్శ్వంబునఁ బడిపోయెను. అప్పు డవ్వరాహము తత్క్షణంబ ప్రాణంబుల విడిచి భూమిపయిం బడిపో యెను. దేవతలానమయంబునఁ బరమానందభరితులై పుష్పవర్షముం గురియించిరి. ప్రాణత్యాగసమయంబున యథాస్వరూపముం దాల్చి యామూకదైత్యుండు మరణించుటచే శివుండు హర్షాన్వితుండయ్యెను; అర్జునన కానందం బయ్యెను. ఆయద్భుతసంఘటనముం గాంచి యర్జునుండప్పుడు శివుండు తనకు సద్బుద్ధిం గల్పించినందులకు సంతో షించుచు ననేకవిధంబుల శివనామస్మరణంబు గావించుకొనియెను.

—: శివభృత్యార్జునసంవాదము. :—

అప్పుడు శివుండు బాణానయనంబునకై తనసేవకుని బంపిం చెను. అందుకొఱకే యర్జునుండు నచ్చటికిం బోయెను. ఆయిరువురు నేకకాలమునందే బాణసమీపమునకు వచ్చిరి. అర్జునుండప్పుడు శివ భృత్యుని దిరస్కరించి బాణమును దీసికొనుటయు శివసేవకుం డీబా ణము మాప్రభునిది కావున నీవు తీసికొనఁగూడదని వారించెను. అప్పు డర్జునుం డిట్లనియెను. ఓవనచరా! నీవు మూర్ఖుండవు. కాకున్నచో నేమియు నెఱుంగకుండ నిట్లేల భాషించెదవు. నేనిప్పుడే దీనిపై బాణ ప్రయోగంబు గావించి యుంటిని. ఇది నీది యెట్లయ్యెను? నాశిలీ ముఖంబునం [illegible] రేఖయును మయూరపింఛంబును నానవాలుగా నున్నవి. ఇంతియ కా[illegible]నామాంకములున్నవి. ఇట్టిచో నిది నీది యెట్లగును? దీనింబట్టి చూడఁగా నీదుస్స్వభావము స్పష్టపడు

చున్నది. అని యిట్లర్జునుండు తిరస్కరించుటయు శివభృత్యుండు హాస్యపూర్వకంబుగ నిట్లనియెను. ఓరీ! నీవు తపస్వివేషముం దాల్చితివి గాని నిజంబుగఁ దపంబు గావించుటలేదు. యథార్థముగ నీవు తపస్విని కావు. తపస్వియెవ్వండును నీవలె నసత్యములు వచియింపఁబోఁడు. నే నేకాకి నని యనుకొనవలదు. మా సేనానాయకుఁడున్నాఁడు. మా స్వామి వనచరులగు ననేక వ్యాధులచేఁ బరివృతుండై యిచ్చట నివసించి యున్నాఁడు. అతఁ డెల్లవిధంబుల నిగ్రహానుగ్రహసమర్థుండు. నీవిప్పుడు గైకొనిన బాణ మాతనిదే! ఇది యెప్పుడును నీయొద్ద నుండునది కాదు. ఓతపోనిధీ! నీవేల తపఃఫలము నూఱక పోఁగొట్టుకొందువు? చౌర్యము, చాంచల్యము, నభిమానము, విస్మయము, సత్యపరిత్యాగము మొదలగు దుర్గుణంబులవలన నిశ్చయంబుగఁ దపంబు క్షీణించునని నేను విని యుంటిని. అట్టి నీకుఁ దపఃఫలం బెట్లు సిద్ధించును? మాస్వామి నీరక్షణంబునకై యీ నారాచమును బ్రయోగించియున్నాఁడు. నీవు దీని నాతనికొఱకు విడువకున్నచోఁ గృతఘ్నుండ వయ్యెదవు. నాస్వామి నీశత్రువు నీనిస్త్రింశంబుచేఁ గొట్టి వధించి నీకుపకారంబు గావించి మరల నీబాణంబును గైకొనఁదలంచి యున్నాఁడు. నీవు కృతజ్ఞునివలెనే యగపడుచున్నావు. నీతపంబును సర్వోత్తమం బైనదిగా నగపడుచున్నది. నీవు సత్యవాదివని బోధ యగుచున్నది. అత్యుత్తమఫలసిద్ధిం గోరియున్న నీకీకఱకుటమ్ముతోఁ బనియేమున్నది? అట్లే నీకుఁ గావలసియున్నచో మాస్వామిని యాచింపరాదా? మాస్వామి యిట్టి బాణంబుల ననేకంబుగ దానంబు చేయుటకు సమర్థుండు. ఆతఁడు మాకుఁ బ్రభుండు. నీవాతని నేల యుద్ధింపఁగూడదు? నీవు బహువిధంబులఁ బ్రార్థించినచో నాతఁడు వివిధంబులగు ఫలంబులఁ బ్రసాదింపఁగలఁడు. నీవుపకారమును బరిత్యజించి యపకారచేష్టల నేల గావించెదవు? ఇంతటి చప

లుండవై యుండుట నీవంటివాని కుచితము కాదు. అనుటయుఁ బార్థుం
డిట్లనియెను. ఓకిరాతా! నీవచనంబు లన్నియు సత్యంబులు.
నీజాతి ననుసరించియే నీవు ప్రవర్తించుచున్నావు. నేను క్షత్రి
యుండను. నీవు వన్యుండవు. మన యిరువురకును యుద్ధ మెట్లు
కాఁగలదు? ఇది సమ్మతంబు గాదు. శాత్రవంబుగాని, మిత్రత్వం
బుగాని సమానవ్యక్తులతోఁ గావించుట యుచితంబు. హీనవ్యక్తు
లతోఁ గావించుట సమంజసంబు గాదు. మీరు కేవలము నికృష్ట
స్వభావులు. కావున మీసావాసియును మీవలెనే నికృష్టుండు. మేము
దాతలము. మీరు యాచకులు. కిరాతుండవు నీవు నను
మాలిన్యవంతుండ నేమి నీనాతని నెట్లు యాచింతును? ఓకిరాతా!
నీవీబాణముకొఱకు నన్నేల యాచింపఁగూడదు? నాయొద్ద ననేకంబు
లగు బాణములు లున్నవి. నీవర్థించినచో నీకు బాణప్రదానంబు చేయు
దును. మారుభిక్షగాని యగు మీరాజు నాకు బాణప్రదానంబు సేయ
నిచో నాకెట్టి సంతసమును లేదు. నీవు నన్ను యాచింపకుండ నీకీబాణ
మును నేనేల యొసంగుదును? మీరాజునకీ బాణముం గైకొనవలయు
నని యిచ్ఛగా యున్నచో నాతోఁ జెప్పుటకేల రాలేదు? ఆవశ్యకం
బైనచో నాతనినే రానిమ్ము. నీమాటలవలన నించుకంతయును
బ్రయోజనంబు లేదు. మీరాజు వచ్చి నాతోడ యుద్ధంబు గావించి
విజయుండై యీబాణమును గ్రహించుంగాక! ఆలస్యమెందులకు?
అని యిట్లర్జునుండు దృఢనిశ్చయుండై పలుకుటయు భిల్లుం డిట్లనియెను.
ఓయీ! నీవవివేకుండవుగాని ఋషివలె నగపడుట లేదు. వృథామర
ణంబునకేల ప్రయత్నించెదవు? ఈబాణమును గూర్చి దురాశపడక
దీనిని వదలుకొని సుఖింపుము. కాకున్నచోఁ గష్టములపాలు గావలసి
వచ్చును. అనుటయు మరల నర్జునుం డిట్లనియెను. నిర్భయుండవై వచ్చి
తానీనపలుకు ఫలంబు ననుభవింతువుగాక! కిరాతుండవైన నన్ను యుద్ధము సేయం

దలంచుచు నాకార్యస్థానంబని నిప్పుడు వినిపించుచున్నాను. అట్టి సంఘటన మును నీవిప్పుడు చూడఁగలవు. ఇఁక నిప్పుడు నీ యిష్టము వచ్చినట్లు చేయుము. అని చెప్పుటయు భృత్యుండు తనప్రభునియొద్దకుం బోయి సర్వంబును నివేదించెను. భిల్లప్రభుండు నంతయు నాలకించి స్వార్థ యుతుండై సేనాసహితంబుగ నర్జునాభిముఖంబై బయలుదేరెను. ఆ భిల్లసైన్యమును గాంచి యర్జునుం డాయుధధారియై యెదురుకొను చుండుటయు నప్పుడు కిరాతరూపుండగు శంకరుం డర్జునునియొద్ద కొక భృత్యునిం బంపెను. ఆసేవకుం డర్జునునియొద్దకుం బోయి తన ప్రభునివాక్యంబులుగా నిట్లనియెను. ఓతపస్వివరా! మర్థయం బగు మాసైన్యము నవలోకించి యుక్తమైనను మాబాణమును విడిచిపెట్టు ము. ఇప్పుడీస్వల్పవిషయంబునకై మరణము నొందుట కిచ్ఛయించెదవు? నీవు మరణించినచో నీసోదరు లత్యంతదుఃఖాక్రాంతులగుదురు. నీభార్యయు నధికదుఃఖంబు నందఁగలదు. ఈధరణీసామ్రాజ్యం బంతయును నీ కరంబులనుండి విచ్ఛిన్నంబై పోవునని నాకు భీతి యగుచున్నది. అని యిట్లు భృత్యుండు చెప్పుటయు నర్జునుం డిట్లనియెను. ఓకిరాతా! నీ వాక్యము లతివిపరీతములుగా నున్నవి. నేనెట్లును నాబాణమును మీ కొరకై విడిచి నావంశమును గళంకితముగఁ జేయఁజాలను. ఇందువల నను నాసోదరులు దుఃఖితు లగుదురు. బాణమును బోఁగొట్టుకొన కున్నచో వారు విచారింపరు. ఈబాణమునువదలినచో నానమస్త్రవిద్య లును వ్యర్థములై పోవును. కావున నేను నిశ్చయముగఁ జెప్పుచున్నా ను. చేతనైనచో మీరు రావచ్చును. సింహము శృగాలంబునకు భయపడినట్లు నేనెన్నండును వినియుండ వేదు. అని యర్జునుండు పలుకు టయు భృత్యుండు శివునియొద్దకుం బోయి సర్వంబును నివేదించెను. అప్పుడు సదాశివుం డానందభరితుండై పార్థునియొద్దకు విచ్చేసెను.

## శివార్జునులద్వంద్వయుద్ధము

అర్జునుం డప్పుడు తనమీఁదికి వచ్చుచున్న భిల్లరాజుం గాంచి శివుని ధ్యానించుచు నాతనిం దలపడి మహారణంబు సేయం గడంగెను. ఆసమయంబునఁ గిరాతసైనికులు నానావిధాయుధపాణులై పార్థునిం జుట్టుముట్టి పీడింపనారంభించిరి. శివుండును విజయునిం దలపడి ఘోరరణంబు సేయుచుండెను. అర్జునుండమ్మహాదేవుని సర్వాస్త్రంబులను ఛేదించుచు సైనికుల సర్వాయుధంబులును విఫలంబులుగఁ జేసివైచుటయేగాక వివిధాస్త్రంబులచే బాధించుటయును వారాతని కోపఁజాలక నలుదెసలకుఁ బలాయితులగుచుండిరి. అప్పుడయ్యర్జును నెదిరి రణంబు చేయుట కొక్కరును సమర్థులు కాఁజాలకపోయిరి. శివార్జునుల కప్పు డతిఘోరం బగు ద్వంద్వయుద్ధము జరిగెను. సదాశివుం డర్జునుని మెచ్చుకొనుచు నాతనినొడిసి పట్టుటయు నర్జునుండు దృఢతరంబుగ శివశరీరంబునఁ బ్రహరింపసాగెను. కాని శివుం డాసమయంబున నర్జునుని సకలాయుధంబులను నిష్ప్రయోజనంబులుగఁ గావించి యాతని కవచమును ఛేదించివైచుటయు నర్జునుండు మల్లయుద్ధంబునకు దొరఁకొనియెను. ఆదారుణ సమరంబునకు ససాగరంబగు ధరణీమండల మంతయును సంక్షోభించెను. ఎట్టివిపత్సంఘటనం బగునో యని దేవత లెల్లరును సంచరించుచుండిరి. శివుం డప్పు డంతరాళమున నిలిచి యుద్ధంబు సేయుటయు విజయుండు నట్లే యంతరాళస్థితుండై యతి దారుణంబుగ రణంబు గావించెను. ఇట్లమ్మహాబలు లిరువురును జగద్భీకరంబుగఁ బోరుగావించుచుండ నప్పు డయ్యర్జునుం డవకాశముం జూచికొని శివుని పాదద్వంద్వముం బట్టుకొని పైకెత్తి యద్దేవదేవుని గిరగిరం ద్రిప్పుచుండుటయు శివుండును తనభక్తపరాధీనత్వముం బ్రకటించుచుఁ గొంతసేపటివఱకు నేమియుం జేయక యనంతర మొక్క క్షణమాత్రంబున నవ్వుచు నర్జునుని చేతులనుండి తప్పించుకొని రణరంగ

మున నిలిచి యొకింతస్మితముఖుఁ డనన్యంబగు తన దివ్యమంగళ సుందర రూపమును బ్రదర్శించెను. పురాణపురుషుం డగునమ్మహాదేవుని దర్శనమాత్రంబున సవ్యసాచి లజ్జితుండై యిట్లు వితర్కించుకొనియెను. ఏమిది! నేనెవ్వని దివ్యరూపమును మనంబున నిత్యమును భావించి సేవించుచుంటినో యట్టి త్రిలోకాధీశ్వరుండగు శివుండే యిప్పుడు నా మ్రోలయెదుట నిలిచియున్నవాఁడు. అయ్యో! నేనిప్పు డెట్టిపని చేసితిని! ఈశ్వరునిమాయ బలవత్తమమైనది. అది మాయావులనుగూడ విముగ్ధులం గావింపఁగలదు. ప్రభుండగు నీశ్వరుండు నిజస్వరూపమును మఱుఁగుపరుచుకొని యెంతపనిచేసినాఁడు! నాకు సిగ్గుగ నున్నది. అని భావించుకొనుచు నర్జునుం డప్పుడు శంకరుని చరణపంకజముల పై వ్రాలి ప్రభూ! నాయపరాధమును క్షమించి నన్ను మన్నింపవలయు నని ప్రార్థించెను. అప్పుడు శంకరుండు ప్రసన్నవదనంబున మందహాసంబు దోఁప నయ్యర్జును నాశ్వాసించుచుఁ గుమారా! నీవు నా భక్తుండవు. నేను నీనిశ్చయమును బరీక్షించుటకై యిట్లు కావించితిని. కావున నీవు విచారింపవల దని యానతిచ్చుచు నాతనిచేయిపట్టుకొని లేవనెత్తెను. సదాశివుం డట్లాశ్వాసించుటవలనను, ప్రమథగణంబులచేఁ దదీయగుణగణంబుల నాకర్ణించుటవలనను, పార్థుండు విగతసంశయుం డయ్యెను. ఆసమయంబున శివుం డర్జునుం గాంచి నేను నీ యెడలఁ బ్రసన్నుండనైతిని వరంబు వేఁడుము. నీవొనరించిన యస్త్రాదికప్రహారంబులను నేను పూజలుగా గ్రహించితిని. నేనిచ్ఛావశంబుననే నీతోఁ రణంబుగావించితిని. ఇందు నీయపరాధం బెంతమాత్రంబును లేదు. నీకీయరానిదేదియును లేదు. నీ కేమి కావలయునో కోరుకొనుము. శత్రువులయందు నీకీర్తి విస్తరించుటకై నేనీయద్భుతకార్యం బొనరించితిని. నీవించుకంతయును విచారింపవలదు. అజ్ఞానమును విడువు మనుటయు నర్జునుం డచ్చట సావధానుండై నిలువఁ

బడి దేవరయిష్టంబని పలికి మరల నోదేవా! ఈజగంబున నీవు సర్వ
సాక్షియుండవు; దయాళుండవు, సదాశివుండవని ప్రశంసించుచు నమ్మహా
దేవుని నుద్దేశించి వేదసమ్మతంబుగ నిట్లు స్తుతింపం దొడంగెను. ఓ
దేవదేవా! కైలాసవాసా! సదాశివా! పంచవక్త్రా! కపర్దీ! త్రినే
త్రా! నీకు నమస్కారము. ఓసుముఖా! నీవు కుండలేంద్రుండవు. నీవు
సర్వదా సత్పురుషులకుం బ్రసన్నుండవగుదువు. నీవదనమండ
లము నిరంతరము మందహాసవిలసితంబు! ఓ నీలకంఠా! సద్యోజాతుండ
వగునీకు నమస్కారము. వృషభధ్వజుండవును, నర్ధనారీశ్వరుండవును,
దయాళుండవును, బరమాత్ముండవు నగు నీకు వందనము. డమరు
కపాలహస్తుండవును, నరకపాలమాలికాలంకృతుండవు నగునీకుం బ్రణా
మంబు. నీదివ్యదేహము నిర్మలస్ఫటికముం బోలి స్వచ్ఛంబైనది.
కర్పూరగౌరవంబైనది; నీవు పినాకపాణివి, త్రిశూలధారివి. నీకు
సాష్టాంగనమస్కారంబు. వ్యాఘ్రచర్మోత్తరీయుండవును గజచర్మధరుం
డవును, నాగభూషణుండవును, గంగాధరుండవు నగు నీకు నమస్కార
ము. నీసుందరచరణకమలము ముక్తిప్రదాయకమైనది. నీవు నిర్గుణుం
డవయ్యును సగుణుండవు. ఈజగంబునంగల దృశ్యవస్తువులన్నియు
నీ తేజోమాత్రంబులు. దేవా! దేవతలైనను నీగుణగణంబులను బరిగ
ణింపంజాలరు. మందబుద్ధినగు నేనెట్లు నిన్ను వర్ణింపంగలుగుదును. అట్టి
తత్త్వస్వరూపుండ వగునీకు నమస్కరించుచున్నాను. నన్ను గరుణిం
పుము. అని యిట్లువిష్ణుండు వినుతించుటయు శంకరుండు ప్రస
న్నుండై వరప్రార్థనంబు గావింపు మనియెను. అప్పు డజ్జనుం
డా సదాశివునకుం బ్రణమిల్లి యిట్లనియెను. మహాత్మా! నీవు
ప్రసన్నుండవగుము. సకలాంతర్యామి వగు నీ వెఱుంగని దేది
యును లేదు. అయినను నీయానతి ననుసరించి ప్రార్థించుచున్నా
ను. నీ దర్శనమాత్రంబున నాకు శత్రుభయంబు దూరీభూతం

బైనది. నాకీజగంబున విశేషయశంబు లభియించునట్లనుగ్రహింపుము. అని ప్రార్థించుచు నర్జునుండు శివునకు నమస్కారంబు గావించి నిటల ఘటిత కరకమలుండై నిలువంబడుటయు శివుం డాతని ననభక్త్యాగ్ర గణ్యునిగా భావించి పాశుపతంబను దివ్యాస్త్రంబు నాతనికిం బ్రసాదించుచు నిట్లనియెను "అర్జునా! నీవీప్రపంచమునం దెంగాను శత్రువుల కజేయుండ వయ్యెదవు. ఈ పాశుపతదివ్యాస్త్రమూలంబున శత్రువులను జయించి నీవు సకలసుఖోపభోగంబుల ననుభవింతువుగాక! నేను నీకుసహాయంబు గావింపుమని కృష్ణునకుం జెప్పెదను. ఆతండు నాయంశదో కావున నీకెల్లవిధంబులం దోడుపడుచుం గార్యనిర్వహణంబు గావించును. నీవు నిష్కంటకంబగు సామ్రాజ్యముం గాంచి నానావిధంబులగు ధర్మంబులం గావింపుము. అని యిట్లు శివుండు తనకరకమలము నర్జునునిమస్తకమునం దుంచి యూరించి కౌఁగలించుకొని తన భక్తివత్సలత్వము తేటపడునట్లుగ నాశీర్వదించుచు జయప్రదానంబు గావించి యాతనిచేఁ బూజితుండై యంతర్హితుం డయ్యెను. అర్జునున కట్లు మహాదేవుండు పాశుపతాస్త్ర ప్రదానముం గావించుటయు దివ్య దుందుభులు మొరసెను. పుష్పవృష్టిగురిసెను. అప్సరలు నృత్యంబులం గావించిరి. అప్పుడు సకలదేవతలు నచ్చట సాక్షాత్కరించి యర్జునునకుం దమతమ దివ్యాస్త్రంబుల నొసంగిరి. అట్లర్జునుండు సకలదేవతల చేతను సన్మానింపఁబడి భ్రాతృగణంబునొద్దకుం బోయెను. సోదరులెల్లరు నాతనిం గాంచి శరీరంబునఁ బ్రా[illegible]యం[illegible] నట్లుగా సంతసించిరి. ద్రౌపదియును బరమానందభరితయయ్యెను. అప్పుడుస్త్రీపుత్ముల యాశ్రమంబున శుభసూచకంబుగా జలసకలితం బగు పుష్పవర్షము గురిసెను. అర్జునుండు సోదరులతోఁ సమస్తవృత్తాంతము నెఱింగించి వారికి బరమానందముగావించెను. అప్పుడు పాండవులందఱును మహాదేవుండగు శంకరు ననేకవిధంబుల వినుతించుచుం [illegible]ను

దుఃఖంబులు దూరంబయ్యెననియు, విజయంబు లభియించుననియు నుప్పొంగసాగిరి. అర్జునాగమనము నెఱింగి యాతనిం గాంచుటకై యప్పుడు కృష్ణుం డచ్చటికి వచ్చి పార్థునివలన నెల్లసంగతులు నెఱింగి హర్షవికసితహృదయకమలుండై యిట్లనియెను. నేనిందుకొఱకే చెప్పియుంటిని. శంకరుండు సకలదుఃఖవినాశకుఁడు నేను నిరంతరమును సదాశివు నారాధించుచుందును. మీరును నాతని సేవింపుచుండుఁడు! అని ప్రబోధించి కృష్ణుండు ద్వారకానగరంబునకు వెడలిపోయెను.

—: పార్థివ శివపూజావిధి. :—

మహర్షిశేఖరులారా! దుఃఖంబు సన్నిహితంబైనప్పుడును, నాధిదైవికాది త్రివిధబాధాశాంతికొఱకును, స్వర్గాదిసుఖంబులనిమిత్తంబును, మోక్షార్థంబును సద్గురు నాశ్రయించి యాతనియొద్ద శివమంత్రగ్రహణంబు గావింపవలయును. అనంతరము పురుషుండు యథావిధిగ శౌచ్యాశుద్ధుండై మలమూత్రంబుల విసర్జించి దంతధావనంబు చేసి మిగుల విశ్వాసముతో శివారాధనంబు గావింపవలయును. బ్రాహ్మముహూర్తంబున లేచి గురుస్మరణంబును బ్రణామంబు నాచరించి శివనామసంకీర్తనంబును, బుణ్యతీర్థస్మరణంబును గావించి దంతధావనంబు చేసి సుస్నాతుండై యాచమనంబు చేసి మంత్రంబుచేతను, శివాదినామంబులచేతను లలాటహృదయనాభిగళస్కంధబాహుపృష్ఠమస్తకాది ద్వాదశస్థానంబులఁ దిలకధారణంబుగావించి ధర్మశాస్త్రోక్త ప్రకారంబున నిత్యకృత్యంబులగు సంధ్యావందనాదివిధులం దీర్చి భూతశుద్ధిగావించి పార్థివమూర్తిని బ్రాణప్రతిష్ఠాపనంబు గావించి యారాధింపవలయును. మానవులకు శివారాధనమే సర్వసిద్ధిప్రదాయకంబైనది. జ్యోతిస్స్వరూపుండగు శివుండు నాహృదయంబున నివసించియుండెను గావున హృదయస్థుండగుశంకరుండు జపసిద్ధికొఱకు నాశరీరమును విశుద్ధంబుగఁ జేయుఁగాక యనుమంత్రంబున సమస్తకార్యంబులఁ సంప

న్నంబుల గావించి శివపూజం గావింపవలయును. అందుఁ బ్రథమంబునఁ బిత్రృసేవనంబును, ననంతరము సూర్యార్ఘ్యప్రదానంబును గ్రమంబుగ గణపతిపూజయు, విష్ణుసమారాధనంబును, భవానీసేవనంబును, బిమ్మటఁ బార్థివలింగార్చనంబును యథావిధిగ నాచరింపవలయును. "ఓం శ్రీ అష్టమూర్తయే నమః" అను నిమంత్రంబును జపించుచుఁ బవిత్ర స్థానంబునుండి యత్నపూర్వకంబుగ మృత్తికాసంగ్రహణంబు గావించి దానిం బరిశోధించి పవిత్రస్థానంబున రక్షణంబు గావింపవలయును. ప్రతిదినంబును మృత్తికాసంగ్రహణంబుఁ జేయ శక్తుండైనచోఁ గృష్ణపక్షంబునఁ జతుర్దశిదినంబున సంగ్రహించినయెడల నొకమాసంబు వఱకు నది యుపయోగింపఁగలదు. తరువాత మరల సంగ్రహింపవలయును. ఆరాధకుండు ముందుగ నాచమనంబు చేసి తిథివారాద్యుల్లేఖపూర్వకంబుగ సంకల్పం బాచరించి "శివాయ అంగుష్ఠాభ్యాన్నమః; భవాయ తర్జనీభ్యాన్నమః; శర్వాయ మధ్యమాభ్యాన్నమః; పశుపతయే అనామికాభ్యాంనమః; మహాదేవాయ కనిష్ఠికాభ్యాం నమః; ఈశానాయ కరతలకరపృష్ఠాభ్యాం నమః; అని యీవిధంబుగఁ గరన్యాసంబును, శివాయ హృదయాయనమః; భవాయ శిరసేస్వాహా; శర్వాయ శిఖాయైవషట్; పశుపతయే కవచాయహుం; మహాదేవాయ నేత్రత్రయాయవౌషట్; ఈశానాయ అస్త్రాయఫట్; అని యివ్విధంబుగ నంగన్యాసంబును గావించి:—

ఓమ్. ధ్యాయేన్నిత్యం మహేశం రజతగిరినిభం చారుచంద్రావతంసం
రత్నాకల్పోజ్జ్వలాంగం పరశుమృగవరాభీతిహస్తం ప్రసన్నం
పద్మాసీనంసమంతాత్ స్తుతమమరగణైర్వ్యాఘ్రకృత్తింవసానం
విశ్వాద్యం విశ్వబీజం (వంద్యం) నిఖిలభయహరం
పంచవక్త్రం త్రినేత్రం.

కర్పూరగౌరం కరుణావతారం
సంసారసారం భుజగేంద్రహారం

సదావసంతం హృదయారవిందే
భవం భవానీసహితం నమామి.
కైలాసపీఠాసనమధ్యసంస్థం
భక్తైశ్చసంద్యాదిభిః సేవ్యమానం
భక్తార్తిదావానలమప్రమేయం
ధ్యాయేన్మహాలింగశివస్వరూపం :—

అని యిట్లు ధ్యానంబు గావించి పిమ్మట శివుని బూజింపవలయును. ఇట్లు ధ్యానాదికంబు గావించుటకు కర్తలగువారు "ఆనందపూర్వకంబుగ శాస్త్రోక్తస్వరూపాకారుండును భగవంతుండు నగు శివుని ధ్యానించుచున్నాను" అని యీవిధంబుగ ధ్యానంబు గావింపవలయును. ధ్యానానంతరంబున హరుండును మహేశ్వరుండును, శూలపాణియు పినాకధరుండును, పశుపతియు, శివుండును, యజమానుండును అను నామంబులచే క్రమంబుగ మృత్తికాసంగ్రహణంబును, లింగసంఘటనంబును, లింగప్రతిష్ఠయు, లింగావాహనంబును, లింగాభిషేకంబును, లింగపూజయు, క్షమాప్రార్థనంబును గావించి విసర్జనంబు గావింపవలయును.

"కైలాసశిఖరాద్రమ్యాత్ సమాగచ్ఛ మమ ప్రభో పూజాం చేమాం గృహీత్వా చ యథోక్తవరదో భవ" అను మంత్రంబున గావించిన యావాహనంబు విశేషం బని యెఱుంగునది. మంత్రజపసంఖ్యయందు దశాంశంబు హోమంబును హోమంబున దశాంశంబు తర్పణంబును గావింపవలయును. అనంతరము శివసంబంధి యగువృషభశ్రేష్ఠంబును ప్రమథగణంబులను బూజించి విధ్యుక్తంబులగు పర్వ్య కార్యములు చేర్పవలయును. "ఓం పశుపతయే నమః" అను మంత్రంబున స్నానంబును, మృత్యుంజయనామమంత్రంబులచేతను, మంత్రంబులచేతను శివసంకల్పంబును, "ఓం శివాయనమః" అను మం

లింగమున సూపనిపక్వ నైవేద్య ప్రభృతి నానావిధద్రవ్యనివేదనంబును గావించి యీరతి నోసంగవలయును. పిమ్మట "యజమానాయనమః క్షమస్వ" అను మంత్రంబులచే విసర్జనంబు గావించి పూర్వోక్త రూపంబున ధ్యానంబు చేసి మంత్రజపారంభంబు గావింపవలయును. "ఓం అస్యశ్రీసదాశివమంత్రస్య వామదేవో ఋషిః, దేవీపంక్తిచ్ఛందః శ్రీశివో దేవతా మమభుక్తిముక్తిసిద్ధ్యర్థే జపే వినియోగః" అని జపారంభము చేసి యనంతఫలసిద్ధికొఱకు సహస్రసంఖ్యాకంబగు మంత్రంబును శివసన్నిధిని జపింపవలయును. జపసమయంబున గద్గదచిత్తుండై త్ర్యంబకుని ధ్యానంబు చేయవలయును. శుభఫలాకాంక్షియగు నరుండు యథాశక్తిం గావించిన జపంబునందు దశాంశంబు తర్పణంబును నందుదశాంశంబు మార్జనంబును గావింపవలయును. మఱియు లింగపూజాఫలసిద్ధికొఱ కష్టమూర్తిపూజనం గావింపవలయును. శర్వాయ క్షితిమూర్తయే నమః, భవాయ జలమూర్తయే నమః, రుద్రాయ తేజోమూర్తయే నమః, ఉగ్రాయ వాయుమూర్తయే నమః, భీమాయాకాశమూర్తయే నమః, పశుపతయే యజమానమూర్తయే నమః, మహాదేవాయ సోమమూర్తయే నమః ఈశానాయ సూర్యమూర్తయే నమః, అనుమంత్రంబులం బఠియించుచు యథావిధిగం గ్రమంబుగం జందనాక్షతాదులచేం బూజింపవలయును. అనంతరము నృత్యగీతవాద్యంబులచే శివునారాధించి దోసిలినిండం బుష్పంబుల నక్షతలను గ్రహించి శంకరునియెదుట నిలువంబడి "ఓశంకరా! నేను నీవాండను. నాప్రాణంబును, మనంబును నీయందే లీనంబులై యున్నవి. కృపాసింధూ! భూతనాథా! నీవింతయును గ్రహించి నాకుం బ్రసన్నుండవగుము. శంకరా! నేనజ్ఞానముచేంగాని, జ్ఞానముచేం గాని కావించినపూజ లన్నియును నీ కృపావశంబున సఫలంబు లగుంగాక! నేను మహాపాపాత్ముండను, నీవు పతితపావనుండవు. సర్వజ్ఞుండవగు

నీవు నావిషయంబున నీ యిచ్ఛవచ్చినట్లాచరింపుము. వేదపురాణాది సకలార్థవిదులగు మహర్షులుగూడ నిన్నెఱుంగంజాలరు. అట్టిచో సామాన్యుండ నగునేను నీతత్త్వము నెట్లెఱుంగుదును ? దేవదేవా ! శంకరా ! నీవెట్టివాడవైన నగుదువుగాక ! ఎల్లవిధంబుల నీసేవకుండ నగు నన్ననుగ్రహింపుము. అని ప్రార్థించు శివునియుత్తమాంగంబునం బుష్పాంజలినిడిచి బహుప్రకారంబులం బ్రార్థించుచు మహాదేవా ! దయాళుండవై నీవిప్పు డెట్లువచ్చి నాపూజల నందికొంటివో యట్లే మరల దర్శనం బొసంగు మను మంత్రంబును బఠించుచు శివలింగ విసర్జనంబు గావింపవలయును. తదనంతరము మరల సంకల్పంబు గావించి సమాప్తంబు చేసి కర్మదక్షులగు మానవులు సాంసారికక్రియల నిర్వర్తించుకొనవలయును. ఇట్లు యథావిధిగ శివపూజం గావించుచుండినచో నధికఫలసిద్ధియగును. పూజావిధానంబుకొఱకు బ్రాహ్మణాభావంబైనచో మంత్రపూర్వకంబుగ స్వయముగనే పూజింపవలయును. అందువలన లింగపూజాఫలంబు సిద్ధించును. శివపూజాపరుండు శంకరాదేశంబునం బూజానంతరమతఁ డాశీర్వాదమును గ్రహింపవలయును. శివపూజాపరాయణుల కెట్టిలోపములును గలుగవు. ఎవ్వం డాఱుమాసంబులు యథావిధిగ శివపూజం గావించునో యాతండు శాపానుగ్రహసమర్థుం డగును. ఇందెంతమాత్రమును సంశయము లేదు. శివభక్తదర్శనంబున శివదర్శనఫలంబు లభించు నని మహర్షులు నిర్దేశించిరి. భగవానుండగు కృష్ణుండును, దేవప్రభుండగునింద్రుండును, ప్రధానులగు మునులును, సకలర్షులునిట్లే పార్థివశివలింగార్చనముం గావించిధన్యులైరి. ఈయుత్తమాఖ్యానంబు నాకర్ణించువారు శాశ్వతసిద్ధిం గాంతురు.

## —: బిల్వేశ్వరమహాత్మ్యము. :—

మునిశ్రేష్ఠులారా ! శ్రీకృష్ణుండు గోకులమునుండి మధురానగరమునకుం బోయి కంసుని సంహరించి దేవకీవసుదేవులను గారాగృహ

విముక్తులం గావించి సమ్మట యాదవులనందఱ సాహాయ్యగొంచి యుగ్ర
సేనునకు రాజ్యప్రదానం బాచరించి యాతనిచే ధర్మానుసారంబుగ
[illegible]
[illegible] తీర [illegible]
పునిం గుమారునిం జేసికొని యాతనిచే శివమంత్రోపదేశం బొందియుండెను.
ఆశివమంత్రప్రభావంబునఁ బ్రభుండగు శ్రీకృష్ణుం డల్పకాలంబునం దే
సకలవిద్యాపారంగతుం డయ్యెను. సమ్మోదంబున కృష్ణుండు [illegible]
గురుదక్షిణ [illegible] మగధ మధురానగరంబునకు వచ్చి రాక్షసులతో
యుద్ధంబు గావించెను. అప్పుడు మధురానగరము గుప్తదానవులచే
నాక్రమింపఁబడియెను. అంత వాసుదేవుండు సముద్రమధ్యంబున
ద్వాదశయోజనపరిమితంబున [illegible] ద్వారకానగరమును
నిర్మించి యందు వసుదేవాది సకలయాదవులను నివసింపఁ జేసి యోగ
మాయాప్రభావంబున లభ్యంబులగు సకలోపకరణంబులతో [illegible]
గృహకార్యభారమును వారియందే యుంచి తానందు నివసించి
యుండెను. అనంతరము కృష్ణుండు కాలయవనాది రాక్షసులచే పీడి
తుండై యనుగ్రహపూర్వకంబుగఁ దానే స్వయముగఁ బోయి ముచు
కుందునకు దర్శనం బొసంగెను. ఒకనాఁడు శ్రీకృష్ణుండు రైవతనామ
కంబగు పర్వతంబున కరిగి యందుపమన్యుండను శివభక్తాగ్రేసరుం
దర్శించి నాకీ యిహలోకంబునఁ బరమునందుతో సహపూర్వకంబగు జయ
లాభం బెట్లు సిద్ధించునో యుపదేశింపు మని యమ్మహాత్ముని బ్రార్థిం
చెను. గణశ్రేష్ఠుండగు నుపమన్యుం డప్పుడా దేవకీనందనుం గాంచి
యిట్లనియెను. కృష్ణా! నీవు విష్ణుస్వరూపుండవు. నీవేల శివారా
ధనముం గావింపవలెను? ఆమహాదేవుని సేవించితివేని నిశ్చయ
ముగ నాతఁడు నీ కెల్లసమయములయందును సాహాయ్యంబు గావిం
చును. కావున నీవు నిరంతరము నమ్మహాదేవు నారాధింపుము. అని

యిట్లుపమన్యుం డుపదేశించుటయుఁ గృష్ణుం డదిమొదలుగ నేడు మాసంబులవఱకును నిరంతరమును సహస్రపత్రంబులును, బిల్వపత్రంబులును, శతపత్రంబులును, కుశలును, గరవీరపుష్పంబులును, దూర్వాంకురంబులును, సర్వపుష్పంబులును, రక్తపద్మంబులును, శంఖపుష్పంబులును మొదలగువానిచే శంకరుని బూజించుచు సంతుష్టుం గావించుటయు శంకరుండు ప్రసన్నుండై సాక్షాత్కరించి వరంబు వేఁడుకొమ్మనియెను. అప్పుడు వాసుదేవుండు పరమానందభరితుండై యిట్లనియెను. శంకరా! నీప్రభావంబున నాకు సర్వంబును లభించియున్నది. ఇప్పుడు దానవులు నన్నధికతరంబుగఁ బీడించుచున్నారు. కావున నీశరణంబు గోరితిని. అని యిట్లు కృష్ణుండు ప్రార్థించుటయు శంకరుండు కృష్ణునకు ధనధాన్యంబులును, నసంఖ్యపత్నీపుత్రులును, నసమాన సామర్థ్యంబును లభియించునట్లు వరంబొసంగెను. భవానియును దేవకీనందనున కనేక వరంబులఁ బ్రసాదించెను. అప్పుడు శ్రీకృష్ణుండు పరమానందహృదయుండై దేవదేవున కిట్లనియెను. మహాదేవా! నీవు పూర్వకాలంబున నాయం దనుగ్రహించి నాకు సుదర్శనచక్రప్రదానంబు గావించితివి. నేనాచక్రప్రభావంబుననే నిరంతరమును దేవతాగణంబులచే బహుమానితుండనగుచున్నాఁడను. నీవిప్పుడును నేనుగోరినవరంబులఁ బ్రసాదించితివి. నాకింకఁ గావలసినదేమి? అని పలుకుచుఁ గృష్ణుండు శివు ననేకవిధంబులఁ బూజించుటయు శంకరుండు సంతుష్టుండై నీకెల్లవిధంబుల శ్రేయోదాయకంబులగు కార్యంబులయెడల నేను సహాయుండనై యుండెద నని యభయం బొసంగెను. అనంతర మయ్యాదవవీరుండు సంతుష్టుండై ద్వారకానగరంబునకుం బోయి సకలజనంబులను బరిపాలించుచుండెను. భగవంతుం డగుశంకరుం డిప్పటికిని రైవతపర్వతంబున లోకసుఖదాతయుఁ బరమసుందరుండునై బిల్వేశ్వరనామంబునఁ బ్రసిద్ధుండై

యున్నవాఁడు. కృష్ణుండు సప్తమాసంబులు నిరంతరము నమ్మహాదేవుని యుత్తమాంగంబున బిల్వపత్రంబుల నర్పించుటచే నాదేవునకు బిల్వేశ్వరుం డనునామంబు కలిగెను. ప్రతిదినంబును గృష్ణునిచే విసర్జింపఁబడుచున్న శివనిర్మాల్యంబులగు నాబిల్వపత్రంబులలో నొక్కొక్కదానినుండి యొక్కొక్క శివలింగము భక్తరక్షణార్థంబుగ నావిర్భూతంబయ్యెను. ఆశివలింగంబులన్నియును నాదేవునిచేఁ బ్రార్థింపఁబడి లోకహితార్థమాయాస్థానంబుల ననస్థితంబులై యుండెను. పరమాత్ముండగుకృష్ణుం డదిమొదలుగ శివారాధనము గావించుచుండెను. భుక్తిముక్తిఫలప్రదాతయగు నీబిల్వేశ్వరుని చరిత్రము నాకర్ణించువారు సకలపాపవిముక్తులగుదురు.

## విష్ణునకు సుదర్శనచక్రప్రాప్తి.

పూర్వకాలంబునం దొకానొక సమయంబున రాక్షసు లధికబలసంపన్నులై సకలలోకంబులను బీడించుచు సకలధర్మంబులను ధ్వంసము చేయుచుండిరి. అప్పుడు దేవత లందఱు నసురపీడితులై విష్ణుదేవునియొద్దకుం బోయి యిట్లని ప్రార్థించిరి. దేవా! మాయెడలఁ గృపాకలితుండవై మమ్ము రక్షింపుము! దానవు లెల్లయెడల మమ్ము హింసించుచున్నారు. అగతికులమై యేమియుం జేయఁజాలక నీశరణంబు గోరివచ్చిన మమ్ముద్ధరింపుము. అని వేఁడుకొనుటయు విష్ణుదేవుం డిట్లనియెను. సురలారా! నేను శంకరు నారాధించి మీయభీష్టంబు దీర్చెదను. ఆరాక్షసు లతిబలవంతులగుటచే మహాప్రయత్నంబునఁగాని విజితులు కానేరరు. మీరు స్వస్థచిత్తులై మీమీస్థానంబులకుఁ బొండు. అని యిట్లానతిచ్చి దేవతలను బంపివైచి కృష్ణుం డసురవిజయంబుం గోరి శంకరు నారాధింపం దొడంగెను. ఆతఁడు కైలాసపర్వతంబునకుం బోయి యొకయుత్తమస్థలంబున హోమకుండంబు నిర్మించుకొని యందగ్నిస్థాపనంబు గావించి హోమసమారంభంబునఁ దారిన

శివపూజావిధానంబున యథావిధిగ మహాదేవు నారాధించుచు ననేక విధంబులగు స్తోత్రపాఠంబులఁ గావించుచు మానససరోవరసంజాతంబు లగుకమలంబులచే శంకరుని బూజించుచు నిష్ఠాగరిష్ఠుండై తపంబు గావించుచుండెను. అప్పుడా కృష్ణుండు మహాదేవుండు ప్రసన్నుండగు నంతవఱకు నీస్థానంబు విడువ నని నిశ్చయించుకొని బద్ధాసనుండై యచ్చట నవస్థితుండై నిరంతరమును శివారాధనం బాచరించుచుం డెను. కాని యెంతకాలంబునకును శంకరుండు ప్రసన్నుండు కాకుండు టచే వాసుదేవుం డెంచుక విచారించి నానావిధంబులగు గష్టతమంబగు తపంబుచేయుచు శివుని బూజింప నారంభించెను. అప్పటికిని శివానుగ్రహము లభించకుండుటచే నొక్కొక్క శివనామంబున కొక్కొక్క కమలంబుగా శివసహస్రనామోచ్చారణ పూర్వకంబుగ సహస్రకమలంబులచే సదాశివునిం బూజించి ప్రసన్నుం గావించుకొనవలయు నని సంకల్పించి కృష్ణుండట్లు సహస్రకమలపూజం గావించుట కుద్యుక్తుం డయ్యెను. అప్పుడు శివుండు తనభక్తుని భక్తిభావముం బరీక్షించుటకై సహస్రపద్మములం దొకపద్మము నపహరించెను. కాని కృష్ణుం డయ్యది శివమాయావిలాసము నించుకంతయు నెఱుంగఁజాలకపోయెను. తుదకొక్కపద్మము లుప్తం బగుటయుఁ గృష్ణుం డప్పుడు తన నయనకమలంబు నుత్పాటితంబు గావించి పూరింపందలంచెను. ఆసమయంబున సర్వదుఃఖాపహారియగు శంకరుండు ప్రసన్నుండై వరంబు గోరుకొమ్మనియెను. అప్పుడు కృష్ణుం డపరిమితానందభరితుండై యిట్లు వేడుకొనియెను. దేవదేవా! సకలాంతర్యామివగు నీ కెఱుంగరాని దేమున్నది? నీయెదుట నేనింకను గోరవలయునా? సదాశివా! త్రిజ గంబులను [illegible] ఆట్టి బల వంతులగు దానవులను సంహరించుటకుఁ దగనదవ్యాస్త్రం బెదియును లభింపకున్నది. ఇఁక నేమి చేయవలయును? నీ శరణంబు గోరితిని.

కావున నన్నుఁ గటాక్షించి లోకంబుల నుద్ధరింపుము. అని యిట్లు కృష్ణుండు ప్రార్థించి పరమాత్ముండగు శివునకుఁ బ్రణామంబు గావించి బద్ధాంజలిపుటుండై యెదుటనిలువఁబడి యుండెను. అప్పుడు సకల లోక ప్రభుండగు శంకరుండు కృష్ణభగవానునకు సుదర్శనచక్రప్రదానంబు గావించెను. ఆ చక్రాయుధ ప్రభావంబునఁ గృష్ణుండు దుర్జయులగు దానవులను సంహరించి లోకహితంబు గావించెను. శ్రీకృష్ణుండట్లు సహస్రపద్మంబులచే శివునిబూజించుచుఁ బఠియించిన పవిత్రంబులగు * శివసహస్రనామంబులు ప్రకాశినము నెవ్వండు భక్తిశ్రద్ధలతోఁ బఠియించునో యాతనికి సకలాభీష్టసిద్ధి యగునని శివుండానతిచ్చెను. ఈ సహస్రనామంబులఁ బఠియించువారికి నుపదేశించువారికిని స్వప్నంబులయందైనను దుఃఖంబులు పొరయవు. శివసహస్ర నామంబులు శతవారంబులు జపియించినచో మహారాజులకు రాజ్యవిప్లవంబులు దొరగి కల్యాణఫలంబులు సిద్ధించును. ఎవ్వఁడు నిత్యంబును ప్రాతఃకాలంబునఁ బార్థివలింగార్చనంబు గావించి సహస్రనామంబులు పఠయించునో వానికి సర్వార్థసిద్ధి యగును. ఈశివసహస్రనామజపంబైహికాముష్మిక ఫలప్రదాయకంబు.

## —: శివరాత్రివ్రతమాహాత్మ్యము :—

ఓమునిశ్రేష్ఠులారా! అనంతపుణ్యఫలప్రదంబును, పరమేశ్వరానుగ్రహప్రదాయకంబును, భోగమోక్షప్రదంబును నుత్తమంబును నగు శివరాత్రివ్రతమాహాత్మ్యముంగూర్చి పూర్వకాలంబున దేవదేవుండగుసదాశివుండు బ్రహ్మావిష్ణువులకును దుర్గాదేవికిని బ్రసన్నుండై యుపదేశించి యుండెను. ఈశివరాత్రివ్రతం బెల్లవ్రతంబులయందును త్తమంబగునది. ఇది ఋగ్వేదప్రభృతి వేదంబులలోనను, ఆయుర్వేదాద్యుపవేదంబులలోనను, మన్వాదిస్మృతిసమూహంబులలోనను, బ్రహ్మ

* ఈ శివసహస్రనామంబులు గ్రంథాంతమునఁ బ్రకటింపఁబడును.

దిపురాణంబులలోనను, సకలశాస్త్రతత్త్వంబులలోనను, సర్వోత్కృష్టధర్మంబులలోనను, గోపనీయంబులగు సమస్తవ్రతంబులలోనను నద్వితీయసారభూతంబైనది. సమస్తవ్రతంబులయందు నీవ్రతం బతిహితకరమైనది. శివపూజయు, రుద్రాధ్యాయజపంబును, దినత్రయోపవాసవ్రతంబును, వారాణసీమరణంబును ననునీనాలుగును ముక్తిసాధనంబులు. అష్టమీసోమవారవ్రతంబును, కృష్ణపక్షచతుర్దశీవ్రతంబును శివసంతుష్టికరంబులు. వీనిలో శివరాత్రివ్రతం బత్యుత్తమంబైనది. కావున భోగమోక్షార్థులగువారికి శివరాత్రివ్రతం బవశ్యకర్తవ్యంబు. దీనికంటె హితసాధకంబులగు వ్రతంబు లెవ్వియును లేవు. ఇట్లు శివుండు విష్ణుదేవున కుపదేశించుటయు విష్ణుండిట్లని ప్రశ్నించెను. దేవదేవా! ఈవ్రతం బెట్లు చేయవలయును? ఏమాసంబున నెట్టివిధానంబునం గావింపవలయునో లోకహితార్థంబుగ నానతీయవలయును? దేవా! నీకుం జతుర్దశి యెందులకుఁ బ్రియకరంబైనదియో యెఱింగింపుము. అనుటయు శివుం డిట్లనియెను. హరీ! ఈవ్రతంబు బ్రాహ్మణాది సకలవర్ణంబులవారును, బ్రహ్మచారిప్రభృతి సకలాశ్రమస్థులును, స్త్రీలును, బాలురును గూడఁ జేయందగినధర్మసాధకంబగు నుత్తమవ్రతంబు. ఈవ్రతంబు దాసదాసీజనంబులకును, దేవదానవులకును, దేహధారులగువారందఱకును గూడ శ్రేయోదాయకంబు. ఈశ్రేష్ఠవ్రతంబు వాంఛానుసారంబుగ భోగమోక్షంబులఁ బ్రసాదింపఁగలదు. మాఘమాసంబునఁ గృష్ణపక్షంబున నిశార్ధవ్యాపిని యగుచతుర్దశి కోటికోటిహత్యాపాతకనివారిణి యని గ్రహించుమనది. ఆదినంబునఁ బ్రాతఃకాలంబున లేచి పరమానందంబున మానవజన్మం బతిదుర్లభంబనియు, నైనను ననారంబును జంచలంబు ననియు, శివరాత్రివ్రతంబున నీమానవజన్మంబు సార్థకపఱుపవలయు ననియు మనంబున నిశ్చయించి వ్రతోద్యోగంబు గావించి యన్యేతరులనుగూడ వ్రతాచర

ణంబునకుఁ బ్రవేశించి కాల్యకృత్యంబులం దీర్చి దేశకాలపాత్రావిరోధంబుగ నద్యాదులయందు స్నానం బాచరించి సంధ్యావందనాది నిత్యకర్మంబులం దీర్చి నైమిత్తికం బగుశివరాత్రివ్రతాచరణంబు గావింపవలయును. ప్రప్రథమంబున శివసన్నిధికిం బోయి యచ్చట నొనరించిన సత్కర్మంబు లల్పంబులయ్యు ననంతఫలదంబు లగుం గావున నట్టిమహాఫలంబు గోరి మానవుం డమ్మహాదేవుని విధివిధానంబునఁ బూజింపవలయును. తరువాతఁ బ్రియపూర్వకంబుగ నద్దేవునకుఁ బ్రణామంబుచేసి యోదేవదేవా! నీలకంఠా! సదాశివా! నేను సంకల్పించిన యీశివరాత్రివ్రతంబు నీయనుగ్రహంబున నిర్విఘ్నంబుగఁ బరిసమాప్తం బగుఁగాక! కామక్రోధాదిశత్రువర్గంబు నన్నుఁ బీడింపకుండుఁగాక! దేవేశా! సువ్రతా! నాకు నీప్రభావంబున వ్రతపరిసమాప్తి యగునంతవఱకు నిందితులతోడ నాలాపంబును, నపవిత్రులయంగస్పర్శనంబును, నితరచింతనంబును, దివానిద్రయును లేకుండుఁగాక! ఈవ్రతంబు ముగియునంతవఱకు నేను జలంబులనైన గ్రహింపకుండెద ననుమంత్రంబున శివప్రార్థనంబు గావించి నియతుండై పూజాద్రవ్యంబుల సంపాదించి శైవాగమశాస్త్రప్రసిద్ధంబగు శివలింగసాన్నిధ్యంబునకు రాత్రికాలంబునఁ బోయి పూజాద్రవ్యంబు లమ్మహాదేవునకుఁ బశ్చిమంబునఁగాని, దక్షిణంబునఁగాని పదిలపఱచి మరల విధిపూర్వకంబుగ సుస్నాతుండై మౌనవ్రతము నవలంబించి మడివలువలఁ గట్టుకొని యాచమనంబు చేసి పూజారంభము గావింపవలయును. అనంతరము మంత్రపూర్వకంబుగ షోడశోపచారంబుల బూజింపవలయును. అమంత్రకంబుగ నెన్నఁడును హరునర్చింపరాదు. ద్రవ్యానురూపంబులగు మంత్రంబులచేతనే పూజింపవలయును. విచక్షణుండగు మానవుండు సాత్త్వికభావావలంబనుండై నృత్యగీతవాద్యాదులచేఁ బ్రథమప్రహరంబున మహాదేవుని బూజించి పిమ్మట

మంత్రజపంబు గావింపవలయును. నిత్యపార్థివలింగార్చకుండగువాఁ డప్పుడుకూడఁ బార్థివలింగమును నిర్మించి ప్రథమంబునఁ బార్థివ పూజయుఁ బిమ్మట ననాదిశివలింగపూజనంబును గావింపవలయును. పిమ్మట నానావిధస్తోత్రంబులచే వృషభధ్వజుని బ్రీతుం గావించి వ్రత మాహాత్మ్యంబు నాకర్ణింపవలయును. అట్లు నాలుగుజాములయందును నాలుగుమూర్తులను నిర్మించి యావాహనంబుమొదలుగ విసర్జనపర్యం తంబును బూజాక్రియల యథావిధిగ నాచరించి రాత్రియంతయును జాగరణంబు గావించి మహోత్సవంబులఁ గావించుచుఁ బరదినంబునఁ బ్రాతఃకాలంబున మరల శుచియై యచ్చట శివమూర్తిని స్థాపించి పూజించి యనంతరము స్నానంబు చేసి మహాదేవా! నీయాజ్ఞాక్రమం బున నేనీవ్రతంబు నాచరించి పరిసమాప్తంబుఁ జేయుచున్నవాఁడను. ఈవ్రతంబుత్తమరూపంబున సంపన్నంబైనది. దేవదేవా! యథా శక్తిం గావించిన యీవ్రతంబుచే నీవు సంతుష్టుండ వయ్యెదవుగాక! శివా! శంకరా! సర్వాత్మా! నాయెడలఁ గృపాళుండ వగుమని స్తోత్రంబు చేసి వ్రతసమాపనంబు గావించి పుష్పాంజలివిడిచి నమస్కా రంబుచేసి యథాశక్తిని దానాదులం గావింపవలయును. తదనంతర మీశ్వరునియందాత్మసమర్పణంబు గావించి పారణజలంబును స్వీక రింపవలయును. ప్రథమప్రహరంబునఁ బరమభక్తిపూర్వకంబుగ షోడశోపచారంబులచే స్థాపితశివలింగంబును, బార్థివలింగంబును బూ జించి మంత్రపూర్వకంబుగఁ బంచామృతంబులను, జందనాదుల నర్పించి జలధారాభిషేకంబు గావింపవలయును. అనంతరము నిరం తర జలధారాసేచనంబునఁ బూజాద్రవ్యావతరణంబు గావించి యష్టో త్తరశతమంత్రపాఠంబు సేయుచు నిర్గుణుండును, గుణరూపుండును, నగుశివునకు జలధారాపూజనంబు గావింపవలయును. అనంతరము గురుప్రదత్తంబగు మంత్రమూలంబునను, దదభావంబున నానామంత్ర

మూలంబునను సదాశివుని బూజించి విచిత్రచందనంబునను, నఖండిత తండులంబులను, దిలాదిసమస్తద్రవ్యంబులచేతను శివపూజం గావింపవలయును. పిమ్మట శర్వుండును, భవుండును, రుద్రుండును, బశుపతియు, నుగ్రుండును, మహాదేవుండును, భీముండును, నీశానుండునను నామాష్టకంబున శివోపరిభాగంబునఁ బుష్పారోపణంబు గావింపవలయును. పిమ్మట ధూపదీపనైవేద్యంబుల నర్పింపవలయును. ప్రథమప్రహరంబునఁ బక్వాన్న నివేదనంబు గావించి శ్రీఫలయుతంబుగ నర్ఘ్యప్రదానంబు చేసి తాంబూలము సమర్పించి నమస్కారంబును, ధ్యానంబును, జపంబును గావింపవలయును. తరువాత ధేనుముద్రాప్రదర్శనంబు గావించి శక్త్యనుసారంబుగ బ్రాహ్మణభోజనంబునకు సంకల్పంబు చేయవలయును. అశక్తపక్షంబున నేకవిప్రభోజనంబైన నావశ్యకంబని శాస్త్రంబు లుద్ఘోషించుచున్నవి. ఒకయతికైనను భోజనప్రదానంబు గావింపవలయును. అనంతరము యామాంతరంబువఱకును నృత్యగీతవాద్యంబులచేఁ బరమేశ్వరుని సంతుష్టుంగావించుచు నయ్యామపూజాఫలం బద్దేవునకు సమర్పించి యమ్మహాదేవునియం దాత్మార్పణంబు గావింపవలయును. ప్రతిప్రహరంబునం దిట్లే యాచరింపవలయును. ద్వితీయప్రహరంబునఁ బూర్వోక్తప్రకారంబుగఁ బూజించుచు ద్విగుణీకృతస్వరంబున మంత్రోచ్చారణంబు గావింపవలయును. అనంతరము చందనతండులయవాదులచే శివు నర్చించి బిల్వపత్రంబులచేతను, బుష్పంబులచేతను బూజించి లడ్డుకంబుల నివేదనంబు చేయవలయును. అట్లు పూజించువానిజన్మంబు నిశ్చయంబుగా సఫలంబు కాఁగలదు. అట్టివానికి నేను నిఖిలభోగంబుల నొసంగి యంతంబున మోక్షంబు నొసంగెదను. ద్వితీయప్రహరంబున బీజపూరసహితంబుగ నర్ఘ్యంబిచ్చి ధూపదీపంబులనొసంగి పాయసాన్ననివేదనంబు గావించి తాంబూలంబును దక్షిణయు నొసంగి

మరల ధ్యానంబును జపంబును గావింపవలెను. జపంబు ప్రథమప్రహ రంబునకంటె ద్వితీయంబున ద్విగుణంబు గావించి బ్రాహ్మణభోజన సంకల్పంబును, నమస్కారంబును, గీతాదికంబును గావించుచు ద్వితీయ ప్రహరశేషంబు గడపవలయును. తృతీయ యామంబున మరలఁ బార్థివలింగమును నిర్మించుకొని పూజానుష్ఠానమును గావించి పూర్వో క్తప్రకారంబున యథావిధిగఁ బూజాభిషేకంబులఁ గావింపవలయును. తృతీయయామంబున ద్వితీయంబుకంటె నెల్లక్రియలును ద్విగుణంబులు గఁ జేసి సదాశివుని జందనతండుల గోధూమాదికంబున నర్చించి మందారపుష్పంబులచే బూజించి ధూపదీపాదుల నొసంగి యపూపం బులచేతను, నానావిధశాకంబులచేతను నైవేద్యంబాచరించి కర్పూరా రాత్రికంబుల నొసంగి దాడిమీఫలసహితంబుగ నర్ఘ్యప్రదానంబును, నమస్కారంబును, ధ్యానంబును, ద్వితీయ ప్రహారంబునకు ద్విగు ణంబగు మంత్రజపంబును గావించి బ్రాహ్మణ భోజనంబునకు సంకల్పించి వాగూపంబున దక్షిణ నొసంగవలయును. చతుర్థ ప్రహరంబున మరలఁ బార్థివలింగమును నిర్మించుకొని పూర్వో క్తప్రకారంబున శివలింగంబునకును, బార్థివంబునకును బూజాభిషేకం బులఁ గావించి తృతీయయామంబుకంటె ద్విగుణంబుగ మంత్రజపంబు గావించి చందనతండులమాషముద్గాదులచేఁ గాని, సప్తధాన్యంబుల చేఁగాని పరమేశ్వరుని బూజింపవలయును. సకలయామంబులను ముందుగ జాతికుసుమంబులను, క్రమంబుగ శంఖపుష్పంబులు మొద లగు వివిధపుష్పంబులను నామమంత్రాష్టకంబునఁ బూజింపవలయును. అనంతరము వివిధమంత్రంబులచేఁ బూజించి యథాక్రమంబుగ ధూప దీపనైవేద్య ప్రదానంబు గావింపవలయును. చతుర్థ యామంబున మధురరసద్రవ్యంబులచేఁగాని, మాషాన్నంబుచేఁగాని నైవేద్యంబిచ్చి పరమేశ్వరుని సంతుష్టుం గావింపవలయును. చతుర్థప్రహరంబునఁ గద

ళీఫలంబులచేఁగాని, వివిధఫలంబులచేఁగాని శివున కర్ఘ్యప్రదానంబుచేసి ప్రణామధ్యానజపంబులఁ గావింపవలయును. అనంతరము బ్రాహ్మణభోజన దక్షిణాదికసంకల్పంబు చేసి యరుణోదయం బగువఱకును గీతాదులచేఁ గాలక్షేపంబు చేసి సూర్యోదయానంతరమున శంకరునిఁదర్శించి ప్రార్థించి స్నానంబు గావించి నానావిధంబులఁ బుష్పతండుల ధూపదీప నైవేద్యార్ఘ్యంబులచే శివు నర్చించి యథావిధిగ నభిషేకంబుచేసి శంకరుం బరితుష్టుంగావించి దానంబులు చేయనలయును. పిమ్మట నాలుగుజాములను సంకల్పించిన సంఖ్యననుసరించి బ్రాహ్మణులకును యతులకును సంతర్పణంబు గావింపవలయును. పిమ్మటఁ బుష్పాంజలి బద్ధుండై మృడా! నీపూజసర్వంబును సమాప్తంబైనది. నాప్రాణమనంబులు నీకు సమర్పణంబు గావించితిని కృపానిధీ! సముచితం బగు రీతి నాచరింపుము భూతనాథా! నేనజ్ఞానంబునఁగాని, జ్ఞానంబునఁగాని చేసినపూజకు నీవుప్రసన్నుండవై సమస్తోపచారంబులచే సిద్ధింపగల సకల ఫలంబులను నాకుఁ బ్రసాదింపుము. మహాత్మా! నావ్రతంబు న్యూనంబైనను నీకిప్పుఁడొసంగు నీపుష్పాంజలిమూలంబున సర్వసంపన్నంబగుఁ గాక యని ప్రార్థించుచుఁ బుష్పాంజలి నర్పించి తిలకంబును బ్రాహ్మణాశీర్వాదంబును బరిగ్రహింపవలయును. పిమ్మట బ్రాహ్మణులకును శంకరునకును నమస్కారంబుగావించి పునరాగమనంబుకొఱకు శివలింగమును విసర్జింపవలయును. అప్పుడు భక్తుండు నిశ్చలచిత్తంబున దేవా! నావంశంబునం దెల్లప్పుడును నీభజనం బగుచుండుఁగాక! నీవు నామానసంబున నిరంతరమును నిశ్చలుండవై యుండెదవుగాక! దివారాత్రులయం దేక్షణంబును నాకు నీస్మరణంబులేని యొక్కనిశ్వాసంబైనను నిర్గతంబు గాకుండుఁగాక నీవొకప్పుడును నన్ను విడనాడకుండువుగాక యని ప్రార్థించి నమస్కరించి శంకరమూర్తివిసర్జనముం గావించి బ్రాహ్మణభోజనంబు సేయింపవలయును. ఇట్లువ్రతాచరణంబు

గావించువాఁడు సకలపాపవిముక్తుం డగును. ఈశ్వరుం డాపుణ్యపురుషుని విడిచి యుండఁజాలఁడు. ఈయుత్తమవ్రతమాహాత్మ్యము నెట్టిసమర్థుండును బదివేలవత్సరంబులకైనను వర్ణింపఁజాలఁడు. అనాదరంబుచేనైన నీవ్రతంబుగావించువానికిఁ దప్పక ముక్తిలభియించును. ఇందెంతమాత్రమును సంశయములేదు. ఈవ్రతంబు ప్రతిమాసంబునను గృష్ణచతుర్దశీదినంబున నాచరింపవలయును. ఇట్లుచతుర్దశవత్సరంబులు వ్రతంబాచరించి పిమ్మటసాంగోద్యాపనవిధి ననుష్ఠింపవలయును. ఈవ్రతమూలంబున శంకరుండు సంతుష్టుండై సకలదుఃఖంబుల దూరీకృతంబులం గావించి యిహలోకభోగంబులఁ బ్రసాదించి పిమ్మట మోక్షంబు నొసంగుచున్నాఁడు.

—: శివరాత్రివ్రతోద్యాపనవిధి. :—

మానవుండు శివరాత్రిదినంబున సంధ్యావందనాది నిత్యకృత్యంబులం దీర్చి శివాలయంబునకుఁ బోయి యథావిధిగ మహాదేవుని బూజించి వ్రతసంకల్పంబు చేసి రాత్రి జాగరణం బాచరించుచు నాల్గుయామంబులను, స్థాపితలింగమునకుఁగాని, పార్థివలింగమునకుఁగాని పూజచేసి మరునాఁ డుదయంబున నిట్లు శివసాన్నిధ్యంబున సంకల్పింపవలయును. శివప్రసాదంబున నేనీయుత్తమవ్రతంబు నాచరించుచున్నాను. దేవదేవా! నీయాజ్ఞానుసారంబుగ నేను ప్రతిమాసంబునను వ్రతంబు గావించితిని. నీదయచే నీవ్రతంబు నిర్విఘ్నసంపన్నంబగుఁగాక! అని యిట్లు శివాలయంబున నియతుండై పారణంబు గావింపవలయును. అనంతరము బ్రాహ్మణాశీర్వాదమును గ్రహించి [illegible] సమయంబునను [illegible] బంబు గావింపవలయును. తరువాత మరలఁ గృష్ణచతుర్దశినాఁడు ప్రాతఃకాలంబున లేచి తీర్థాదులయందుగాని, గృహంబునఁ గాని స్నానం బాచరించి నిత్యకర్మంబులఁ బూర్తిగావించి శివాలయంబునకుం బోయి యథావిధిగఁ బూజించి యోదేవ

దేవా! నేఁడు నీయాజ్ఞచే నిరాహారుండనై జలపానంబునైనఁ జేయక యుపవసించి విధిదృష్టవిధానంబున నీవ్రతంబు చేయందలంచితిని. ప్రభూ! నాకు ధైర్యంబు నొసంగు మని ప్రార్థించి నమస్కరించి కామక్రోధ వివర్జితుండై దినంబు గడపి రాత్రికాలంబునఁ బ్రతిప్రహరంబునను విధివిధానంబున శివపూజం గావించుచుఁ బ్రాతఃకాలపర్యంతమును జాగరణంబు చేసి గురుదత్తమంత్రజపంబును, నృత్యగీతాది కాలక్షేపంబును జేసి పిమ్మట స్నానంబును శివపూజయు నాచరించి బ్రాహ్మణసంతర్పణంబును యతిభోజనంబును గావింపవలయును. అశక్తుండైనచో నొక్కబ్రాహ్మణునకైనను భోజనంబు పెట్టి పిదపఁ దాను భుజించి యతిబ్రాహ్మణాశీర్వాదమును బరిగ్రహింపవలయును. అట్లు మహాశివరాత్రి వచ్చునంతవఱకు నీవిధంబుగాఁ బ్రతిమాసంబు నుత్తమవ్రతంబు గావించుచు శివరాత్రిదినంబునఁ గర్తవ్యంబగు నుద్యాపనవిధి నాచరింపవలయును. ముందుగ బ్రాహ్మణానుమతంబున సమస్తశైవశాస్త్రాలోచనంబు గావించి యందలివిధుల ననుసరించి కార్యకలాపంబు నిర్వర్తింపవలయును. ఉద్యాపనవిధియందు మానవుండు ప్రభాతంబున లేచి నిత్యకృత్యంబుల నిర్వర్తించి పూజాస్థానంబున గౌరీతిలకనామకం బగు మండలమును నిర్మించి యందుఁ బ్రాజాపత్యసంఖ్యాకంబులగు ద్వాదశకుంభంబులను స్థాపించి మండలపార్శ్వంబున దక్షిణసహితంబుగ సుందరకలశసహస్రంబును, మండలమధ్యంబునందేకకలశంబును స్థాపించి రాత్రి యాకలశదక్షిణభాగంబున దీపారాధనంబు చేసి పార్వతీపరమేశ్వరులను నాలుగుజాములను యథావిధిగఁ బూజించుచు జాగరణంబు చేయవలయును. దివంబున వేదవిహితవిధానంబున శివపూజచేసి ఋషితుల్యులును, వేదపారగులు నగు బ్రాహ్మణులకు యజ్ఞోపవీతవస్త్రపాదుకాదుల నర్పించి దక్షిణ లొసంగి వారిని బరితృప్తులం గావించి రుద్రాధ్యాయోక్త మంత్రపూర్వకంబుగ

ఘృతపాయసంబుల హోమంబు చేయవలయును. వ్రతశీలుండు మున్నుందుగ నవగ్రహహోమంబు గావించి తిలయవఘృతంబులచే శివమంత్రంబున శివహోమంబును జేయవలయును. అనంతరము వ్రతఫలావాప్తికై స్వర్ణరుద్రమూర్తిని, రజతగౌరీమూర్తిని, శయ్యను, శయ్యోపకరణంబులను, సప్తధాన్యంబులను, గోవును, బ్రాహ్మణునకు దానంబు గావింపవలయును. ఈవిధంబుగ హోమసమాపంబు గావించి యర్ఘ్యపుష్పవస్త్రాలంకారంబులచే నాచార్యుని బూజించి స్వర్ణశృంగంబును, రజతఖురంబును, కాంస్యదోహనపాత్రయుతంబును, రత్నమయ పుచ్ఛంబును, దామ్రమయపృష్ఠంబును, నానావిధాలంకార విభూషితంబును, వస్త్రాచ్ఛాదితంబును, సుశీలంబును, విశిష్ట దుగ్ధసంకలితంబును సవత్సకంబును నగుధేనువును సువర్ణసహితంబుగ సాధువగు నాచార్యునకు వ్రతదక్షిణగా నొసంగి ఘృతసహితంబును, పాయస సంకలితంబును, శర్కరామిళితంబును నగుభోజనంబున బ్రాహ్మణులను బరితృప్తులం గావించి శివాజ్ఞానుసారంబుగ వారికి నానావిధ వస్త్రాదుల నొసంగవలయును. అశక్తుండగువాఁడు ద్వాదశ బ్రాహ్మణభోజనంబైనను గావింపవలయును. అనంతరము సమస్తవ్రతఫలంబును సదాశివార్పణంబు చేసి దేవదేవా! మహాదేవా! శంభూ! శంకరా! హరా! దేవేశ్వరా! నాయీవ్రతంబున నీవు నాయెడల దయాళుండవగుము! సదాశివా! యథాశక్తిని నేనీవ్రతం బాచరించితిని. జ్ఞానాజ్ఞానపూర్వకంబుగ నేనొనరించిన యీపూజ నీ యనుగ్రహంబున సత్ఫలసంపన్నం బగుఁగాక యని ప్రార్థించి శివునకుఁ బుష్పాంజలి విడిచి నమస్కారంబుచేసి దేవా! నీ చరణకమలంబు నాహృదయంబు నొక్కప్పుడును నెడఁబాయకుండుఁగాక యని మరలఁ బ్రార్థింపవలయును. ఇట్లెవ్వఁడు వ్రతానుష్ఠానముం గావించునో యాతనికట్టి యనిష్టములును గలుగకుండుటయేకాక యభిలషితార్థసిద్ధి యగును.

ఈ యుత్తమవ్రతంబు ముక్తిబీజం బని శాస్త్రంబు లుద్ఘోషించు చున్నవి. జ్ఞానంబుచేనైనను నజ్ఞానంబుచేనైనను నీవ్రతంబు గావించిన చో శివుండు సంతుష్టుం డగును. ఈవ్రతం బాచరించినవానికిఁ బరమ పదంబు కరతలామలకంబగును. మనోవాక్కర్మంబులం గలుగుపాపం బీవ్రతానుష్ఠానంబున వినష్టం బగును. మరల సమునాహ్యదివసంబున స్నానంబుచేసి మధ్యాహ్నకాలంబున బిండప్రదానంబు గావించి నాఁడు పితృగణంబుల నుద్దేశించి బ్రాహ్మణభోజనంబు చేయించినచోఁ బితృదేవల సంతుష్టి చతుర్గుణంబు లధికం బగును. పిమ్మటఁ బండిత సాన్నిధ్యంబునఁ బరీక్షితుండును, శాస్త్రజ్ఞుండును, సుశీలుండును, స్వదారనిరతుండు నగు వైష్ణవోత్తమున కిష్టమృష్టాన్న ప్రదానంబు చేసి దక్షిణ నొసంగి పిమ్మట బంధుసహితంబుగ సుపక్వాన్నభోజనంబు గావింపవలయును. ఈ యుత్తమవ్రతం బెల్లవారికి నవశ్యకర్తవ్యంబు. ఈవ్రతవిధి నెవ్వరు పఠింతురో యెవ్వరుపదేశింతురో వారికి సకలాభీష్టంబులును సిద్ధించును.

—: వ్యాధ చరిత్రము :—

పూర్వకాలంబునం దొకమహారణ్యంబున నతిబలవంతుండును, క్రూరుండును, క్రూరకర్మనిరతుండునునగు గురుద్రుహుండను భిల్లుండు సకుటుంబముగ నివసించి యుండెను. ఆకిరాతుండు నిరంతరమును వనంబునం గలసాధుమృగంబుల వధియించి యాహారంబు చేసికొనుచు ననేకవిధంబులఁ జౌర్యకర్మంబులమూలంబునఁ గుటుంబపోషణముం గావించుకొనుచుండెను. పుట్టినదిమొదలెన్నఁడు నాతఁడొక్కపుణ్యకర్మంబునైన గావించి యెఱుంగఁడు. ఈవిధంబుగ నాతఁడావనంబునఁ జాలకాలము గడపెను. ఇట్లుండ నొకప్పుడు శివరాత్రిదివసంబుపస్థితం బయ్యెను. ఆదురాత్ముం డాపవిత్రశివరాత్రిదినవిశేషంబును గాని తద్వ్రతమాహాత్మ్యంబునుగాని యించుకంతయు నెఱుంగ చే

యెఱుంగఁడు. ఆనాఁ డాకిరాతునితల్లిదండ్రులును, భార్యయు నాహారంబులేక పరితపించుచుఁ దినుట కేమైనం దీసికొని రమ్మని యాతని వేఁడుకొనిరి. అప్పుడా వ్యాధుండు వల్లె యని ధనుర్బాణంబులం గైకొని మృగసంహారముకొఱకు వనమంతటను బరిభ్రమించి యెంతయో యాశతోఁ బ్రయత్నంబు చేసెనుగాని దైవవశంబున నాదినంబునం దాతని కొక్కమృగంబైనను గంటఁబడకుండఁబోయెను. అట్లే క్రమముగా సూర్యాస్తమయం బగుటయు హతాశుండై యాభిల్లుం డిట్లు విచారింపదొడంగెను. అయ్యో! నేనిప్పు డేమిచేయుదును? నేఁడాహారంబున కేదియును లభింపదయ్యెను. ఇంటియొద్ద బాలకు లాఁకలిచే నెంత పరితపించుచుండిరో? ముదుసళులగు తల్లిదండ్రు లెట్లు తల్లడిల్లుచుండిరో? క్షుద్బాధితయగు నాభార్య యెంతగా దురపిల్లుచున్నదో? ఇప్పుడు నేనూరక యింటికిఁ బోయి యేమి చేయుదును? ఎట్లైన నాహారమును సంపాదించి మఱిపోవుట యుచితము. అని నిశ్చయించుకొని యాగురుద్రుహుం డొక్కజలాశయంబుకడకుం బోయి యిట కేదే నొకమృగంబు జలగ్రహణంబునకై రాకపోదని యూహించి తనకు దాహార్థంబుగఁ గొన్నిజలంబులం దీసికొని యాతటాకతీరంబునం గల యొకబిల్వవృక్షము నధిరోహించి ధనుర్బాణపాణియై మృగాన్వేషణంబు గావించుచుండెను. ఆకిరాతునకు దినమంతయు నాహారములేదు. ఎప్పుడు మృగంబువచ్చు నెప్పుడు వధియింతు నని రాత్రియంతయు వచ్చుటనే కనుపెట్టుకొని యుండెను. ఆరాత్రిప్రథమయామంబున దప్పిచేఁదూలుచు నొకమృగంబాజలాశయమునొద్ద కతివేగముగ వచ్చుచుండెను. ఆయాఁడు లేఁడిం గాంచి వ్యాధుండు బాణమును సంధించి దానికి లక్ష్యముచేసెను. అప్పు డాకదలికచే నాతనినడుమునం దాల్చిన జలకోశమునుండి యించుక జలంబు బిల్వపత్రములనుండి క్రిందికి జారెను. ఆక్రిందిభాగమునం దొకశివలింగముండెను. ఆజలము బిల్వపత్రసహిత

మఁగనాశివలింగముపైఁ బడుటచే నదిశివలింగమునకుఁ బ్రథమయామ పూజ యయ్యెను. అది కారణంబుగా శివనామస్మరణము వలన వ్యాధుని సమస్తపాపములును వినష్టములై పోయెను. ఆశబ్దశ్రవణంబున హరిణి భయవ్యాకుల హృదయయై యక్కిరాతుం గాంచి యయ్యో యీతఁడు బాణముచే నన్ను వధింపనున్నాఁడు. ఏమిచేయుదును ? ఎట్లు తప్పించు కొని పోఁగలుగుదునని విచారించుచుఁ గౌశలంబున నాతనితో నీవు నన్నేమిచేయ దలంచితి వనిప్రశ్నించెను. అప్పుడు కిరాతుండు నిన్ను వధించి నా కుటుంబజనంబున కాహారప్రదానంబు చేసి క్షుధార్తులగు వారిని రక్షింపఁదలంచితి ననియెను. హరిణం బాతని దారుణవాక్యం బాలకించి హర్షముతో నిట్లనియెను. ఓ వ్యాధసత్తమా ! ఈ నిరర్థక శరీరమునందలి మాంసమెవ్వరికే నొక్కరికైన సుఖంబు గల్పించినచో నేను ధన్యురాలనగుదు. ఈజగంబునఁ బరోపకారులగువారి పుణ్యఫలం బును బరిగణించుట కెవ్వరును సమర్థులు కాఁజాలరు. ఆహా ! ఇప్పుడు నేను చరితార్థురాల నైతిని. నాజన్మము సఫలమైనది. కాని నాకు గృహంబున శిశువులున్నారు. వారిని నా సపత్నికిని, స్వామికిని విధిపూర్వకంబుగ సమర్పించి నీయభీష్టముం దీర్చుటకు మరలవచ్చెదను. అప్పుడు నీవు నామాంసమూలంబున సర్వవిధములఁ బరితృప్తుండ వయ్యెదవుగాక. అని యాహరిణి కోరుటయుఁ గిరాతుండు దాని వాక్యంబులను విశ్వసింపక విపత్సమయంబున నెల్లరు నసత్యములాడు వారే యనుటయు మృగి మరల నిట్లనియెను. ఓ భిల్లశ్రేష్ఠా ! వాయు ప్రభృతి దేవతాగణంబులును, సప్తసముద్రంబులును, సకల జలా శయంబులును, మొదలగునవి యన్నియు సత్యమునే యాశ్రయించి స్వధర్మనిర్వాహణంబు గావించుచుండును. అందఱును సత్యధర్మావలం బులై ప్రతిష్ఠాలాభముంగాంచుచుందురు. ఓమృగయూ ! నీవు నామాట యసత్యంబని యనుకొనవల దనియెను. ఇట్లు చెప్పినను గురుద్రుహుం

డాహరిణీవాక్యములను నమ్మకుండుటచే మరల నది యిట్లనియెను. నేను వచ్చెదనని చెప్పి రాకయున్నచోఁ బాపము నాతలపైఁ బడుఁగాక! నేనట్లు మరల రాకయుండినచో వేదవిక్రయుండును, త్రికాల సంధ్యావందన విహీనుండు నగు బ్రాహ్మణుని పాపంబును, మగనియాజ్ఞ నుల్లంఘించిన మగువపాపంబును, కృతఘ్నునిపాపంబును, హరిభజనంబు సేయనివాని పాపంబును, బరాపకారి యగువాని పాపంబును, స్వధర్మోల్లంఘనం బాచరించువాని పాపంబును నన్నుఁ జుట్టుకొనుంగాక! అని యిట్లాహరిణి యనేకశపథంబులం గావించి యూరకుండుటయు వ్యాధుండు నీవు పోయి రమ్మనియెను. అప్పుడాహరిణి సంతోషపూర్వకంబుగ జలపానంబు గావించి తనయాశ్రమాభిముఖంబుగఁ బోయెను. హరిణీపునరాగమనంబు నిరీక్షించుచు రురుద్రుహుండు ప్రథమప్రహరజాగరణముం గావించెను. ఇంతలో నాహరిణీసపత్ని యగు లేఁడి తనసవతిని వెదకికొనుచు జలపానార్థమై సరిగ నచ్చటికే వచ్చెను. వ్యాధుండు దానింగాంచి బాణాకర్షణముం గావించుటయు మునుపటివలెనే బిల్వపత్రసహితంబుగ జలంబు శివలింగముపైఁ బడి ద్వితీయప్రహరపూజ సంపన్నం బయ్యెను. అప్పుడా లేఁడి తనపై బాణము విడువనున్నయాతనిం జూచి నన్నేల చంపెద వని యడుగుటయు మృగయుండు తనకుటుంబవృత్తాంతముం జెప్పి యాహారము కొఱకు నిన్నువధింతు నని చెప్పెను. అప్పుడు లేఁడి పరమానందముతో నేను ధన్యురాలనైతిని. ఇన్నాళ్ళకు నాజీవితము సార్థకమైనది. ఏమనిన నాయీ యనిత్యశరీరమువలనఁ బరోపకారం బగుచున్నది కాని నాకు నాయింట నోరెఱుంగని బిడ్డలున్నారు. వారిని నా నాధునకొప్పగించి యతిత్వరముగ వచ్చెద ననుటయు వ్యాధుండు నీమాటలను నమ్మఁజాలననియుఁ దప్పక నిన్ను వధింతు ననియుఁ బ్రత్యుత్తరమిచ్చెను. అప్పుడు లేఁడి నేను చెప్పినట్లుగా మరల

తాకుంటినేని పతివ్రతయగు పత్నిని విడనాడి యన్యస్త్రీగమనంబాచరించినవాని పాపంబునకును, వేదధర్మబాహ్యుండై వక్రమార్గమునఁ జరించువాని పాపంబునకును, విష్ణుభక్తుండై శివదూషణంబు గావించువాని పాపంబునకును, గర్మభూమియందుండియుఁ బితృమాతృశ్రాద్ధక్రియలఁ బరిత్యజించినవాని పాపంబునకును, పరులను వంచించి సంతాపంబు గూర్చువాని పాపంబునకును నేను గుఱి యయ్యెదను. విశేషించి యాడితప్పిన వాని సమస్త పుణ్యంబులును నశించును. అట్టిపాపాత్ముని భరించుటకు భూదేవి తల్లడిల్లుచుండును. అనుటయుఁ గిరాతుం డాహరిణివచనములను విశ్వసించి పోయిరమ్మనియెను. అప్పుడా జింక యానందముతో జలపానంబు గావించి యింటికిఁ బోయెను. వ్యాధునకీవిధముగా నిద్రలేకుండ రెండవజామునుకూడఁ గడచిపోయెను. అనంతర మాహరిణులకు స్వామియగు హరిణంబు తనభార్యలం గానక విచారించుచు బయలుదేరి యాజలాశయంబునొద్దకే వచ్చెను. బలసియున్న యామృగముంగాంచి హర్షచిత్తుండై దీనిమాంసము మాకుటుంబమున కంతకును సంపూర్ణముగ సరిపోవు నని సంతోషించుచు బాణాకర్షణంబు గావించుటయు నాతని చలనమువలన మరల జలంబును బిల్వపత్రంబులును శివోపరిభాగంబునఁ బడుటయు దయాళుండగుశివుండు దానిని తృతీయప్రహరపూజగా నంగీకరించెను. అప్పు డెప్పటివలెనే మృగభిల్లులకు సంవాదము బరగుటయు మృగంబిట్లనియెను. నీకుటుంబమున కంతకును బరితృప్తింగూర్చునంతటి మాంసము నీయఁజాలిన నాశరీరము సార్థకమైనది. పరోపకారము సేయనివాని సర్వంబును నిరర్థకంబు. సమర్థుండయ్యు నుపకారము చేయఁజాలనివాని శక్తియంతయును నిష్ఫలంబైనది. నాశరీరంబుచే నీకుఁ బరితృప్తి గాఁగలదు. కాని నేనిప్పుడు నాబిడ్డలను నాభార్యల కొప్పగించి సంతోషపూర్వకంబుగ

మరల వచ్చి నీకాహారం బయ్యెదను. దయయుంచి సెలవొసంగు మనుటయుఁ గిరాతుండు నీమాటలయందు నాకు నమ్మకము లేదు. ఇక్కడకువచ్చిన మృగంబు లన్నియు నేఁడు నీవలెనే చెప్పి నన్ను నమ్మించి పోయినవి. కాని యింతవఱకును రాలేదు. నీవును విపత్సమయంబున నసత్యము లాడి తప్పించుకొని పోవఁజూచుచున్నావు. ఇఁక నేను బ్రదుకుట యెట్లు? అని వ్యాధుండు నిరాకరించుటయు మృగం బిట్లనియెను. భిల్లసత్తమా! నేనసత్యమాడుట లేదు. చరాచరసహితం బగు సమస్త బ్రహ్మాండమును సత్యమునే యాశ్రయించి యున్నది. మిథ్యావాది యగువానిపుణ్యంబులు నశించును. నేను శపథముచేసి చెప్పుచున్నాను. నీవు నామాట విశ్వసించుట లేదు. నేను నిన్ను వంచించి పోయి మరలరాకున్నచో సంధ్యాసమయంబున సతీసంగమంబు గావించినవాని పాపంబునను, శివరాత్రి దినంబున భుజియించినవాని పాపంబునను, గూటసాక్ష్యం బిచ్చినవాని పాపంబునను, దాపుడుధనంబు నపహరించినవాని పాపంబునను, సంధ్యావందన క్రియావిరహితుం డగుబ్రాహ్మణుని పాపంబునను, శివనామోచ్చారణంబు సేయనివాని పాపంబునను, దక్షుండయ్యు నుపకారం బాచరింపనివాని పాపంబునను, దివాసంగమంబు గావించువానిపాపంబునను, బర్వదినంబులను, రజోనిస్సరణకాలంబులను, వ్రతదివసంబులను గామినీసంభోగంబు గావించినవానిపాపంబునను, నభక్ష్యభక్షణంబుసేయువాని పాపంబునను బోవంగలవాఁడను. అనుటయు వ్యాధుండు విశ్వసించి సత్వరముగఁ బోయి రమ్మనియెను. మృగంబప్పుడు సెలవందికొని జలపానంబుచేసి వెడలిపోయెను. పిదపనామృగంబు తనయింటికిం బోయి తనభార్యలం గలిసికొని యొండొరులవృత్తాంతంబు తెలిసికొని మనము సత్యపాశబద్ధుల మైతిమి గావున నవశ్యంబుగ నచ్చుటకు మువ్వురమును బోవలయు నని నిశ్చయించుకొనిరి. అప్పుడు

జ్యేష్ఠహరిణి స్వామిం గాంచి యిట్లనియెను. స్వామీ! ఈ బిడ్డలు తల్లిదండ్రులు లేక యిచ్చట నెట్లుండఁగలరు? నేను మొదటఁ బ్రతిజ్ఞం గావించితిం గావున నేను పోయెదను. మీరిరువురు నిచ్చట నుండెదరు గాక! అనుటయుఁ గనిష్ఠహరిణి యిట్లనియెను. నేను మీదాసిని గావున మీరిచ్చట నుండుఁడు. నేను పోయెద ననియెను. అప్పుడు మృగంబు తనపత్నులపలుకు లాలించి నేను పోయెద ననుటయు హరిణులు విధవాజీవనంబు దుస్సహంబు గావున మీరుపోవలదని యనేకవిధంబుల వేఁడుకొనిరి. అనంతర మమ్మువ్వురును దమబిడ్డల నూరడించి వారిని దమ నెయ్యురకు సమర్పించి తమరాకకొఱకు నిరీక్షించుచున్న వ్యాధునిసమీపమునకుం బోయిరి. మృగశాబకంబులును దమకుఁ దమ తల్లిదండ్రులగతియే యగుంగాక యని నిశ్చయించుకొని విడువఁజాలక జననీజనకుల వెంబడించియే పోయెను. అప్పుడు వ్యాధుం డామృగంబులం గాంచి పరమానందముతో ధనుస్సున బాణంబును సంధించుటయు నాతనిశరీరచాలనంబున జలంబును బిల్వపత్రంబులును శివునిపయిం బడెను. అందువలనఁ జతుర్థయామ శివపూజ సంపూర్ణం బయ్యెను. తత్క్షణమే యాకిరాతుని సమస్తపాపములును భస్మీభూతము లైపోయెను. అప్పుడా హరిణులును హరిణంబును భిల్లశేఖరా! శీఘ్రముగ మాంసభక్షణముం గావించి మా శరీరంబులను సార్థకపఱుపు మనుటయుఁ గిరాతుండు విస్మయాక్రాంతుం డయ్యెను. ఆసమయంబున శివపూజాప్రభావముచే నాతనికి జ్ఞానోదయం బగుటయుఁ గిరాతుండిట్లు భావించుకొనఁ దొడంగెను. జ్ఞానహీనంబులగు నీమృగంబుల జీవితములేధన్యములు; లోకసమ్మతములు; ఇవి తమశరీరంబుచేఁ బరోపకారంబు గావించుచున్నవి. నేను మనుష్యుఁడనై యుండియు నెంతటి నికృష్టకార్యముం గావించుచున్నాను! నేను నిరంతరమును బరపీడనంబు గావించుచు స్వశరీరమును స్వకు

టుంబమును బోషించుకొనుచున్నాఁడను. ఇఁక నాకు గతి యేమున్నది. నాబ్రదుకంతయును పాపదూషితమై పోయినది. నాకెట్టిదుర్గతి కలుగునో యని విచార మగుచున్నది. ఛీ! ఇట్టి నాబ్రదు కేల? అని వితర్కించుకొనుచు రురుద్రహుండు బాణము నుపసంహరించి మృగంబులం గాంచి యిట్లనియెను. ఓ మృగశ్రేష్ఠములారా! మీరే ధన్యులు. ఇఁక మీరు మీయింటికిఁ బొండు! అనుటయు దత్క్షణమే శంకరుం డచ్చట సాక్షాత్కరించి పూజితుండగుటచే నావ్యాధునకుఁ దన దివ్యసుందరరూపంబును బ్రదర్శించి కరుణామృతసాగరుం డగు నమ్మహాదేవుం డప్పుడు దయాపూర్వకంబుగఁ గిరాతుం గాంచి వరంబు గోరుకొమ్మనియెను. అప్పుడు వ్యాధుండు శివస్వరూపుండై జీవన్ముక్తుండై నాకు సర్వంబును సంపన్నం బయ్యెనని పలుకుచు మహాదేవుని చరణకమలంబులఁ జాగిలఁబడియెను. ఆసమయంబున సదాశివుం డాతనికి గుహుండను నామకరణంబు చేసి వరంబుల నొసంగి యిట్లనియెను. ఓవ్యాధా! నీవునీయభీష్టభోగంబుల ననుభవించుచు బ్రభుండవై యుండుము. నీవంశంబు దినదినప్రవర్ధమానం బగుఁగాక! నీకులంబు దేవతామాననీయంబును సుస్థిరంబు నగుఁగాక! దశరథతనయుం డగు శ్రీరామచంద్రుండు నీయింటికి రాఁగలఁడు. నీవాశ్రీరాముని బూజించి యాతని భజియించి దేవమానవ మునిజనదుర్లభం బగు మోక్షము నందఁగలవు! నీ పుత్రపౌత్రులెల్లరును శివపూజానిరతు లయ్యెదరుగాక! అని యాతని నాశీర్వదించుచున్న సమయంబున మృగంబులు బిడ్డలతోఁగూడ సర్వేశ్వరుని సందర్శించి తదనుగ్రహంబున మృగశరీరంబుల విడిచి దివ్యదేహంబులం దాల్చి దివ్యవిమానంబు నధిరోహించి సంసారపాశంబులఁ బరిత్యజించి స్వర్గంబునకుఁ బోయెను. ఈవిధంబుగా నర్బుదాచలంబున వ్యాధేశ్వరదేవుం డావిర్భూతుం డయ్యెను. నాఁటినుండి వ్యాధుండు సర్వోత్తమభోగంబుల ననుభ

వించుచుండి యనంతరము కొంతకాలంబునకు శ్రీరామచంద్రాను గ్రహంబున శివసాయుజ్యముం గాంచెను. ఆవ్యాధుం డిట్లజ్ఞానంబుచే నైనను శివరాత్రివ్రతం బాచరించి శివసాయుజ్యంబు గాంచఁగలిగెను. ఇఁక భక్తిపూర్వకంబుగ నీవ్రతంబు గావించువారి పుణ్యఫలముం గూర్చి వేఱుగఁ జెప్పవలసిన దేమున్నది? సమస్త శాస్త్రాలోచనం బును, ననేక ధర్మానుష్ఠానంబును నానావిధవ్రతాచరణంబును, నానా తీర్థగమనంబును, నానాప్రకార విచిత్రవస్తుప్రదానంబును గావించిన నెట్టిఫలంబులభియించునో శివరాత్రివ్రతంబున నంతటిసత్ఫలంబులభింప గలదు. కావున హితాకాంక్షులగువారికి మంగళకరంబగు నీసద్వ్రతంబు నాచరించుట యవశ్యకర్తవ్యంబు.

## —♦ వేదనిధిచరిత్రము ♦—

మునులారా! రమ్యంబగు నవంతీనగరంబున నిరంతరయజ్ఞ దీక్షితుండును, సత్కులోత్పన్నుండును, సదాచారసంపన్నుండును, సర్వదా సత్కర్మనిరతుండును, వేదశాస్త్రాభిజ్ఞుండును, విచక్షణుండు నగు నొక బ్రాహ్మణుండు వాసము చేయుచుండెను. ఆతని సతీమణి యును సత్కులసంజాతయుఁ, బతిధర్మపరాయణయునై నిరంతరమును బతియాజ్ఞ నతిక్రమింపక మెలంగుచుండెను. ఆ దంపతులకు సునిధి, వేదనిధి యను నిరువురు కొమరులు గలరు. అందు జ్యేష్ఠుం డగు సునిధి జననీజనకుల యానతిని జవదాటక సంచరించుచుండెను. కనిష్ఠుండగు వేదనిధి వేదశాస్త్రపండితుండయ్యును, వేశ్యాగమనాది నిందితవ్యసనుండై యుండెను. ఆతఁ డెల్లప్పుడును వేశ్యాగృహంబున నే భుజియించుచుండుట నెఱింగి యాతని తల్లిదండ్రు లనేకవిధంబుల బోధించి నిషేధించిరిగాని యాతఁ డెంతమాత్రమును వారిమాటలాల కింపక తన యిచ్చవచ్చినరీతినే ప్రవర్తించుచుండెను. జననీజనకులును సోదరుండును నాతని నెన్నివిధముల నిందించినను నాతఁ డావ్యసన

మును విడువఁజాలకుండెను. ఒకప్పుడా నగరాధీశ్వరుఁ డాదీక్షిత బ్రాహ్మణున కమూల్యంబులగు నలంకారంబులను నొకయుంగరంబును స్వయముగ దానము చేసెను. ఆవిప్రుం డాయలంకారముల నింటికిఁ దెచ్చి భార్య కొసంగుటయు నామె వానిని నొకచో భద్రముగ దాఁచి యుంచెను. దురాత్ముండగు వేదనిధి యీసంగతి నెఱింగి యొకనాఁటి రాత్రిసమయంబున వాని నపహరించి తీసికొనిపోయి వేశ్యకొసంగెను. ఒకనాఁ డవ్వేశ్య రాజసభయందు నృత్యాభినయంబులఁ గావింపుచుండ దానిచేతియుంగరముం గాంచి రాజు విస్మితుండై యవ్వారవనితనుద్దేశించి యీ యంగుళీయకము నీకెట్లు లభియించిన దని యడిగెను. అది యెంతకును సత్యము జెప్పదయ్యెను. అంతట రాజు శిక్షించెదనని భయపెట్టి ధిక్కరించి యడుగుటయుఁ దుదకావారాంగన సర్వవృత్తాంతమును యథార్థముగఁ దెలియఁజేసెను. తరువాత రాజు బలవంతముగ నాభూషణమును దానియొద్దనుండి లాగికొని తనయొద్ద నుంచుకొని మరునాఁ డుదయంబున నా బ్రాహ్మణునిం బిలిపించి నాఁడు నేను మీకొసంగిన యుంగరముతో నా కించుకపని కలిగినది కావున నొకసారి యిటకుఁ దీసికొని రమ్మని యానతిచ్చెను. తోడనే బ్రాహ్మణుఁడింటికిం బోయి గృహిణింగాంచి నీకు నేనిచ్చినయుంగరము నొకసారి నాకిమ్మని యడిగెను. అప్పుడు బ్రాహ్మణపత్ని తానాయంగుళీయకమునుదాచిన తావునకుఁబోయి యెంత వెదకిన నగపడకుండుటచే మరల నామె నాథునియొద్దకు వచ్చి యుంగరమేమైనదో దొరకలేదని చెప్పెను. బ్రాహ్మణు డాయుంగరము దొరకనందులకు మిగుల విచారించుచు రాజునొద్దకుఁ బోయి సర్వమును నివేదించెను. అప్పుడు రాజా బ్రాహ్మణున కాతనితనయునిచరిత్రమంతయును నెఱింగించెను. రాజిట్లు చెప్పుటచే బ్రాహ్మణుండు మిగుల ఖిన్నుండై యింటికిం బోయి భార్యను నిందించుచుఁ బాపాత్మురాలా! నీవాయుంగరమును

నేమిచేసితి వని తిట్టుచు సమస్తము నామె కెఱింగించెను. పిమ్మట నా దంపతు లిరువురును బుత్రుని మిగుల దూషించుచు నోదురాత్మా! కులదూషకుండవగు [illegible]. నీవీయింట నుండవలదు. మాకవమానము దెచ్చుచున్నని విట నుండి పోయి నీ యిచ్చవచ్చినచోటనుండు మని నిందించుచు నాతని వెడలఁ గొట్టుటయు వేదనిధి యుఁకఁ జేయునది లేక వేశ్యాయింటికింబోయి దానిచేఁగూడఁ దిరస్కృతుఁ డయ్యెను నారాత్రి యాహారపానీయం బులులేకుండఁ గాలయాపనంబు గావించెను. మఱునాఁడు శివరాత్రి యయ్యెను. ఆ దినంబున నొకధనవంతుఁడు వివిధంబులగు పూజాద్ర వ్యంబులను నైవేద్యంబులను గైకొని శివాలయంబునకుఁ బోవుచుం డెను. వేదనిధి యది యంతయుం గాంచి యాభక్ష్యంబుల నెట్లైన నపహరించి క్షుద్బాధ నపనయించుకొనవలయు నను కాంక్షతో నాతని వెనువెంటనే పోయి దురాత్ముం డగు నాతఁడు భక్తజనంబుల తోఁగలసి దేవాలయంబున శివపూజం గాంచుచుఁ గూర్చుండి యుం డెను. అప్పు డాఁకలిచే జాగరణంబు సేయుచున్నయాతఁడు వీరు భక్ష్యంబులం గైకొని వెడలిపోకుండ నెట్లో యీభక్ష్యంబులం గైకొని భుజియింపవలయు నని భావించుకొనుచుఁ దనయభీష్టసిద్ధికొఱకాతఁడు నిద్రలేక జాగరూకుఁడై కనిపెట్టుకొని యుండెను. ఆ సమయంబున నచ్చటి భక్తజనంబు ప్రతిప్రహరంబునను విధిపూర్వకంబుగ శివారా ధనంబు గావించి యించుక నిద్రావివశులై యుండిరి. కొందఱు తమ గృహంబులకుం బోయిరి. మఱికొందఱా శివాలయంబుననే శయ నించిరి. వారట్లు నిద్రించుచుండుటంగాంచి వేదనిధి యాని వేదితాన్నం బును,నానావిధపక్వాన్నంబులను, సంగ్రహింపవలయునను నుద్దేశముతో మెల్లమెల్లగ నడుగు లిడుకొనుచు శివసన్నిధికిం బోయి యప్పుడు దీప ములు సన్నగిలియుండుటచే సరిగ భక్ష్యద్రవ్యములను గనుఁగొనఁ

జాలక తనశిరోవేష్టమునూడి యించుకవస్త్రమును జించి వత్తిచేసి దానిచే దీపంబును సముజ్జ్వలంబు గావించి యావెలుంగున భక్ష్యంబులం గాంచి యాశతో వాని నన్నిటిని గైకొని మరల మెల్లమెల్లగ వెనుకకుఁ దిరిగివచ్చుచుఁ బ్రమాదవశంబున నందు శయనించియున్న యొకభక్తునిం ద్రొక్కుటయు నాతఁడులికిపడిలేచి దొంగ దొంగయని కేకలు వైచెను. అంతలో సంఘమును లేచి కేకలు వైచుటయు వేదనిధి భయభ్రాంతుండై యతివేగముగఁ బరుగెత్తుచుండుటయు రక్షకభటు లాతని వెంబడించి పట్టి గట్టి యెంతకును దొరకకుండుటచే నాతనిపై బాణక్షేపముం గావించిరి. ఆబాణపాతంబున వేదనిధి తత్క్షణంబ క్రిందఁబడి మరణించెను. ఎట్లయిన నవ్విప్రకుమారుగనకాదినంబున శివరాత్రి వ్రతంబును జాగరణంబును సంపన్నంబులయ్యెను. శంకరుం డతిదయాళుండు కావున నప్పుడా బ్రాహ్మణకుమారుని దుష్కార్యంబు లన్నియును శుభఫలప్రదంబులయ్యెను. అప్పుడు యమకింకరులును మహాబలపరాక్రమ సంపన్నులగు శివానుచరులు నచ్చటికిఁ జనుదెంచిరి. ఆసమయంబున నయ్యుభయపక్షములవారికిని విశేషవివాదము జరిగెను. అప్పుడు శివానుచరులు యమదూతలం గాంచి మీరగు దండపాణులై యిచ్చటి కెందులకు వచ్చితిరనుటయు శివభక్తులగు మీ రేల వచ్చితిరి? ఈబ్రాహ్మణుండు తనజీవితంబునఁ గావించినదంతయును బాపకర్మమే గాని యించుకంతయైనను బుణ్యకర్మంబు గావించి యెఱుంగఁడని విన్నవించిరి. అంత శివానుచరు లిట్లనిరి. ఈతఁడు కేవలమును బాపాత్ముఁడనుమాట నిశ్చయమే. కాని యీశివరాత్రివ్రతమూలంబున నీవిప్రకుమారుని సమస్తపాపంబులును వినష్టంబులై పోయినవి. అజ్ఞానులారా! ఈతనికిఁకఁ బాపమెక్కడిది? అని యివ్విధంబుగఁ బరస్పరమును వాదించుకొనుచు యమునియొద్దకుం బోయిరి. అప్పుడు యముండు వారిం

గాంచి యీశివదూతలు చెప్పినదంతయును సత్యము. ఈబ్రాహ్మణుని పాపంబు లన్నియును భస్మీభూతంబు లై పోయిన వని చెప్పుచు శివదూతలకును బ్రాహ్మణునకును నమస్కరించి విప్రకుమారు నుద్దేశించి నీవు ధన్యుండవని ప్రశంసించుచు నాతని గళింగదేశాధీశ్వరుం గావించెను. ఆబ్రాహ్మణకుమారుండు శివపూజాబలంబునఁ గళింగేశ్వరుండై పుట్టి నిరంతర శివపూజారతుండై శివరాత్రివ్రతానుష్ఠాన పరాయణుండై తనరాజ్యంబునఁ బ్రజలం దఱిచేతను శివపూజలం జేయించుచు శివాలయంబున దీపప్రదానము నాచరింపఁజేయుచు నంతంబున శివసాయుజ్యంబు నందెను. మునిశ్రేష్ఠులారా! దురాత్ముం డగు బ్రాహ్మణుం డెట్టిప్రయత్నంబును లేక స్వార్థపరుండై యాచరించిన కర్మంబుననే శివరాత్రివ్రతఫలంబు నందికొని ముక్తుం డై నప్పుడు భక్తిశ్రద్ధలతో నీయుత్తమవ్రతంబు నాచరించినవారు భోగమోక్షంబుల ననుభవింతు రనుటకు సంశయం బేమున్నది? ఆదుష్టబ్రాహ్మణుండు చౌర్యముకొఱకు దీపారాధనముం గావించెను గాని సద్బుద్ధితోఁ గావింపలేదు, అట్టివాని కిట్టిఫలంబు లభించెను. అట్టిచో శివరాత్రియందు భక్తిపూర్వకంబుగ శివాలయంబున దీపారాధనంబు సేయువారి కెట్టిఫలంబు లభియించునో వర్ణించుటకు సమర్థు లెవ్వరును లేరు. ఈశివరాత్రివ్రతంబుకంటె నుత్తమవ్రతంబు లేదు. శివునికంటె దయాళుండు బరమపావనుండు మఱియెవ్వఁడును లేడు. ఈపావనేతిహాసము నాకర్ణించిన మానవుండు సకలపాపవిముక్తుండై శివసాయుజ్యంబు నందును. ఈయుత్తమవ్రతంబున ముక్తిలాభంబు కలుగును. శివుండే జ్ఞానప్రకాశకుండు. శివుండే పరమపదము. శివతాదాత్మ్యమే ముక్తి. శివోపాసనంబు లేనివ్రతంబు వ్రతమే కాదు.

## —♦ ముక్తిలక్షణము. ♦—

మునివరులారా! ముక్తి యనుపద సామీప్యం బనియు, సాలోక్యం బనియు, సాన్నిధ్యం బనియు, సాయుజ్యం బనియు, నను

ర్విధంబులై యుండును. ఈయుత్తమ శివరాత్రివ్రతంబున నెట్టిముక్తి లభియించునో చెప్పెద నాలింపుఁడు. ఎవ్వనినుండి సమస్తంబు నుత్పన్నం బయ్యెనో, యెవ్వఁడీసకలలోకంబులను బాలించు చుండెనో, ప్రళయకాలంబున నెవ్వనియం దీసర్వంబును విలీనం బగుచుండునో యెవ్వఁడీ సమస్తంబునను వ్యాపించి యుండెనో, యట్టి పరమశివుని స్వరూపముం గాంచుటయే ముక్తి. ఆదివ్యస్వరూపమును బ్రహ్మయు, విష్ణుండును, సనత్కుమార నారద మార్కండేయాది మహర్షులును, వ్యాసశిష్యుండగు శుకదేవుండును, వ్యాసుండును, బ్రహ్మమానసపుత్రులునుగూడ నేతినేతివాక్యంబులచే సమస్తవస్తు పరిత్యాగముం గావించుటయేగాని యప్రత్యక్షంబగుటచే నెఱుంగఁజాలకున్నారు. సత్యజ్ఞానస్వరూపంబును, ననంతంబును నిత్యానందమయంబును, త్రిగుణాతీతంబును, మాయారహితంబును, ప్రపంచలేశశూన్యంబును, నక్షయంబును, శ్వేతరక్త పీతాదివర్ణవిరహితంబును ననిర్వాచ్యంబును, నవాఙ్మానస గోచరంబును నగుపరబ్రహ్మమే ప్రప్రథమంబున శివనామంబునఁ బ్రసిద్ధంబయ్యెను. ఆబ్రహ్మ మాకాశముంబోలి సర్వవ్యాప్తంబై యుండును. అది స్థూలంబునుగాదు. సూక్ష్మంబునుగాదు. ఆ పరబ్రహ్మమునకు సుఖదుఃఖంబులుగాని, మాత్సర్యాది వికారంబులుగాని లేవు. ఇహలోకంబునఁగాని, పరలోకంబునఁగాని బ్రహ్మపదార్థమునకు వికారము లేదు. కేవల శివభజనంబునఁగాని బ్రహ్మసాక్షాత్కారము లభియింపదు. కావున ముక్తికోఱకుశివుని సేవింపవలయును.

## —♦ బ్రహ్మనిరూపణము. ♦—

ఈ సమస్తజగంబు నేనిర్గుణపరమాత్మయం దుత్పన్నం బయ్యెనో యాపరమాత్మయే శివుఁడు. ఆతత్త్వము నేదవేదాంతవిదుల కవగతంబగును. పురుషుండగు విష్ణుండును, ప్రకృతి యగు మాయయు నాతనియందే యుదయించెను. ఆప్రకృతిపురుషు లిరువురును గలసి

త్రిశూలస్థితంబును బంచక్రోశ పరిమితంబును నగు కాశీధామమునఁ దపంబు గావించిరి. అప్పు డాపురుషుని హర్షజలంబులచే నంతయును జలమయం బయ్యెను. ఆజలంబున శయనించుటచేతనే మునులచే నాపురుషునకు నారాయణనామంబును, బ్రకృతికి నారాయణీనామం బును విఖ్యాతంబు లయ్యెను. ఆనారాయణుని నాభీకమలంబున జని యించినయాతఁడే పితామహుం డగు బ్రహ్మదేవుండు. మహాప్రళయ కాల పర్యంతమును స్వకీయం బగువైకుంఠధామంబున నివసించియుం డు సనాతనుండగు విష్ణుదేవునిం దనతపోబలంబున బ్రహ్మదేవుండు దర్శింపఁగల్గెను. అప్పటి యయ్యిరువురి వివాదమును దీర్పుటకై సాక్షా త్కరించిన శివమూర్తియే మహాదేవనామంబున సుప్రసిద్ధుం డయ్యెను. ఆసమయంబున నమ్మహాదేవుండు బ్రహ్మకపోలదేశమునుండి రుద్ర రూపుండై యావిర్భవించెను. పరమశివుండు రూపరహితుం డైనను లోకానుగ్రహంబు కొఱకును, భక్తోపచారగ్రహణంబు కొఱకును ధ్యానంబుకొఱకును రుద్రరూపముం దాల్చి రుద్రనామంబున విఖ్యా తుం డయ్యెను. భక్తవత్సలుం డగునారుద్రుండు సాక్షాచ్ఛివస్వరూ పంబు. బ్రహ్మమొదలుగ జనియించినవా రందఱును గాలానుసారం బుగ లయంబు నందెదరుగాని రుద్రుండుమాత్ర మట్లు కాక శివుని యందు విలీనుం డగును. రుద్రునియందు విలయంబు నందని బ్రహ్మాది దేవతల లందఱును మాయాధీనులు గావునఁ గేవలప్రకృతియందే లయంబు గాంతురు. రుద్రుండు బ్రహ్మాదులతోఁ గలసి విలయుండు కాఁడని శ్రుతిప్రసిద్ధము. సమస్తలోకంబును రుద్రుని భజియించును గాని రుద్రుం డెవ్వరిని భజియింపఁడు. విష్ణుప్రభృతు లగు దేవతలను సత్యమును భజియించువారు వారియందు విలీనులై తుదకు వమదేవ తలతోఁగూడ శివతాదాత్మ్యరూపం బగు ముక్తిని గాంచుచున్నారు. ఎవ్వరు శివభజనంబు సేయుదురో యట్టివా రితరాపేక్ష లేకుండఁ

దక్షుణమే శివతాదాత్మ్యముం గాంతురు. అజ్ఞానం బనేకవిధము లైనది. తత్త్వజ్ఞాన మొక్కటియె సత్యము. బహుప్రకారముల నగపడుచుండును గాని సత్యం బొక్కటియే. బ్రహ్మాదితృణపర్యంతం బును గనంబడుచున్న సమస్తవస్తుప్రపంచమును నేకంబును సత్యంబు నగు శివస్వరూపమే గాని యన్యంబుగాదు. శివుం డొక్కండుమాత్ర మే కేవలుండు. సృష్టికిఁ బూర్వంబునను, సృష్టికాలంబునను, సృష్ట్య వసానంబునను గూడ నుండువాఁడు గావున నాతఁడు సదాశివుండు. ఆకారణంబుననే శివుండు నిర్గుణుం డని చెప్పంబడుచున్నాఁడు తన నిశ్వాసవాయుమూలంబున విష్ణుదేవునకు వేదంబులను, వివిధమంత్రం బులను, ధ్యానపూజావిధులను బ్రసాదించిన యమ్మహాదేవుండు సర్వ విద్యాధీశ్వరుండని సనాతనశ్రుతులు ప్రశంసించుచున్నవి. శివుండు సకలలోకంబుల ననుగ్రహించుచుండును. ఆశివుండే విష్ణుండు మొద లగువారి నందఱను సృజియించి పాలించుచున్నాఁడు. ఆతఁడు పుణ్య పాపంబులకు సాక్షిద్రష్టయును, సంహారకర్తయు నైయున్నాఁడు. ఆతఁడే కాలపరిణామంబునకును, గాలపరిగణనంబునకును గారణుం డగుచున్నాఁడు. కాని కాలకృతపరిణామంబును, బరిగణనంబును నాత నికి లేవు. శివుండు స్వయంబుగ సాక్షాన్మహాకాలస్వరూపుఁడు. మహా కాళి యాతని నాశ్రయించియుండును. రుద్రుం డట్లు పరబ్రహ్మస్వరూ పుండగు శివునినుండి యుత్పన్నుం డయ్యెనో యట్లే మహాకాళియు నుత్పన్న యయ్యెనని పండితులు చెప్పెదరు. శివుండు కారణస్వరూ పుఁడు. అచ్యుతాది సకలదేవతలును గార్యస్వరూపులు. సమస్తజగం బును మహాకాళీ మహాకాలులచే వ్యాప్తంబై యుండును. వారి యిచ్ఛానుసారంబుననే జగదుత్పత్తిస్థితిలయంబు లగుచుండును. శివున కుత్పాదకుండును, సంహారకర్తయు, నాశ్రయుండును మఱియొకండు లేఁడు. ఆతఁడు తనకుఁ దానే కారణుండై యున్నాఁడు. ఆతం

డొక్కఁడే యయ్యును సృష్టికాలంబునం దనేకాకృతియై ప్రళయకాలంబున మరలఁ నేకాకృతి యగుచున్నాఁడు. బీజం బొక్కటియై యయ్యును బల్లవపుష్పఫలాదిరూపంబుల వివిధంబై క్రమ్మర యథారూపంబున బీజంబై నిలుచునట్లు శివుం డొక్కఁడే బహురూపంబులం దోఁచి పర్యవసానంబున శివుండై నిలుచుచున్నాఁడు. వాస్తవంబుగ సమస్తంబును శివస్వరూపమే కాని యన్యంబు గాదు. శివతత్త్వము జ్ఞానులకే గాని సామాన్యులకుఁ బ్రబోధంబు గానేరదు.

—: జ్ఞానప్రశంస. :—

మునులారా! ఇఁక జ్ఞానంబును గూర్చి ప్రశంసించెదను వినుండు. బ్రహ్మయును నారదుండును సనత్కుమారుండును వ్యాసభగవానుండును గపిలదేవుండును మొదలుగాఁగల మహాత్ముల సభయందు విచారపూర్వకంబుగ నిది యిట్లు నిర్దేశింపఁబడియెను. జ్ఞానంబును, జ్ఞాతయు, జ్ఞేయంబు నను త్రివిధభావంబులు గల యీ సమస్తంబును శివస్వరూపంబు. బ్రహ్మాదితృణపర్యంతమును దృగ్గోచరంబగు సర్వంబును శివస్వరూపం బనుట కొంకింతయును సంశయంబు లేదు. శివుం డిచ్ఛావశంబునఁ నీజగన్నిర్మాణముం గావించుచుండును. ఆతఁ డందఱ నెఱుంగునుగాని యాతని నెఱింగినవా రొక్కరును లేరు. శివుఁడీజగంబును నిర్మించి తానందుఁ బ్రతిష్ఠుండై యుండియును, బ్రతిబింబరూపంబున జలప్రవిష్టుం డగు సూర్యునింబోలి దూరస్థితుండై యుండును. ఈజగంబున శివునకు వాస్తవికప్రవేశము లేదు. సర్వస్వరూపుం డగునాతం డట్లే జగద్విలీనుండైనట్లు ప్రతిభాసితు డగుచుండును. సత్యముగ శివుండే వివిధరూపంబులఁ బరిదృశ్యమానుం డగుచున్నాఁడు. ఈజగం బీశ్వరునకు భిన్నంబైన దని తలంచుట కేవల మజ్ఞానము. సర్వంబును బ్రహ్మస్వరూపమే. తద్భిన్నం బించుకంతయును లేదు. మతిభేదంబున కజ్ఞానమే కారణ

ణము. అజ్ఞానంబు లేకున్నచో భిన్నబుద్ధియే యుండదు. వైశేషికాదిదర్శనంబులఁ బరిచోద్యమానం బగుద్వైతమతముకూడ నవిద్యాకల్పితమే కాని వేఱు కాదు. కేవల వేదాంతవేత్తలు సర్వవిధముల నద్వైతప్రతిపాదనమే గావించుచుందురు. పరబ్రహ్మాంశయగు జీవున కవిద్యావశంబున భేదబుద్ధి కలుగుచున్నది. జీవుండు మాయావశంబునఁ దన్నుఁ బరమేశ్వరునకు భిన్నునిగాఁ దలంచుకొనుచుండును. అట్టిజీవుండు శ్రవణమననాద్యుపాయంబులచే మాయాపరిత్యక్తుండై నప్పుడు కేవలము శివస్వరూపుం డగుచున్నాఁడు. చేతనాచేతనంబులగు సమస్తపదార్థంబులయందును సదాశివుం డంతర్యామియైయుండును. భక్తిపూర్వకంబుగ శాస్త్రోక్తంబులగు శ్రవణమననాద్యుపాయంబుల నవలంబించి యేకాగ్రచిత్తంబునఁ బ్రయత్నించువారికి నిశ్చయముగ శివసాక్షాత్కారము లభింపఁగలదు. పురుషుండు సంఘర్షణాదిక్రియలచేఁ గాష్ఠములయం దగ్నిని సందర్శించునట్లు శ్రవణమననాదిసదుపాయావలంబనాదులచే జగంబున జగదంతర్యామియగు నీశ్వరుని దర్శించుచున్నాఁడు. స్థావరజంగమాత్మకం బగు సర్వంబును శివమయంబై యున్నది. శివుండును సర్వమయుండై యుండును. ఈజగంబున శివవ్యతిరిక్తంబగుపదార్థ మొక్కటియును లేదు. సముద్ర మొక్కటియే యయ్యును ఫేనతరంగాద్యుపాధిభేదంబున భిన్నరూపంబులుగఁ దోచునట్లును, నేకవస్తు వగుమృత్తిక ఘటశరావాద్యుపాధిభేదంబున భిన్నాకృతులఁ గానవచ్చునట్లును, నొక్కటియగు సువర్ణంబు కుండలముయాద్యుపాధిభేదంబున భిన్నభావంబులఁ గానవచ్చునట్లును, బరమాత్ముం డొక్కఁడయ్యును నహంకారాద్యుపాధిభేదంబులచే భిన్నాకృతులఁ బ్రతిభాసిల్లుచుండును. కార్యకారణంబులకు వాస్తవికభేదంబు లేదు. అంకురంబునకు బూర్వము కేవలబీజమే యున్నది. తరువాత మృత్తికాజలసంయోగంబున వివిధాంకురంబు లుత్పన్నంబులై

తుదకు ఫలాభ్యంతరంబున బీజంబుమాత్రమే శేషించుచున్నది. తక్కినయంకురాదులు వినష్టంబు లగుచున్నవి. అట్లే సృష్టికిఁ బూర్వాంబునను బరంబునను నిత్యుండును నేకస్వరూపుండును బరమాత్ముండు నగు శివుండొక్కఁడే సుస్థిరుండై విరాజిల్లుచున్నవాఁడు. జీవునకుఁ జ్ఞానంబు లభియించినచో సర్వంబును బ్రహ్మస్వరూపంబుగఁ బ్రబోధంబగుచుండును. అజ్ఞానియగువానికి భిన్నరూపసంపన్నంబగు జగంబు పరిశ్యతుం బగుచుండును. శివమయంబగు నీప్రపంచంబునందుఁ దద్భిన్నంబొక్కటియును లేదు. అజ్ఞాని జగంబును భిన్నప్రకారంబుల నవలోకించుచుండును. ఒకప్పుడు నిందలి యేకత్వమును గనుఁగొనఁజాలఁడు. మానవుఁడు జలాదులయం దేకజ్యోతిర్మయంబగు చంద్రమండలమును, సూర్యమండలమును భిన్నభిన్నరూపంబులఁ గాంచుచుండును. అట్లే జీవుండు మాయాధీనుండై పరమాత్మునకు భిన్నభావము నారోపించుచుండును. చంద్రసూర్యులు తను తేజంబుచే సర్వవ్యాపకు లయ్యు నీజగంబు నించుకంతయు స్పృశింపకుండినట్లే పరమాత్ముండును సర్వవ్యాపకుండై యీ మిథ్యాజగంబుతో నించుకంతయును, సంబంధము లేక యుండును. జీవుం డహంకారపరిత్యక్తుం డయ్యెనేని సాక్షాచ్ఛివస్వరూపుం డగును. తామ్రసంకలనంబున సువర్ణం బల్పమూల్యంబైనట్లే యహంకారకలనంబున జీవుండు బద్ధుం డగుచున్నాఁడు. కాలాంతరంబున నట్టిసువర్ణము పుటపాకాదులచేఁ బరిశుద్ధంబై యథారూపంబున మూల్యవంతంబైనట్లు జీవుండు సద్గురుప్రసాదంబున శివబోధంబు గాంచి యుత్తమపూజనంబునను, మంగళజనకంబగు శివనామకీర్తనంబునను, ధ్యానంబునను, స్తవంబునను, సమస్తపాపంబులను దూరంబు చేసి యజ్ఞానపరిత్యక్తుం డగుచున్నాఁడు. అప్పు డాజీవునకు జగంబు మిథ్యయనియు, సనాతనుండగు శివుండే సత్యస్వరూపుండనియు బోధ యగును. అజ్ఞానంబు విడిచి విజ్ఞాని యగువా డహంకారవిముక్తుండై

శివతాదాత్మ్యముం గాంచుచున్నాఁడు. దర్పణంబున స్వస్వరూపముం గాంచునట్లు సమస్తప్రపంచంబునందును సర్వవ్యాపకం బగు శివస్వరూపమును దర్శించువాఁడు జీవన్ముక్తుండై యంతంబున శివరూపం బగు నిర్గుణబ్రహ్మంబున విలీనుండగును. జ్ఞానియగువాని కనుకూల ప్రతికూలఫలంబులయెడల హర్షకోపంబులు లేవు సుఖదుఃఖంబులయందు సమబుద్ధి యగువాఁడే జ్ఞాని. జ్ఞానియగువాఁ డాత్మయోగంబునఁ దత్త్వ వివేచనంబు గావించుకొనుచు నిచ్ఛానుసారంబుగఁ జరియించుచు శరీర పతనసమయంబున శివునియందు లయంబు గాంచును. ఎప్పుడు ముక్తుం డగునో యప్పుడే యాతని సర్వబంధంబులును వదలిపోవును. అట్టివాని కిఁకఁ బునర్జన్మంబు లేదు. శివతత్త్వజ్ఞానంబున కాత్మయోగంబును, దానికి భక్తియును, భక్తికిఁ భగవంతునియందలి ప్రేమంబును, ప్రేమంబునకు వేదాంతశ్రవణంబును, శ్రవణంబునకు సత్సంగంబును, సత్సంగంబునకు సద్గురూపదేశంబును మూలకారణంబులు. పురుషునకు జ్ఞానంబువలననే మోక్షంబు లభియించును. విజ్ఞానవిధులగువారు మోక్షంబుకొఱకుఁ గేవల శివభక్తితత్పరులై సర్వదా శివభజనంబు సేయుచు నిశ్చయముగ శివసాయుజ్యముం గాంచుచుందురు. ఏకారణంబుచే నైన భక్తికి విఘ్నంబు తటస్థించినచో శ్రవణమననాదిసంస్కారసహితం బగు పునర్జన్మము కలుగును. అట్లు జన్మించువాఁడు మరల శివభక్తియుక్తుండై నిరంతరభజనంబు చేయుచు నంతంబున ముక్తుం డగును. శివునికంటెఁ బ్రధానదేవత లెవ్వరును లేరు. శివప్రాప్తుం డగువానికిఁ బునర్జన్మంబు లేదు. సహస్రసహస్ర జన్మార్జితంబులగు తపోదానవ్రతాది సత్కర్మఫలంబులవలన శివభక్తి లభియించును. అట్టిభక్తివలననే భక్తునకు ముక్తి కరతలామలకం బగును. ఓ మునులారా! ఈ మహావాక్యంబు లన్నియును సనత్కుమారాది మహాత్ములసభయందు మహర్షులచే నిశ్చయింపఁబడినవని వ్యాసభగ

వానుండానతిచ్చియున్నాఁడు. ఆ వ్యాసదేవునిచే నేనుపదేశింపఁబడితిని పరమాత్ముండగు శివుండు జ్యోతిర్లింగంబునఁ బ్రాదుర్భూతుండైన సమయంబున విష్ణుదేవున కీపరమార్థమును బోధించియుండెను. ఆ పురుషోత్తముండు కమలాసనునకును, నాతండు సనత్కుమారాది మహాత్ములకును ప్రబోధించెను. సనత్కుమారుండు నారదునకును, నారదుండు వ్యాసునకును బోధించెను. దయాళుండగు వ్యాసభగవానుండు నాకుపదేశించెను. నేను లోకమంగళంబుకొఱకుఁ బరమగుహ్యంబగు నియ్యుత్తమబోధనంబును మీకెఱింగించితిని. అనుటయు శౌనకాదిమహర్షులు సూతుం గాంచి పరమానందభరితులై వినయపూర్వకంబుగ నిట్లనిరి. ఓమహాభాగా! నీయనుగ్రహంబున మామనోవిభ్రాంతు లన్నియును మాయమైపోయినవి. అని మునులు సంతసించుటయు సూతుం డిట్లనియెను. మహాత్ములారా! నాస్తికుండును, శ్రద్ధాహీనుండును, భక్తిరహితుండును నగువాని కీవాక్యములను బోధింపరాదు. వ్యాసభగవానుం డష్టాదశపురాణంబులను, మహాభారతాద్యనేకేతిహాసంబులను, బహువిధవేదార్థంబులను మరలమరలఁ బరిశీలించి విచారపూర్వకంబుగ శివతత్త్వజ్ఞానసారంబగు నీరహస్యమును ప్రబోధించియుండెను. దీని నాకర్ణించినచో భక్తిహీనుండు భక్తుండగును; భక్తునకు భక్తివర్ధిల్లును. దీని నొక్కసారి యాకర్ణించినచో సమస్తపాపంబులును నశించును. క్రమంబుగ వినినకొలఁది భక్తియును, ప్రవృత్తియును లభించును. మరల విన్నచో శివసాక్షాత్కారము సిద్ధించును. క్రమంబుగ నియ్యుత్తమోపదేశశ్రవణమననంబులచే నిత్యశివసందర్శనంబును, శివతత్త్వజ్ఞానంబును, భోగమోక్షసిద్ధియు నగుంగావున శుభాకాంక్షులగువారీ శివతత్త్వమును మరల మరల నాకర్ణింపవలయును, శ్రేష్ఠఫలాకాంక్షితుండగువాఁ డియ్యుత్త

మవాక్యంబుల నైదుపర్యాయములు పఠియించినచోఁ నాతనికి నిశ్చయముగ ఫలసిద్ధి యగునని వేదవ్యాసుం డానతిచ్చియున్నాఁడు. ఈ వ్యాసవాక్యంబుల శ్రద్ధాభక్తులతోఁ వినువానికి జగంబున దుర్లభంబగునది యేదియునులేదు. అని బోధించుటయు మహర్షులాశివతత్త్వసారశ్రవణంబు గావించి పరిపూర్ణహృదయులైరి. ప్రాచీనులగు మహారాజులు పంచవారంబు లీశివతత్త్వసారశ్రవణంబు గావించి యుత్తమసిద్ధిం గాంచిరి. అని చెప్పుటయు మహర్షులందఱును బలమానందంబున సూతునిం బ్రశంసించుచుఁ జందనాదినానాలంకారంబులచే నాతని నర్చించి నమస్కారంబు గావించి పూజించి వివిధాశీర్వాదంబులు సేసి పరమసంతుష్టులైరి. సూతుండును సంతుష్టుం డయ్యెను. అనంతర మమ్మునిప్రవరులందఱు నిష్టాంతఃకరణంబులతోఁ నిదియ యుత్తమసాధనంబని శివభజనంబు గావింపందొడఁగిరి. ఈజగంబునం దెవ్వఁడీశివపురాణము నాకర్ణించునో యాతనికి సర్వాభీష్టములును సిద్ధించుటయేకాక యంతంబున శివసాయుజ్యంబు లభియించును. వేదసమ్మతంబగు నీశివపురాణమును లిఖించి స్వర్ణమయవృషంబుతోఁ గూడ దానంబు చేయువాఁడు నియతశివలోకావాసుండగును. ఆతఁడు నిశ్చయముగ శివస్వరూపంబు నందఁగలఁడు. కావుననో మునులారా! మీరు ప్రయత్నపూర్వకంబుగ శివపురాణప్రదానమ్ముం గావింపుఁడు. ఈ దానంబునకు దక్షిణగా నాలుగుసువర్ణంబుల నీయవలయును. ఈ దానంబుచే నెన్నటికిం జెడని శివసాయుజ్యము కలుగును. ఈశివపురాణంబు చదివి వినిపించువానిని శ్రోతలు తమ యభీష్టశిద్ధికొఱకు వస్త్రాలంకారభూషణంబులచేతను, మృష్టాన్నభోజనాదులచేతను సంతుష్టుం గావింపవలయును. అట్లు చేసినచోఁ బ్రతిజన్మంబునను శివభక్తి లభియింపగలదు.

శ్రీరామచంద్ర.

# శివపురాణము.

## విద్యేశ్వరసంహిత.

అమరు నజరు నతులు ◆ నాద్యంతమంగళు
నాత్మదేవు నజు న ◆ ఘాపహారిఁ
బార్వతీసనాథు ◆ బంచాననుని శివు
నఖిలమయునిఁ గొలుతు ◆ మహరహంబు.

### —: సాధ్యసాధనాది నిరూపణము. :—

గంగాయమునా సంగమస్థానంబును, స్వర్గపథస్వరూపంబును, బరమపావనంబును, ధర్మజనకంబు నగుప్రయాగ మహాక్షేత్రంబున ప్రశంసితాత్ములును, సత్యవ్రతపరాయణులును, మహాతేజస్సంపన్నులును, మహాభాగులు నగు శౌనకాదిమహర్షులు సత్రయాగంబు గావించుచుండుటయుఁ బౌరాణికప్రధానుండును, వ్యాసశిష్యుండు నగు సూతుండు యాగదర్శనార్థం బచ్చటి కేతెంచెను. అప్పు డాతనిం గాంచి మునిప్రవరులు వేదాంతసారసర్వస్వంబగు నొక పురాణవృత్తాంత మెఱింగింపుమని ప్రార్థించిరి. అంత సూతుండు పురాణ విషయంబుల వర్ణింప నుద్దేశించి యమ్మునివరులంగాంచి యిట్లనియెను. మునిశ్రేష్ఠులారా! అనంతం బగుకాలంబున ననేకకల్పంబు లతీతంబులై యొకానొక కల్పం బారంభంబగు సమయంబున షడ్వాంశసంభూతులగు మునులకు బ్రహ్మతత్త్వముంగూర్చి పరస్పరవివాదము కలిగెను. అపుడు వారు యథార్థతత్త్వపరిజ్ఞానముకొఱకు సనాతనుండును జగద్విధాతయు నగు బ్రహ్మదేవునియొద్దకుం బోయి కృతాంజలిపుటులై వినయంబుగ

నిట్లు ప్రార్థించిరి. పితామహా! నీవీసమస్తప్రపంచమును సృజియించి తివి. నీవు సమస్తకారణంబులకును గారణుండవు. కావున నిన్నుఁ ప్రార్థించుచున్నారము. మహదాదిసమస్తతత్వంబులకంటెను బురాతనుండును, బరాత్పరుండును నగుపురుషుం డెవ్వఁడో యానతీయవలయును. అని యేకగ్రీవముగ వేఁడుకొనుటయుఁ గమలాసనుం డిట్లనియెను. మునిచూడామణులారా! ఎవ్వఁడు వాక్కునకును, మనంబునకు నగోచరుండై యుండునో, ఎవ్వనివలన సమస్తేంద్రియంబులును, నాకాశాది పంచభూతంబులును, బ్రహ్మవిష్ణురుద్రేంద్రప్రభృతి దేవతాగణంబులును, సమస్తచరాచరవస్తుజాలంబులును బ్రథమంబున సముద్భూతంబు లయ్యెనో యట్టి సర్వజ్ఞుండును, జగదీశ్వరుండును నగు మహాదేవుండే సకలతత్త్వంబులకును బురాతనుండు. ఆతఁడే పరాత్పరుండు. పరమభక్తికంటె భిన్నంబగు మఱియేమార్గంబునను నాతని దర్శనలాభంబు గలుగనేరదు. హరిహరబ్రహ్మేంద్రాది సకలదేవతలును భక్తిబలంబుచే నాతని దర్శింపఁగోరుచుందురు. వేయేల? జీవులకు శివభక్తిబలంబుననే ముక్తిలాభంబు గలుగును. బీజంబునుండి యంకురంబును, నంకురంబునుండి బీజంబును గలుగునట్లు దేవతాప్రసాదంబున భక్తియును, భక్తివలన దేవతాప్రసాదంబును గలుగుచుండు. కావున నో మునులారా! మీరు భూమండలమునకుం బోయి మహేశ్వర సాక్షాత్కారముకొఱకు సహస్రవర్షపర్యంతమును దీర్ఘ సత్త్రానుష్ఠానముం గావింపుఁడు. యజ్ఞేశ్వరుండగు మహాదేవుండు ప్రసన్నుండైనచో మీకు సాధ్యసాధనరూపంబగు వేదోక్తవిద్యా జ్ఞానంబు లభియింపఁగలదు. అనుటయు మునులు మహాత్మా! చెప్పంబడిన సాధ్యసాధనంబు లెట్టివియో, సాధకవిధానం బెట్టిదియో యథార్థస్వరూపంబును సవిస్తరంబుగ నానతీయవలయునని యడిగిన, అప్పుడు పంకజాసనుం డిట్లనియెను. మునులారా!

శివపదప్రాప్తియే సాధ్యంబు. అమ్మహాదేవుని సేవయే సాధనంబు. మఱియు నెవ్వఁడు శివప్రసాదంబున నిత్యనైమిత్తికాది కర్మంబుల యెడల ఫలకాంక్షాశూన్యుండై యుండునో యాతఁడే సాధకుండు. ఎవ్వఁడు వేదవిహితకర్మంబుల నాచరించుచుఁ గర్మఫలంబులఁ బరమేశ్వరునకు సమర్పించుచుండునో యాతఁ డనాయాసంబుగ సాలోక్యాది క్రమంబునఁ బరమేశ్వరపదప్రాప్తుం డగును. భక్తజనంబులు భక్త్యనుసారంబుగఁ బరమఫలంబునకు నధికారులై యుందురు. మఱియు సాక్షాత్పరమేశ్వరుండే బహుప్రకారంబుల సాధననిర్దేశంబు గావించి యుండెను. అందుఁ బ్రధానంబగు సాధనమును సంక్షేపంబుగ మీకెఱింగించెదను వినుండు. కర్ణంబులచే నమ్మహాదేవుని యాకారప్రకారంబుల నాకర్ణించుటయును, వాక్యంబులచే నాపరాత్పరుని సద్గుణసంకీర్తనంబు గావించుటయును, మనంబుచే నిరంతరము నద్దేవుని మననంబు గావించుటయు మహాసాధనంబని నిర్దిష్టం బయ్యెను. ఇవ్విషయంబున శ్రుతిప్రమాణంబు కలదు. ప్రథమంబున మహేశ్వరగుణాది శ్రవణంబును, సంకీర్తనంబును, పిదప మననంబును గావించుట కర్తవ్యంబు. కావున సర్వార్థసాధనతత్పరులగు మునులారా! మీరివ్విధంబగు సాధనమూలంబున నుత్కృష్టసాధనలాభంబునకుఁ బ్రయత్నింపుఁడు! సకలజీవులును బ్రత్యక్షవిషయంబును నేత్రమూలంబునఁ గాంచుచు నప్రత్యక్షవిషయంబును శ్రవణమూలంబున గ్రహించుటకుఁ బ్రయత్నించుచుందురు. కావున బుద్ధిమంతుం డగువాఁడు ముందుగ గురుముఖంబున శ్రవణరూపసాధనానుష్ఠానముం గావించి యనంతరము సంకీర్తనంబును మననంబును గావింపవలయును. ఇట్లు క్రమంబుగ మననరూపసాధనపర్యంతమును సుసాధితం బయ్యెనేని శివయోగబలంబున సాలోక్యాదిముక్తిలాభంబు సిద్ధింపఁగలదు. అట్టి సత్పురుషులు ముందుగ వ్యాధిశూన్యులును, బరిణామంబునఁ బరమానందమయులునై పర

మహాత్మ్యమందు విలీను లయ్యెదరు. పూర్వోక్తసాధనత్రయం బభ్యాస కాలంబునఁ గ్లేశప్రదం బైనను క్రమంబుగఁ బరిణామంబునఁ నిరంతర మంగళదాయకంబు కాఁగలదు.

## —♦ మననాదిస్వరూపనిరూపణము. ♦—

మునులారా! యుక్తిపూర్ణహృదయంబున జగదీశ్వరుండగు శంకరుని పూజయును, జపంబును, గుణరూపవిలాస నామంబులును నిరంతరము బరిశోధించుటయే శ్రేష్ఠసాధనంబులయందు ముఖ్యంబగు మననంబని బుధులు చెప్పుదురు. అది పరమేశ్వర కరుణాకటాక్షంబు నంగాని లభింపదు. శివుని ప్రతాపగుణరూపవిలాసనామప్రకాశకం బగు సంగీతంబును, వేదవాక్యంబులచేఁగాని, స్వభాషణంబులచేఁగాని, ప్రేమపూర్వకంబుగ నమ్మహాదేవుని సంస్తుతించుట కీర్తనంబను మధ్యమసాధనంబు. ప్రతికార్యంబునను, ప్రతివచనంబునను శివునియందు స్త్రీకేళియందుంబోలె శ్రవణేంద్రియమూలంబున మనంబు దృఢతరంబుగ లగ్నంబగుటయే శ్రవణంబు. ప్రప్రథమంబున సాధుసంగంబుచే శ్రవణంబును, పిమ్మట, సంకీర్తనంబును, దుదకు సర్వసాధనశ్రేష్ఠంబగు శంకరదివ్యరూపగుణాదిమననంబును గలుగును. కాని యివి యన్నియును శివకటాక్షాధీనములై యుండును. పూర్వము వ్యాసదేవుండు విభ్రాంతుండై సరస్వతీతీరంబునఁ దపస్సు చేయుచుండ భగవానుండగు సనత్కుమారుండు యదృచ్ఛావశంబున సూర్యసన్నిభవిమానారూఢుండై పోవుచు నాతని కగపడియెను. అప్పుడు ధ్యానారూఢుండగు పారాశర్యుండు ప్రబుద్ధుండై బ్రహ్మపుత్రుండగు సనత్కుమారున కతికుతూహలంబున సాష్టాంగప్రణామంబుచేసి దేవయోగ్యంబులగు నర్ఘ్యపాద్యంబు లిచ్చి శుభాసనాసీనుం గావించుటయు నమ్మునీంద్రుండు సంతుష్టుండై గంభీరవచనంబుల నిట్లనియెను. పరాశరనందనా! సనాతనుండును సత్యస్వరూపుండునగు శంకరుని

హృదయమధ్యంబున నిశ్చలంబుగ ధ్యానించినచోఁ దత్క్షణంబ యమ్మహాదేవుండు సాక్షాత్కరించును. అట్టిచో నీవేల సాక్షివై యీస్థానమునం దీవిధముగాఁ దపఃక్లేశము ననుభవించుచుంటివని ? అనుటయు వ్యాసుండిట్లనియెను. మునీంద్రా! నేను బహుపురాణంబులను గ్రంథంబుల వేదవిహితంబులగు ధర్మార్థకామమోక్షంబుల బహుప్రకారంబుల నిర్దేశించి జనసమాజంబున నెల్లవిధంబులఁ బూజ్యుండనై యుంటిని, కాని నాహృదయంబున నిప్పటికిని బరమాద్భుతము క్తిసాధనం బగు జ్ఞానం బుదయింపమింజేసి యిప్పుడు నేనందుకొఱ కిట్లు తపంబు గావించుచున్నాఁడను. ముక్తికారణము నాకింకను బోధపడుటలేదు. అనుటయు సనత్కుమారుం డిట్లనియెను. తపోధనా ! భగవంతుండగు శంకరుని రూపగుణాది శ్రవణంబును, సంకీర్తనంబును, తద్విషయికమననంబునను నీ మూఁడుసాధనంబులును వేదసమ్మతంబులు. పూర్వకాలంబున నేను మందరపర్వతంబున నన్యసాధనావలంబుండనై యత్యాసక్తితో శంకరునుగూర్చి తపంబు చేయుచుండ నొకనాఁడు సర్వసాక్షియు గణాధిపుండును, దయాళుండును, భగవానుండు నగు నందికేశ్వరుండు శివాజ్ఞానుసారంబుగ నాయొద్దకు విచ్చేసి ప్రేమపూర్వకభాషణంబుల నాకుఁ బావనముక్తిసాధనంబు నుపదేశించి యుండెను. శ్రవణసంకీర్తనమననంబులను సాధనత్రయంబును నవశ్యకర్తవ్యంబని యమ్మహాత్ముఁడు నాకు బోధించియున్నాఁడు. అని చెప్పి సనత్కుమారుండు వ్యాసుక కుపదేశించి వెడలిపోయెను. ఈ పూర్వవృత్తాంతమును మీకెఱింగించితి ననుటయు ఋషులు సూతుంగాంచి మహాభాగా ! ఈ సాధనత్రయానుష్ఠానంబున కశక్తులగువారు ముక్తికొఱ కేమిచేయవలయునో ప్రబోధింపుమని ప్రార్థించిరి.

## ——♦ లింగపూజాసాధనకథనము. ♦——

తపోధనులారా ! శ్రవణాదిసాధనానుష్ఠానంబున కశక్తులగువారు శివలింగమునుగాని శివప్రతిమనుగాని, ప్రతిష్ఠించి ప్రతిదినము

నర్చించుచుండినచో సంసారసాగరమునుండి యుత్తీర్ణులు కాఁగలరు. సాధకుండు శక్తివంచనము లేక యథావిధిగఁ బూజోపకరణంబుల సమకూర్చుకొని యారాధించుచు నిత్యమును నియతుండై యుండవలయును. శివమూర్తికి భక్తిపూర్వకంబుగ రాజోపభోగయోగ్యంబగు మండపంబును గోపురంబును, దీర్ఘంబును, మఠంబును, క్షేత్రంబును, నుత్సవంబును, వస్త్రంబును, గంధంబును. మాల్యంబును, ధూపంబును. దీపంబును, వివిధవ్యంజనసహితంబగు నన్నంబును, భక్ష్యాదికంబును, ఛత్రధ్వజవ్యజనచామరంబులను సమర్పించి నిరంతరమును నావాహనపూర్వకంబుగ శంకరుని బూజించుచు యథాశక్తిని బ్రదక్షిణనమస్కారంబులఁ జేసి జపసమాపనంబున విసర్జనంబు గావించుచుండవలయును. ఇట్లు నియతుండై యాచరించువాఁడు శివప్రసాదంబున శ్రవణాదిసాధనవ్యతీతుండయ్యును సాధకసిద్ధిలాభంబునకు సమర్థుండగును. ఇట్లు లింగప్రతిమార్చనంబులవలననే యనేకపురాతన మహాజనులు ముక్తిపదంబు నందఁగలిగిరి. అద్వితీయుండగు శంకరుండు నిరాకారబ్రహ్మస్వరూపుండగుటచే నిర్గుణుండును, సాకారుం డగుటచే సగుణుండునై ప్రకీర్తితుండగుచున్నాఁడు. మహాదేవుం డొక్కఁడే యయ్యు నిట్లు సగుణనిర్గుణరూపంబులఁ బ్రసిద్ధుండై యున్నాఁడు. కావున శంకరుండు నిర్గుణుండగుటచే నిర్గుణలింగరూపంబునను, సగుణుండగుటచే సావయవప్రతిమామూర్తిని బూజించుట యసంగతము కాదు. సగుణనిర్గుణరూపుండగు శంకరుండు పరబ్రహ్మస్వరూపుండు. కావున నాతఁడు సమస్తజనులచేతను లింగరూపమునను బ్రతిమారూపంబుననుగూడఁ బూజింపబడుచుండును. ఇతరదేవతలకు బ్రహ్మత్వము లేకయుండుటచే వారికి నిర్గుణారాధనము చెప్పంబడలేదు. దేవతలయం దెవ్వరికిని బ్రహ్మత్వము లేదు. వారందఱును జీవులు. కావున సగుణులును సాకారులు నగువారు ప్రతిమారూపంబుననే పూజనీయు

లగుచున్నారు. కేవలము భగవంతుం డగు శంకరుం డొక్కఁడు మాత్రమే పరబ్రహ్మంబనియును తదితరులందఱును జీవులనియు నుపనిషత్తుల యందుఁ బ్రణవార్థకథనసమయంబునఁ బ్రకాశితం బయ్యెను. పూర్వకాలంబున బ్రహ్మపుత్రుండగు సనత్కుమారమునివరుండు మందరపర్వతంబునఁ దపంబు చేయుచు నొకప్పుడు సన్నిహితుండగు నందికేశ్వరునింగాంచి యిట్లు ప్రశ్నించెను. మహాత్మా! ఇతరదేవతాభక్తులందఱును దమతమ యభీష్టదైవతంబులను బ్రతిమారూపంబున నారాధించుచుందురు. ఒక్కశివపూజయందు మాత్రము ప్రతిమయును లింగంబును నుపయుజ్యమానంబు లగుచున్నవి. దీనికిం గారణం బేమియో యానతీయవలయును. అనుటయు నందికేశ్వరుం డిట్లనియెను. మునివరా! పరబ్రహ్మవిషయికం బగునీనిగూఢప్రశ్నంబునకు బ్రత్యుత్తరం బొసంగుట మిగులఁ గష్టంబయినను నీహృదయము భక్తిరసపరిప్లుతంబగుటం జేసి సదాశివునిచే నేను వినినది వినినయట్లు చెప్పెద నాకర్ణింపుము. భగవంతుండగు చంద్రమౌళి నిర్గుణస్వరూపుండగుటచే నిర్గుణలింగంబునం దాతని బూజించుట సకలవేదసమ్మతము. మఱియు నాతఁడు సగుణుండగుటచేఁ బ్రతిమాపూజనంబును లోకసమ్మతంబైనది. శివవ్యతీతులగు సకల దేవతలును సగుణులును జీవులు నగుటచేఁ బ్రతిమారూపపూజనముమాత్రమే వారికి వేదములచే నిర్ణీతంబయ్యెను. ఆవిర్భావసమయంబున సకల దేవతలును సగుణస్వరూపులై యవతరించినట్లును శంకరుండు మాత్రము, సగుణస్వరూపుండుగను, నిర్గుణలింగస్వరూపుండుగను, ద్వివిధంబుగ నావిర్భూతుండైనట్లును సకలశైవశాస్త్రంబుల యందును కానంబడుచున్నది. కాని లింగపూజనము యుక్తిసంగతమైనది. అని నందికేశ్వరుండు ప్రబోధించుటయు సనత్కుమారుండు మహాదేవుని లింగావిర్భూతింగూర్చి యానతీయవలయునని ప్రార్థించుటయు నందికేశ్వరుం డిట్లనియెను.

## —: బ్రహ్మావిష్ణువుల పరస్పరయుద్ధము. :—

తపోధనశ్రేష్ఠా ! పూర్వకాలమునం దొకప్పుడు భగవానుండగు విష్ణుండు గరుడాద్యనుచరులతోఁ గూడి పరమైశ్వర్యసమన్వితుండై యనంతశయనంబున శయనించియుండ నాసమయంబున బ్రహ్మావిదులలో నగ్రగణ్యుండగు బ్రహ్మ యదృచ్ఛావశంబున నచ్చటికి వచ్చి యనంతశాయియుఁ బరమసుందరుండునగు పుండరీకాక్షుం గాంచి నాయాగమనంబు నెఱింగియు నింతటి గర్వంబునఁ బ్రత్యుత్థానంబు సేయక శయనించియున్న నీవెవ్వఁడవు ? వత్సా ! నీప్రభుండనగు నేనిచ్చటకు వచ్చితిని. లేచి నన్ను సందర్శింపవేమి ? పూజనీయుండగు గురుండు విచ్చేసినప్పు డవలోకించియు నుద్ధతాచరణుండగు గురుద్రోహికిఁ బ్రాయశ్చిత్తము కావలసియున్నది. అని విరించి ధిక్కరించుటయు విష్ణుండు మనంబునఁ గ్రుద్ధుండయ్యును గోపంబు నడంచుకొని శాంతంబును బ్రకటించుచు వత్సా ! నీకు శుభ మగుఁగాక ! నీకు స్వాగతము. ఇటువచ్చి యీసింహాసనము నధిరోహింపుము. నీవింతవ్యగ్రుఁడవై యుంటివేమి ? నీకన్నులయం దిట్టివిపరీతభావము గలుగుటకుఁ గారణమేమనుటయుఁ గమలాసనుండు వత్సా ! విష్ణూ ! నేను కాలవశంబున నీయొద్దకు వచ్చితిని. నేను జగత్పితామహుండను. నీకుఁ బ్రభుండనని యెను. అంత నారాయణుండు నవ్వుచు నిట్లనియెను. వత్సా ! పరిదృశ్యమానంబగు జగంబంతయును నాయందే యిమిడి యున్నది. నీవు తస్కరునిం బోలి పరసంపదను నీయదిగా భావించుచున్నావు. నీవు నా నాభీకమలమునుండి యుదయించితివి కావున నాపుత్రుండవు. ఇది కారణంబుగా నీవు చెప్పిన దంతయు నసత్యంబై నది. అని నారాయణుండు పలుకుటయు నప్పు డాద్యంతశూన్యులగు నయ్యిరువురకును మోహావశంబున సర్వశ్రేష్ఠత్వముంగూర్చి పరస్పరవాగ్వాదము జరిగెను. అప్పు డయ్యిరువురును నన్యోన్యవిధనా

కాంక్షులై స్వస్వవాహనంబుల నధిరోహించి మహారణంబు గావించు టకుఁ దలపడిరి. ఆసమయంబున బ్రాహ్మణగణంబునకును, వైష్ణవ గణంబునకును బరస్పరసంగ్రామం బగుటయు సకలదేవతలును విమా నారూఢులై యంబరతలంబున నిలిచి సంగ్రామదర్శనంబు చేసి పుష్ప వర్షంబు గురియింపం దొడంగిరి. అప్పుడు గరుడవాహనుండగు విష్ణుం డు క్రోధాన్వితుండై బ్రహ్మవక్షస్థలంబున వివిధంబులును, నసంఖ్యా కంబులును, దుస్సహంబులునగు నస్త్రంబులఁ బ్రహరించుటయు, విరిం చియును కోపకషాయితాక్షుండై యనలసన్నిభకఠోరశరసమూహం బులను ననేకాస్త్రంబులను విష్ణుదేవునిపైఁ బ్రయోగించి నొప్పించెను. అయ్యాశ్చర్యరణకౌశలంబుం గాంచి దేవతలు నిరతిశయాకులహృద యులై యయ్యిరువురను బ్రశంసింపందొడంగిరి. అనంతరము సమ రాసక్తుండును, మహాజ్ఞానియునగు నారాయణుండు క్రోధోజ్జ్వలుండై దీర్ఘనిశ్వాసపూర్వకంబుగఁ బంకజాసను నుపలక్షించి భయంకర మాహే శ్వరాస్త్రంబును ధనుస్సున సంధించి విడుచుటయుఁ బితామహుండును నిరతిశయరోషపరవశుండై విశ్వమండలమును బ్రకంపింపఁ జేయుచు జనార్దనుని వక్షంబును లక్ష్యముచేసి ఘోరతరంబగు పాశుపతాస్త్ర మును బ్రయోగించెను. అప్పు డయుతసూర్యసన్నిభంబులును, సహ స్రముఖాత్యుగ్రంబులునగు నద్దివ్యాస్త్రంబులు గగనతలంబున కెగసి ప్రచండవాయువుల నిర్గమింపంజేయుచు నతిభయంకరరూపంబులచేఁ బ్రతీయమానంబు లయ్యెను. అప్పుడు బ్రహ్మవిష్ణువుల పరస్పర మహోగ్రరణసంరంభముం గాంచి దేవతలందఱును, రాజక్షోభసమ యంబున ద్విజగణంబులంబోలి నితాంతవిషణ్ణసమాకులహృదయులై యెవ్వనిచే సృష్టిస్థితిప్రళయతిరోభావానుగ్రహంబులు ప్రవర్తితంబులగు చున్నవో, యెవ్వనియాదేశంబు లేక యీజగంబునం దెవ్వరు నొక్క తృ ణంబునైనను యదృచ్ఛావశంబున నొకప్పుడును వినాశనంబు సేయఁ

జాలరో యట్టి త్రిశూలధారియుఁ బరబ్రహ్మస్వరూపుండు నగు మహే శ్వరునకు నమస్కరించుచు నా సదాశివుని ధ్యానించుచు శశాంకమౌళి యగుశివుండు ప్రతిష్ఠితుండై యున్న కైలాసశిఖరంబున కేగి ప్రణవా కారంబగు శంకరస్థానంబును సందర్శించి ప్రహృష్టాంతఃకరణంబునఁ బ్రణామంబు లాచరించి శివభవనంబునఁ బ్రవేశించి నిండుకొలువున దేవియగు పార్వతితోఁగలసి రత్నసింహాసనాసీనుండై యున్న మహా దేవునిం గాంచిరి. అప్పు డమ్మహాదేవుండు వామచరణోపరిభాగంబున దక్షిణపాదంబును దదుపరిభాగంబున వామకరకమలంబును జేర్చి యా సీనుండై యుండెను. సర్వలక్షణ సంపన్నుండగు నప్పరమేశ్వరుని నలువంకలను శైవగణంబులు నిలువంబడి యుండెను. శివభక్తి పరాయణలగు రమణీమణులా దేవునకు నిరంతరమును జామరంబుల వీచుచుండిరి. అట్టి వేదసన్నుతుండును, సర్వానుగ్రహకారియు నగు బరమేశ్వరుంగాంచుటచే నమరగణంబుల నయనంబులనుండి సంతతా నందాశ్రుధారలు వెల్లివిరియందొడంగెను. అప్పుడా దేవతలందఱును దూరమునందుండియే దండప్రణామంబు లాచరించుటయు శంకరుండు వారింగాంచి సమీపంబునకుఁ బిలిపించి వారినానందింపఁజేయుచు దేవ శిఖామణియగు శివుం డర్థగంభీరంబులును, శుభమధురంబులు నగు వచనంబులతో నిట్లనియెను. సురశ్రేష్ఠులారా ! మీకు సేమంబే కద సకలజగన్నివాసులును, దేవతలును మదీయ శాసనానుసారంబుగ స్వధర్మనిర్వహణంబు గావించుచుండిరిగద! నాకిదివఱకే బ్రహ్మవిష్ణువుల పరస్పర యుద్ధవిషయముముంగూర్చి తెలియవచ్చినది. మీ యాగమనంబుచే నది పునరుక్తంబై నది. అని పలుకుచు శివుండు మందహాసవదనముతో దేవతలకు సంతోషంబుగూర్చి ప్రమథగణంబులలో బ్రధానులగువారికి సమరాంగణమునకుం బయనంబుగండని యాజ్ఞాపించెను. అనంతరము వివిధవాద్యంబులతో ననుచరులందఱు రణోచిత వేషాలంకృతులై

స్వస్వవాహనారూఢులై పయనంబునకు నిరీక్షించి యుండిరి. అప్పుడు పార్వతీనాథుండగు పరమేశ్వరుండు పంచమండలాలంకృతంబును, బ్రణవాకారంబును భద్రంబు నగురథంబు నారోహించుటయు నింద్రాదిదేవతలంగలును, సపుత్రకుండును, సానుచరుండునగు శంకరు సనుగమించిరి. అప్పుడు చతుర్దిశలను విజయధ్వజంబులును, చామరాది వీజనంబులును, నృత్యగీత వాద్యంబులును, బుష్పవర్షంబును విలసిల్లుచుండెను. భగవానుండగు పశుపతి యీవిధముగా సజ్జితుండై భగవతి యగు పార్వతితోడను, సైన్యగణంబులోడను వాద్యాదికోలాహలధ్వనుల నుజ్జగించి యతినిరూఢంబుగ గగనమార్గంబున సమరాంగణంబునం దవస్థితుండై యుండెను.

## — ♦ తేజోమయలింగ ప్రాదుర్భావము. ♦—

అప్పుడు మహేశ్వరాస్త్రంబును బాశుపతాస్త్రంబును విజృంభించుటచే జగత్త్రయంబు దగ్ధంబగుచుండుటయుఁ ద్రిగుణాతీతుండును భగవానుండు నగు చంద్రశేఖరుండు నిదారుణంబగునయ్యకాలప్రళయంబుం గాంచి తత్క్షణంబ భీషణంబగు నగ్నిస్తంభాకృతిన నయ్యుభయయోధులమధ్యస్థలంబునం దావిర్భూతుండగునంతనే త్రిలోకసంహారసమర్థంబులును, జ్వాలాభీలంబులు నగు నయ్యస్త్రంబు లాయన లస్తంభంబున నిపతితంబులై ప్రశాంతంబులయ్యెను. అప్పు డచ్చటివారంగలు నస్త్రశాంతికరంబును, జగద్ధితంబునగు నయ్యద్భుతసంఘటనముంగాంచి యాశ్చర్యాన్వితచిత్తులైపోయిరి. అంత వీరాభిమానులగు బ్రహ్మవిష్ణువులుగూడ నివ్వెఱపడి "అతీంద్రియంబగు నియ్యగ్నిస్తంభం బిచ్చట నెట్లుద్భవించినది! ఎట్లయినను మనము దీనియాద్యంతములఁ గనుఁగొనవలయును" అని యొండొరులు నిశ్చయించుకొని సత్వరంబుగఁ దెలిసికొనవలయు నని యుద్యుక్తులైరి. అప్పుడు విష్ణుం డిట్లనియెను. మనమిరువురును గలసి యొకదిక్కున కేపోయి

పరీక్షించుట యుచితముగాదు. అని చెప్పి యాతండు వరాహరూపముం దాల్చి యా స్తంభమూలప్రదేశంబునకు గమనంబు సేయుటయు బ్రహ్మదేవుండు హంసాకృతిం దాల్చి దానియంతముంగనుంగొనుటకై ప్రవృత్తుం డయ్యెను. వరాహరూపియగు విష్ణుండు పాతాళతలమును భేదించుకొని బహుదూరంబు పోయియు నా స్తంభమూలమును గనుగొనఁజాలక నిరతిశయపరిశ్రాంతుండై మరలనా రణరంగమునకుఁ జనుదెంచెను. విధాతయును గగనమార్గంబునఁ బోయి యనుపమమధురసుగంధమయంబును, గించిద్వికసితంబును నచ్యుతంబును నగు నొకకేతకీకుసుమంబును సందర్శించెను. ఆకుసుమంబు చిరకాల పతితంబైనట్లుగ నాతనికి బోధయయ్యెను. అహంకార పూరితంబగు నా బ్రహ్మవిష్ణువుల ప్రయత్నముం గాంచి భగవానుండగు చంద్రమౌళి మందహాసంబున శిరఃకంపంబు గావించుటయు శివుని యుత్తమాంగమునుండి యయ్యుత్తమ కుసుమంబు బ్రహ్మవిష్ణువుల ననుగ్రహింపవచ్చుచున్నదో యనునట్లుగఁ గ్రిందికి వచ్చుచుండెను. బ్రహ్మదేవుం డప్పుడో పుష్పరాజమా! నీ వెటనుండి పడుచుంటివి? నిన్ను ధరించినవా రెవ్వరని యడుగుటయుఁ గేతకి యిట్లనియెను. విధాతా! నేనీ స్తంభమధ్యస్థలమునందుండి చిరకాలమునుండి పడుచున్నాను. కాని యిప్పటికిని దీనిమూలమును గాంచలేకున్నదానను. కావున నీవీయప్రమేయాద్భుత స్తంభాగ్రమును దర్శించునాశను బరిత్యజింపుము. అనుటయు బ్రహ్మయిట్లనియెను. పుష్పరాజమా! నేనీ స్తంభాగ్రసందర్శనార్థినై హంసరూపంబును దాల్చి యిప్పటి కిచ్చటికి వచ్చితిని. నీవిప్పుడు నాకొక మహోపకారముం గావింపవలయును. నేనీస్థంభాగ్రమును దర్శించితినని సాక్షివై నీవు విష్ణుదేవున కెఱింగింపవలయును. అని ప్రార్థించి విరించి యక్కేతకీ సుమంబున కనేక వందనంబు లాచరించెను. ఆపత్కాలమునం దసత్యము నాశ్రయింపవలసివచ్చునపు

గదా! అనంతరము కమలజుండు సమరాంగణంబునకు మరలి విచ్చేసి యచ్చట నిరానందుండును బరిశ్రాంతుండునగు విష్ణునవలోకించి యానందనృత్యంబు చేయుచు మూర్ఖునివలె నల్పుండనైన నేనీ స్తంభాగ్రమును దర్శించి వచ్చితిని. అందులకీ కేతకీకుసుమంబు సాక్షిగా నున్నదని యసత్యంబాడుటయుఁ గేతకికూడ విష్ణుసన్నిధిని బ్రహ్మచెప్పినది యథార్థంబని యసత్యంబాడెను. అప్పుడు విష్ణుదేవుం డది సత్యంబే యని భావించి తాను విధాతకు నమస్కరించి షోడశోపచారంబులఁ బూజించెను. ఆసమయంబున భగవానుండగు బాలచంద్రావతంసుండు కపటాచారియగు చతుర్ముఖుని శాసించుటకై యాయుష్ణలింగము నుండి దివ్యమూర్తిం దాల్చి యావిర్భూతుండగుటయుఁ బద్మజుం డద్దేవునకుం బ్రణామంబు గావించి యాతని చరణకమలంబులఁ బట్టుకొని యెను. అప్పుడు భయంబుచేఁ గమలజుని కరకమలంబులు కంపింప దొడంగెను. అంత నవ్విరించి యప్పంచాననుం గాంచి భయసంభ్రమంబునఁ బ్రభూ! నేనజ్ఞానవశంబున నాద్యంతశూన్యుండవగు నిన్ను నూర్చి యహంకృతుండనై కుతర్కంబులఁ గావించితిని. కావుననో కృపాళూ! నాయెడలఁ బ్రసన్నుండవగుము. నీసందర్శనంబున నా సర్వపాపంబులును వినష్టంబులైనవి. నాయపరాధంబులను క్షమింపుము. సర్వంబును నీలీలామాత్రంబు. అని ప్రార్థించి యూరకుండుటయు మహాదేవుండు విష్ణుదేవుం గాంచి వత్సా! హరీ! నీవు ప్రాభవంబుం గోరియు సత్యవాక్యనిరతుండవై యుంటివి గావున నేను నీయెడలఁ బ్రీతుండనైతిని. కావున నింతటినుండి పవిత్రక్షేత్రంబులయందు వేఱు వేఱుగ నీమూర్తులను బ్రతిష్ఠించి జనులందఱును బూజించుచు నీకు మహోత్సవంబులఁ గావించుచుండెదరుగాక! అని యానతిచ్చి మహాదేవుండు సత్యంబు కారణంబుగా సకలదేవతలసమక్షంబునను జనార్ధనుని సన్మానించి యమ్మహాత్మునకు దనతో సమానత్వమును బ్రసాదించెను.

## —♦ భైరవుండు బ్రహ్మశిరంబును ఖండించుట. ♦—

అనంతరము మహాదేవుండు బ్రహ్మగర్వభంజనంబుకొఱకుఁ దనభ్రూమధ్యంబునుండి భైరవుని సృజియించుటయు నాతండు ప్రభుండగు శంకరునకు నమస్కారంబు గావించి జగత్ప్రభూ నేనేమిచేయవలయునో యాజ్ఞాపింపు మనియెను. అప్పుడు శంకరుండు వత్సా! ఈ జగదాది దేవుండగు విధాతం జూచితివిగదా! నీవిప్పుడతిశీఘ్రంబుగ నితని నీఖడ్గంబుచేఁ బూజింపు మని యానతిచ్చెను. అనంతరము భైరవుండేకకరంబున బ్రహ్మదేవుని కేశాకర్షణంబు గావించి యన్యహస్తంబున నాతని యసత్యభాషణంబగు పంచమమస్తకమును విచ్ఛిన్నంబుచేసి యితరమస్తకచతుష్టయముంగూడ ఖండించుటకుద్యుక్తుండై యుగ్రకరవాలమును ఝుళిపించుచుండుటయు నప్పుడు బ్రహ్మదేవుని వస్త్రమాల్యాలంకారంబులును, గేశకలాపంబును నట్టిట్టైపోయెను. కమలజుండు ప్రచండవాతాహతంబగు కదలీతరువుంబోలి కంపించుచు భైరవుని పాదపద్మంబులపై బడియెను. ఆసమయంబునఁ గృపాపరాయణుండును భగవానుండు నగు కేశవుండు విరించి సంరక్షణంబుకొఱకుఁ గృతాంజలిపుటుండై బాష్పజలంబులచేఁ బరమేశ్వరుని పాదపంకజంబుల నభిషేకించుచుఁ దంద్రిని తనయుండు ప్రార్థించినట్లుగా నస్ఫుటమధురస్వరంబున దేవదేవా! పూర్వంబున నీవే యీతని కీశ్వరచిహ్నంబగు పంచాననప్రదానంబు గావించితివి. కావున నీవిప్పుడీవిధాతయెడలఁ బ్రసన్నుండవై యీతని యపరాధములను క్షమింపుమని వేడుకొనుటయు శివుండు సంతుష్టుండై బ్రహ్మదండముచే భైరవుని వారించి భ్రష్టకంధరుండును, గపటచారియు నగుబ్రహ్మం గాంచి నీవు జగత్పూజ్యత్వముం గోరి శఠుండవై సర్వేశ్వరత్వమును బ్రకటించితివిగావున నింతటినుండి భువనమధ్యంబున నీకుఁ బూజామహోత్సవంబులు లేకుండుఁగాక! యని కఠోరంబుగ శాసించెను. అంత

బ్రహ్మదేవుండు వినమితుండై యిట్లనియెను. ప్రభూ! ప్రసన్నుండవగుము. వరప్రదా! నీవు నామస్తకచ్ఛేదనంబు గావించుట వరంబొసంగినట్లుగ భావించుచున్నాను. మహాత్మా! నీవు జగద్బంధుండవు. అందఱియపరాధములను క్షమించుట నీస్వభావము. నీకు వందనములు. అని ప్రార్థించుటయు శంకరుండు సంతుష్టుండై వత్సా! జగంబున రాజదండభయంబు లేకున్నచో సర్వంబును విధ్వస్తంబగును కావున నీవు జగద్భారంబు వహించి దండార్హులను శాసించుటకుఁ బ్రవృత్తుండవగుము నీవింకటినుండి యగ్నిహోత్రాది కార్యంబులకును, స్మృత్యుక్తకార్యంబులకును, యజ్ఞంబులకును గురుండవయ్యెదవుగాక! భవద్వ్యతీతంబులగు యజ్ఞంబులు సర్వాంగపూర్ణంబులును, సదక్షిణాకంబులునయ్యును నిష్ఫలంబు లగుంగాక యని బ్రహ్మకు వరప్రదానంబు గావించి పిమ్మట మిథ్యాసాక్ష్యంబొసంగిన ప్రపంచకంబగు కేతకంబును నిందించుచు నింతటినుండి నీపుష్పంబులు మాకుఁ బ్రీతిపాత్రంబులు గాకుండుంగాక! యని శపియించెను. అప్పుడు సకల దేవతలును గేతకియును శివసన్నిధినుండి యవ్వలికిఁ జరియువైచుటయుఁ గేతకంబు భయగద్గదస్వరంబున మహాత్మా! దేవాదిదేవా! నీకు నమస్కారము. నీతిరస్కారముచే నిప్పుడు నాజీవితము నిష్ఫలంబై పోయినది. తండ్రీ! నాయపరాధమును క్షమించి నాజన్మమును సార్థకపఱుపుము. నీస్మరణమాత్రంబున జ్ఞానాజ్ఞానకృతంబులగు సకల పాపంబులును వినష్టంబులై పోవును. స్వామీ! ఇప్పుడు నాకన్నులకు నీదివ్యసాక్షాత్కారము లభియించియుండఁగా నింక నా సామాన్యమిథ్యావాదదోష మేల నశియించిపోకుండును? అని యనేకవిధంబుల స్తుతియించుటయు శంకరుం డిట్లనియెను. కేతకా! నేను జగదీశ్వరుండను, నావాక్యము లెప్పుడు నసత్యంబులు కాఁజాలవు. కావున నిన్ను [illegible] నిష్ప్ర

శ్రుతిదేవతలు నిన్నుద్ధరింతురుగాక. అందువలన నిజన్మము సార్థకంబు కాఁగలదు. మఱియు వితానచ్ఛలంబున నీవు నాయుపరిభాగంబున నుండుట కంగీకరించితివని పలుకుచు భగవానుండగు చంద్రశేఖరుండు, బ్రహ్మను, విష్ణుదేవుని, గతకిని నీవిధంబుగా ననుగ్రహించి సకలదేవతలచేతను బ్రస్తుతుండై సభామధ్యంబున విరాజమానుండై యుండెను.

—: బ్రహ్మవిష్ణువులు శివునిఁ బూజించుట. :—

ఆసమయంబున బ్రహ్మయును. విష్ణుండును స్వామియగు శంకరునకు, నమస్కరించి కృతాంజలిపుటులై యాదేవున కిరువంకలను నిలిచియుండి పిమ్మట నమ్మహాదేవుని సపరివారంబుగ నుత్తమసింహాసనాసీనుం గావించి పురుషసూక్తప్రకారంబున బూజించి హారంబును, నూపురంబును, కేయూరంబును, కిరీటంబును, మణికుండలంబులును, యజ్ఞోపవీతంబును, నుత్తరీయంబును, కౌశేయవస్త్రంబును, మాల్యంబులును, నంగుళీయకంబులును, పుష్ప చందన తాంబూల కర్పూరాగురుధూపదీపంబులును, శ్వేతచ్ఛత్రవ్యజనధ్వజచామరంబులును, నాదిగాఁగల వర్ణనాతీతంబులును, సామాన్యజనదుర్లభంబులును, బహువిధోగ్యంబులునగు దివ్యోపహారంబులచేఁ బ్రభుండగు శంకరు నర్చించిరి. ఉత్కృష్టతమంబులగు వస్తువు లన్నియును శివపూజార్హంబు లని యెఱుంగునది. అనంతరము పరమేశ్వరుండు బ్రహ్మవిష్ణుప్రదత్తంబులగు నాదివ్యవస్తువులను సనాతనాచారానుసారంబుగ సభ్యుల కందఱకును యథాక్రమంబున సంతోషముతోఁ బ్రసాదించెను. అప్పుడాసభయంతయును సముత్సాహ కోలాహలంబున నుప్పొంగెను. బ్రహ్మవిష్ణువు లిట్టికరూపంబున భక్తిశ్రద్ధలతోఁ బూజించుటయు శివుండు ప్రసన్నుండై యిట్లనియెను. వత్సలారా! నేఁడు మీపూజనంబునఁ బరమప్రీతుండనైతిని. కావున నీపవిత్రదినంబు చిరకాలంబువఱకును శ్రేష్ఠతమదినంబుగా నాచే గణింపఁబడుఁగాక ! మఱి యీదినంబున నీ

శుభతిథి శివరాత్రినామంబున జగంబునఁ బ్రఖ్యాతం బగుఁగాక! ఎవ్వఁడీ దివ్యదివసంబున లింగరూపంబునఁగాని, ప్రతిమారూపంబున గాని నన్నుఁ బూజించునో యట్టివాఁడు నిశ్చయముగ సృష్టిస్థిత్యాది కార్యసమర్థుం డగును. ఎట్టిలోపంబును లేక యీశివరాత్రిదినంబున జితేంద్రియుండై యహోరాత్రంబు లుపవసించి యథాశక్తిని యథా విధిగ నన్నుఁ బూజించువాని కొకవత్సరంబు నిరంతరమును నన్ను భక్తితోఁ బూజించినఫలంబు నిశ్చయంబుగా లభియింపఁగలదు. సాగ రంబునకుఁ జంద్రోదయమునుంబోలి శివధర్మంబునకు శివరాత్రిదినంబు పుష్టిజనకంబని యెఱుంగునది. మార్గశీర్షమాసంబున నార్ద్రానక్షత్రం బున నేను తేజోమయస్తంభరూపంబున నావిర్భవించితింగావున నెవ్వఁ డాదినంబున నుమాసహితుండనగు నన్నుఁ బ్రతిష్ఠించి పూజించునో యాతనికి సర్వశుభంబులును జేకూరఁగలవు. ఆశుభదినంబునఁ బార్వతీసహితుండనగు నన్ను భక్తితో దర్శించువాఁడు నాకుఁ గార్తి కేయునికంటెను బ్రియుం డగును. ఆదినంబున నాదర్శనమే యెట్టి ఫలంబు నొసంగుచుండ నప్పుడు నన్నుఁ బూజించినచో నికఁ దక్కువ యేమున్నది? నేను లింగరూపంబున నావిర్భవించిన యీరణరంగంబు లింగస్థానంబునాఁ బ్రసిద్ధం బగుఁగాక! కుమారులారా! ఆద్యంత రహితంబగు నీయనలస్తంభ మింతటినుండి యల్పమూర్తిం దాల్చి లోకజనసంసేవార్థం బిచ్చట నవస్థితంబై యుండును. భోగజనకం బగు నీలింగము భుక్తిముక్తిసాధనం బగుఁగాక. దీని దర్శనస్పర్శన ధ్యానంబులు జీవులకు సులభముక్తిప్రదంబు లగుఁగాక! మఱియు నచలాచలసన్నిభంబై సముద్ధితంబగు నీలింగ మింతటినుండి యరుణా చలనామంబున సుప్రసిద్ధంబగును. సర్వతీర్థంబు లిందు నివసించి యుండుటచే నిట మరణించు జీవులకు మోక్షంబు సిద్ధింపంగలదు. ఈ స్థానంబున నిరంతర [illegible]

బగుఁగాక ! ఇందలి దానహోమజపంబులు కోటిగుణితంబు లగును. ఇది మదీయంబులగు సర్వక్షేత్రంబులయందు నుత్కృష్టతమంబగును. ఇచ్చట మదీయ స్మరణమాత్రముననే ముక్తిలాభంబు గలుగును. కావున సర్వకల్యాణకరంబును, సర్వముక్తి ప్రదంబును, బరమ శుభ సంకలితంబు నగు నీ దివ్యక్షేత్రమే సర్వోత్తమం బైనది. ఇందు లింగస్వరూపుండ నగు నన్నుఁ బూజించు వారికి సాలోక్య సామీప్య సారూప్య సార్ష్టిత్వ సాయుజ్యంబులను పంచవిధ ముక్తి లాభంబులు సిద్ధింపఁగలవు. కావున వత్సలారా ! అతిశీఘ్రంబుగ మీ మనోరథములు సిద్ధించును. అని యనుగ్రహించి దేవదేవుండు నిజప్రభావంబున నట నమృతవర్షంబు గురియించి రణనిహతులగు బ్రాహ్మణవైష్ణవ గణంబులఁ బునరుజ్జీవితులం గావించి వారి యజ్ఞానంబును, బరస్పరవైరంబును దొలంగింపఁ జేయు సంకల్పంబున విష్ణువుల నుద్దేశించి పల్కెను. వత్సలారా ! సగుణనిర్గుణరూపంబులు కేవలము నాకొక్కనికే కలవు. ఇంక నెవ్వరికిని లేవు ఇది కారణంబుగా నితరుఁ డెవ్వఁడు నీశ్వరుండు కాఁజాలఁడు. నేను మొదట నిర్గుణ స్తంభస్వరూపంబుగను, పిమ్మట సగుణమూర్తిగను నావిర్భూతుండ నైతిని. కావున నిర్గుణబ్రహ్మత్వమును, సగుణేశ్వరత్వంబును నాకుఁ దక్క నితరుల కెవ్వరికిని లేవు. కావున మీ యుభయులకుఁగాని మఱి యితరులకుఁగాని యీశ్వరత్వంబు లేదు. అజ్ఞానవశంబుననే మీకిట్టి యీశ్వరాభిమానం బుదయించినది. దానిని వారించుటకే నేనీ సమ రాంగణంబునం దావిర్భవించితిని. ఇఁక మీరిప్పటినుండి యహంకార విరహితులై మీచిత్తంబుల నాయందు విలీనంబు చేయుఁడు. నాయ నుగ్రహంబుననే త్రిజగంబులను సకలకార్యంబులును సిద్ధించుచుండు నని యానతిచ్చెను. [illegible] నేనిప్పుడు

మీప్రియంబుకొఱకు నిగూఢంబగు బ్రహ్మతత్త్వముం గూర్చి యుపదే
శించెద నాకర్ణింపుఁడు.

## శివతత్త్వోపదేశము

సగుణనిర్గుణస్వరూపంబులు నిరాకారపరబ్రహ్మమును నేనే. ప్రత్యక్షంబగు సర్వంబును నాస్వరూపంబు. నేను పరబ్రహ్మంబునగుటం జేసి యీశ్వరుండను. అనుగ్రహాదికంబులు నాకార్యంబులు. వత్సలారా! బృహత్త్వంబునను, బృంహణత్వంబునను నేనే పరబ్రహ్మమును. సమత్వంబునను, వ్యాపకత్వంబునను నేనే పరమాత్మను. ఇతరులగు జీవులందఱును నిశ్చయముగ ననాత్మస్వరూపులు. నేనీశ్వరుండ నగుటం జేసి యనుగ్రహాదిసర్గాంతపంచజగత్కృత్యంబులను నియమానుసారంబుగఁ గావించుచుందును. అట్లు చేయుటకు నాకంటె నితరు లెవ్వరును సమర్థులు కాఁజాలరు. కావున నన్ను సగుణుండగు నీశ్వరునిగా నెఱుంగుఁడు. ఈయనల స్తంభంబు నిర్గుణంబై మదీయబ్రహ్మత్వంబు నకు సూచకంబగుచున్నది. ఈ స్తంభంబునం గానవచ్చుచున్న నాలింగ చిహ్నమును మీరు నిత్యంబును బూజించుచుండుఁడు. అదియు నా స్వరూపంబును మత్సాన్నిధ్యముక్తికారకంబునైనది. ఈలింగము నిత్య పూజనీయంబు. లింగలింగులకు భేదంబు లేదు. ఎచ్చట మత్స్వరూపం బగు లింగంబుండునో యచ్చట నేనప్రతిష్ఠితుండనయ్యుఁ బ్రతిష్ఠితుండ నగుదును. ఎవ్వండు శివలింగప్రతిష్ఠాపనంబు గావించునో యాతండు మత్సమానుండును, లింగద్వయసంస్థాపకుండగు వాఁడు మత్స్వరూప విలీనుండును, సమభాగియు నగును. పర్యవసానంబునఁ జెప్పిన దేమన:— నా ప్రతిమామూర్తిని బ్రతిష్ఠించుటకంటె లింగప్రతిష్ఠాప నంబే సర్వప్రధానంబు. శివప్రతిమామూర్తియున్నను శివలింగసంస్థాప నంబు లేకున్నచో నది శివక్షేత్రంబు కానేరదు.

## కృత్యపంచకలక్షణము.

అని యిట్లు పరమశివుండు ప్రబోధించుటయు విధిమాధవులు సృష్ట్యాదిపంచకృత్యలక్షణంబుల నెఱింగింపుమని ప్రార్థించిరి. అప్పుడు శివుండు కృపాళుండై యిట్లనియెను. వత్సలారా! మదీయంబులగు పంచకృత్యంబులు నతినిగూఢంబులైనను మీ కెఱింగించుచున్నాను. సృష్టియును, స్థితియు, సంహారంబును, తిరోభావంబును, అనుగ్రహంబు నను నీ పంచజగత్కృత్యంబులును నాకు నిత్యసిద్ధంబులు. ఇందు సంసారారంభము సృష్టి యనియు, సంసారవృద్ధి స్థితియనియు, సంసార క్షయంబు సంహారం బనియు, జీవులను సంసారమునుండి యుద్ధరించుట తిరోభావంబనియు సంసారమునుండి జీవులకు ముక్తి ప్రదానంబు గావించుటయే యనుగ్రహంబనియు నిట్లు పంచకృత్యంబులకును లక్షణంబుల నెఱుంగునది. గోపురప్రతిబింబన్యాయంబున నీ పంచకృత్యంబులును బృథివ్యాదులచేఁ జేయంబడుచున్నట్లు తోఁచుచుండునుగాని వాస్తవముగ సృష్ట్యాది సాంసారికకృత్యచతుష్కంబును, ముక్తిని దానంబగు ననుగ్రహకృత్యంబును కేవలము నాచేతనే నిర్వహింపఁ బడుచుండును. కాని జీవు లీపంచకృత్యంబులను భూమ్యాది పంచభూతములయందును దర్శించుచుందురు. భూమియందు సృష్టియును, జలంబున స్థితియు, నగ్నియందు సంహారంబును, వాయువునందుఁ దిరోభావంబును, నాకాశంబునం దనుగ్రహంబును బోధ యగుచుండును. కాని, నా దివ్యతేజము ధరామూలంబున సృష్టిని, జలమూలంబున వర్ధనంబును, ననలమూలంబున సంహారంబును, వాయుమూలంబునఁ దిరోభావంబును, నంబరమూలంబున ననుగ్రహంబును గావించుచుండు నని విజ్ఞానులు గ్రహింపఁగలరు. ఈ పంచకార్యభారమును వహించుటకే దిక్చతుష్టయంబునందును, మధ్యభాగంబునందును నా పంచవదనములును విరాజమానము లగుచుండును. వత్సలారా! మీరా

రిరువురును దపంబుచే నన్నుఁ బ్రీతుం గావించి సృష్టిస్థితినామకంబు లగు కృత్యంబులను రెండింటిని నాత్మవశంబు చేసికొనఁ గలిగితిరి. రుద్రుండును, మహేశ్వరుండును మిగిలిన సంహారతిరోభావంబు లగు కృత్యంబులను గైకొనియున్నారు. కాని యనుగ్రహకృత్యంబును మాత్రము గ్రహించుట కెవ్వరును సమర్థులు కాఁజాలరు. కాలవశంబున మీరీపూర్వవృత్తాంత మంతయును మఱచిపోయితిరి. రుద్రుండును, మహేశ్వరుండునుమాత్ర మిప్పటికిని మఱవలేదు. కావుననే వారికి నేను రూపవేషకృత్యవాహనాసనాయుధాది సర్వవిషయంబులయందును మత్సాదృశ్యంబును బ్రసాదించి యుంటిని.

—♦ ప్రణవస్వరూపకథనము. ♦—

కుమారులారా! కేవలమును మీరు నా ధ్యానము నెడలఁ బరాఙ్ముఖు లగుటచేతనే మీకీయజ్ఞానము కలిగినది. అట్లుగాక నన్ను యథార్థరూపంబున గ్రహియించియే యున్నచో మహేశ్వరునివలెనే మీకును నెన్నటికిని దురభిమానము కలుగకయే యుండును. మదీయంబగు యథార్థస్వరూపమును దెలిసికొనుటకై యిప్పటినుండియును మీరు దురభిమాన వినాశకంబును, మదీయంబు నగు నోంకారరూప పరమమంత్రమును జపంబు గావించుచుండుఁడు. నిరతిశయ మంగళ జనకంబగు నోంకారమంత్రమును నేను పూర్వమునందే మీకుపదేశించియుంటిని. నా తత్త్వప్రకాశకంబగు నయ్యోంకార మంత్రము పూర్వము నాముఖమునుండియే వెలువడినది. అది నాకు వాచకము. నేను దానికి వాచ్యుండను. వాచ్యవాచకంబు లభిన్నంబులగుటం జేసి కేవలమామంత్రంబు మత్స్వరూపంబ యగుచున్నది. కావున నిత్యము నమ్మంత్రమును జపించుటయే నన్ను స్మరించుట యగును. ప్రప్రథమంబున నాయుత్తరముఖమునుండి “అ”కారంబును, బశ్చిమముఖమునుండి “ఉ” కారంబును దక్షిణముఖమునుండి “మ” కారంబును, బూర్వ

ముఖంబునుండి బిందువును, మధ్యముఖంబునుండి నాదంబును సముత్పన్నంబు లయ్యెను. ఈవిధంబుగాఁ బంచాక్షరనివృతం బగు నోంకారము క్రమ్మఱ నేకీభూతంబై యేకాక్షరం బయ్యెను. నామరూపాత్మకంబగు సర్వంబును శివభక్తిబోధకంబగు నీమంత్రంబునఁ బ్రతీయమానంబై యుండును. ఈ యోంకారమంత్రమునందలి "అ" కారాది పంచవర్ణములనుండి యథాక్రమంబుగ "న" కారాది పంచాక్షరంబులును వానినుండి పంచవిధంబులగు మాతృకావర్ణంబులును సముత్పన్నంబు లయ్యెను. పిమ్మట నాపంచవదనంబులనుండియుఁ ద్రిపదసంకలితంబగు గాయత్రీమంత్రంబును దానినుండి సమస్తవేదంబులును, వానినుండి కోటికోటి మంత్రంబులును సముత్పన్నంబు లయ్యెను. ఇతరంబులగు సకలమంత్రంబులును గేవల నిర్దిష్టఫలసిద్ధిప్రదంబులేగాని యోంకారంబుమాత్రము సర్వసిద్ధిప్రదాయకంబు. కావున నోంకారంబు సర్వమంత్రమూలస్వరూపంబై విరాజిల్లుచున్నది. అది సకలభోగంబులను మోక్షంబునుగూడఁ బ్రసాదింపఁగలదు. ఇతరంబులగు శుభమంత్రంబు లన్నియును భోగమాత్రప్రదంబులు. అని యిట్లు భగవంతుండగు శంకరుండు ప్రబోధించి యుత్తరాభిముఖులై యున్న శిష్యులగు బ్రహ్మవిష్ణువులను వస్త్రావృతులం గావించి వారిమస్తకంబులఁ గరకమలంబునుంచి యంబికాసహితుండై క్రమ్మఱ నమ్మంత్రరాజంబును వారి కుపదేశించుటయు శిష్యులిరువురును యంత్రతంత్రసమన్వితంబగు మంత్రంబును గ్రహించి గురుదక్షిణగ నాత్మసమర్పణంబు గావించి బద్ధాంజలిపుటులై జగద్గురుండగు నమ్మహాదేవునుద్దేశించి యిట్లనిరి. గురూత్తమా ! నీవు సగుణనిర్గుణ స్వరూపుండవు. సకలంబులగు సగుణపదార్థములకును ప్రభుండవు. నిర్గుణతేజోమయుండవు. సర్వస్వరూపుండవగు నీకు మేము మాటిమాటికిని నమస్కరించుచున్నారము. ప్రభూ ! ప్రణవవాచ్యుండవును, బ్రణవచిహ్నుండవును,

సృష్ట్యాదికర్తవును, బంచవదనుండవునగు నీకు నమస్కారము. శంకరా! నీవు పంచబ్రహ్మాకృతివి. పంచకృత్యస్వరూపుండవు. నీగుణంబులును, శక్తులును నపరిమేయంబు లైనవి. అట్టి సగుణుండవును నిర్గుణుండవును, బరమాత్ముండవును, బరబ్రహ్మంబవును, బరమగురుండవు నగు నీకు వందనంబులు. అని యిట్లు విరించికేశవులు గురుండగు శంకరుని స్తుతించి ప్రణామంబు గావించుటయు శివుండిట్లనియెను. వత్సలారా! నేను మీకు సమస్తతత్త్వంబును బ్రబోధించి ప్రదర్శించి యుంటిని. ఇంతటినుండి మీరు దేవిచే నభిప్రేతంబును, మదాత్మకంబు నగు ప్రణవమంత్రమును జపించుచుండుఁడు. అందువలన సుస్థిరంబగు జ్ఞానంబును, సర్వవిధంబులగు శాశ్వతభాగ్యలాభంబులును గలుగును. ఆర్ద్రానక్షత్రమునందును, జతుర్దశియందు నీమంత్రంబు జపించినచో నక్షయఫలజనకం బగు మఱియు సూర్యగత్యనుసారంబున నది మహార్ద్రయైనచో నప్పుడు గావించినజపంబు కోటిగుణ ఫలప్రదంబగును. మృగశీర్షాంత్యపాదంబును, బునర్వసునక్షత్రాద్యపాదంబును జపహోమతర్పణాదికార్యంబుల కార్ద్రానక్షత్రతుల్యంబు లని యెఱుంగునది. ప్రభాతకాలము మొదలు సంగవకాలంబు చతుర్థపంచమషష్ఠముహూర్తంబుల వఱకును మదీయ లింగప్రతిమాసందర్శనంబు ప్రశస్తంబు. పూర్వోక్తంబగు చదుర్దశి నిశీథవ్యాపినియుఁ బ్రతిపద్యుక్తప్రదోషవ్యాపినియు నైనచో జపహోమాదికార్యంబులకు కుపయుక్తం బగుచున్నది. నాలింగంబును, బ్రతిమయుఁ దుల్యంబులే యయ్యు నుపాసకులకు లింగంబె ప్రధానంబు. ముముక్షులగువారికిఁ బ్రతిమాపూజనంబు కంటె లింగార్చనంబె శ్రేష్ఠంబు. సాధకు లోంకారమంత్రంబుచే లింగంబును, బంచాక్షరమంత్రంబునఁ బ్రతిమను బూజింపవలయును. నాలింగంబును, బ్రతిమయుఁ బరప్రతిష్ఠితంబు లైయున్నను, స్వకీయ ద్రవ్యంబులచే షోడశోపచారంబుల స్వయముగఁ బూజించినచో సాధ

కుల కనాయాసంబుగ శివపదప్రాప్తి యగును. అని యిట్లు భగవా నుం డగు శంకరుండు శిష్యులగు బ్రహ్మవిష్ణువుల కుపదేశించి యంత ర్ధానుం డయ్యెను.

—: శివలింగ ప్రతిష్ఠాపనవిధానము. :—

అనంతరము శౌనకాదిమహర్షులు శివలింగ ప్రతిష్ఠంగూర్చియు, లింగలక్షణములం గూర్చియు, బూజావిధింగూర్చియు, పూజావిహి తంబులగు దేశకాలపాత్రంబులం గూర్చియుఁ దెలుపుమని ప్రశ్నించు టయు సూతుం డిట్లనియెను. తపోధనులారా ! నిత్యపూజాయోగ్యం బగు నదీతటంబునఁగాని, తీర్థస్థానంబునఁగాని శాస్త్రోక్తంబగు నను కూలశుభసమయంబున సిద్ధానుసారంబుగ మృణ్మయలింగంబునుగాని, జలమయ లింగంబునుగాని, ధాతుమయ లింగంబునుగాని ప్రతిష్ఠింప వలయును. అట్టి లింగంబు శైవాగమోక్త లక్షణయుతంబై యుండ వలయును. అట్లున్నచో యథాసమయంబునఁ బూజాఫలంబు సిద్ధిం చును. లింగంబు సర్వలక్షణ సమన్వితంబైనచో సద్యఃపూజాఫల ప్రదంబు కాఁగలదు. చరంబున సూక్ష్మలింగంబును, స్థిరంబున స్థూల లింగంబును బ్రతిష్ఠింపవలయును. లింగంబులను యథోక్తలక్షణాన్వి తంబులుగను, బీఠయుక్తంబులుగను స్థాపించుట విహితంబు. లింగ పీఠంబుమండలంబుగఁగాని, చతురశ్రమంబుగఁగాని, కోణత్రయవిలసితం బుగఁగాని యుండవలయును. అది ఖట్వాంగంబునుంబోలి మధ్య సూక్ష్మంబైనచో మహాఫలప్రదంబగును. మృణ్మయశిలామయలిం గంబులకంటె లోహమయలింగంబు బ్రశస్తంబు స్థిరాధారంబున లింగ పీఠంబు లేక వస్తుసంఘటితంబులైనచో శ్రేష్ఠంబు. బాణలింగంబుగాక యితర లింగంబులును బీఠంబులు నేకవస్తు నిర్మితంబులగుట యుచి తంబు. శివలింగంబు ప్రతిష్ఠాపకుని ద్వాదశాంగుళపరిమితంబై యున్న చో నుత్తమంబు. అంతకంటె నధికంబైనను దోషంబుగాదు. కాని

యంతకంటె న్యూనంబైనచో న్యూనఫలప్రదంబగును. కేవల చరాధారంబున నేకాదశాంగుళ పరిమితంబగు శివలింగమును బ్రతిష్ఠించుట విహితంబు. శివప్రతిష్ఠాపకులు ముందుగఁ గారుకర్మనిపుణులగువారిచే వివిధదేవమూర్తి సమన్వితంబగు మందిరంబును నిర్మింపఁజేయవలయును. ఆమందిరంబునకుఁ బూర్వపశ్చిమంబుల రెండు. ప్రధానద్వారంబు లుండవలయును. అనంతరము నవరత్నవిభూషితంబును, దర్పణసన్నిభంబును, దృఢంబును, రమణీయంబునగు మందిరాభ్యంతరగృహంబున వేదికపై మధ్యభాగంబున నొకకుండంబు నిర్మించి యందు నవరత్నంబులను నిక్షేపించి "సద్యోజాతాయనమః" అను మంత్రంబులచేఁ బంచస్థానంబులను లింగపూజ గావించి సపరివారుండగు సదాశివు నుద్దేశించి యగ్నియం దాజ్యహోమంబు చేసి విశేషధనంబుల చేతను, నభిలషితవస్తువులచేతను గురుని నాచార్యుని బాంధవులను బూజించి యర్థులకు వస్త్రాలంకారాది దానంబులం జేసి ప్రయత్నపూర్వకంబుగఁ దత్తదభిలషితద్రవ్యంబులచే స్థావరజంగమజీవనిచయంబులను సంతోషింపఁజేసి సువర్ణనవరత్నప్రపూర్ణంబగు పూర్వోక్తకుండమధ్యంబున శివలింగమును బ్రతిష్ఠింపవలయును. పిమ్మటఁ బీఠంబుతో లింగంబును సంలగ్నంబు చేసి లాక్షాప్రభృతిచిరస్థితంబులగు విలేపనద్రవ్యంబులచే లింగపీఠంబులను దృఢసంయోజితంబులుగఁ జేయవలయును. పరమశుభకరంబగు శివప్రతిమాస్థాపనంబునకు విధానంబుకూడ నిట్లేయని యెఱుంగునది. కేవల ముత్సవాదులకొఱకు మాత్రము బహిర్భాగంబున శివప్రతిమను బంచాక్షరమంత్రంబుచేఁ బ్రతిష్ఠింపవలయును. ఈవిధంబుగా శివలింగంబును, శివప్రతిమను, స్థాపించి పూజించుటచేఁగాని, గురుదత్తంబును, సాధుపూజితంబునగు శివప్రతిమను బూజించుటచేఁగాని నిశ్చయంబుగ శివపదప్రాప్తియగును. ఇంతియకాక స్థావరంబనియు, జంగమాత్మకంబనియు శివలిం

తరువాత వారికి నమస్కరించి వారిని ప్రసన్నులం గావించుకొని గణపతిమంత్రంబు మొదలు వేదాదిమంత్రంబును, రుద్రాధ్యాయంబునందలి రుద్రచమకద్వయంబును, రుద్రసూక్తపంచకంబును బఠింపవలయును. బ్రాహ్మణభోజనానంతరమున రుద్రాధ్యాయ మంత్రంబుల బఠింపవలయును. తరువాత బ్రాహ్మణుల కుత్తరాపోశనం బొసంగి వారు లేచి పరిశుద్ధులై వచ్చినపిమ్మట నాసనంబులయం దక్షిముఖంబుగ గూర్చుండఁ జేసి తాంబూలంబును దక్షిణయును బాదుకలను, ఛత్రంబును, వ్యజనంబును, బీఠంబును, వంశదండంబును వారికి సమర్పించి ప్రదక్షిణ నమస్కారంబులుగావించ వారిని సంతుష్టులం జేసి వారివలన నాశీర్వాదంబువడసి మరల వారికి నమస్కారంబును జేసి ప్రార్థించి సదాశివస్వరూపులారా ! మీరు సంప్రీతచిత్తులై యథా సుఖంబుగ వేంచేయుఁ డని వారల నంపించుచు ద్వార దేశంబువఱకును వారిననుగమింపవలయును. తరువాత బ్రాహ్మణులాతనికి సెలవొసంగుటయుఁ దిరిగివచ్చి యజమానుండు బంధువులు బ్రాహ్మణులు, నతిథులు, దీనులు, ననాథులు, నగువారితోఁగూడి భోజనంబు గావింపవలయును. ప్రతివత్సరంబు నీవిధంబుగ నియమపూర్వకంబుగ గురునారాధించువాఁడిహలోకంబున మహద్భోగంబుల ననుభవించి యంతంబున శివలోకప్రాప్తుం డగును అని యిట్లు స్కందదేవుండు శిష్యుండగు వామదేవునకు బ్రబోధించిమునీంద్రా! పరమగుహ్యంబును బవిత్రంబునగు నీవేదాంతసిద్ధాంతమును నీవునాయొద్ద శ్రద్ధాపూర్వకంబుగ నుపదేశంబు గాంచితివి గావున నింతటినుండి పండితులు దీనిని వామదేవమతంబుగా గ్రహింపుచుందురుగాక ! ఈక్రమంబు ననుసరించి యతీంద్రుఁడు నేను శివస్వరూపుండ నైతినని భావించినచో సకలనదులును సముద్రగామినులగునట్లే పితామహాది విభాగంబులనుండి ముక్తుండై శివుని విలీనుండగుచున్నాఁడు. అని యిట్లు కుమారుండు వామదేవ

మఱియును నియమానుసారంబుగ సదాశివలింగసందర్శనంబు గావించుచున్నచో శివపదంబు లభియించును. సాధకులు ప్రయత్నపూర్వకంబుగ మృత్తికాగోమయపుష్పఫల నవనీతభస్మాన్నాదులలోఁ దమకిష్టంబైనవానిచే శివలింగనిర్మాణముం గావించి యథావిధిగ బూజింపవచ్చును. కొందఱుబుధు లంగుష్ఠంబులయందుఁగూడ శివలింగకల్పనంబు గావించి పూజించుట విహితం బని వక్కాణించి యున్నారు. వేయేల? లింగము నేవిధముగ సంకల్పించుకొని పూజించినను నిషేధము లేదు. కాని భగవంతుండగు శంకరుండు భక్తులకుఁ బరిశ్రమానురూపంబులగు ఫలంబులనుమాత్రమే యొసంగుచుండును. మఱియు శ్రద్ధాసహితంబుగ శివలింగమునుగాని తత్ప్రాప్తియోగ్య మూల్యంబును గాని శివభక్తునకు దానముచేసినవానికిని శివపదప్రాప్తియగును. ఇంతియకాక నిత్యంబును బదివేలుగాని, యుభయసంధ్యలను వేయేసి గాని ప్రణవమంత్రమును జపంబు చేసినచో శివపదప్రాప్తియగును. ప్రణవమంత్రజపసమయంబున మనశ్శుద్ధి యావశ్యకంబు. సమాధియందు మానసికజపంబును, నితరసమయంబులయం దపరిస్ఫుటజపంబును విహితంబు. ఏజపంబునందైనను నాదబిందుయుతంబగుప్రణవము స్పష్టంబుగను, సమంబుగ నుచ్చరింపఁబడవలయును. నిత్యంబును దశసహస్రంబైనను, గాదే నుభయ సంధ్యలయందును సహస్రంబైనను బంచాక్షరమంత్రంబు జపించినచో శివపదప్రాప్తుండగును. పంచాక్షరమంత్రమును బ్రాహ్మణుండు జపియించినచో మొదట బ్రణవంబును జేర్చుకొనుట ప్రశస్తంబు. సకల మంత్రంబులును గురూపదేశమూలంబుననే ఫలజనకంబు లగుచున్నవి. కావున గురు సన్నిధి నభిషిక్తుండై మాతృకాన్యాసశిక్షితుం డగుట కర్తవ్యంబు. సర్వవిధంబులచేతను, సత్యపూతాత్ముండును, జ్ఞానియు, బ్రాహ్మణుండు నగు గురుండే సుప్రశస్తుం డని యెఱుంగునది. సాధువులు ద్విజు

లకు మంత్ర పూర్వంబునను, దదితరులకు మంత్ర పరంబునను నమఃపదంబు చేర్పవలయునని నిర్దేశించి యున్నారు. స్త్రీలకుమాత్రము మంత్రపూర్వంబునందైనను బరంబునందైనను "నమోఽస్తు" అని చేర్చుచుండవలయును. కాని కొందఱుపెద్దలు విప్రస్త్రీలకు మంత్రపూర్వమునందు నమఃపదంబు చేర్పవచ్చునని చెప్పియున్నారు. సాధకుఁడీమంత్రము నైదుకోట్లు జపంబు చేసి సదాశివసమానుం డగుచున్నాఁడు. ఏకద్విత్రిచతుష్కోటిజపంబునఁ గ్రమముగా బ్రహ్మాది పదలాభంబు గలుగును. మంత్రంబునందలి ప్రత్యక్షరమును బ్రత్యేకముగ లక్షలక్షగఁగాని, మంత్రాక్షర సంఖ్యానుసారంబున నక్షరలక్షగాఁగాని జపంబు గావించినచో శివపదప్రాప్తి యగును. ప్రతిదినంబును సహస్రంబుగా దశలక్షజపంబు గావించి యథాసాధ్యంబుగ బ్రాహ్మణభోజనంబు సేయించినచో సర్వాభీష్టసిద్ధి యగును. బ్రాహ్మణుండెవ్వఁడు నిత్యం బష్టోత్తరశతంబుగ గాయత్రీమంత్రజపంబు గావించునో యాతఁడు క్రమంబుగ శివపదప్రాప్తుండగును. యథానియమంబుగ వేదమంత్రజపంబును, సూక్తపఠనంబును, వేదపారాయణంబును గావించినచో నిశ్చయముగ సదాశివసాయుజ్యప్రాప్తియగును. ఈ విధముగ నితరమంత్రములనుగూడ నక్షరలక్షజపంబు గావించినచో శివపదంబు లభించునుకాని యేకాక్షరమంత్రంబునకుఁ గోటిజపంబును బిమ్మట మరల భక్తిపూర్వకంబుగ సహస్రజపంబును విధేయంబు. ఎవ్వఁడు నిరంతరమును బ్రణవమంత్రంబును నిత్యసహస్రంబుగ మరణించుదాఁక జపించుచుండునో యాతనికి సర్వాభీష్టసిద్ధియగునని శంకరుండు స్వయముగ నానతిచ్చియుండెను. శివసంసేవనంబుకొఱకు బుష్పోద్యానాదులఁ గల్పించిపోషించుటయును శివపదసిద్ధికి హేతుఁభూతంబు. నిరంతరమును శివక్షేత్రంబున భక్తిభావముతో నివసించుట యెల్లరకును గర్తవ్యంబు. అందువలన స్థావరజంగమాత్మకంబు

లగు సర్వప్రకృతులకును భోగమోక్షంబులు సిద్ధించును. కావున బుద్ధిమంతులగు జీవులు సర్వవిధంబుల శివక్షేత్రంబున నివసింపవలయును. మానవప్రతిష్ఠితంబగు శివలింగమునకు శతహస్త పరిమితంబును, దేవర్షిస్థాపిత శివలింగంబునకు సహస్రహస్త పరిమితంబును స్వయంప్రతిష్ఠితలింగంబునకు సహస్రధనుఃపరిమితంబును నగు స్థానంబు పుణ్యక్షేత్రంబుగాఁ బరిగణింపఁబడుచున్నది. అట్టి పుణ్యక్షేత్రంబులయందలి వాపీకూపతటాకజలంబులు శివలింగాజలంబు లని శంకరుం డానతిచ్చియున్నాఁడు. అందుఁ గావింపంబడిన స్నానదానహోమాదికార్యంబులు శివపదప్రాప్తికిఁ గారణంబులగుచున్నవి. కావున నెల్లరును మరణపర్యంతంబును శివక్షేత్రంబున నివసింపవలయును. అట్టిక్షేత్రంబులయందు దహనసంస్కారంబును, దశాహకృత్యంబును, మాసికంబును, సపిండీకరణంబును, సాంవత్సరికంబును, బిండప్రదానంబును, దక్షిణముక్తిదాయకంబులు. అందున సప్తరాత్రంబులైనను, బంచరాత్రంబులైనను, త్రిరాత్రంబులైనను, నేకరాత్రంబైనను వసించువాఁడు క్రమముగా శివపదప్రాప్తిం గాంచును. మానవులు విశుద్ధాచారమూలంబునను, భక్తిబలంబునను, గ్రమంబుగ నుచ్చవర్ణంబులయందు జన్మించి స్వవర్ణానురూపంబులగు నతిశయఫలలాభంబులఁ బడయుచుందురు. పూర్వోక్తంబులగు సత్కార్యంబు లన్నియును గామకృతంబులయినచో సద్యఃఫల జనకంబులును, నకామకృతంబులైనచో శివపదప్రదంబులు నగుచున్నవి. శివారాధనంబునకుఁ బ్రాతఃకాల మధ్యాహ్నకాల సాయంకాలంబులను నియమములేక సర్వసమయంబులు ననుకూలంబు లగుచున్నవి. అందుఁ బ్రాతఃకాలంబు నిత్యవిధి సంపాదకంబు. మధ్యాహ్నకాలంబు కామ్యఫలప్రదంబు. సాయాహ్నరాత్రికాలంబులు వైరాగ్యసంపాదకంబులని యెఱుంగునది. రాత్రిమధ్యమయామద్వయరూపనిశీథకాలంబున శివపూజ విశేషాభీష్టప్రదా

యకంబగుచున్నది. మానవు లీవిధంబుగ నెల్లసంగతుల నెఱింగి శివ సేవనంబు గావించినచో యథోక్తఫలసిద్ధులం గాంచుట నిశ్చయంబు. కలియుగంబున నధికారిభేదంబు ననుసరించి చెప్పంబడిన యే పూజా కార్యంబైనను విశిష్ఠఫలప్రదం బగుచున్నది. కాని సద్వృత్తుండును, బాపభీరుండునగువాఁడు మాత్రమే యథోక్తఫలసిద్ధిం గాంచుచుండును.

## —♦ తీర్థక్షేత్రప్రశంస. ♦—

మునివరులారా! పంచాశత్కోటియోజనవిస్తీర్ణంబును, శైల కాననసమన్వితంబు నగునీ భూమండలము శివాజ్ఞచే సకలంబునకు నాధారంబై యున్నది. ఇందు మానవులముక్తికొఱకు భగవానుండగు శంకరుం డచ్చటచ్చటఁ బుణ్యక్షేత్రములను గల్పించి యుంచెను. దేవతలచేతను మహర్షులచేతను గొన్ని క్షేత్రంబు లుత్పన్నంబులయ్యెను. మఱికొన్ని స్వయంసముద్భూతంబులయ్యెను. తీర్థక్షేత్రంబులయందు స్నానదాన జపహోమాదిపవిత్రకార్యంబు లాచరించుటమానవులకు విహితంబు. అట్లు గావింపనివారు రోగదారిద్ర్యాభిభూతులై మూక త్వాదిదుఃఖంబుల ననుభవించుచుందురు. పుణ్యభూమి యగునీభారత వర్షంబున జనియించినమానవుండు మరణించియుఁ గ్రమ్మఱ మానవుం డుగనే జన్మించుచుండును. పుణ్యక్షేత్రంబులయందుఁ బాపాచరణంబు గురుతరదుఃఖప్రదంబుగావున మానవుండెవ్వఁడు నచ్చట నెట్టిసామా న్యపాపంబునైనను జేయంజనదు. ఏవిధంబుచేనైనను మానవుండు పుణ్యక్షేత్రవాస్తవ్యుండగుట శ్రేయంబు. సముద్రనికటంబునకు గంగా తీరంబునను బుణ్యక్షేత్రంబు లనేకంబులు గలవు. పుణ్యదాయిని యగుసరస్వతీనది షష్టిముఖ యనునామంబున విలసిల్లుచున్నది. బుద్ధి మంతుం డగువానికిఁ దత్తీరంబున నివసించుట యుచితము. అందు వలన బ్రహ్మపదప్రాప్తి యగును. హిమాలయసముద్భూత యగు పవిత్రభాగీరథీనది శతముఖానామంబున విరాజిల్లుచున్నది. ఆ గంగా

తీరంబుననే కాశ్యాదిబహుతరపుణ్యక్షేత్రంబులు గలవు. బృహస్పతి మకరస్థుం డగుసమయంబున గంగాతీర మతిప్రశంసనీయంబును నధిక ఫలప్రదంబు నగుచున్నది. పవిత్రంబు నభీష్టప్రదంబు నగు శోణభద్రా నది దశముఖంబులఁ బ్రసిద్ధంబై స్నానోపవాసాది వ్రతాచరణంబున గణేశలోకలాభప్రదం బగుచున్నది. పావనంబగు నర్మదామహానది చతుర్వింశతిముఖంబుల విఖ్యాతం బగుచున్నది. అందు స్నానంబును, తత్తీరనివాసంబును విష్ణులోకప్రదంబులు. తమసానదిద్వాదశముఖంబు లను, దేవానది దశముఖంబులను బ్రసిద్ధంబులై బ్రహ్మహత్యాగోహత్యా దిమహాపాపనివారకంబు లగుచున్నవి. మహాపుణ్యఫలప్రదంబగు గోదా వరీనది యేకవింశతిముఖంబులఁ బ్రకీర్తితంబై స్నానదానాదులచే రుద్రలోకంబును బ్రసాదించుచున్నది. సర్వపాప నివారకంబును, విష్ణులోకప్రదంబును, బుణ్యంబు నగు కృష్ణవేణీనది యష్టాదశ ముఖంబుల నలరారుచున్నది. బ్రహ్మలోకప్రదాయకం బగు తుంగ భద్రానది దశముఖంబులను పుణ్యం బగు సువర్ణముఖీనది నవ ముఖంబులను విరాజిల్లుచున్నవి. బ్రహ్మలోకపరిచ్యుతు లగు జీవులా సువర్ణముఖీతీరంబున జన్మించుచుందురు. సరస్వతీ పంపాకన్యా శ్వేత నదీతీరంబుల వసియించువా రింద్రలోకప్రాప్తు లగుదురు. సహ్య పర్వతసంభూతంబును, మహాపుణ్యఫలప్రదంబు నగు కావేరీమహానది సప్తవింశతిముఖంబుల విలసిల్లుచు సర్వాభీష్టప్రదాయకంబై యున్నది. తత్తీరంబున నివసించినచో స్వర్గవాసంబును, బ్రహ్మవిష్ణుపదలాభంబును, సర్వాభీష్టసిద్ధియు, నంతంబున శివలోకప్రాప్తియు నగును. రవియును, గురుండును, మేషరాశిగతులై యున్న సమయంబున నైమిశారణ్యంబు నను, బదరికాశ్రమంబునను గావించు స్నానదానతపఃపూజాదికంబులు శివలోకప్రాప్తికి హేతుభూతంబులు. సూర్యుండు సింహకర్కటకంబుల యందున్నప్పుడు సింధునదీస్నానంబును తథావిధఫలప్రదం బగుచున్నది.

కేదారనదీజలపానంబును స్నానంబును జ్ఞానప్రదంబులని పెద్దలు చెప్పెదరు. సింహామాసంబునను, బృహస్పతి సింహంబునందున్న సమయంబునను గోదావరీస్నానంబు శివపదప్రదంబని పూర్వకాలంబున శివుం డానతిచ్చి యుండెను. రవిగురులు కన్యారాశియందున్న కాలంబున యమునాజలంబున సుస్నాతుండగువానికిఁ ధర్మలోకంబును, శోణనదీస్నాతుండగువానికి గణపతిలోకంబును లభియించును. ఈ యుభయనదీస్నానంబులును మహైశ్వర్యభోగప్రదంబులు. రవిగురులు తులారాశియందున్న సమయంబున గావేరీస్నానము విష్ణువచనానుసారంబుగ సర్వాభీష్టప్రదం బని పండితులు చెప్పుచున్నారు. రవిబృహస్పతులు వృశ్చికరాశిస్థితులగు వేళ నర్మదాస్నానంబు విష్ణులోకలాభప్రదంబు. రవిగురులు ధనుస్సునం దున్నప్పుడు సువర్ణముఖీస్నానంబు శివలోకప్రదంబని బ్రహ్మదేవుండు వచియించెను. సౌరఫాల్గునంబున గురుండు మకరస్థుండైనప్పుడు గంగాస్నానంబున బ్రహ్మవిష్ణు శివలోకంబుల నానందభోగంబు లభియించును. అనంతరము జ్ఞానలాభంబున మోక్షంబు సిద్ధించునని కమలోదరుం డానతిచ్చెను. మకరంబునఁగాని, కుంభంబునఁగాని సూర్యదేవుం డధిష్ఠించి యున్నప్పుడు మానవుండు భాగీరథీకూలంబున బిండప్రదానంబుగాని, తిలతర్పణంబుగాని గావించినచో నాతని పితృకులంబును, మాతృకులంబును కోటిపురుషాంతరముల వఱకు నుద్ధరింపఁబడును. సురగురుండును, సూర్యుండును, మీనరాశిస్థితులై యున్నప్పుడు కృష్ణవేణియందును, దదుపకూలస్థితంబగు తీర్థంబునను స్నానం బాచరించినచో నింద్రపదంబు లభించునని సకలదేవతలును, బ్రశంసించి యున్నారు. వేత్తలగువారు గంగాకావేరీతీరంబుల నివసించియుండుట యుచితంబు. అందువలనఁ దత్కాలకృతంబులగు సర్వపాపంబులును నశించునని బుధులు వచియించియున్నారు. ఇట్లే రుద్రలోక ఫలప్రదంబులగు నితరపుణ్యక్షేత్రంబు లనేకంబు

లున్నవి. తామ్రపర్ణి వేగవతీనదులు బ్రహ్మలోకప్రదంబులు. వీనితీరంబులయందు స్వర్గదాయకంబులును, భూరిపుణ్యజనకంబులు నగు పుణ్యక్షేత్రంబు లనేకంబులు కలవుగావున మానవు లందు నివసించియుండుట సర్వశ్రేయస్సాధనంబు. మఱియు మానవుండు సర్వదా సద్వృత్తుండును, సదాచారతత్పరుండును, శివధ్యాన నిరతుండును, దయాళుండును, ప్రాజ్ఞుండునై యున్నచోఁ బుణ్యక్షేత్రఫలభాగి యగుచు న్నాఁడు. పుణ్యక్షేత్రకృతంబు లగుచుండును. పుణ్యక్షేత్ర నివాస కాలంబున జీవనంబుకొఱకుఁ గావించినపాపంబు పుణ్యకాలంబున నశియించుచున్నది. విద్వజ్జనులు పుణ్యం బైశ్వర్యప్రదంబని ప్రశంసించి యున్నారు. పుణ్యంబు వాచికంబనియుఁ గాయికంబనియు, మానసికంబనియుఁ ద్రివిధంబులై యుండును. పాపంబుగూడ నిట్లే త్రివిధంబులు. పాపంబును నిర్మూలంబు గావించుట యెల్లరకును కర్తవ్యంబు. పాపంబు వజ్రలేపంబుం బోలి కల్పకల్పాంతంబులవఱకును సుస్థిరంబై యుండును. అందు మానసికంబగు పాపంబు మహాభయంకరంబు. అది శివధ్యానంబునంగాని మఱియేయుపాయంబునను నశించునదికాదు. వాచికపాపంబు జపాదులచేతను, కాయికపాపంబు కాయశోషణాదికంబునను విధ్వంసంబగును. కాని ధనకృతంబగు పాపంబు దానంబుచేఁగాని కోటికోటివర్షంబులకైనను నశియింపదు. ఒక్కొక్కప్పుడు పాపప్రాబల్యంబునఁ బుణ్యంబుకూడ క్షీణించుచుండును. పుణ్యపాపంబులకు బీజంబును, వృద్ధియు భోగంబు నని మూడంశలు కలవు. బీజవృద్ధ్యంశంబులు జ్ఞానంబుచే నశియించును గాని భోగాంశంబుమాత్ర మనుభవంబుచేఁగాని నశియింపదు. దేవతాపూజనంబునను, బ్రాహ్మణాదులకు దానాదికంబునను, నధికతరతపోనుష్ఠానంబునను మానవులకు భోగాంశంబు ప్రశమితంబుమాత్రము కాఁగలదు. కావుననే సుఖాభిలాషులగు మానవులు యత్నించి పాపంబునకైనను విముఖులై పుణ్యక్షేత్రంబుల నివసించి యుండవలయును.

## సదాచారనిరూపణము.

తపోధనశ్రేష్ఠులారా! సదాచారసంపన్నుండును విద్వాంసుండు నగు ద్విజుండుమాత్రమే బ్రాహ్మణుం డగుచున్నాఁడు. వేదాచారయుతుండగువాఁడు విప్రుండు. ఇందేకగుణమాత్రంబుగలవాఁడు ద్విజపదవాచ్యుండు. అల్పసదాచారుండును నల్పవేదాచారుండును, రాజసేవకుండు నగువాఁడు క్షత్రియుండని చెప్పవచ్చును. కృషివాణిజ్యకారియుఁ గించిదాచారవంతుండు నగువాఁడు వైశ్యుఁడు. స్వయముగఁ గృషికార్యనిర్వహణంబు చేయుబ్రాహ్మణుండు నిశ్చయముగ శూద్రబ్రాహ్మణుం డని చెప్పంబడును. మఱియు నసూయాపరవశుండును, బరద్రోహియు నగుబ్రాహ్మణుండు చండాలద్విజుండని బుధులు నిర్దేశించి యున్నారు. క్షత్రియుండు భూపాలకుం డయ్యేనేని రాజగును. తక్కినవారలందఱును క్షత్రియపదవాచ్యులు. వైశ్యుండు ధాన్యాదిక్రయవిక్రయవ్యాపారమూలంబున వైశ్యుం డగుచున్నాఁడు. తక్కినవారు వణిజు లగుచున్నారు. బ్రహ్మక్షత్రియవైశ్యులకు శుశ్రూషం గావించునాతఁడుమాత్రమే శూద్రుండు. వారిలోఁ గృషికార్యాచరణుండగువాఁడు వృషలుండగును. తదితరులు దస్యులని పిలువంబడుచున్నారు. మానవులు ప్రాతఃకాలంబునఁ బూర్వాభిముఖులై యుండి దేవతాస్మరణంబు గావించుచు ధర్మార్థంబులను, నాయవ్యయంబులను విచారించుకొనవలయును. ప్రాతఃకాలంబున మానవుండు శయ్యనుండి లేచునప్పుడు పూర్వాభిముఖుం డైనచో నాయంబును, క్రమంబుగ నాగ్నేయాదిసప్తదిశలను ద్వేషమరణపాపభాగ్యవ్యాధిపుష్టిశక్తులును గలుగునని బుధులచే ఫలనిర్దేశంబు గావింపఁబడియెను. రాత్రిశేషయామంబున నుషయనియును, దాని శేషార్ధంబునకు సంధియనియును నామంబులు కలవు. ద్విజులాసంధికాలంబున నిద్రనుండి మేల్కాంచి లేచి గృహంబునకు దూరంబుగఁబోయి యావృతశరీరులు

నుత్తరాభిముఖులునై విణ్మూత్రవిసర్జనంబు గావింపవలయును. ప్రతిబంధంబున నితరదిక్కులైనను దోషంబులేదు, కాని, జలానలబ్రాహ్మణదైవతంబుల కభిముఖులై మలమూత్రవిసర్జనంబు గావించుట గర్హ్యంబు. వామహస్తంబున లింగంబును, దక్షిణహస్తంబున ముఖంబును సమావృతంబు గావించి విణ్మూత్రత్యాగంబు గావింపవలయును. పురీషంబుపై దృష్టిపాతంబు సేయంజనదు. జలాశయంబునకు బహిర్దేశంబున నుద్ధృతంబగు జలంబుచే శౌచంబు గావించుట విహితంబు. కాదేని దేవతీర్థంబులును, పితృతీర్థంబులును, ఋషితీర్థంబులును గాని జలాశయములయం దైనను శౌచంబు గావింపవచ్చును. సప్తవారంబులుగాని, పంచవారంబులుగాని, త్రివారంబులుగాని గుహ్యదేశమున మృత్తికాశౌచంబు సేయవలయును. కంకోలఫలపరిమితం బగు మృత్తికచే లింగంబును, నంజలిపరిమితంబగు మృత్తికచే మలద్వారంబును శోధితంబు గావింపవలయును. పిమ్మటఁ గరచరణశౌచంబు గావించి యెనిమిదిసారులు గండూషంబు సేయవలయును. అనంతరము జలాశయబహిర్భాగంబునఁ బత్రంబులచేఁగాని నిర్దిష్టంబు లగు దంతకాష్ఠంబులచేఁగాని తర్జనిచే స్పృశింపకుండ దంతధావనంబు చేసి జలదేవతాప్రదానపురస్సరంబుగ స్నానంబుచేయవలయును. స్నానంబున కశక్తుం డగువాఁడు కంఠకటిజానుదేశపర్యంతంబైనను యథాశక్తినభిషిక్తుండై పిమ్మట మంత్రస్నానంబు గావింపవలయును. తరువాతఁ దీర్థజలంబున దేవతాపితృతర్పణంబుగావించి పంచకచ్ఛయుక్తంబుగ ధౌతపరిధానంబు గావింపవలయును. సకలకార్యంబులయందు నుత్తరీయంబును ధరించుట కర్తవ్యంబు. నద్యాదితీర్థజలంబులయందుఁ బరిధేయంబు నుదుకుట నింద్యంబు. స్నానానంతరంబున వాపీకూపజలంబులఁగాని, గృహంబునఁగాని స్నానవస్త్రంబును బరిశుద్ధంబు చేయవలయు నని బుధులు నిర్దేశించియున్నారు. ద్విజులు కాష్ఠంబుల

యందుఁగాని, శిలలయందుగాని జలంబుచే వస్త్రశుద్ధింగావించి పితృగణంబుల తృప్తికొఱకు వస్త్రపీడనంబు గావింపవలయును. పిమ్మట జాబాలకోక్తమంత్రంబున భస్మత్రిపుండ్రధారణంబు సేయవలయును. అమంత్రకంబుగ భస్మంబును జలంబున నిక్షేపించుట నరకహేతువగుచున్నది. మానవుండు పాపశాంతి కొఱకు "ఆపోహిష్ఠా" ది మంత్రంబులచే మస్తకంబునను, "యస్యక్షయా" యాది మంత్రంబులచేఁ బాదద్వయంబునను జలసేచనంబు చేయవలయును. దీనికి సంధిప్రోక్షణంబని పేరు. "ఆపోహిష్ఠా" ది మంత్రంబులందొక్కొక్క వాక్యంబునఁ గ్రమంబుగఁ బాదంబులను మస్తకంబునను హృదయంబునను మస్తకంబునను హృదయంబునను బాదంబులను మస్తకంబునను జలప్రోక్షణంబు గావించుట మంత్రస్నానంబని బుధులు నిర్దేశించిరి. అపవిత్రవస్తు స్పర్శనంబునందును శరీరాస్వాస్థ్యంబునందును రాష్ట్రభయంబునందును, రాజభయంబునందును, బథగమనసమయంబునందును నగత్యంబగుటచే నిట్లు మంత్రస్నానంబు సేయవలయును. సంధ్యావందనమధ్యంబునఁ బ్రాతఃకాలంబున "సూర్యశ్చమామన్యుశ్చ" యనుమంత్రంబుచేతను, సాయంకాలంబున "అగ్నిశ్చమామన్యుశ్చ" యనుమంత్రంబుచేతను బాదాంతంబున నాచమనంబు గావించి పూర్వోక్తప్రకారంబున మార్జనంబు చేయవలయును. ప్రాతఃకాలంబున గాయత్రమంత్రజపానంతరంబున నూర్ధ్వంబుగమూడుపర్యాయంబులును, మధ్యాహ్నంబున మధ్యభాగంబున నొకపర్యాయంబును, సాయంకాలంబునఁ బశ్చిమాభిముఖుండై భూతలంబునం దొకపర్యాయంబును సూర్యదేవునుద్దేశించి జలంబులచే నర్ఘ్యప్రదానంబు చేయవలయును. ప్రాతఃకాలమధ్యాహ్నకాలంబులందు దేవతీర్థజలంబులను సాయంకాలంబునం దంగుళీరంధ్రంబులను గగనస్థుండగుదివాకరుని సందర్శించి యాత్మప్రదక్షిణంబును శుద్ధాచమనంబును గావింపవలయును.

సాయంకాలమున నొకముహూర్తముపూర్వమునందే సాయంసంధ్యా వందనంబు చేయవలయును. అకాలసంధ్యావందనంబు నిష్ఫలం బగుచున్నది. యథాకాలమునం దాచరించుటయే విధాయకంబు. సంధ్యా వందనంబున కొకదినం బతీతంబైనచో బరదినంబున యథావిధిగ శత గాయత్రీజపంబును, దశదినంబు లతీతంబు లయ్యెనేని లక్షగాయత్రీ జపంబును చేయవలయును. మఱియు నేకమాసంబతీతంబయ్యెనేని మరల నుపనయనంబు గావలయును. మానవుండభీష్టసిద్ధికొఱకు నిత్యంబును జలంబులచే మహేశ్వరుని, పార్వతిని, గార్తికేయుని, విష్ణుదేవుని, బ్రహ్మను, నింద్రుని, యముని నుద్దేశించి తర్పణంబు గావింపవలయును. జ్ఞానియగువాఁడు తీర్థంబునకుదక్షిణంబునం గలప్రశస్తమఠంబునంగాని, మంత్రాలయంబునగాని, ప్రసిద్ధదేవాలయంబునఁగాని, గృహంబునగాని నియమితస్థానంబున స్థిరచిత్తుండై స్థిరాసనంబున సకలదేవతలకును బ్రణామపూర్వకంబుగఁ బ్రణవంబు నుచ్చరించుచు గాయత్రీమంత్రంబును జపింపవలయును. మఱియు గాయత్రీ మంత్రకాలంబున జీవబ్రహ్మలకభేదంబను జ్ఞానంబుతోఁ బ్రణవంబునుచ్చరించుచు "ఎవ్వరు జ్ఞానేంద్రియకర్మేంద్రియమూలంబున నామనోవృత్తిని, బుద్ధిని భోగమోక్షప్రదంబు లగుధర్మవిషయంబులందును, జ్ఞానమార్గంబునందును నిరంతరమును బ్రేరేపించుచుందురో యట్టి త్రిలోకకర్తయగుబ్రహ్మదేవుని పాలనకర్తయగు నారాయణదేవుని, సంహారకర్తయగు రుద్రదేవుని నేనుపాసించుచున్నాను" అనునిట్టిగాయత్రీ మంత్రార్థమును జింతించుచు జపంబు గావించినచో బ్రహ్మపదలాభంబు సిద్ధించును. ఇట్టియర్థజ్ఞానంబు లేకున్నను బ్రాహ్మణ్యసిద్ధికొఱకు నిత్యంబును గాయత్రీజపంబు చేయవలయును. బ్రాహ్మణపుంగవునకు నిత్యంబును బ్రాతఃకాలమునం దష్టాధికసహస్రంబును, మధ్యాహ్నకాలంబునం దష్టాధికశతంబును, సాయంకాలంబునం దష్టాధికద్విశతం

బును గాయత్రీమంత్రజపంబు కర్తవ్యంబు. సామాన్యులగువారు సాధ్యానుసారంబుగ జపంబు చేయవలయును. మూలాధారంబు మొదలు బ్రహ్మరంధ్రపర్యంతమును షట్చక్రములయందును యథాక్రమంబుగ నవస్థితులగు విద్యేశ్వర బ్రహ్మ విష్ణుమహేశ్వర జీవాత్మపరమాత్మలకు బ్రహ్మబోధంబున నభేదంబనుజ్ఞానముతో "సోహం" బను తత్త్వంబును భావించుచు గాయత్రీమంత్రజపంబు గావింపవలయును. ఆవిద్యేశ్వరాది దేవతలను బ్రహ్మరంధ్రాదులయందును, శరీరబహిర్భాగంబులయందును భావించుచు ననంతశరీరంబునందలి మహాతత్త్వంబుల నేకైకజపమూలంబున నేకైకతత్త్వంబును మెల్లమెల్లగనతిక్రమించుచుఁ బరమాత్మతో జీవాత్మననుసంధింపఁజేయుటయే జపతత్త్వంబని బుధులచే నిర్దేశింపఁబడియెను. అష్టోత్తరశతాది జపసంఖ్యానిర్ణయంబీజప తత్త్వంబునకు దేహస్వరూపంబులు. ఏజపంబుగావించినను నీవిధియావశ్యకంబని విద్వద్వర్యులు నిశ్చయించియున్నారు. సహస్రజపంబున బ్రహ్మలోకంబును, శతజపంబున నింద్రలోకంబును, ద్విశతాదిజపంబుననాత్మరక్షణంబును బ్రాహ్మణకులజననంబును లభియింపఁగలవు. ప్రతి దినంబును ముందుగ సూర్యభగవాను నర్చించి జపానుష్ఠానంబు గావింపవలయును. ఎవ్వఁడిట్లు ద్వాదశలక్షజపంబు గావించునో యాతఁడే సంపూర్ణముగ బ్రాహ్మణపదవాచ్యుండగును. మఱియు లక్షగాయత్రీ జపంబైనను గావింపనివానిని వైదికకర్మంబుల నియోజించుట గర్హ్యంబు. మానవులకీ నియమంబు సప్తతివర్షపర్యంతమే విహితంబై యున్నది. అనంతరము సన్న్యాసాశ్రమంబును గ్రహించుట కర్తవ్యంబు. సన్న్యాసి యగువాఁడు ప్రతిదినంబును బ్రాతఃకాలమునందు ద్వాదశసహస్ర ప్రణవజపంబు గావింపవలయును. కాని యందొక్కదినం బతిక్రమించెనేని మరలద్వాదశసహస్రంబును, మాసంబతిక్రమించెనేని సార్ధలక్షయును జపంబు చేసి యామూలంబున జపలోపపాపంబునకుఁ బ్రాయ

శ్చిత్తంబు చేసికొనవలయును. అట్లు చేయనిచో నట్టియతి రౌరవ
నరకపతితుం డగును. పూర్వోక్తకాలంబుకంటెను నధికకాలం బతీ
తంబయ్యెనేని మరల సన్యాసంబును స్వీకరింపవలయును. యతిగాక
తక్కినయందఱును ధర్మార్థంబులయెడల ననురాగులైయుండుట విహి
తంబు. బ్రాహ్మణుండు ముక్తికాముండై నిత్యంబును బ్రహ్మజ్ఞానము
నభ్యసింపవలయును ధర్మమునుండి యర్థంబును, నర్థమునుండి భోగం
బును, భోగంబునుండి వైరాగ్యంబును నుత్పన్నంబు లగుచున్నవి.
కాని యధర్మోపార్జితంబగు నర్థంబునందైన భోగంబువలన వైరాగ్యం
బునకుఁ దూఱుగ విషయలోలత్వంబే ప్రవర్థమానంబగుచున్నది. పూర్వో
క్తంబగు ధర్మంబు ద్రవ్యసంబంధం బనియు, దేహసంబంధం బనియు
ద్వివిధంబు. అందు యాగాదిరూపంబులగు ధర్మంబులు ద్రవ్యజనితం
బులు. తీర్థస్నానాదిరూపంబులగు ధర్మంబులు దేహజనితంబులు. ఇట్టి
ధర్మకార్యంబులవలన ధనంబును, ధనంబువలన దివ్యరూపంబును గలు
గును. నిష్కాముండై ధర్మాచరణంబు సేయువానికిఁ బ్రథమంబునఁ
జిత్తశుద్ధియు, నందువలన జ్ఞానలాభంబును సిద్ధించును. సత్యాది
యుగత్రయంబునఁ దపోనుష్ఠానంబును, గలియుగంబున ద్రవ్యధర్మంబు
ను బ్రశంసనీయంబులు. సత్యయుగంబున ధ్యానంబునను, త్రేతాయు
గంబునఁ దపోనుష్ఠానంబునను, ద్వాపరంబున యజనకార్యంబులను,
గలియుగంబునఁ బ్రతిమాదిపూజనంబునను జ్ఞానలాభం బగును. ధర్మ
సాధనంబులగు ధనదేహంబులమూలంబున సంపాదింపబడిన పాపపుణ్యం
బులకుఁ దదనురూపంబులగు ఫలంబులే సంప్రాప్తంబు లగుచుండును.
ఈజగంబున నవిధేయంబులును గుత్సితంబులును, హింసారూపంబులు
నగుకర్మంబులచే నధర్మంబును, యజ్ఞయాగాదికర్మంబులచే ధర్మంబును
సముత్పన్నంబులగుచున్నవి. అందధర్మమునుండి దుఃఖంబును, ధర్మము
నుండిసుఖంబునుగలుగుచున్నవి. ఇట్లేసువృత్తియును, దుర్వృత్తియును

క్రమంబుగ సుఖదుఃఖదాయకంబులగుచున్నవి. కావున మానవుండుని రంతరంబును భోగమోక్షప్రదంబులగు ధర్మకార్యముల నాచరించుట యందేప్రవృత్తుండై యుండవలయును. బహుతరపరివారుండును, బహు కుటుంబియునగు బ్రాహ్మణునకు శతవర్షభోగ్యంబగు వృత్తిని దానంబు చేసినను, సహస్రచాంద్రాయణవ్రతం బాచరించినను బ్రహ్మలోక ప్రాప్తి యగునని బుధులు నిర్దేశించిరి. క్షత్రియుండు సహస్రకుటుంబ పోషకుండైనచో నింద్రలోకంబును, నయుతకుటుంబ ప్రతిష్ఠాపకుం డైనచో బ్రహ్మలోకంబును గాంచుచున్నాఁడు. ఏదేవతాసాన్నిధ్యం బున దానముం గావించినచో నాదేవతాలోకంబు లభియించునని వేదవిదులు చెప్పుదురు. అర్థహీనుం డగువాఁడు తపోనుష్ఠానంబున ధర్మార్జనంబు గావింపవలయును. తీర్థస్థానసేవనంబునను, దపంబునను సిద్ధించుసుఖం బక్షయంబైనది. ఇఁక న్యాయసంగతంబగు నర్థోపార్జన ముంగూర్చి చెప్పెద నాకర్ణింపుఁడు. బ్రాహ్మణుఁడు దైన్యజ్ఞాపనంబు చేయక సత్ప్రతిగ్రహంబు వలనను, ననతిక్లేశకరంబగు యజ్ఞకార్యంబు వలనను ధనోపార్జనంబు చేయవలయును. క్షత్రియుండు బాహువీ ర్యంబునను, వైశ్యుండు కృషిగోరక్షణాది కార్యంబులను నర్థంబును సముపార్జింపవలయును. ఇట్లు న్యాయార్జితంబగు ధనంబును దానంబు గావించినచో జ్ఞానసిద్ధియు దానివలన మోక్షసిద్ధియు దానివలన సర్వ స్వరూప సిద్ధియు నగును. అప్పుడు జీవుండు పరమానందోప భోగంబునకు సమర్థుం డగును. కాని ఈ సిద్ధు లన్నియును గురు కృపావశంబునఁగాని లభింపవు. పూర్వోక్తంబులగు సమస్తసత్కా ర్యంబులును మానవులకు సాధుసంగవశంబున సంఘటితంబు లగుచు న్నవి. గృహస్థుండగువాఁడు ధనధాన్యాది సకలవస్తువులను దానము చేయవలయును. ఏసమయమునం దేవస్తువు లేఫలంబు లేధాన్యాదు లుత్పన్నంబులగునో యాయాసమయములం దాయావస్తువుల నాత్మ

హితంబుకొఱకు బ్రాహ్మణులకు దానంబు చేయవలయును. మఱియుఁ దృష్ణార్తునకు జలంబును, క్షుధార్తున కన్నంబును, ద్విజగణంబులకు క్షేత్రంబును, ధాన్యంబును, నామాన్నంబును, జతుర్విధాన్నంబును, దానముచేయవలయును. ఏదాతయన్నంబు నెవ్వరెంతకాలంబు భుజియించుచుందురో యట్టివా రొనరించుచుండు పుణ్యంబులయం దర్ధభాగంబు దాతకుఁ జెందుచున్నది. దానప్రతిగ్రహంబు గావించినవాఁడు ప్రతిగ్రహవస్తువులను దానముచేయుటవలనను, తపంబువలనను బ్రతిగ్రహపాపవిముక్తుం డగుచున్నాఁడు. అట్లు కావింపనిచో నాతనికి నిశ్చయముగ రౌరవప్రాప్తియగును. సాధకుండు న్యాయార్జితద్రవ్యంబును ధర్మంబునకును, వృద్ధికిని, భోగంబునకును ద్రిభాగంబులు చేసి ధర్మాంశచే నిత్యనైమిత్తిక కామ్యకర్మంబులను, వృధ్యంశంబువలన వర్ధనంబును, భోగాంశంబువలన నసితరక్లేశంబులును, ధర్మావిరుద్ధంబులును, బరిమితంబులునగు భోగంబులను గావింపవలయును. కృషికర్మోపార్జితంబున దశాంశంబు పాపశుద్ధికొఱకు దానంబు చేయవలయును. అవశిష్టధనంబున ధర్మకార్యంబుల నాచరింపవలయును. అట్లు చేయనిచో నరకప్రాప్తి యగును. కాదేని బాపమతియగును. మఱియు నాతని సకలసస్యంబులును వినష్టంబు లగును. ధర్మవిదులగు ద్విజులు కృషివాణిజ్యలబ్ధంబగు ధనంబునం దాఱవభాగంబును, సత్ప్రతిగ్రహలబ్ధధనంబునందుఁ జతుర్థాంశంబును, నాకస్మికలబ్ధధనంబునం దర్ధాంశంబును దానంబు చేయుదురు. అసత్ప్రతిగ్రహలబ్ధంబగు ధనంబంతయును సాగరజలంబులఁ బరిత్యజించుట కర్తవ్యంబు. బ్రాహ్మణుని స్వయముగ నాహ్వానించి దానముచేయుట యెల్లయెడల విహితంబు. అందువలన సమధికంబగు నాత్మభోగలాభంబు కలుగును. మఱియును బ్రాహ్మణుం డర్థించిన వస్తువును శక్త్యనుసారంబుగ దానంబుచేయుటుచితంబు. ప్రార్థితద్రవ్యంబును దానము చేయనివాఁడు జన్మాంతర

రంబున భయంకర ఋణగ్రస్తుం డగును. విచక్షణుండగు వాఁడితరుల దోషంబుల వినియుఁ జూచియును గూడఁ బ్రకటింపక యుండును. ఏజీవికైనను హృదయసంతాపకరం బగుకార్యంబుగావించుటయు, భాషించుటయుఁ బండితుల కకర్తవ్యంబు. సాధకుండు యథావిధిగఁ దండులంబులను, ధాన్యంబును, నాజ్యంబును, ఫలంబులను, హవిస్సును, స్థాలీపక్వాన్నంబును నాదిగాఁగల హోమద్రవ్యంబులను సంపాదించి యైశ్వర్యసిద్ధికై ప్రాతస్సాయంకాలముల యందుఁగాని యశక్తుండైనచో నేకకాలమాత్రంబున గాని యథాశాస్త్రంబుగ హోమంబును సూర్యాగ్ని దేవారాధనంబును గావింప వలయును. హవ్యాభావంబునఁ బ్రధానహోమంబునైనను గావింపవలయును. సదాసంస్థితం బగునీయగ్ని సజ్జనంబని ఋషులు వక్కాణించిరి. ఉపాసకు లశక్తులైనచోఁ గేవలహోమమంత్రజపంబుగాని, సూర్యనమస్కారంబుగాని గావింపవలయును. ఆత్మార్థి యగువాఁడుమాత్రమే యిట్లు గావింపవచ్చును. అర్థార్థియగువాఁడు యథావిధిగ హోమంబు గావింపవలయును. ఎవ్వరు నిత్యంబును బ్రహ్మయజ్ఞంబును, దేవపూజయు, నగ్నికార్యంబును, గుర్వర్చనంబును, బ్రాహ్మణసంతర్పణంబును గావింతురో వారు స్వర్గసుఖసంపాదనంబునకు సమర్థులగుదురు.

## పంచమహాయజ్ఞకథనము.

మునివరులారా! అగ్నియజ్ఞంబును, దేవయజ్ఞంబును బ్రహ్మయజ్ఞంబును, గురుపూజయు, బ్రహ్మతృప్తియు, బంచయజ్ఞంబులని పెద్దలు చెప్పుదురు. అగ్నియందుఁ దండులాదులచే హోమంబు గావించుట యగ్నియజ్ఞంబు. బ్రహ్మచారులకు జాతాగ్నియందు సమిధలను వ్రేల్చుటయే యగ్నియజ్ఞం బగును. బ్రహ్మచారులకు సమావర్తనపర్యంతంబును బూర్వోక్తసమిత్సంరక్షితంబగు జాతాగ్నియందే వ్రతయజనాదికార్యంబులు నిర్దిష్టంబులు. ఆత్మయం దగ్నిసమర్పణంబు గావించిన వానప్రస్థుల

కును యతులకును యథాసమయంబునఁ బరిమితంబును, బవిత్రంబు నగునన్నంబును భుజించుటయే హోమం బగును నిత్యహోమంబు నకుఁ గుండంబునఁగాని, భాండంబునఁగాని సురక్షితంబుగావించిన సమావర్తనాగ్నిని ధర్మవిధులగువా రజస్రంబని చెప్పుదురు. రాజోప ద్రవంబునఁగాని దైవవ్యాఘాతవశంబునఁగాని యాత్మయందైనను, నరణి యందైనను నారోపింపఁబడినయగ్ని సమారోపితంబు నాఁబడు. సాయంకాలంబున నగ్నియందాహుతి గావించినచో సంపదయుఁ, బ్రాతఃకాలంబున సూర్యునియం దాహుతిదానం బాయుర్వృద్ధికరంబు నగును. దివసంబునం దగ్నిసూర్యునియందుఁ బ్రవేశించియుండునుగా వున దివంబున సూర్యునియందాహుతిం గావించుటయే యగ్నియజ్ఞం బని బుధులు నిర్దేశించిరి. ఇంద్రాదిదేవతలనుద్దేశించి యనలంబున హోమంబు చేయుటయు, స్థాలీపాకాదిక్రతువులును, లౌకికాగ్నిప్రతిష్ఠి తంబులగు చౌలాదికార్యంబులును దేవయజ్ఞంబని పెద్దలు చెప్పుదురు. వేదాధ్యయనంబు బ్రహ్మయజ్ఞంబు. నిత్యకర్మసమాపనంబు మొదలు సాయంకాలపర్యంతమును బ్రహ్మయజ్ఞంబున కధికారంబు గలదు. రాత్రియందు బ్రహ్మయజ్ఞంబు సేయంజనదు. ద్విజులు ప్రతిదినంబును దేవతాతృప్తికొఱకు బ్రహ్మయజ్ఞంబు గావింపవలయును. ఈమూ డును గురుపాసనంబును, బ్రాహ్మణసంతర్పణంబును బంచయజ్ఞంబులగు చున్నవి.

## దినవిశేషంబున దేవపూజావిధి.

కరుణామయుండును, సర్వజ్ఞుండును భగవానుండునగు మహా దేవుండు సృష్టిప్రారంభమున సకలజనహితంబు కొఱకు సప్తవారంబు లను సృజించెను. సంసారవైద్యుండగు సదాశివుండు ప్రథమంబునఁ దనమాయాబలంబున సర్వౌషధంబులకు నౌషధస్వరూపంబును, నారో గ్యప్రదంబునగు స్వకీయవారంబును, దరువాతఁ బీడాదిదుర్గతి కాంత

జన్ములగు శిశువులకుమంగళకరం బగుకుమారునివారంబును, బిమ్మట నామయశాంతికొఱకు విశ్వపాలకుండగు విష్ణునివారంబును, ననంతరము జీవరక్షణంబునకు సంతుష్టికిని నాయుష్కర్తయగు విధాతృని యాయుష్కరవారంబును, నదనంతరము జీవులకాయుష్యంబుకొఱకుఁ ద్రిలోకకర్తయుఁ బరమేష్ఠియు నగుబ్రహ్మదేవుని వారంబును, తరువాతఁ ద్రిలోకవృద్ధికొఱకుఁ గల్పింపఁబడిన పుణ్యాపాపంబులయందుఁ బుణ్యాధీశ్వరుండగునింద్రుని భోగప్రదవారంబును, పాపాధీశ్వరుండగుయముని సర్వలోకమృత్యుహరవారంబును సృజియించి జ్యోతిశ్చక్రప్రతిష్ఠితులును, సుఖదుఃఖసూచకులు నగు నాదిత్యాది సప్తదేవతలను యథాక్రమంబుగ నీ సప్తవారంబుల కధిపతులం గావించి యాయావారములయం దాయాదేవతలు వారానుసారంబులగు ఫలంబులఁ బ్రసాదించునట్టి పూజలను గల్పించి యుండెను. పండితు లయ్యాదిత్యాది సప్తవారంబులయందును నాదిత్యాది సప్తగ్రహంబులను బరితృప్తులం గావించినచోఁ గ్రమంబుగ నారోగ్యంబును, సంపదయు, వ్యాధిశాంతియుఁ, బుష్టియు, నాయువును, భోగంబును, మృత్యుహానియు నగునని నిర్దేశించి యున్నారు. ఏదేవతలఁ బూజించినను సర్వాత్ముండగు శివుండు పూజాఫలమును బ్రసాదించుచున్నాఁడు. దేవతాప్రీతికొఱకుఁ దత్తన్మంత్రజపంబును, హోమంబును, దానంబును, తపంబును, స్థండిలప్రతిమానల బ్రాహ్మణాదులయం దర్చనంబు ననుపంచవిధపూజ లమ్మహాదేవుచేతనే కల్పింపఁబడియెను. అందుత్తరోత్తరంబుకంటెఁ బూర్వపూర్వంబు ఫలజనకంబగును. పూర్వవిధియం దశక్తులగువారు పరవిధియందుఁ బ్రవృత్తులు కావలయును. మానవుండు నేత్రశిరోరోగంబులును, కుష్ఠంబును శాంతించుకొఱకు నేకదినంబును, నేకమాసంబును, నేకవర్షంబును, బురాతనదుష్కృతం బతిబలవంతంబయ్యేనేని వర్షత్రయంబును నాదిత్యదేవు నర్చించి బ్రాహ్మణ సంతర్పణంబు గావించు

చున్నచో రోగశాంతి యగును. ఆయావారములయం దాయావారాధిపతులగు దేవతలను యథావిధిఁ బూజించుచున్నచో నాయావారఫలంబులు సంపన్నంబులగునని బుధులు వచియించియున్నారు. ఆదివారంబున నతిప్రయత్నపూర్వకంబుగ నుత్తమోత్తమంబులగు వస్తువుల నాదిత్యునకును, దేవతలకును బ్రాహ్మణులకును సమర్పించినచో సకలపాపశాంతి యగును. సంపత్కాముం డగువాఁడు సోమవారంబున లక్ష్మ్యాదిదేవతల నర్చించి యాజ్యాన్నంబునఁ బత్నీసహితులగు బ్రాహ్మణులను సంతృప్తులం గావింపవలయును. రోగశాంతిం గోరువాఁడు మంగళవారంబునఁ గాళీప్రభృతి దేవతలను బూజించి యాఢకపరిమితం బగు మాషముద్గాన్నంబున బ్రాహ్మణపరితృప్తిం గావించుట విహితంబు. బుధవారంబున దధ్యన్నదానంబున విష్ణుదేవు నర్చించువాఁడు సర్వదా పుత్రమిత్రకళత్రసంపత్కలితుం డగును. ఆయుష్కాముం డగువాఁడు గురువారంబునఁ బుష్టిసిద్ధికొఱకు నుపవీతవస్త్రక్షీరాజ్యంబులచే దేవతాగణంబులఁ బూజింపవలయును. భోగార్థి యగువాఁడు శుక్రవారంబున దేవతల నర్చించి షడ్రసయుక్తం బగు నన్నదానంబున బ్రాహ్మణులం దనియించి యుత్కృష్టవస్త్రాదులచే రమణీజనంబులఁ దృప్తిపఱుపవలయును. అపమృత్యుహరణంబునకై శనివారంబున రుద్రాదిదేవతలం బూజించి తిలహోమంబును, దిలదానంబును, దిలాన్నదానంబున బ్రాహ్మణక్షున్నివారణంబును గావింపవలయును. ఎవ్వఁ డీవిధంబుగ దేవగణంబుల నర్చించుచుండునో యాతఁడు నిశ్చయంబుగ నారోగ్యాదిఫలసిద్ధులం గాంచుటకు సమర్థుం డగును. నిత్యదేవతాపూజనంబును, గాదే నొకప్పుడు సమధిక దేవతాపూజయు, స్నానంబును, దానంబును, జపంబును, హోమంబును, ద్విజగణసంతోషసాధనంబును, దిథినక్షత్రయోగంబులను, నాదిత్యాదివారంబులను నాదిత్యాదిదేవతార్చనంబును గావించువానికి సర్వజ్ఞుండును, జగ

దీశ్వరుండును, జంద్రశేఖరుండు నగు శివుండే తత్తద్దేవతారూపంబున సాధకుల కారోగ్యాది సకలఫలంబులఁ బ్రసాదించుచుండును. కాని దేశకాలపాత్రోపకరణద్రవ్యంబులను బట్టియు, సాధకుని భక్తిశ్రద్ధలం బట్టియు, లోకానుసారంబునను బూర్వోక్తఫలంబులకు న్యూనాధిక భావంబులు గలుగుచుండును. దేవతాపూజనంబు సర్వవిధంబుల నభీష్టఫలసంపాదనంబున కేకమాత్రసాధనంబు గావున గృహస్థుండు శుభారంభసమయంబునను, నశుభాంతంబునను, జన్మనక్షత్రంబునను గృహంబున నారోగ్యాదిసమృద్ధికోఱకు నాదిత్యాదిగ్రహంబులఁ బూజింపవలయును. కావున శుభఫలాకాంక్షు లగువారెల్లరును యథావిధిగ సప్తవారంబుల నాదిత్యాదిగ్రహసమారాధనంబు చేయుచుండవలయును. ఇట్టి పూజలయందు బ్రాహ్మణులకు వేదమంత్రంబులును, నితర వర్ణంబులకుఁ దాంత్రికమంత్రంబులును విహితంబులు. దరిద్రుండు తపోమూలంబునను, ధనాఢ్యుండు ధనమూలంబునను దేవతారాధనంబు గావింపవలయును. అట్లు గావించువాఁ డుత్తరజన్మంబున నుత్తముండై పుట్టి పరమశ్రద్ధాపూర్వకంబుగ నిట్టి సత్కార్యంబు లాచరించు బునర్జన్మంబున వివిధభోగోపభోగంబులం గాంచి భూమండలంబున నుత్కృష్టుండగును. ధనవంతుండగువాఁడు భోగలాభార్థము సర్వదా వృక్షంబులను, జలాశయంబులను, బ్రాహ్మణ గృహంబులను బ్రతిష్ఠించుచు సర్వప్రకారంబులధర్మోపార్జనంబు గావించుచుండవలయును. అట్లు గావించుచున్నచో నాతనికిఁ గాలానుసారంబుగఁ బుణ్యపరిపాకంబున జ్ఞానలాభంబగును. ఇయ్యధ్యాయంబు చదివినవారికిని, జదివించినవారికిని, వినినవారికిని, వినిపించినవారికిని దేవయజ్ఞ ఫలంబు సిద్ధించును.

## దేశకాలవిశేషపూజాఫలము.

పవిత్రంబగు గృహంబున యజ్ఞాదులంగావించినచో సమానఫలంబును, గోష్ఠంబున గృహంబుకంటె దశగుణాధికఫలంబును, జల

తీరంబున గోష్ఠంబుకంటె దశగుణాధికఫలంబును. బిల్వాశ్వత్థతులసీ మూలంబుల జలతీరంబుకంటె దశగుణాధికఫలంబును సిద్ధించును. ఇట్లే దేవాలయమును, తీర్థస్థానంబును, నదీతీరంబును, తీర్థనదీతీరంబును, సప్తలింగానదీతీరంబును నుత్తరోత్తరదశగుణాధికఫలంబు లని యెఱుంగవలయును. గంగయు, గోదావరియుఁ, గావేరియుఁ, దామ్రపర్ణియు, సింధువును, సరయువు నీయేడునదులును సప్తగంగలని సుప్రసిద్ధంబులైనవి. మఱియు నీసప్తగంగలకంటెను, సముద్రతీరంబును, దానికంటెఁ బర్వతాగ్రంబును దశగుణాధికఫలజనకంబులు. మనంబున కభిమతంబగుస్థానం బన్నిటికంటె నధికఫలదాయకం బని బుధులు నిర్దేశించి యున్నారు. యజ్ఞదానాదికంబులకుఁ గృతయుగంబునఁ బూర్ణఫలంబును, త్రేతాయుగంబునఁ ద్రిపాదఫలంబును, ద్వాపరంబునం దర్ధఫలంబును, గలియం దేకపాదమాత్రఫలంబును, క్రమంబుగఁ గలియుగము కొంతకాలం బతీతంబైనవెనుక యాపాదఫలంబునం దేకపాదన్యూనఫలంబును సిద్ధించును. పరిశుద్ధాత్ముం డగువాఁడు శుద్ధదినంబునఁ బుణ్యకార్యంబు గావించినచో సమానఫలంబును, రవిసంక్రమణంబున దశగుణాధికఫలంబును, విషుసంక్రాంతియు, నయనసంక్రాంతియు, మకరసంక్రాంతియుఁ జంద్రగ్రహణంబును క్రమక్రమంబుగ దశగుణాధిక ఫలదాయకంబులు. ఉత్తమంబగు సూర్యగ్రహణకాలంబునఁ గావించు పుణ్యకార్యంబులు సంపూర్ణఫలదంబులు. జగదాత్మస్వరూపుండగు సూర్యదేవుని రాహుగ్రాసవిషయోగంబు సకలజీవులకును రోగప్రదంబుగావున నట్టివిషశాంతికొఱకు స్నానదానజపంబులఁ గావించుట విధేయంబు. జన్మనక్షత్రంబునను, వ్రతాంతంబునను గావించుపుణ్యకార్యంబులు సూర్యగ్రహణ సమయమునందలి కార్యంబులవలెనే సంపూర్ణఫలప్రదంబు లగును. మహాత్ముల సమాగమంబు లభియించినకాలంబు కోటిసూర్యగ్రహణకాలతుల్యంబని

చెప్పుదురు. తపోనిష్ఠులును, జ్ఞాననిష్ఠులు నగుయోగులును, యతులును పాపనాశనకారణులు గావునఁ బూజాపాత్రు లగుచున్నారు. మఱియుఁ జతుర్వింశతిలక్షసంఖ్యాక మగు గాయత్రీమంత్రజపంబు గావించిన బ్రాహ్మణుండును సంపూర్ణఫలప్రదపూజా పాత్రుండు కాఁగలఁడు. దాతను బతనమునుండియుఁ, బాతకముల నుండియుఁ బరిత్రాణంబు గావించువారే పాత్రులని శాస్త్రంబు లుద్ఘోషించుచున్నవి. గాయకుని బరిత్రాణంబు సేయునది కావున గాయత్రి యగుచున్నది. అర్థవిహీనుండు ధనదానంబునకుఁ గాని యట్లుపరిశుద్ధుం డితరులను బవిత్రులఁ జేయఁజాలఁడు. ధనాఢ్యుండర్థుల కిష్టార్థంబుల కొసంగ సమర్థుండగునట్లు విశుద్ధుండును, బుణ్యాత్ముండు నగువాఁ డనాయాసంబుగఁ బరపరిత్రాణంబు సేయఁగలఁడు. గాయత్రీ జపమూలంబున నాత్మశుద్ధుండగునట్టివాఁడే విశుద్ధబ్రాహ్మణ పదవాచ్యుండు. అది కారణంబుగ దానజపహోమపూజాది కార్యంబులయందు దానాది గ్రహణంబునకు బ్రాహ్మణుండే పాత్రుండును, సమర్థుండు నగుచున్నాఁడు. స్త్రీపురుషులయం దెవ్వరైనను క్షుధార్తులగువారే యన్నదానమునకుఁ బాత్రులు. సమాహితుండును, నభీష్టఫలప్రదాన సమర్థుండును, దానగ్రహణాకాంక్షియు, విచక్షణుండును, శ్రేష్ఠుండునగు బ్రాహ్మణునాహ్వానించి యుచితసమయంబున యథేచ్ఛానుసారముగ దానముం గావించినచో నాదానము సంపూర్ణ ఫలజనకంబగును. ప్రార్థనానంతరంబునం గావించుదానం బర్ధఫలంబును, సేవకున కొసంగుదానము తదర్థఫలంబును నొసంగునని పండితులు వక్కాణించి యున్నారు. దీనుండగు జాతిమాత్రబ్రాహ్మణునకు ధనదానము చేసినచో దశవత్సరములు భూలోకసుఖంబును, వేదజ్ఞుండగు విప్రున కొసంగినచో దశవత్సర స్వర్గసుఖంబును, గాయత్రీజపయుక్తబ్రాహ్మణున కొసంగినచో దశవత్సర సత్యలోకసుఖంబును, విష్ణుభక్తవిప్రున

కొసంగినచో దశవత్సర వైకుంఠసుఖంబును, శివభక్తపిప్రుని కొసంగినచో దశవత్సర కైలాససుఖంబును లభియించును. ఆదివారంబున బ్రాహ్మణునకు దశాంగసహితంబగు నన్నదానంబు సేయువాఁడుత్తరజన్మంబున దశవర్షంబు లారోగ్యలాభమ్ముం గాంచును. ఆహ్వానంబును, సతిశయసన్మానంబును, సభ్యంగనంబును, పాదసేవయు, వస్త్రాది పూజాసమర్పణంబును, ఘృతాపూపసమన్వితంబును, షడ్రసోపేతంబును, బహువ్యంజనసహితంబునగు నన్నంబును, దక్షిణయుఁ, దాంబూలంబును, నమస్కారంబును, ననుగమనంబు నను నివి యన్నదానంబునకు దశవిధాంగంబులు. ఇట్లు దశాంగంబులతో రవివారంబున దశబ్రాహ్మణుల కన్నదానంబు గావించినవాఁ డుత్తరజన్మంబున శతవర్షారోగ్యవంతుం డగును. ఇతరవారములయం దన్నదానంబు తత్తద్వారానురూప ఫలదంబగును. అన్నదానంబుచేఁ బరజన్మంబున సుఖభోగంబు లభియించును. సప్తవారంబులయందును బదిమంది బ్రాహ్మణులకు దశాంగసహితంబుగ నన్నదానంబు చేసినచో నుత్తరజన్మంబున శతవర్షంబులు నారోగ్యాది సుఖోపభోగంబులు సిద్ధించును. ఆదివారంబున శతబ్రాహ్మణుల కన్నదానంబు చేసినవాఁడు శివలోకంబున సహస్రవర్షంబు లారోగ్యవంతుండై యుండును. అట్లే సహస్రబ్రాహ్మణసమారాధనంబు చేసినయెడల నయుతవత్సరము లట్టిఫలంబే లభియించును. సోమాదివారములయందుఁగూడ నట్టి ఫలంబుల నెఱుంగునది. ఆదివారంబున గాయత్రీపూతాత్ములగు సహస్రబ్రాహ్మణుల కన్నదానంబు చేసినచో సత్యలోకంబునను, నయుతబ్రాహ్మణుల కాచరించినచో విష్ణులోకంబునను, లక్షబ్రాహ్మణులకొసంగినచో రుద్రలోకంబునను నారోగ్యాది లాభంబులు సిద్ధించును. విద్యార్థులగువారు బ్రహ్మబుద్ధితో బాలకులకును, పుత్రార్థులగువారు విష్ణుబుద్ధితో యువకులకును, జ్ఞానార్థులగువారు రుద్రబుద్ధితో వృద్ధులకును, బుద్ధికాము

లగువారు సరస్వతీబుద్ధితో బాలికలకును, భోగార్థులగువారు లక్ష్మీబుద్ధితో యువతులకును, నాత్మజ్ఞానార్థులగు సాధువులు పార్వతీబుద్ధితో వృద్ధరమణులకును నన్నప్రదానంబు చేయవలయును. బ్రాహ్మణునకు శిలోంఛవృత్తులచే సంపాదితంబగు ద్రవ్యంబు గురుదక్షిణగ సంపాదించిన ధనంబును, నుత్తమద్రవ్యంబు నాఁబడు. అది దానంబున సంపూర్ణఫలజనకంబు. ప్రతిగ్రహాదులవలన లభించుద్రవ్యంబు మధ్యమంబు. కృషివాణిజ్యాదులచేఁ గలుగుధనం బధమంబు. క్షత్రియునకు వీరత్వార్జితధనంబును, వైశ్యునకు వాణిజ్యార్జితధనంబును, శూద్రునకు వేతనలబ్ధధనంబును నుత్తమంబులని పండితులు నిర్దేశించియున్నారు. మానవులు చైత్రాదిద్వాదశమాసంబులయందు నభీష్టసిద్ధికొఱకు యథాక్రమంబుగ గో, భూ, తిల, హిరణ్యాజ్య, వస్త్ర, ధాన్య, గుడ, రౌప్య, లవణ, కూష్మాండ కన్యాదిద్వాదశదానంబులను గావింపవలయును. కాదేని వసంతర్తువునందే ద్వాదశ దానములనొక్కసారిగనైనఁ జేయవలయును. గోదానంబు గావించినచో నుపకారకంబగు గోమయంబుచే ధనధాన్యాదికము నాశ్రయించిన పాపంబును, బవిత్రగోమూత్రమూలంబున, జలస్థలజనితంబగు పాపంబును, క్షీరదధిఘృతాదులచేఁ గాయికాదిత్రివిధపాపంబులును శాంతించుటయేగాక క్షేమంబు గలుగునని బుధులు చెప్పుదురు. భూదానంబున నిహపరంబులయందుఁ బ్రతిష్ఠాలాభంబు గలుగును. తిలదానంబున బలంబును మృత్యువిజయంబును లభించును. హిరణ్యదానంబున జఠరవృద్ధియు, బలాధానంబు నగు. ఆజ్య దానంబునఁ బుష్టియు, వస్త్ర దానంబున నాయుర్వృద్ధియు, ధాన్య దానంబుచే నన్నసమృద్ధియు, గుడ దానంబున మధురభోజ్య ప్రాప్తియు, రౌప్య దానంబున శుక్రవృద్ధియు, లవణదానంబున షడ్విధరసాస్వాదనంబును, సర్వవిధవస్తుదానంబులచే సర్వప్రకారసమృద్ధిలాభంబును, కూష్మాండ

దానంబునబుష్టియుఁ, గన్యాదానంబున నుభయలోకసకలభోగప్రాప్తి యుం గలుగును. పనసామ్రకపిత్థాది తరుఫలంబులను, గదళ్యాది గుల్మఫలంబులను మాషముద్గాదిధాన్యంబులను, శాకంబులను, మరీచ సర్షపాదిశాకోపకరణంబులను నేఁబుతువునం దేపి దొరకునో వాని నాబుతువునందు శ్రోత్రాదిపంచేంద్రియతృప్తికొఱకును, శబ్దాదిదశవిధ భోగ్యవస్త్రావభోగార్థంబును, నిరంతరము బ్రాహ్మణులకు దానంబు చేయవలయును. గురుముఖంబునం దెలిసికొన్న వేదశాస్త్రార్థజ్ఞానం బునఁ గర్మంబునకు ఫలంబుగలదని యెఱుంగుటయే యాస్తిక్యంబు నా బడు. బంధుభయంబుచేఁగాని, రాజభయంబుచేఁగాని, చేయంబడు కర్మాచరణంబునకు శ్రద్ధయని పేరు. అది నికృష్టంబు. దరిద్రుండగు వాఁడు ద్రవ్యవిహీనుండగుట కారణంబుగా వాచికకాయికయజన కార్యానుష్ఠానతత్పరుండు గావలయును. జపస్తోత్రపాఠాదికంబులు వాచికయజనంబు లనియు, దీర్థయాత్రావ్రతాదికంబులు కాయికయజ నంబుఁ లనియుఁ బండితులు నిర్దేశించియున్నారు. దేవతా తృప్తిసాధ నంబునకై కొలఁదిగాని గొప్పగఁగాని కావించు సత్కార్యంబు సుఖోపభోగకారణం బగును. తపంబును దానంబును మానవునకు నిరంతరకర్తవ్యములు. దేవతాతృప్తికొఱకు స్వవర్ణగుణశోభితంబు లగు గృహాదిదానంబులు గావించినచో నిహపరలోకంబుల సకల సుఖోపభోగంబులు లభియించుటయే గాక యుత్తమ జన్మప్రాప్తి యుఁ గూడ లభియించునని బుధులు చెప్పుదురు. కర్మఫలంబును బరమేశ్వరార్పణంబు గావించి యీ సకలకార్యంబుల నాచరించు వాఁడు మోక్షపదంబు గాంచఁగలఁడు. ఈయధ్యాయమును నిరంతర మును బఠించువానికిని, వినువానికిని ధర్మబుద్ధియు, జ్ఞానవృద్ధియు నగుచున్నది.

## —♦ పార్థివప్రతిమాపూజావిధి. ♦—

ఋషివరులారా ! సద్యోదుఃఖవినాశకంబగు పార్థివప్రతిమా పూజ యపమృత్యునివారకంబును, గాలమృత్యు రక్షణసమర్థంబు నైనది. అది పుత్రపౌత్రధనధాన్యాది సకలసంపత్ప్రదాయకంబును, సమస్తభోగప్రదంబునైనది. సర్వాభీష్టప్రదాయకంబగునట్టి యుత్తమ పూజం గావించుటకు స్త్రీపురుషులకు సమానాధికారము కలదు. నదీ తటాకకూపాదిజలమధ్యంబున మృత్తికాహరణంబు గావించి సంశోధ నంబుచేసి యుత్తమమండపంబున దుగ్ధసంస్కృతంబును, సంగప్రత్యంగ యుక్తంబును, సస్త్రశస్త్రసమన్వితంబును, బద్ధాసనసంస్థితంబు నగు ప్రతిమను గావించి భక్తిపూర్వకంబుగఁ బూజింపవలయును. బ్రాహ్మణుండు గణేశసూర్యమాధవ దుర్గాశివప్రతిమా శివలింగపూజ నంబును నిరంతరము నాచరించుచుండవలయును. సంపూర్ణఫలకాంక్షి యగువాఁడు షోడశోపచారంబులఁ బూజించి పుష్పప్రోక్షణంబును, సమంత్రకంబుగ నభిషేకంబును గావింపవలయు. కుడవపరిమాణం బగు శాల్యన్నంబుచే నైవేద్యంబు గావింపవలయును. గృహప్రతిష్ఠిత ప్రతి మాపూజనంబున నైవేద్యంబు కుడవపరిమాణంబును, ఋషిప్రతిష్ఠిత ప్రతిమాపూజనంబునఁ బ్రస్థపరిమాణంబును, దేవస్థాపిత ప్రతిమా పక్షంబునఁ బ్రస్థత్రయ పరిమాణంబును, ననాదిమూర్తి పక్షంబునఁ బంచప్రస్థపరిమాణంబును నివేదనంబు గావలయును. ఆఱుప్రస్థముల నైవేద్యం బధికఫలప్రదంబగును. సహస్రప్రస్థనివేదనంబు గావించు ద్విజుండు సత్యంబుగ సత్యలోకావాసుం డగును. ద్వాదశాంగుళవిస్తా రంబును, బంచవింశత్యంగుళదీర్ఘంబును, బంచదశాంగుళోర్ధ్వంబును నగు సమోదారుమయంబగు పాత్ర శివంబని బుధులు విధించియు న్నారు. ఆపాత్రయం దెనిమిదవభాగము ప్రస్థము. ప్రస్థంబున నాలవ వంతు కుడవంబు. జలతైల గంధాదులు మానుషప్రతిష్ఠితలింగంబులకు

దశప్రస్థంబులును, ఋషిప్రతిష్ఠిత లింగంబులకు శతప్రస్థంబులును, సనాద్ధిలింగంబులకు సహస్రప్రస్థంబులును సమర్పింపవలయును. స్నానంబున నాత్మశుద్ధియు, గంధదానంబునఁ బుణ్యలాభంబును, నైవేద్యంబున నాయుర్వృద్ధియుఁ బరితృప్తియు, ధూపసేవనంబున ధనలాభంబును, దీపసమర్పణంబున జ్ఞానలాభంబును, తాంబూలంబున భోగప్రాప్తియుఁ గలుగునుగావున నిత్యాయుకార్యంబులు నతిభక్తిశ్రద్ధలతో నాచరింపవలయును. నమస్కారంబును, జపంబును సర్వాభీష్టప్రదంబులుగావున భోగమోక్షార్థి యగువాఁడు పూజావసానంబున వానిం గావింపవలయును. ప్రథమంబున మానసికపూజనాచరించి పిమ్మటఁ బూర్వోక్తకార్యంబులం దీర్పవలయును. మానవుం డేదేవత నారాధించునో యాదేవతాలోకముం గాంచఁగలఁడు. వినాయకపూజనంబున భూలోకంబున యథాభిలషిత ఫలసిద్ధికలుగును. శ్రావణశుక్లపక్షంబున శుక్రవారంబునను, భాద్రపదశుక్లపక్షంబునఁ జతుర్థీతిథియందును, ధనుర్మాసంబున శతభిషానక్షత్రంబునను విఘ్నేశ్వరు నారాధింప వలయును. శతదినంబులుగాని, సహస్ర దినంబులుగాని నియమపూర్వకంబుగ నగ్నిదేవు నారాధించినవారికిఁ బుత్రప్రాప్తియు, సర్వాభీష్టసిద్ధియు నగును. సుకృతలాభంబును, దురితనాశనంబును గూడ నగును. విహితంబులగు వారంబులయందు శివాది దేవతల నారాధించినచో నాత్మశుద్ధియగునని బుధులు నిర్దేశించి యున్నారు. తిథినక్షత్రయోగాదులకు వారమే యాధారంబై సకలకామప్రదాయకంబగుచున్నది. అట్టివారంబునకు వృద్ధిక్షయంబులు లేకుండుటచేతనే దానిని బరిపూర్ణపరబ్రహ్మస్వరూపంబుగ బండితులు ప్రకీర్తించుచున్నారు. సూర్యోదయము మొదలు మరల సూర్యోదయంబగు నంతవఱకును గలకాలంబునకు వారం బనిపేరు. అది బ్రాహ్మణాది వర్ణంబులకుఁ గర్మప్రవర్తకం బగుచున్నది. తిథ్యాదియందలి దేవపూజ సంపూర్ణ

ఫలప్రదంబు. తిథియందలి రాత్రియుక్తం బగు పూర్వభాగంబు పితృ కార్యంబులకును, దివాయుక్తం బగు పరభాగము దేవకార్యంబులకును ప్రశస్తంబు. మధ్యాహ్నకాలంబునఁ బ్రవేశించినతిథి యుదయంబునఁ బ్రవేశించినట్లుగనే భావింపవలయును. దేవకార్యంబులయందుఁ దిథి వారనక్షత్రంబులు శుభకరంబులగువానిం గ్రహించి పూజాజపంబులఁ గావింపవలయును. పూజాశబ్దంబునకు భోగఫలసిద్ధిదాయకం బను నర్థంబు వేదంబులయందు నిర్దేశింపఁ బడియెను. అట్టి పూజాకార్యంబుచే నభిలషితభోగంబును, నభీష్టజ్ఞానసిద్ధియు నగును. నిత్యనైమిత్తికంబులగు కర్మంబులు కాలాంతరంబున ఫలప్రదంబు లగుచున్నవి. కామ్యకర్మంబు లనుష్ఠానమాత్రంబుననే ఫలసిద్ధి నొసంగుచుండును. నియమితంబులగు మాసంబులును, పక్షంబులును, వత్సరంబులును, యథాక్రమంబున విధివిహితఫలదాయకంబు లగును. కృష్ణపక్షచతుర్థీ దినంబున గణేశ్వరుం బూజించినచోఁ బక్షపాపక్షయంబును బక్షభోగ ఫలంబును సిద్ధించును. చైత్రశుక్లచతుర్థీ దినంబునఁ బూజించినచో నేకమాస పాపక్షయంబును, నేకమాస భోగఫలంబును సిద్ధించును. సూర్యుండు సింహస్థుండైనప్పుడు భాద్రపదంబునఁ జతుర్థీ తిథియందుఁ బూజించినచో నేకవర్ష పాపక్షయంబును, నేకవర్ష భోగఫలంబును సిద్ధించును. శ్రవణానక్షత్రయుక్త రవివారంబునను, హస్తానక్షత్రసహిత సప్తమీతిథియందును, మాఘశుక్లసప్తమీతిథియందును, జ్యేష్ఠభాద్రపదమాసములయందలి బుధవారంబులను, శ్రవణా నక్షత్రయుక్త ద్వాదశీతిథియందును భగవానుండగు నాదిత్యు నారాధింపవలయును. ద్వాదశియందు విష్ణు యజనంబు గావించినచో నభిలషిత ఫలసిద్ధి యగును. శ్రవణా నక్షత్ర యుక్త శుభతిథులయందు విష్ణుదేవు నారాధించినచో నభీష్టసిద్ధియు, నారోగ్యవృద్ధియు నగును. ద్వాదశి దినంబున విష్ణుదేవుని ద్వాదశనామంబులచేతను ద్వాదశబ్రాహ్మణు

లను షోడశోపచారంబులచేఁ బూజించినచో విష్ణుప్రీతి యగును. ఇట్లే సమస్తదేవతలను బూజించుటయందు గ్రహించునది. ఐశ్వర్యార్థి యగువాఁడు శ్రావణమాసంబున సోమవారంబున, మృగశీర్షానక్షత్ర యుక్త నవమీతిథియం దఖిలభోగప్రదాయిని యగు నంబికాదేవి నారాధింపవలయును. ఆశ్వీజశుద్ధనవమీ తిథియందలి జగదంబాపూజ సర్వాభీష్టప్రదాయకంబు. విశేషించి రవివారయుక్తంబగు కృష్ణచతుర్దశియందలి జగదంబాపూజ విశేషఫలప్రదంబు. సామాన్యముగ నార్ద్రానక్షత్రంబునఁగాని, రవివారయుక్తంబగు నార్ద్రానక్షత్రంబునఁ గాని శివునిం బూజించినచో విశేషఫలప్రదంబగును. రవివారయుతంబగు నార్ద్రానక్షత్రంబునకు మహార్ద్రయని పేరు. జ్యేష్ఠమాసంబున మహార్ద్రాయుక్తంబగు చతుర్దశియందు శివపూజం గావించినచో నాయుర్వృద్ధియు, మృత్యుభయాపహంబును, సకలాభీష్టప్రదంబు నగుచున్నది. మార్గశిరంబున నార్ద్రానక్షత్రంబున షోడశోపచారంబులచే శివుని బూజించుటయు, శివపాదసందర్శనంబు గావించుటయు, శివారాధనంబు సేయుటయు భోగమోక్షఫలప్రదంబులు. కార్తికమాసంబున నియమితవారంబులయందు నియమితదేవతారాధనంబు విశేషఫలప్రదంబు. కావున బుద్ధిమంతుండగు మానవుండు కార్తికమాసంబున తపోదానజపహోమ నియమోపవాసంబులచే నిఖిలదేవతల నారాధించి పరితృప్తులం గావింపవలయును. అట్టి కార్తికమాసంబున షోడశోపచార ప్రతిమాపూజనంబును, మంత్రపూర్వక బ్రాహ్మణ భోజనంబును గావించినచోఁ గామక్రోధాదులచే జనించిన పీడలు శాంతించును. కార్తికదేవపూజనంబున భోగసంసిద్ధియు, రోగశాంతియు నగుటయేగాక సకలభూతగ్రహాదుల యుపద్రవంబులును దూరీభూతంబు లగును. కార్తికమాసంబున సూర్యదేవుని బూజించి తైలకార్పాసదానంబులఁ గావించినచోఁ గుష్ఠాది రోగోపశాంతి

యగును. మఱియుఁ గార్తికమాసంబున హారిత కీమరీచవస్త్రక్షీరాది ప్రదానంబును, బ్రాహ్మణస్థాపనంబును గావించినచో క్షయరోగంబు నివారణం బగును. దీపదానంబునను, సర్షపదానంబునను నపస్మార రోగం బుపశమిల్లును ; కార్తిక సోమవారంబునఁగాని, కృత్తికానక్షత్రయుక్త సోమవారంబునఁగాని శివుని బూజించినచో నతిశయదారిద్ర్యనాశంబును సర్వప్రకారసంపల్లాభంబు నగును. కార్తికమంగళవారంబునఁగాని, కృత్తికాయుక్త మంగళవారంబునఁగాని గృహాక్షేత్రదీపఘంటాదిదానంబులఁ గావించి గృహోపకరణంబులచేఁ గార్తికేయుని బూజించినచో వాక్సిద్ధియగును. కార్తికబుధవారంబునఁగాని, కృత్తికాబుధవారంబునఁగాని విష్ణుపూజ గావించి దధ్యోదనదానంబు చేసినచో సాధుసంతానలాభం బగును. కార్తిక గురువారంబునఁగాని, కృత్తికాగురువారంబునఁగాని ధనదానంబుచే బ్రహ్మపూజనంబు చేసి మధుస్వర్ణఘృతదానంబులఁ గావించినచో బహుభోగలాభం బగును. అట్లే శుక్రవారంబున గణపతిని బూజించి గంధపుష్పాది దానంబు గావించినచో భోగ్యవస్తువృద్ధియగును. అట్లే శనివారంబున స్వర్ణరౌప్యాదిదానంబును, దిక్పాలపూజనంబును గావించినచో వంధ్యయైనను సుపుత్రవతి యగును. ఆదినంబున నిట్లే దిగ్గజంబులను, నాగంబులను, సేతుపాలకగణంబును, రుద్రుని, పాపహారుండగు విష్ణుదేవుని బూజించినచోఁ బూర్వోక్తఫలంబు సిద్ధించును. ఇట్లే బ్రహ్మను బూజించినచో జ్ఞానలాభంబును, ధన్వంతరిని నశ్వినీ కుమారులను బూజించినచో రోగాపమృత్యుభయనివారణంబును నగును. ధనుర్మాసంబున ప్రాతఃకాలంబున నాదిత్యునిబూజించి లవణలోహతైలమాషాదులను, త్రికటుఫలగంధయుక్త జలాదులను నితర ద్రవపదార్థములను, గఠినపదార్థములను బ్రస్థపరిమాణంబుగఁ గాని, పలపరిణామంబుగఁ గాని దానంబు చేసినచో స్వర్గప్రాప్తి యగును. శివప్రీతి

నిఖిల దేవగణంబులకును బరితృప్తికొఱకు శాల్యన్నంబును, హవిష్యంబును నైవేద్యంబు సేయవలయును. ఇట్లు గావించుట ప్రశస్తంబు. ధనుర్మాసంబున వివిధంబులగు నన్నంబులచే నైవేద్యంబు చేయుట విశేషఫలప్రదంబు. మార్గశీర్షమాసంబున నన్నప్రదానంబు గావించువానికి సర్వాభీష్టసిద్ధియుఁ బాపక్షయంబును, నారోగ్యంబును, ధర్మప్రవృద్ధియు, విజ్ఞానంబును, సదనుష్ఠానలాభంబును నగును. ధనుర్మాసంబున నన్నదానంబుసేయువాఁ డిహపరసుఖంబులం గాంచఁగలఁడు. భోగాభిలాషియగువాఁడు మార్గశిరమాసంబునఁ బ్రాతఃకాలంబునఁగాని ధనుర్మాసం బతిక్రమింపకుండ వరుసగ దినత్రయంబుగాని దేవపూజలం గావింపవలయును. సూర్యుండు ధనురాశియందున్న కాలంబునకు ధనుర్మాసంబని పేరు. అట్టి ధనుర్మాసంబంతయు, జితేంద్రియుండును నిరాహారుండునై మధ్యాహ్నపర్యంతంబును వేదమాతయగు గాయత్రీమంత్రంబును జపించుచు నిద్రించు పర్యంతంబును బంచాక్షరమంత్రజపంబు చేయు బ్రాహ్మణుఁడు జ్ఞానలాభంబు గాంచి యంతంబున ముక్తుం డగును. అన్యజాతిస్త్రీపురుషులు త్రికాలస్నానంబును, బంచాక్షరమంత్రజపంబును గావించినచో విశుద్ధజ్ఞానలాభంబు గాంచెదరు. నిరంతరము నిష్టమంత్రజపంబుచేయుచున్నచో మహాపాపక్షయంబగును. ధనుర్మాసంబున భావపరిమిత శాలితండులంబులును, ప్రస్థపరిమితమరీచంబులునుగూర్చి మహానివేదనంబు గావింపవలయును. ఈ మహానైవేద్యంబునఁ బ్రతివస్తువును ద్వాదశ సంఖ్యాపరిమితంబై యుండవలయును. కుడువ పరిమితంబగు మధువును, నాజ్యంబును, ద్రోణ పరిమిత ముద్గంబులును, ద్వాదశ విధవ్యంజనంబులును, ఘృతపక్వంబులగు నపూపంబులును, మోదకంబులును, ద్వాదశప్రస్థపరిమితంబులగు దధిక్షీరంబులును, ద్వాదశ సంఖ్యాకంబులగు నారికేళాది ఫలంబులును జగ్ధ

పంద్రెండు పోకలును, ముప్పదియాఱు తములపాకులును, గర్పూరంబును, గస్తూరియు, సున్నంబును నేలాలవంగాది పంచ సుగంధ ద్రవ్యంబులునుగల తాంబూలంబును గలసినచో మహానైవేద్యంబగును. అట్టి మహానైవేద్యంబును దేవతానివేదనంబు గావించి వర్ణానుసారంబుగ భక్తులకుఁ బ్రదానంబు చేయవలయును. కేవలము నన్ననివేదనంబున స్వర్గప్రాప్తి యగును. సహస్రమహానైవేద్య దానంబున సత్యలోకప్రాప్తియు, త్రింశత్సహస్ర మహానైవేద్యదానంబున సత్యలోకంబున కూర్ధ్వలోకప్రాప్తియు, జన్మరాహిత్యంబును నగును. షట్త్రింశత్సహస్ర మహానైవేద్యంబులకు జన్మనైవేద్యం బని పేరు. అట్టిదానంబు మహాపూర్ణం బని చెప్పంబడును. మహాదేవ నైవేద్యంబునకును జన్మనైవేద్యంబని చెప్పుదురు. అట్టి జన్మనైవేద్యంబు చేయువానికిఁ బునర్జన్మంబు లేదు. సంక్రాంతిని, వ్యతీపాతంబునను, జన్మనక్షత్రంబునను; బున్నమను, నమావాస్యను, గార్తికమాసంబునఁ బుణ్యదివసంబునను, జన్మనైవేద్యంబు గావించుటకుఁ బ్రయత్నింపవలయును. జన్మతిథియందును, జన్మనక్షత్రంబునను, జన్మనైవేద్య ప్రదానంబు చేయవలయును. సకలపుణ్యయోగ సమ్మిళినసమయంబునఁగాని శనిదివసంబునఁగాని సహస్రజన్మనైవేద్యంబులఁ గావింపవలయును. జన్మనైవేద్యప్రదానంబున జన్మదానఫలం బగును. జన్మదానంబున శివప్రీతియు, సాయుజ్యలాభంబును నగును. కావున శివునుద్దేశించియే జన్మనైవేద్యంబు గావింపవలయును. యోనిలింగరూపంబున శివుండే జన్మంబునకుఁ గారణుండు గావున జన్మనివృత్తికొఱకు శివపూజయే ముఖ్యముగ నాచరింపవలయును. స్థావరజంగమాత్మకంబగు నీజగంబంతయును బిందునాదాత్మకంబై యున్నది. బిందువు శక్తియనియు, నాదంబు మహాదేవుం డనియు నెఱుంగునది. కావున సర్వప్రపంచమును శివశక్త్యాత్మకంబైనది. బిందువు నాదాధారంబైనది.

జగంబు బింద్వాధారమైనది. బిందునాదంబులు జగదాధారంబులై యున్నవి. బిందునాదాత్మకంబులగు సకలవస్తువులును గళామూలంబున సమ్మిళితంబులయ్యెను. అట్టి సమ్మేళనంబుననే విశ్వసృష్టియయ్యెను. బిందునాదాత్మకంబగు లింగంబు జగత్కారణం బని చెప్పంబడుచున్నది. బిందువు సాక్షాద్దేవియును నాదంబు శివుండును గావున నియ్యుభయాత్మకం బగులింగంబు శివలింగం బయ్యెను. అట్లగుటం జేసి జన్మనివృత్తికొఱకు శివలింగమునే పూజింపవలయును, బిందురూపయగుదేవి తల్లియును, నాదరూపుండగు శివుండు తండ్రియు నగుచున్నారు. మాతాపితరులు పూజితులై పరమానందము నొసంగుచుందురు. కావునఁ బరమానందలాభంబుకొఱకు శివలింగమును బూజింపవలయును. ఆదేవి జగన్మాతయు, నాశివుండు జగజ్జనకుండు నగుటచే సేవించుపుత్రులయెడల దల్లిదండ్రులగువారికి నిరంతరము ననురాగము వర్ధిల్లుచుండును. తల్లిదండ్రులు తమకుపచారంబుల గావించుతనయునకు గుప్తంబగునైశ్వర్యము నొసంగుచుందురు. కావున నంతర్గతనిగూఢానందలాభంబునకై జననీజనకస్వరూపంబగు శివలింగమును బూజింపవలయును. మహాదేవుండు పురుషస్వరూపుండును, పార్వతీదేవి ప్రకృతిస్వరూపిణియు నని బుధులు నిర్దేశించి యున్నారు. అవ్యక్తాంతరధిష్ఠానగర్భుండగువాఁడు పురుషుండనియు, సువ్యక్తాంతరధిష్ఠానగర్భంబగునది ప్రకృతియనియుఁ జెప్పంబడును. ఆదిగర్భుండగు పురుషుండు ప్రకృతిరూప గర్భసంబంధంబున గర్భవంతుండై జగజ్జనకుండయ్యెను. పురుషునినుండి ప్రకృతియందు సంక్రమించుట ప్రథమజన్మమనియుఁ, బ్రకృతినుండి వ్యక్తతాలాభంబు నొందుట ద్వితీయజన్మంబనియు నెఱుంగునది. జీవునకు జననమరణంబులు పురుషునివలననే కలుగుచున్నవి. మాయామూలంబునఁ బ్రకటీకృతంబును నుత్పాదితంబు నగునది జన్మంబు నాఁబడు. జన్మకాలంబుమొదలు జీర్ణించువాఁడుగావునఁ బ్రా

గులు జీవులని చెప్పంబడుచున్నారు. జన్మప్రభృతి మాయాపాశబద్ధు లగుటచే జీవులని కొందఱుఁ జీవశబ్దంబున కర్థనిర్ణయంబు సేయుచున్నారు. అట్టిజీవుండు జన్మపాశనివృత్తికొఱకు జన్మలింగపూజనంబు గావింపవలయును. భం + వృద్ధిని గ + పొందుచుండునది కావునఁ బ్రకృతికి భగశబ్దంబు వర్తించుచున్నది. కావుననే శివుండు భగవానుం డయ్యెను. అట్టి భగవానుం డగు శివుండే భోగదాతయగుం గాని యితరులెవ్వరు నట్టివారు కారు. ప్రకృతినాథుం డగు నా సదాశివుని బండితులు భర్గుండని పిలుచుచున్నారు. పురుషునితోడి ప్రకృతియును, ప్రకృతితోడిపురుషుండు నిహపరలోకంబులయందు భోగకారణు లగుచున్నారు. కావున శివలింగస్వరూపుండును భగవానుండు నగు మహాదేవుని బూజింపవలయును. జగత్కర్తయు, జగజ్జనకుండునగు మహాదేవుని లింగమయమూర్తిగాఁ బూజింపవలయును. శివశక్తి చిహ్నసమ్మేళన స్వరూపంబు లింగంబు గావునఁ దమ చిహ్నంబులఁ బూజించువారికిఁ బార్వతీ పరమేశ్వరులు భవదుఃఖ నివారణంబు గావింతురు. బాహ్యాభ్యంతరంబుల షోడశోపచారంబులచేఁ బ్రకృతి పురుష స్వరూపం బగు శివలింగమును బూజింప వలయును. ఆదివారంబున నిట్లు షోడశోపచారంబులచే శివలింగమును బూజించినవారికిఁక జన్మాంతరంబు గలుగదు. ఆదివారంబునందుఁ బ్రణవ మూలంబున మహాలింగపూజనంబు గావింపవలయును. రవివారంబునఁ బంచగవ్యాభిషేకంబు విశేష ఫలప్రదంబగును. గోమయంబును, మూత్రంబును, దుగ్ధంబును, దధియు, ఘృతంబును ననునీయైదును బంచగవ్యంబులని యెఱుంగునది. వీనిని దేనెచేగాని, బెల్లముచేఁ గాని శర్కరచేఁగాని సమ్మేళనంబు గావింపవలయును. ప్రణవమంత్రంబుచే గోక్షీరాన్న నైవేద్యంబు గావింపవలయును. ప్రణవంబు ధ్వని లింగంబు; నాదలింగంబు; స్వయంభూలింగంబు; ప్రణవయంత్రంబు

— లింగక్రమకథనము. —

సర్వకామప్రదంబగు ప్రణవంబు ప్రథమలింగంబు. అతిసూక్ష్మంబును, నిష్కలంబు నగునది సూక్ష్మప్రణవలింగంబు; సకలంబును బంచాక్షరసమన్వితంబు నగునది స్థూలప్రణవలింగంబు. ఈయుభయవిధలింగపూజనంబునకుఁ దపంబని పేరు. ఈ యుభయలింగములే సాక్షాన్మోక్షప్రదంబులు. మఱియుఁ బురుషప్రకృతిసంభవంబు లగు లింగంబు లనేకంబులు గలవు. అట్టి లింగంబులంగూర్చి సవిస్తరంబుగఁ జెప్పుటకు శివునకుఁ దక్క నన్యుల కసాధ్యంబు. అయినను వానిలో భూసంబంధము లగు విజ్ఞాతలింగంబులం గూర్చి యెఱింగించెదను. ప్రథమంబు స్వయంభూలింగంబు; ద్వితీయంబు బిందులింగంబు; తృతీయంబు ప్రతిష్ఠితలింగంబు; చతుర్థంబు చరలింగంబు; పంచమంబు గురులింగంబు. ఋషిదేవతాదుల తపంబునకు మెచ్చి వారికి దర్శనం బిచ్చుటకై జగద్బీజస్వరూపుండును నాదరూపియుఁ బృథివ్యంతరస్థితుండు నగు మహాదేవుండు స్థావరాంకురముం బోలి భూమిని భేదించుకొని స్వయంబుగ నుత్పన్నుం డగుచుండును. అట్టి లింగంబునకు స్వయంభూలింగం బని పేరు. అట్టి లింగమును బూజించుటవలన జ్ఞానాభివృద్ధి యగును. సువర్ణంబునఁ గాని, రజతంబునఁ గాని, భూమియందుఁ గాని, వేదికమొదలుగాఁగల సమున్నతంబులును, బరిష్కృతంబులు నగు స్థలంబులయందుఁగాని, స్వహస్తలిఖితంబును, విశుద్ధంబును, బ్రణవాత్మకంబు నగు లింగంబునకు బిందులింగం బని పేరు. ఇట్టి యంత్రలింగంబు నంకితంబు చేసి ప్రతిష్ఠించి యావాహనంబు గావింపవలయును. బిందునాదమయంబులగు స్థావరజంగమలింగంబు లన్నియును శివదృష్టంబులే యనుట కించుకంతయును సంశయములేదు. ఎచ్చట శివుండు కలఁడను విశ్వాసము కలుగుచున్నదో యచ్చటనే యద్దేవుండు విశ్వసించువానికి ఫలప్రదుం డగుచున్నాఁడు. స్వహస్తలిఖితంబులగు స్థావ

రాద్యకృత్రిమ యంత్రంబులయందు శివావాహనంబు గావించి షోడశోపచారంబులచేఁ బూజింపవలయును. ఇట్లు పూజించుటవలన నైశ్వర్యప్రాప్తియును, జ్ఞానలాభంబు నగును. దేవతలుగాని, మహర్షులుగాని తమతమ యాత్మసిద్ధికొఱకు విశుద్ధమండలంబున మంత్రపాఠపూర్వకంబుగ నిర్మించి వినిర్మలభావనాపూర్వకంబుగఁ బ్రతిష్ఠించిన యుత్తమలింగంబు పౌరుషంబనియుఁ, బ్రతిష్ఠితలింగంబనియుఁ బ్రకీర్తితంబగుచున్నది. నిత్యము నిట్టిలింగమును బూజించువాని కణిమాది సిద్ధులును బౌరుషైశ్వర్యంబును సిద్ధించును. మహాత్ములగు సాధువులును, బ్రాహ్మణులును, మహారాజులును, మహాధనవంతులును శిల్పిమూలంబున నిర్మించి మంత్రపూర్వకంబుగ స్థాపించిన లింగంబులును బ్రతిష్ఠితలింగంబులును, బ్రాకృతలింగంబులు నగుచున్నవి. అవి ప్రాకృతైశ్వర్యదాయకంబులు. ప్రభానసంపన్నంబును నిత్యంబు నగునది పౌరుషంబనియు, దుర్బలంబును, ననిత్యంబు నగునది ప్రాకృతంబనియు బుధులు నిర్దేశించియున్నారు. కటిప్రదేశము, హృదయము, ముఖము, నాభిజిహ్వ నాసాగ్రము ననుస్థానంబులయందు శిఖారూపంబున విలసిల్లు నాధ్యాత్మికలింగంబునకుఁ జరలింగంబని పేరు. పర్వతసమూహంబు పౌరుషంబు. భూతలంబు ప్రాకృతంబు. వృక్షాదులు పౌరుషంబులు, లతాదులు ప్రాకృతంబులు; శాలిగోధూమాదిధాన్యంబులు పౌరుషంబులు, షాష్టికంబులు ప్రాకృతంబులు. అణిమాదిసిద్ధిప్రదంబగు నైశ్వర్యంబు పౌరుషంబు. ఆస్తికులు సుందరీజనధనాది విషయంబును బ్రాకృతైశ్వర్యంబని చెప్పుదురు. చరలింగంబులలో రసలింగంబు ప్రధానంబు. రసలింగంబు బ్రాహ్మణులకు సకలాభీష్టదాయకంబు. బాణలింగంబు క్షత్రియులకు రాజ్యప్రదంబును శుభావహంబు నగుచున్నది. సువర్ణలింగంబు వైశ్యులకు మహాధనప్రదంబు. శిలాలింగంబు శూద్రుల కతిశుభప్రదంబు. కాని స్ఫటికమయంబగు

బాణలింగం బెల్లవారికిని సర్వకామఫలప్రదం బగుచున్నది. స్వప్రతి ష్ఠితలింగంబులేనివా రితరుల లింగమును బూజించినను దోషంబులేదు. సువాసినులగు సతులకుఁ బార్థివలింగంబు విశేషఫలప్రదంబు. సంసా రాసక్తలగు విధవలకు స్ఫాటికలింగంబు ఫలదాయకంబైనది. బాల్యం బుననైనను, యౌవనంబుననైనను, వృద్ధత్వముననైనను మోక్షమునే వాంఛించువిధవలు రసలింగమునే పూజింపవలయును. సామాన్య ముగ స్త్రీలకు శుద్ధస్ఫటికమయలింగమే నిఖలభోగప్రదం బగుచున్నది. సర్వవిదుండగు గురునితోఁ గలసి పూజాప్రారంభంబు గావించువాఁ డఖిలవిధంబులగు లింగపూజలను జేయుటకు సమర్థుండగును. అభిషే కానంతరంబున శాల్యన్నని వేదనంబు గావింపవలయును. పూజానంత రంబున లింగమును బ్రత్యేకగృహంబున సంపుటమధ్యంబున రక్ష ణంబు గావింపవలయును. మానసపూజాపరాయణులగు భక్తులు స్వభోజ్యంబులగు పదార్థములనే నివేదనంబు గావింపవలయును. ముముక్షువులకు సూక్ష్మలింగం బుత్కృష్టఫలప్రదంబు. ఆలింగమును విభూతిచే నర్చించి విభూతిదానంబుచేసి పూజించి సర్వదామస్తకం బున ధరియింపవలయును. విభూతి లౌకికంబనియు, వైదికంబనియు, శైవాగ్నిజంబనియు మూఁడువిధంబుల విలసిల్లుచున్నది; లౌకికాగ్నిజం బగు భస్మంబు మృత్తికాదాదులోహరౌప్యధాన్యప్రభృతిద్రవ్యంబుల శుద్ధికొఱ కుపయోగపడుచున్నది. తిలాదులును, వస్త్రాదులును, బర్యుషితవస్తువులును భస్మమూలంబునఁ బరిశుద్ధంబు లగును. శున కాదులచే దూషితంబులగు వస్తువులును భస్మమూలంబునఁ బరిశు ద్ధంబులగును. యథోచితంబుగ భస్మమును సజలంబుగఁగాని, నిర్జలం బుగఁగాని యుపయోగింపవలయును. ఈవిధంబుగఁ గర్మసంపన్నం బైనవెనుక వైదికాగ్నిజన్యంబగు భస్మధారణంబు గావింపవలయును. మంత్రపాఠపూర్వకంబుగ ననుష్ఠితంబులగు సత్క్రియలచేఁ గూడిన

సత్కర్మం బగ్నియందు భస్మరూపముం దాల్చుచున్నది. కావున నట్టి భస్మధారణంబునఁ గర్మం బాత్మసమారోపితం బై నట్లగుచున్నది. అఘోరాత్మక మంత్రమూలంబున బిల్వకాష్ఠంబును బ్రజ్వలింపఁ జేసి కావించిన యగ్నికి శివాగ్ని యని పేరు. దానివలనం గలిగిన భస్మంబు శివాగ్నిజం బగుచున్నది. కపిలగోమయంబును, గాదేని సామాన్య గోమయంబును, జమ్మి, రావి, మోదుగు, మఱ్ఱి, జువ్వి, మారేడు మొదలగు సమిధలును శివాగ్నిచే దగ్ధము చేయఁగానగు శుద్ధభస్మంబును శివాగ్నిజం బగును. పూర్వోక్తశివమంత్రోచ్చారణ పూర్వకంబుగ దర్భాగ్నిచేఁ గాష్ఠదహనంబు గావించి యాభస్మమును వస్త్రమూలంబున సంశోధనంబుచేసి నూతనకుంభమునందుంచి దీప్తి కొఱకు దానిని ధరింపవలయును. అదియును శివాగ్నిజభస్మంబగును. పూర్వకాలంబున శివుండు భస్మశబ్దంబునకు మాన్యంబనియుఁ బుణ్యం బనియు నర్థనిర్దేశంబు గావించి యుండెను. రాజు తనరాజ్యమునందలి సారమును గర (పన్ను) మూలంబున గ్రహించునట్లు మానవుండు సస్యసమిద్దహనంబు గావించి యందలి సారరూపంబగు భస్మమును గ్రహించుచున్నాఁడు. జఠరానలము బహుపరిమాణంబులును, బహు విధంబులు నగు భక్ష్యపదార్థములను దహించి యందలి సారమునుండి సారతరపదార్థమును గ్రహించి శరీరపోషణంబు గావించునట్లు జగత్కర్తయగు పరమేవ్వరుండు తన కధిష్ఠేయం బగు ప్రపంచమును దహించి దానినుండి సారమును గ్రహించుచుండును. శివుండు జగంబును దహించి యాభస్మమును దనయం దారోపితంబు గావించును. ఉద్ధూలన (వస్త్రఘూళితము) చ్ఛలంబున నమ్మహాదేవుండు జగత్సారమును గ్రహించుచున్నాఁడు. ఆకాశసారరూపంబగు భస్మమును గేశములయందును, వాయుసారరూపభస్మమును ముఖమునందును, నగ్నిసారరూపభస్మమును హృదయమునందును, జలసారరూపభస్మమును

కటిప్రదేశమునందును, భూసారరూపభస్మమును జానువులందును నీ విధంబుగ మహాదేవుండు సర్వాంగంబులను భస్మావలేపనంబు గావించు కొనుచుండును. మహేశ్వరుండు బ్రహ్మావిష్ణురుద్రుల సారంబును గ్రహించి త్రిపుండ్రధారణంబు గావించియున్నాఁడు. ఈసకలసారంబులను జగదవనసమర్థంబులని యెఱింగియే శివుండు ప్రపంచసారసర్వస్వంబును దనవశంబు గావించుకొనియెను. తన్ను వశపరచుకొనువారెవ్వరునులేరు. గావున నాతండు శివనామంబునఁ బ్రసిద్ధుండయ్యెను. శవర్ణంబునకు నిత్యసుఖానందంబులును, ఇకారంబునకుఁ బురుషుండును, వకారంబున కమృతశక్తియు నర్థంబులగుటచే నీత్రివర్ణంబులును గలసి శివశబ్దంబగుచున్నది. కావున భక్తుండు తన్ను శివస్వరూపునిగాఁ జేసికొని శివార్చనంబు గావింపవలయును. కావున ముందుగ భస్మోద్ధూళనంబు చేసి త్రిపుండ్రధారణంబు గావింపవలయును. పూజాసమయంబున జలసహితంబుగను, నితరసమయంబుల జలరహితంబుగను భస్మమును ధరింపవలయును. పగలైనను, రాత్రియైనను, బురుషుఁడైనను, స్త్రీయైనను బూజాసమయంబునఁ ద్రిపుండ్రసహితంబుగా సజలభస్మధారణంబు సేయవలయును. సజలంబగు భస్మంబుచేఁ ద్రిపుండ్రధారణంబు చేసి శివపూజంగావించువానికి సంపూర్ణఫలంబు లభియించును. శివమంత్రోచ్చారణపూర్వకంబుగ భస్మధారణంబు చేసి నిరంతరమును త్తమాశ్రమంబు నాశ్రయించువాఁడు శివపరాయణుండనియు, శివాశ్రమయనియుఁ బ్రకీర్తితుం డగుచున్నాఁడు. ఏకమాత్రశివవ్రతావలంబనంబుగలవానికి జాతాశౌచమృతాశౌచంబులు లేవు. అట్టివాఁడు లలాటాగ్రంబున శుభ్రభస్మధారణంబును, నిజహస్తంబునఁగాని గురుహస్తంబునగాని మృత్తికాతిలకధారణంబును గావింప వలయును, గుణనిరోధంబు గావించునాతఁడే గురుండని చెప్పంబడుచున్నాఁడు. గుణాతీతుండగు పరమశివుండు గురురూపంబు నాశ్రయించి వికారరహి

తంబులగు రాజసాదిగుణంబులను దిరోధానంబు నొందించును. ఆతఁ డట్లు గుణనిరోధంబు గావించి శిష్యులకందఱకును శివస్వరూప ప్రబోధంబు గావించుటం జేసి గురునామంబున నభిహితుం డగుచున్నాఁడు. కావున గురుశరీరంబును బూజ్యలింగం బగుచున్నది. అట్టి గురులింగమును బూజించుట గురుశుశ్రూషయగును. త్రికరణంబుల గురుసేవనంబు గావించినచో శాస్త్రజ్ఞానోత్పాదనం బగును. గురుండు చెప్పిన కార్యము శక్యంబైనను, నశక్యంబైనను ధనప్రాణంబుల నర్పించియైన సంపన్నంబు గావించుపూతాత్ముండు గురుశాసనానుసారి యగుశిష్యుం డని కీర్తింపఁబడుచున్నాఁడు. సుశిష్యుండగువాఁడు గురునకుఁ దన్నును దనధనంబును వినియోగించి ప్రథమంబునఁ బక్వాన్నంబు నాతనికి నివేదించి యనంతరమునఁ దాను భుజియింపవలయును. నిరంతర గుర్వాజ్ఞాపరిపాలకుం డగుశిష్యుండు పుత్రుండని చెప్పంబడును. కర్ణరూపం బగుజన్మస్థానంబున, జిహ్వారూపంబగు లింగంబునుండి మంత్రస్వరూపతేజంబు ప్రసరించుటం జేసి శిష్యరూపపుత్రుండుత్పన్నుం డగుచున్నాఁడు. కావునఁ బుత్రరూపుండగు శిష్యుండు పితృస్వరూపుండగు గురుని బూజింపవలయును. కన్నతండ్రి కుమారుని సంసారసాగరనిమగ్నునిం గావించుచున్నాఁడు కాని జ్ఞానదాతయగు గురురూపజనకుండు శిష్యరూపతనయుని సంసారమునుండి యుద్ధరించుచున్నాఁడు. కావునఁ దండ్రికిని గురునకును గలయీభేదమును గ్రహించి పితృస్వరూపుం డగు గురు నారాధింపవలయును. శరీరసంవాహనాది క్రియలచేతను, నిజోపార్జిత ధనాదులచేతను గురుసేవ గావింపవలయును. గురుదేవుని పాదములు మొదలు కేశపర్యంతమునుగల సర్వాంగకంబులను పాదుకాది వస్తుదానంబులచేతను, సువర్ణాద్యలంకార దానంబులచేతను, పాదగ్రహణ స్నానాభిషేక నైవేద్యంబులచేతను భక్తిపూర్వకంబుగ నర్చింపవలయును. గురుపూజనమూలంబుననే పరమాత్ముం డగుశివుని

పూజ సంపన్నంబగును. గురుపూజా విశిష్టవస్తువులచే నాత్మశుద్ధి గావించుకొనవలయును. గురుపూజా విశిష్టంబులును, శివోచ్ఛిష్టంబులు నగుజలాన్నాదివస్తువులు శివభక్తులకును శిష్యులకును గ్రాహ్యంబులును భోగ్యంబులు నగుచున్నవి. గురునియాజ్ఞలేకుండ నేవస్తువునైనను గ్రహించినచో జౌర్యసదృశంబగుపాపంబు ప్రాప్తించుచున్నది. గురునిర్యాణసమయంబునఁ బూర్వగురునికంటెను విశేషజ్ఞుండగువానిని గురునిగాఁ బ్రయత్నపూర్వకంబుగ గ్రహింపవలయును. అజ్ఞానమోచనంబే గురుకార్యంబు. విశేషజ్ఞుం డగునట్టిగురుండే యజ్ఞానమోచనంబునకు సమర్థుం డగుచున్నాఁడు.

## శాంతిక్రియాకథనము.

సత్కర్మఫలసిద్ధికై ముందుగ విఘ్నశాంతి గావింపవలయును. కర్మ సర్వాంగసంపన్నంబును, నిర్విఘ్నానుష్ఠితంబు నైనచో సఫలంబగుచున్నది. కావున బుద్ధిమంతుండగువాఁడు నిఖిలకర్మారంభంబునందును విఘ్నేశ్వరుం డగు గణపతిదేవుని బూజింపవలయును. ఉపాసకుండు సర్వబాధానివారణంబుకొఱకు నిఖిలదేవతల నర్చింపవలయును. జ్వరాదిశారీరకరోగంబు లాధ్యాత్మికబాధలని చెప్పంబడుచున్నవి. పిశాచాదులయుపద్రవంబును, గృహంబున వల్మీకాదులయుత్పత్తియు, నాకస్మికముగ బల్లిమొదలగువానిపతనంబును, గచ్ఛపసర్పదుర్జనాదుల సందర్శనంబును, చెట్లు, స్త్రీలు, గోవులు మొదలగువాని యసమయ ప్రసవంబును మొదలగునవి భావిదుఃఖసూచకంబులు గావున వీని కాధిభౌతికబాధలని పేరు. అమేధ్యాద్యపవిత్రవస్తువర్షణంబును, నశనిపాతంబును, మహామారి, జ్వరమారి, విశూచిమారి, గోమారి, మసూచికామారి మొదలగునవియు, జన్మరాశియందు, జన్మనక్షత్ర గ్రహసంక్రమణంబులును, నితరదుష్టగ్రహయోగంబును మొదలగునవి యాధిదైవికబాధలు. గృహంబున శివచండాలపతితాదులస్పర్శనంబు

మొదలగు భావిబాధాసూచక సంఘటనంబు లుపస్థితంబులైనచోఁ బుద్ధిమంతులగువా రట్టి దుర్ఘటనంబుల శాంతికొఱకు శాంతియజ్ఞంబు చేయవలయును. దేవాలయము, గోష్ఠము, చైత్యము, గృహాంగణము మొదలగువానిలో నొక్కప్రదేశంబునఁ బ్రాదేశమాత్రంబును, నున్నతంబును, ద్విహస్తపరిమితంబునగు నుత్తమాలంకృతవేదికను నిర్మించి యందు భారపరిమితంబగువ్రీహిధాన్యంబును బోసి నలువంకలను బఱచి యందు మధ్యప్రదేశంబునఁ బద్మచిహ్నంబుచేసి పూర్వాది దిక్కులయందుఁ దంతువేష్టితంబులగు కుంభంబుల నుంచి యా మధ్య భాగంబున గుగ్గులుధూపసహితంబగు నొక మహాకుంభమును స్థాపింప వలెను. అష్టదిక్కులను రసాలపల్లవ సహితంబులగు కలశములను స్థాపించి వానియందు సుగంధపంచద్రవ్యసమన్వితంబులగు జలంబులను బోయవలయును. మఱియు వానియందు నీలాదినవరత్నములను నిక్షేపించి శాంతికర్మనిపుణుండును, సపత్నీకుండు నగు నాచార్యునిని మంత్రితునింజేసి పిమ్మట నా వేదికయందు విష్ణుమహేంద్రాదిదేవతల స్వర్ణవిగ్రహంబులను స్థాపించి సమస్తకంబగు మధ్యకుంభంబున విష్ణుదేవు నావాహనంబు గావించి పూజింపవలయును. తరువాతఁ బూర్వాది దిగ్భాగములయందలి యింద్రాదిదేవతలను వారివారి నామంబుల నుచ్చరించుచు యథాక్రమంబుగఁ బూజింపవలయును. ఆవాహనాది నిఖిలకార్యంబులును నాచార్యుని మూలంబుననే గావింపవలయును. ఆచార్యుండు బుత్విజునితోఁగూడ నీనామమంత్రములను నూఱుసారులు జపింపవలయును. జపానంతరమునఁ గుంభంబునకుఁ బశ్చిమభాగంబునఁ గోటియైనను, లక్షయైనను, సహస్రంబైనను, నష్టోత్తరశతంబైనను, హోమంబు గావింపవలయును. ఏకదినంబైనను, నవదినంబులైనను, మండలదినంబులైనను యథాయోగ్యంబుగ దేశకాలపాత్రంబుల ననుసరించి యీశాంతికర్మంబు గావింపవలయును.

శాంతికొఱకు శమీహోమంబును, వృత్త్యర్థంబు పలాశహోమంబును గావింపవలయును. సమిధలు, నన్నంబును, నాజ్యాది ద్రవ్యంబులును, మొదలగువానిచే నైనను యథావిధిగ హోమంబు చేయవలయును. ఏద్రవ్యంబులచే హోమం బారంభింపఁబడియెనో యాద్రవ్యంబుల చేతనే పూర్తి గావింప బడవలయును. కర్మానంతరంబునఁ బుణ్యాహవాచనంబు సేయుచు జలసంప్రోక్షణంబు గావింపవలయును. హోమసంఖ్యానుసారంబుగ బ్రాహ్మణభోజనంబు చేయింపవలయును. ఆదినంబున నాచార్యుండును ఋత్విజులును, హవిష్యంబుమాత్రము భుజియింపవలయును. సకలహోమానంతరంబునను నాదిత్యాది నవగ్రహపూజ చేయవలయును. తరువాత ఋత్విజులకు యథాక్రమంబుగ నవరత్నదక్షిణదానంబు నొసంగి దశదానంబులఁ జేయవలయును. పిమ్మట భూరిదానంబును గావించి పిమ్మట సభర్తృకలకును, కన్యలకును, విధవలకునుగూడ దానంబు చేయవలయును. తరువాత సకలోపకరణంబులు నాచార్యునకు నివేదింపవలయును. ఉత్పాతంబులును, మారీప్రభృతిదుఃఖంబులును మొదలగువానికి యముండధిపతిగావున యముప్రీతికొఱకు కొకయమప్రతిమాదానంబు గావింపవలయును. నూఱుగాని, పదిగాని నిష్కంబులతోఁ బాశాంకుశధరుండును, పురుషరూపియు నగు యమునిప్రతిమను నిర్మింపఁజేసి దానిని దక్షిణాసహితంబుగ దానము చేయవలయును. తరువాతఁ బూర్ణాయుష్యంబుకొఱకుఁ దిలదానంబు చేసి సహస్ర బ్రాహ్మణభోజనంబు చేయింపవలయును. దరిద్రుండైనచో నూర్గురుబ్రాహ్మణులకైనను సంతర్పణంబు చేయవలయును. దరిద్రుండు విత్తాభావంబు గలవాఁడు గావున యథాశక్తిని గార్యానుష్ఠానంబు గావింపవలయును. భూతాదుల యుపద్రవంబు శాంతించుటకై భైరవమహాపూజ చేయవలయును. కర్మావసానంబున శివునుద్దేశించి మహాభిషేకంబును, నైవేద్యంబును గావించి భూరి

భోజన ద్రవ్యంబులచే బ్రాహ్మణభోజనంబు చేయింపవలయును. ఈ విధంబుగ యజ్ఞానుష్ఠానంబు గావించినచో దోషశాంతి యగును. ప్రతివత్సరంబునను, ఫాల్గుణమాసంబున నిట్లు శాంతియజనంబు తప్పక చేయుచుండవలయును. ఏదైన దుర్దర్శనంబైనయప్పుడు తత్క్షణంబునఁ గాని యేకమాసాంతరంబునఁగాని శాంతికర్మంబు చేయవలయును. మహాపాతకాదులు తటస్థించినప్పుడు భైరవపూజ చేయవలయును. మహావ్యాధులు సంభవించినప్పుడు మరల నీశాంతియజ్ఞంబు చేయవలయును. ఏవిధంబుచేనైనను గర్వోచితంబులగు ద్రవ్యంబులను సంపాదించుట కసమర్థుండగు దరిద్రుండు దీపదానమాత్రంబు గావింపవలయును. దానికిఁగూడ నశక్తుండగువాఁడు స్నానంబుచేసి యథాసాధ్యంబుగఁ గొంచెమైనను దానంబుచేసి మంత్రపాఠపూర్వకంబుగ నూటయెనిమిదిసారులు సూర్యనమస్కారంబు గావింపవలయును. నమస్కారరూపంబగు యజ్ఞమూలంబున నిఖిలదేవతలును సంతుష్టులగుదురుగావున బుద్ధిమంతుండగువాఁడు వేయిదైనను, బదివేలైనను, లక్షయైనను, గోటియైనను నమస్కారంబులఁ గావింపవలయును.

సీ. సాంబ ! సదాశివ ♦ సగుణతేజోరూప !
నమ్రమదేదీప్యమా ♦ నస్వరూప !
ఆకాశరూపమ ♦ హాత్స్వరూపుఁడ వయ్యు
నోదేవ ! నీవు శూ ♦ న్యుఁడవు గావు
నిలిపి యుంచితి బుద్ధి ♦ నీయందె, నాముందు
నీదివ్యరూపంబు ♦ నిలిచి యుండె
నాయహంకారంబు ♦ నాశనం బైనది
సాష్టాంగపడి యుంటి ♦ సమ్ముఖమున
నఖిలభువనస్వరూప ! ది ♦ వ్యస్వరూప !
మత్స్వరూపుండ వగునీకు ♦ మంగళునకు

నాత్మదాసానుదాసుండ ♦ నైన నన్ను
శ్రీకృపాసాంగకలన ర ♦ క్షింపుమయ్య !

అని యివ్విధంబుగ నాత్మయజ్ఞరూపంబగు నమస్కారంబు కల్పించి శివ నివేదనంబును దాంబూలప్రదానంబును గావింపవలయును. అనంతర మష్టోత్తర శతపర్యాయంబులు శివునకు స్వయముగఁ బ్రదక్షిణంబు చేయవలయును. మఱియు నితరులచే వేయిగాని, పదివేలుగాని, లక్షగాని, కోటిగాని ప్రదక్షిణంబులు చేయింపవలయును. శివప్రదక్షిణంబున ముహూర్తమాత్రంబున సకలపాపంబులును వినష్టంబులగును. దుఃఖమూలంబు వ్యాధియు, వ్యాధిమూలంబున పాతకంబు నగుచున్నది. అట్టిపాతకంబు ధర్మప్రభావంబుననే యపనోదనం బగుచున్నది. శివునుద్దేశించి కావించు కర్మంబులన్నియును బాపక్షయకారణంబు లగుచున్నవి. శివునుద్దేశించి కావించు కర్మంబులలోఁ బ్రదక్షిణంబే ప్రధానంబు. క్రియారూపంబగు ప్రణవజపంబే ప్రదక్షిణంబు. జననమరణద్వయంబు మాయాచక్రంబు నాఁబడు. అట్టి శివమాయాచక్రంబునకు బలిపీఠంబని పేరు. బలిపీఠంబునుండి యారంభించి ప్రదక్షిణక్రమంబుగఁ బదవిన్యాసంబు సేయుచు మరల బలిపీఠంబునఁ బ్రవేశించి నమస్కారంబు చేయవలయును. ఇట్లు కావించుటయే ప్రదక్షిణం బగుచున్నది. ప్రదక్షిణక్రమగమనంబున జన్మలాభంబును, నమస్కారంబున నాత్మసమర్పణంబు నగుచున్నది. జననమరణంబులను శివమాయాచక్రంబున సమర్పితములుగాఁ జేయవలయును. ఈ యుభయంబును శివమాయాచక్రంబున సమర్పించువానికిఁక జన్మంబు గలుగదు. దేహమున్నంతవఱకును గ్రియాధీనుండగు జీవుండు బద్ధుండని పిలువంబడుచున్నాఁడు. దేహత్రయ వశీకరణంబే మోక్షంబు. మాయాచక్రప్రణేతయగు పరమశివుండు సర్వంబునకును మూలకారణుండు. శివమాయార్పితంబగు ద్వంద్వమును శివుండే పరిశుద్ధంబుగఁ

జేయును. కావున శివకల్పితంబగు ద్రవ్యంద్వయమును శివునియందే యర్పింపవలయును. అట్లగుటం జేసి ప్రదక్షిణ నమస్కారంబులు శివున కతిప్రియకరంబులని యెఱుంగునది. పరమాత్ముండగు శివునుద్దేశించి కావించిన ప్రదక్షిణనమస్కారంబులు షోడశోపచార పూజాఫలంబు నొసంగఁగలవు. ప్రదక్షిణనమస్కారంబులచే వినాశితంబుగాని పాతకం బీలోకంబున నేదియును లేదు. సాధకుండగు శివపూజాపరాయణుండు మౌనియు సత్యవాదిత్యాది గుణసంపన్నుండునై యథాక్రమంబుగఁ గ్రియాతపస్యాజపజ్ఞానంబుల నొక్కటొక్కటిగ ననుష్ఠానంబు గావింప వలయును. అణిమాదులగు నెనిమిది యైశ్వర్యంబులును, దివ్యదేహం బును, జ్ఞానంబును, నజ్ఞానక్షయంబును, శివసాన్నిధ్యంబునను నివి సత్క్రియాఫలంబులు. సత్క్రియాచరణమూలంబున నజ్ఞానాంధకా రంబు వినష్టంబై మానవునకు ఫలసిద్ధి యొదవుననియు, జన్మపరిశోధన హేతుభూతంబులగు క్రియాప్రభృతులు పరబ్రహ్మబుద్ధి ప్రేరణంబుననే కలుగుచున్నవనియు సద్భావంబుగలిగి యుపాసకుం డనుష్ఠానతత్పరుండు కావలయును. దేశకాలపాత్రానుసారంబుగను, ధనయోగ్యతానుసా రంబుగను భక్తిమంతుండగువాఁడు క్రియానుష్ఠానంబు సేయవల యును. బుద్ధిమంతుండగువాఁడు శివక్షేత్రంబున న్యాయపూర్వకం బుగ ధనార్జనంబు సేయుచు జీవహింసను బరిత్యజించి క్లేశశూన్యుండై నివసింపవలయును. పంచాక్షర మంత్రోచ్చారణ పూర్వకంబులగు జలాన్నంబులు సుఖప్రదంబులని యెఱుంగునది. దరిద్రునకు భిక్షా న్నంబు జ్ఞానప్రదంబగుచున్నది. శివభక్తుని భిక్షాన్నంబు శివభక్తి ప్రదంబు. శివయోగి భిక్షాన్నంబు శంభుసత్రంబు నాఁబడు. ఏయుపా యంబుచేతనైనను, నెచ్చటనైనను భక్తుండగువాడు శుద్ధాన్నభోజ నంబు చేయుచు రహస్యభేదనంబు చేయకుండ నుండవలయును. భక్తుల సన్నిధిని శివమాహాత్మ్యంబు ప్రకటించుచుండవలయును. శివమంత్ర

రహస్యంబు శివుండుదక్క నితరు లెవ్వరు నెఱుంగంజాలరు. శివభక్తుండు నిత్యమును శివలింగము నాశ్రయించి యుండవలయును. అందువలన నాతఁడు మహాదేవతుల్యుండగును. చరలింగపూజామూలంబునఁ గ్రమంబుగ ముక్తిలాభంబగుననుటకు సంశయంబు లేదు. ఎవ్వఁడీ యధ్యాయమును బఠించునో యెవ్వఁడు వినునో యట్టివానికి శివజ్ఞానలాభం బగును.

శ్రీరామచంద్ర.

# శివపురాణము.

## కైలాససంహిత.

శ్రీపార్వతీకుమారగ
ణోపేతుఁ బ్రధానునుత్త మోత్తముని శివుం
బ్రాపకు, సర్గస్థితివిల
యాపాదకుఁ గొలిచెదము ని రంతరభక్తిన్.

### — ప్రణవార్థనిరూపణము. —

తపోధనులారా! భగవానుండగు పరాశరసూనుండు నైమిశారణ్య మునీంద్రులకుం దెలిపినవిధంబునఁ బ్రణవార్థము నెఱింగించెద నాకర్ణింపుఁడు. పూర్వకాలంబున జగన్మాతయును, దాక్షాయణియు నగుసతీదేవి శివనిందాప్రసంగమును వినఁజాలక తపోబలంబున దేహత్యాగంబు చేసికొని హిమవంతునకుఁ గన్యారూపంబున నుదయించెను. పర్వతరాజంబగు హిమాలయంబున మహాదేవుండు స్వయంవరవిధానంబునఁ బార్వతీదేవిని పెండ్లియాడెను. అప్పుడు దేవి మహాదేవునిం గాంచి సర్వజ్ఞా! భక్తసులభా! పరమామృతవిగ్రహా! సృష్టిస్థితిప్రభృతిపంచకృత్యవిధాయకా! పరమేశ్వరా! దేవా! నేను దాక్షాయణీదేహమును బరిత్యజించి పర్వతతనయనైతిని. కావున నీవిప్పుడు నాకు మంత్రదీక్ష నొసంగి నన్నుఁ బరిశుద్ధాత్మురాలిం గావింపుము. అని ప్రార్థించుటయు మహాదేవుండగుచంద్రశేఖరుండు దేవీ! నీకిట్టి యుద్దేశంబున్నచో నిన్నుఁ గైలాసంబునకుఁ దీసికొనిపోయి యచ్చట మంత్రదీక్ష నొసంగి పరిశుద్ధాత్మతత్త్వస్థం గావించెద నని చెప్పి యామెతోఁ గూడఁ గైలాసంబునకుం బోయి యచ్చట నద్దేవికిఁ బ్రణవాది

మంత్రదీక్ష నొసంగెను. పిమ్మటఁ బార్వతీసహితుండై పరమేశ్వరుండు నందనవనంబునకుంబోయి యచ్చట సుమాలిని మొదలగు దేవిప్రియసఖులచే వికసితంబులగు పారిజాతకుసుమంబులచే దేవి నలంకరింపఁజేసి నిజక్రోడదేశంబున నామెను గూర్చుండఁజేసికొని యామెవదనమండలంబున దృష్టిప్రసారంబు గావించుచుఁ బ్రఫుల్లముఖుండై యుండెను. ఆసమయంబునఁ బార్వతీపరమేశ్వరులకు సర్వలోక హితకరంబులును, కేవలవేదార్థసంఘటితంబులును నగువివిధ సంభాషణంబులు జరిగెను. అప్పుడు విశ్వజననియగు దేవి పతిక్రోడతలంబునందుండి పతివదనమండలంబు నవలోకించుచునిట్లనియెను. దేవ దేవా! నీవు ప్రణవాదిమంత్రంబులను నాకుపదేశించితివి. అందుఁ బ్రథమంబునఁ బ్రణవంబున కర్థంబు నెఱుంగవలయునని నిశ్చయించుకొంటిని. ప్రణవం బెట్లుత్పన్నం బయ్యెనో దానికిఁ బ్రణవంబను నామం బెట్లు కలిగెనో, తన్మంత్రం బెన్నివిధంబులో, ప్రణవంబు వేదాది యెట్లయ్యెనో, దానికి దేవతలెందఱో ఆదేవతలను ధ్యానించుటయెట్లో, క్రియలెన్నివిధంబులో మంత్రవర్ణంబుల వ్యాప్యవ్యాపకస్వభావం బెట్టిదియో, ప్రణవమంత్రంబున యథాక్రమంబుగఁ బంచబ్రహ్మ లెట్లవస్థితులై యుండిరో, దానికిఁ గళ లెన్నియో, ప్రణవప్రపంచం బెట్టిదియో, దానికి వాచకుండెవ్వఁడో, వాచ్యుండెవ్వఁడో, దానికి స్థానంబు లెన్నియో, యుపాసించుట కధికారులెవ్వరో, విషయంబు లెయ్యవియో, దానికి సంబంధప్రయోజనంబు లెట్లునిర్దేశింపఁబడియెనో, దానికనుష్ఠానప్రణాళికయుఁ బూజావిధంబు నెట్లో, పూజాకాలమునందలి మండలంబును, ఋష్యాదులును, న్యాసంబును నెట్లో నాయందు దయయుంచి సర్వంబు నెఱిఁగింపుము. అని యిట్లు దేవిప్రార్థించుటయు దేవదేవుం డిట్లనియెను. ఓ దేవీ ! ప్రణవార్థంబు నెఱుంగుటయు, నన్నెఱుంగుటయు నొక్కటియే. ప్రణవంబు సర్వవిద్యాబీజంబు. అది వట

బీజంబువలె నతిసూక్ష్మంబై నది. కాని దానికి మహదర్థంబు కలదు. ఓమ్ అను నీ ఏకాక్షరమంత్రమునందుఁ ద్రిగుణాతీతుండును, సర్వజ్ఞుండును, సర్వవ్యాపియు సర్వస్రష్టయుఁ బ్రభుండును, ద్యుతిమంతుండు నగుశివుండు వర్తమానుండై యుండును. గుణప్రాధాన్యవశంబున సమస్తవస్తునిచయంబును దానియందే యవస్థితంబై యుండును. స్థావరజంగమాత్మకంబగు సమస్తంబును విరాణ్మూర్తియును బ్రణవ శబ్దమునందే యుండుటచే నది సర్వార్థసాధకం బగు బ్రహ్మస్వరూప మగుచున్నది. అట్టిప్రణవమునుండియే ప్రప్రథమమున శివుండు సమస్త జగత్తును సృష్టించెను. కావున మహాజనులు శివునే ప్రణవంబుగను, బ్రణవంబును శివునిగను చెప్పుచున్నారు, వాచ్యవాచకంబుల కత్యంత భేదంబు లేనుగావున మనీషులగు మహర్షులు ప్రణవబ్రహ్మంబుల కభేద భావంబునూహించి సన్నేకాక్షరబ్రహ్మముగాఁ దెలిసికొనుచున్నారు. కావున నోపార్వతీ! ముముక్షుం డగువాఁడు ప్రణవంబునే బ్రహ్మ స్వరూపంబుగ నెఱుంగుచున్నాఁడు. ప్రణవం బెట్లుద్ధరింపఁబడియెనో చెప్పెదనువినుము. పూర్వంబున అకారంబును దదనంతరము ఉకారంబును, దరువాత మకారంబును, బిమ్మట బిందువును నాదంబును నీవిధంబుగాఁ బంచవర్ణాత్మకంబగు ప్రణవంబుద్ధరింపఁ బడియెను. ఈ ప్రణవమే బ్రహ్మమొదలు స్థావరపర్యంతమునుగల సమస్తజీవుల కును బ్రాణస్వరూపంబై నది. అకార- ఉకార- మకారంబులు త్రి మాత్రలు. బిందునాదంబులర్ధమాత్రా స్వరూపంబులు. అయ్యర్ధ మాత్రకే సర్వవిద్యేశ్వరత్వంబు శ్రుతులయందుఁ జెప్పంబడుచున్నది. శ్రుతు లన్నియును నావలననే జనియించినవి కావున నేను వేదాది స్వరూపుఁడను. ప్రణవము నాస్వరూపమే కావున నదియును వేదాది యగుచున్నది. అకారంబు సృష్టిసాధనం బగుబీజంబు. అది రజోగుణ ప్రధానుండును, సృష్టికర్తయు నగుబ్రహ్మదేవుని స్వరూపంబు. ఉకా

రంబు ప్రకృతి. సృష్టికాధారుండును, సత్వగుణప్రధానుండును, పాలన కర్తయు నగువిష్ణుదేవుని స్వరూపంబు. మకారంబు పురుషసృష్టిసాధన బీజసంపన్నంబు. అది తమోగుణప్రధానుండును సంహారకర్తయు నగు రుద్రదేవుని స్వరూపంబు. బిందువు సాక్షాన్మహేశ్వరస్వరూపంబు. దానిని దిరోభావం బని చెప్పుదురు. నాదము సదాశివస్వరూపంబు. అదియే సకలానుగ్రహకర్తయని చెప్పంబడుచున్నది. నాదమస్తకంబున సర్వజ్ఞుండును, సర్వకర్తయు, సర్వేశ్వరుండును, బరాత్పరుండును, నిర్మలుండును, నద్వితీయుండు నగుశివుని ధ్యానింపవలయును. ఇయ్యకారాది పంచవర్ణంబులను బరపరవర్ణంబులు వ్యాపకంబులును, బూర్వపూర్వవర్ణంబులు వ్యాప్యంబులు నగుచున్నవి. ఈ పంచవర్ణంబులను యథాక్రమంబుగ సద్యోజాతుండును, వామదేవుండును, నఘోరుండును, తత్పురుషుండును, నీశానుండు నను నీపంచబ్రహ్మలు నవస్థితులై యుందురు. వారికిని నాకును భేదము లేదు. అకారంబున సద్యస్సంభూతంబులైన యష్టకళలును, ఉకారంబు నవామదేవరూపంబులగు త్రయోదశకళలును, మకారంబున నఘోరస్వరూపంబులైన యష్టకళలును, బిందువునఁ బురుషగోచరంబులగు చతుష్కళలును, నాదంబున నీశానజంబులగు పంచకళలును బ్రవర్తిల్లుచుండును. మంత్రంబును, యంత్రంబును, దేవతయుఁ, బ్రపంచంబును, గురుండును, శిష్యుండు నను నీయాఱు పదార్థంబులును బ్రణవప్రపంచ స్వరూపం బగుచున్నది. మంత్రంబు పంచవర్ణసమన్వితంబైనది. ఆమంత్రమే యంత్రమూర్తిని ధరించుచున్నది. అట్టి యంత్రంబునందలి మండలంబులంగూర్చి తరువాతఁ జెప్పెదను. యంత్రంబు దేవతాస్వరూపంబు. ఆ దేవత విశ్వమూర్తి. గురుండును విశ్వరూపుండు. శిష్యుండు గురుదేహంబని పెద్దలు నిర్దేశించియున్నారు. ఓమ్. అను నీశబ్దంబునందుఁ బరిదృశ్యమానంబగు విశ్వంబునకును, విశ్వాత్మకం బగు బ్రహ్మంబు

నకు నభేదంబగుటంజేసి ప్రణవంబునకు వాచ్యవాచకభావము విస్పష్టం బగుచున్నది. ఓపార్వతీ మూలాధారంబును, మణిపూరంబును, హృదయంబును, విశుద్ధియు, నాజ్ఞయు, శక్తియు, శాంతియు, శాంత్యతీతంబు ననునివి యథాక్రమంబుగఁ బ్రణవస్థానంబులు. అందు శాంత్యతీతస్థానంబు సర్వోత్కృష్టంబు. దృఢవైరాగ్యవంతుండగువాఁడు దీనికధికారి యగుచున్నాఁడు. జీవబ్రహ్మైక్యభావనావశంబున నేను దీనికి విషయంబు నగుచున్నాను. జీవాత్మ నాతో నైక్యంబు గాంచుట బోధ్యంబనియు, బ్రణవంబు బోధకం బనియు, నీరీతిగా బోధ్యబోధకసంబంధ మేర్పడియెను. శుచియును, సదాచారసంపన్నుండును, వేదపారగుండును, సుబుద్ధియు నగు బ్రాహ్మణుండు, సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞుండును, నిహపరవిషయవాసనాదూరుండును, వేదాంతవిద్యావిశారదుండును, సుబుద్ధియు, శ్రేష్ఠుండును, యమనియమాదిసంపన్నుండు నగు నాచార్యునియొద్దకుం బోయి దండప్రణామంబు లాచరించి ప్రయత్నపూర్వకంబుగ నాతని సంతుష్టుం గావింపవలయును. శివుండే గురుండనియు, గురుండే శివుండనియు మనంబున నిశ్చయించుకొని గురువునొద్దఁ దన మనోరథము నెఱింగించి గుర్వాజ్ఞానుసారంబుగఁ బండ్రెండుదివసంబులు కేవలక్షీరపానంబు సేయుచు, సముద్రతీరంబునఁగాని, నదీకూలంబునఁగాని, పర్వతంబునఁగాని, శివాలయంబునఁగాని నివసించియుండి శుక్లపక్షంబునఁ బంచమినిగాని, యేకాదశినిగాని ప్రాతస్స్నానంబును, నిత్యకర్మయు సమాపనంబు గావించుకొని యథావిధిగగురువు నాహ్వానంబు చేసి నాందీశ్రాద్ధంబు గావించి యథావిధిగ నాయుష్కర్మంబు గావించుకొని మరలస్నాతుండై సక్తువు (పేలపిండి) భుజించి సాయంసమయంబున మరల స్నానంబుచేసి గురుసహితుండై సంధ్యావందనాదులం గావించి శివస్వరూపుండగు గురుని వస్త్రదక్షిణాదులచేఁ బూజించి యాత్మీయసూత్ర విధానంబున హోమద్రవ్యంబుల సేకరించి లౌకి

కాది వహ్నులను యథావిధిగ సంస్థాపించి యందు బ్రాజాపత్య హోమంబు చేసి సర్వస్వంబును దక్షిణగా నొసంగ వలయును. అనంతరము తనయం దగ్నినారోపణంబు గావించుకొని గృహం బును ద్యజించి పరివ్రాజకుండు గావలయును. అయ్యగ్నియందు సమిధలు, నన్నంబు, నాజ్యంబును, బురుషసూక్తోక్త మంత్రపూర్వకం బుగ హోమంబు చేయవలయును. అనంతరము, శ్రౌతసూత్రాను సారంబుగ హోమంబును, నగ్నికుత్తరభాగంబున నుదీచ్యకర్మంబును గావింపవలయును. పిమ్మట ముందుగాఁ గుశలను వానిపై గృష్ణాజి నంబును, దానిపై వస్త్రంబును బఱచి యట్టి సుఖాసనంబునఁ గూ ర్చుండి దృఢచిత్తంబున మౌనియై బ్రాహ్మముహూర్తంబువఱకును గాయత్రీమంత్రజపంబు చేయవలయును. తరువాత నెప్పటివలెనే స్నానాదులం గావించి చరుపాకంబుచేసి పురుషసూక్తంబు మొదలు విరజాహోమపర్యంతమును సంపూర్తి గావింపవలయును. ఇక్కా ర్యంబు వామదేవమతానుసారంబుగఁగాని, శౌనకాదిమహర్షి మతాను సారంబుగఁగాని చేయవలయును. కాని, గర్భవాసదుఃఖవిముక్తుండగు వామదేవుని మతంబే యిందుఁ బ్రధానంబైనది. పిమ్మట హోమశే షంబు దీర్చి ప్రాతఃకాలహోమంబుచేసి యాయగ్నిం దనయం దారో పించుకొని సంధ్యావందనంబుచేసి సూర్యోదయంబైనవెనుక యథా విధిగ గాయత్రీజపంబుచేసి, యీషణత్రయంబునకును, జలాంజలి నొసంగి మంత్రోచ్చారణపూర్వకంబుగ శిఖాయజ్ఞోపవీతమేఖలాదులఁ బరిత్యజించి పూర్వాభిముఖంబుగఁగాని, యుత్తరాభిముఖంబుగఁగాని పోవలయును. లోకవ్యవహారానువర్తియగువాడు యథాయోగ్యంబుగ దండంబును, గౌపీనాదులను దాల్పవలయును. ప్రపంచవిస్మృతి కలిగి కేవల వైరాగ్యబోధంబు కలవాఁడు వానిని ధరింపనక్కఱలేదు. పిమ్మట గురుసన్నిధికిం బోయి గురునకు ముమ్మారు నమస్కరించి గురు

చరణసమీపంబున నిలువవలయును. అప్పుడు గురుండు విరజాహోమ వహ్నినుండి గ్రహించిన విశుద్ధభస్మంబును శిష్యుని సర్వశరీరంబునను విలేపితంబు గావించుచు మంత్రపూర్వకంబుగఁ ద్రిపుండ్రధారణంబు సేయించి తనహృదయకమలంబున విరాజమానులగుచున్న పార్వతీ పరమేశ్వరులను ధ్యానించుచు శిష్యమస్తకంబున హస్తసంలగ్నంబు గావించి పరమానందంబుతో నాతని దక్షిణకర్ణంబున ఋష్యాది సహితంబుగఁ బ్రణవంబును ముమ్మారుచ్చరించి దానియర్థంబును శిష్యున కుపదేశింపవలయును. గురుకరుణావశంబున నిట్లు శిష్యుండు మంత్ర యంత్రాదిషడ్విధపదార్థవిజ్ఞానంబు వడసి గురునకు సాష్టాంగదండప్రణామంబు గావించి గుర్వాజ్ఞానుసారంబుగ యథావిధిని వేదాంతాభ్యాసంబు గావించుచుఁ దనయందుఁ బరమాత్మని నిత్యమును ధ్యానించుచుండవలయును. శమదమాది ధర్మనిరతుండును, వేదాంతజ్ఞానవిదుండును, యమనియమాది సంపన్నుండును నిర్మత్సరుండునగు యతియే దీని కధికారియని యెఱుంగుము. విరజంబును, విశోకంబును, విశదంబును, బరమంబును, అష్టదళశోభితంబును, గింజల్కసమన్వితంబును, గర్ణికావిలసితంబునగు హృత్పుండరీకమధ్యంబున నాధారశక్తినుండి యాధారంబును, మణిపూరంబును, హృదయంబునను తత్త్వత్రయంబు వఱకునుగల పరమస్థానమును ధ్యానించుచు నందు దహరాకాశమును భావింపవలయును. దేవీ! ఆదహరాకాశమధ్యంబున నోంకారరూపంబగు నేకాక్షరబ్రహ్మంబు నుచ్చరించుచు నిత్యంబు నేకాగ్రచిత్తంబున నిన్నును నన్నును ధ్యానించుచుండవలయును. పార్వతీ! ఈవిధముగా నుపాసించు నాతనికి శివలోకప్రాప్తి యగును. అట్టివాఁడు నావలనఁ దత్త్వజ్ఞానంబు బడసి మత్సాయుజ్యంబు గాంచును. యతియగువాఁడు బ్రాహ్మముహూర్తంబున లేచి శుద్ధస్ఫటికసన్నిభంబును, నేత్రద్వయ విలసితంబును, వరాభయకరసమన్వితంబును, శివంబును, భావనాతి

మనోహరంబును, సహస్రదళకమలపీఠసమాసీనంబును, నగుగురుస్వరూపమును ధ్యానించి గంధాదిమానసోపచారంబులచే యథాక్రమంబుగఁ బూజించి కృతాంజలియై గురుదేవునకు నమస్కరించి జగన్నాథా! ప్రాతఃకాలమునుండి సంధ్యాకాలమువఱకును, సంధ్యాకాలమునుండి ప్రాతఃకాలమువఱకును నేనాచరించునవి యన్నియు నీపూజ లగుంగాక! యని ప్రార్థించి గుర్వనుజ్ఞం గైకొని నియతచిత్తుండును, నియతేంద్రియుండునై ప్రాణాయామంబుచేసి యుపవిష్టుండై ధీశక్తిసంపన్నుండగు శిష్యుండు మూలాధారంబు మొదలు బ్రహ్మరంధ్రపర్యంతంబును విద్యుత్కోటిప్రభామయంబై యున్న యోంకారంబును ధ్యానించుచు భూతలంబునఁ దృణంబును బరచి యందు శరీరమలమోచనంబు గావించిలేచి జలాశయంబునకుం బోయి యథావిధిగ శౌచంబు నిర్వర్తింప వలయును. పిమ్మటఁ గరపాద ప్రక్షాళనంబుగావించి రెండుసారులాచమనంబుచేసి ప్రణవస్మరణంబు సేయుచు నమావాశ్యయందును నేకాదశియందునుగాక తక్కినతిథులయందు త్తరాభిముఖుండై మౌనంబుగఁ దృణంబులచేఁగాని, పత్రంబులచేఁగాని దంతధావనంబుచేయవలయును. పిమ్మటఁ బండ్రెండుసారులు గండూషంబుచేసి ముఖప్రక్షాళనంబుచేసి మగల రెండుసారులాచమనంబుచేసి మృత్తికాలేపంబునను, జలంబునను, గటిప్రదేశమును బరిశుద్ధంబు గావించుకొని యరుణోదయసమయంబున మృత్తికాస్నానంబు చేయవలయును. ఇట్టి సంధ్యాదిక్రియాసమయంబులయందు నన్నును గురువును స్మరియింపవలయును. పిమ్మట శంఖముద్రవైచి ప్రణవమంత్రంబున బండ్రెండుసారులుగాని, యాఱుసారులుగాని, మూడుసారులుగాని శిరోమార్జనంబు చేసికొని జలంబులనుండి తీరంబునకు వచ్చి కౌపీనంబును బరిశుద్ధంబు చేసి రెండుసారులాచమనంబు గావించి ప్రణవంబు నుచ్చరించుచు నంగవస్త్రసమ్మార్జనంబు గావించి దానిచేఁ బ్రథమంబున ముఖంబును, బిమ్మట మస్త

కంబును గ్రమంబుగ సమస్తదేహంబును దుడిచికొని, మానియై విశుద్ధ సూత్రసమన్వితంబగు కౌపీనంబును దాల్చి గురుసమీపమునకుఁబోయి నమస్కరించి మరల ద్వివారంబు లాచమనంబుచేసి మంత్రపూర్వకం బుగ భస్మగ్రహణంబును, నగ్నిరిత్యాదిమంత్రపూర్వకంబుగ దేహస్ప ర్శనంబును గావించి "ఆపోవా" అను మంత్రంబులచే జలంబు బరి శుద్ధంబుచేసి యాజలంబులచే భస్మంబును దడిపి మంత్రపూర్వకంబుగ భస్మసమ్మర్దనంబుచేసి యాభస్మంబును రెండు భాగంబులుగాఁజేసి యందొకదాని నైదుభాగములుగాఁజేసి క్రమంబుగ మస్తకంబునను, ముఖంబునను, హృదయంబునను, గుహ్యదేశంబునను, జరణంబులను బూసికొని యామూలంబున నీశానాదిపంచబ్రహ్మలను యథాక్రమం బుగ నభిషేకింపవలయును. అనంతరము ద్వితీయభస్మఖండమును దీసికొని ప్రణవోచ్చారణపూర్వకంబుగ సర్వాంగంబుల నభిషేకంబు గావించి చేతులు కడిగికొని యన్యంబగు భస్మముం గైకొని దానిని బూర్వమువలెనే జలంబులచే మర్దించి దానిని విధివిహితంబులగు మంత్రపాఠంబులచేతను, బ్రణవమంత్రంబుచేతను నభిమంత్రించుచుఁ గ్రమంబుగ మస్తకంబునను, లలాటంబునను, వక్షోభాగంబునను, స్కంధంబులను, నాభిని, బాహుద్వయంబునను, సంధిస్థానంబులయం దును, బృష్ఠదేశంబునందును ద్రిపుండ్రాకృతిగ ధరింపవలయును. ఇట్లు త్రిపుండ్రధారణంబు గావించి కర్తవ్యజ్ఞానసంపన్నుండగు శిష్యుండు హస్తప్రక్షాళనంబు గావించుకొని ద్వివారంబు లాచమనంబు చేసి యథావిధిగ, బంచాక్షరమంత్రోచ్చారణంబు చేయుచు నిజగురుని భావించి ధ్యానింపవలయును. అనంతరమాఱుపర్యాయములు ప్రాణా యామంబు గావించి ఋష్యాదిన్యాసంబుచేసి దక్షిణహస్తంబున జలం బు గైకొని వామహస్తముచే నాసికాదీంద్రియంబుల నిరోధించుచు నాజలంబును బ్రణవమంత్రంబుచే నభిమంత్రింపవలయును. ఇట్లు త్రివా

రంబు లభిమంత్రించి యాజలంబుచే ముమ్మారు శిరోమార్జనంబు గావించి ముమ్మారు పానంబు గావింపవలయును. తరువాత సాధకుం డేకాగ్రచిత్తుండై సూర్యమండలమధ్యస్థితుండును, సర్వతేజోమయుం డును, సప్తబాహుండును, జతుర్ముఖుండును, సకలవిద్యాగుణసంపన్నుం డును, దివ్యాలంకార విభూషితుండును, నర్ధనారీశ్వరుండును, నగు పర మేశ్వరునిగా నోంకారంబును ధ్యానించుచు యథానియమంబుగ మూఁడుసారు లర్ఘ్యప్రదానంబు గావింపవలయును. తరువాత నూట యెనిమిదిసారులు ప్రణవంబును జపించి పండ్రెండుసారులు తర్పణంబు చేసి మరల నాచమనంబు చేసి ముమ్మారు ప్రాణాయామంబు చేసి పిమ్మట యథావిధిగ ఋష్యాదిన్యాసంబు గావించి పూజాగృహంబు నకుం బోయి పాదంబులఁ గడిగికొని మౌనియైయుండి రెండుసారు లాచమనంబు చేసి దక్షిణపాదవిన్యాసపూర్వకంబుగ మండపప్రదేశము నకుంబోయి యచ్చట యథావిధిగ మండపరచనంబు చేయవలయును.

## ప్రణవయంత్రవిధానము.

ఈశ్వరుం డిట్లనియెను. ఓగిరిరాజతనయా! అనంతర ముపాస కుఁడు మండపప్రదేశభూమిని గంధవర్ణరసాదిపరీక్షం గావించి చంద్రా తపశోభితంబును, గోమయోపలిప్తంబును, దర్పణంబునుంబోలి స్వ చ్ఛంబును, అరత్నిద్వయ (రెండుమూరలు) చతురంబును మనోజ్ఞంబు నగు ప్రదేశంబునఁ జతురస్రం బగు మండలమును రచింపవలయును. ఆమండలమునకు సమానముగ వెడలుపును బొడవునుగల తాళపత్రం బుచే మండలమును బూర్వపశ్చిమంబులకును, దక్షిణోత్తరంబులకును బదుమూఁడు సమానభాగంబులుగ విభజించి దానిపై నాతాళపత్ర మును నిక్షేపించి యాచతురస్రమండలంబునకుఁ బూర్వభాగంబునఁ బశ్చిమాభిముఖుండై కూర్చుండి దృఢం బగు రంగునూలుదారంబుచే బూర్వపశ్చిమంబులకును, నుత్తరదక్షిణంబులకును సమానభాగంబు

లుగఁ బదునాలుగు సూత్రంబులను నిర్మింపవలయును. ఓపార్వతీ! అట్లు కావించినచో నామండలమున నూటయిరువదితొమ్మిదిగదు లేర్పడఁగలవు. ఆగదులయందలి మధ్యకోష్ఠంబు (గది) కర్ణికయగు చున్నది. ఆకర్ణికకుఁ జుట్టును గల యెనిమిదికోష్ఠంబులును నష్టదళంబు లగుచున్నవి. ఆయష్టదళంబులను శ్వేతవర్ణంబులుగను, వానియగ్రభాగంబులను శ్యామవర్ణంబులుగను, గర్ణికను బీతవర్ణంబుగను, సంధిస్థానంబులను రక్తపీతవర్ణంబులుగను గావింపవలయును. అందు దక్షిణ దళమునుండి క్రమముగా దళసంధుల నన్నిటిని రక్తకృష్ణవర్ణరంజితంబులుగాఁ జేయవలయును. మధ్యకోష్ఠం బగు కర్ణికయందుఁ బ్రణవార్థప్రకాశకంబగు యంత్రంబును లిఖింపవలయును. అందడుగుభాగంబునఁ బీఠంబును, దానిపైని శ్రీకంఠరూపంబగు-అకారంబును, దానిపైన మహేశరూపంబగు-ఉకారంబును, మధ్యభాగంబున మహాకాలస్వరూపం బగు-మకారంబును దన్మస్తకంబున దండస్వరూపం బగు నాదంబును, దానిపై నీశ్వరస్వరూపం బగు బిందువును సంకితంబు గావింపవలయును. పీఠంబును శ్యామలవర్ణంబుగను, అకారంబును బీతవర్ణంబుగను, ఉకారంబును, మకారంబును గృష్ణవర్ణంబుగను నాదంబును ధూమ్రవర్ణంబుగను, బిందువును ధవళవర్ణంబుగను జిత్రింపవలయును. ఇట్లు వివిధవర్ణరంజితంబగు యంత్రమును లిఖించి సద్యోజాతాది మంత్రింబులచే నాచ్ఛాదింపవలయును. తదుత్పన్నంబగు నాదమూలంబున నీశానుని బ్రిభేదింపవలయును. ఆయష్టదళంబులకును వెలుపలి గదులవరుసయం దాగ్నేయకోణంబు మొదలుగ నాలుగుకోణంబులను శుక్రవర్ణంబులుగఁ జేసి యందు జతుర్వర్ణంబులను నింపి యా నాలుగుకోణంబులను జతుర్ద్వారంబులు గల్పింపవలయును. ఆద్వారములకు నాలుగువైపులనున్న నాలుగు గదులను బచ్చనిరంగుచేఁ బూరింపవలయును. ఆగ్నేయకోణమునందలి గది

యందు మధ్యప్రదేశంబును జతురస్రంబుగను గించిత్పీతవర్ణంబుగను జేయవలయును. అందించుక యెఱ్ఱనిరంగుగల యష్టదళపద్మమును బచ్చని కర్ణికతో నుండునట్లుగా లిఖింపవలయును. ఆపద్మమధ్యంబున "హం" అను నక్షరమును లిఖింపవలయును. ఆపద్మమునకు నైరృతి భాగంబుననున్న కోష్ఠంబునఁ జతురస్రమధ్యంబునఁ బచ్చని కేసరంబులును, గర్ణికయు, రక్తదళంబులునుగల యష్టదళపద్మంబును లిఖయించి దాని మధ్యభాగంబున "సూ, ఔం" అను బీజంబులను లిఖింపవలయును. ఆపద్మంబునకీశానకోష్ఠంబునఁ బూర్వోక్తప్రకారంబునఁ బద్మంబు నంకితంబుచేసి మధ్యభాగంబున "గుం" అను బీజాక్షరమును జిత్రింపవలయును. దానికి బహిర్భాగంబునంగల మూఁడుపంక్తులయందును బూర్వాదిక్రమంబుగఁ బంచకోష్ఠంబులం గైకొని యందలి మధ్యకోష్ఠంబునఁ బచ్చని కర్ణికయును నెఱ్ఱనివృంతమును లిఖించి దాని దళంబుల నెఱ్ఱనివిగాఁ జేసి దళాంతరములఁ గృష్ణవర్ణచూర్ణంబును బూరింపవలయును. ఆగ్నేయాదికోష్ఠచతుష్టయంబును శుక్లవర్ణంబుగఁ జేయవలయును. పూర్వకోష్ఠంబున షడ్బిందుసంయుక్తంబగు షట్కోణంబును లిఖించి దానిని గృష్ణవర్ణంబుగాఁ జేయవలయును. దక్షిణకోష్ఠంబున రక్తవర్ణంబగు కోణత్రయాకృతియు, నుత్తరకోష్ఠంబున నించుక తెల్లని యర్ధచంద్రాకృతియును, బశ్చిమకోష్ఠంబునఁ బీతవర్ణంబగు చతుష్కోణాకృతియు నంకితంబు గావింపవలయును. పిమ్మటఁ గ్రమంబుగఁ బూర్వకోష్ఠంబున శుభ్రవర్ణంబగు బిందువును, దక్షిణకోష్ఠంబునఁ గృష్ణవర్ణంబగు నుకారంబును, నుత్తరకోష్ఠంబున రక్తవర్ణంబగు మకారంబును, బశ్చిమకోష్ఠంబునఁ బీతవర్ణంబగు నకారంబును లిఖింపవలయును. ఇట్లు చతుర్వర్ణంబుల నంకితంబు గావించి యన్నిటికంటెఁ బైవరుసకుఁ గ్రిందివరుస నారంభించి క్రమంబుగఁ బీతశ్వేతరక్తకృష్ణవర్ణంబులను, దానికిఁ గ్రిందివరుసను శ్వేతకృష్ణపీత

రక్తవర్ణంబులను దానిక్రిందిభాగంబునంగల ముక్కోణంబున రక్తశుక్ల పీతవర్ణంబులను దక్షిణంబు మొద లుత్తరంబువఱకును నంకితంబు గావింపవలయును. దానికి వెలుపలిభాగంబునంగల పంక్తియందుఁ బూర్వాదిభాగమధ్యస్థానంబులమాత్రము క్రమముగాఁ బీతరక్తకృష్ణ శ్యామశ్వేతపీతవర్ణంబులను జిత్రింపవలయును. అగ్నికోణంబు మొదలు క్రమంబుగ రక్తశ్యామశ్వేత రక్తకృష్ణ రక్తంవర్ణంబులను లిఖింపవల యును. దక్షిణమునుండి పూర్వంబునకు నైర్ృతికోణము మొదలుగ నగ్నికోణపర్యంతమును. పశ్చిమమునుండి దక్షిణమునకు వాయుకోణము మొదలు నైరృతికోణమువఱకును, నుత్తరమునుండి పశ్చిమమునకు నీశానకోణము మొదలు వాయుకోణమువరకును బూర్వోక్తరూపం బున వర్ణచిత్రంబు గావింపవలయును. ఈవిధంబుగ మండలవిధానంబు గావించి పవిత్రాత్ముండును బ్రహ్మపరాయణుండు నగు యతి సూర్య పూజం గావింపవలయును:—

## —♦ ప్రణవోద్ధారణము. ♦—

దేవీ! సాధకుఁడు మండలదక్షిణభాగంబున వ్యాఘ్రాసనంబు ను బరచి " ఫట్ " అను మంత్రంబుచేఁ బూతంబగుజలంబునఁ బ్రో క్షించి " ఓం " ఆధారశక్తికమలాయనమః. అను మంత్రంబు నుచ్చ రించుచు నందుత్తరాభిముఖుండై కూర్చుండి ప్రణవంబు నుచ్చరించుచు యథావిధిగఁ బ్రాణాయామం బొనరించి యగ్నిత్యాదిమంత్రంబున భస్మధారణంబు చేసి గురుదేవునకు నమస్కరించి యగ్రభాగంబునఁ గోణత్రయవిలసితంబును, దరువాతవృత్తంబును, దానికి బాహ్యంబున జతురస్రంబునుగాఁ గ్రమంబున మరల మండలరచనంబు చేసి మంత్ర పూర్వకంబుగ నాధారసహితం బగుశంఖమునుస్థాపించి ప్రణవమంత్ర పూర్వకంబుగఁ గర్పూరాదిసువాసిత విశుద్ధజలంబులచే నాశంఖమును బూరించి గంధపుష్పాదులచే బూజించి ప్రణవమంత్రము నేడుసారులు

జపించి శంఖమున ధేనుముద్రయును, ప్రణవంబుచే శంఖముద్రయును ప్రదర్శించి యస్త్రమంత్రంబుచే గంధపుష్పాది పూజోపకరణంబులమీ దను, దనమీదనుజలప్రోక్షణంబు గావింపవలయును. తరువాత ము మ్మారు ప్రాణాయామంబుచేసి ఋష్యాదిన్యాసంబు గావింపవలయును. ఈసూర్యమంత్రంబునకు ఋషి దేవభాగుండు. ఛందంబుగాయత్రి. దేవతసూర్యమహేశ్వరుండు. పిమ్మట యథావిధిగ షడంగన్యాసంబు గావించి యాగ్నేయకోణంబునంగల కోష్ఠంబున నంకితంబగుపద్మంబు నస్త్రమంత్రమూలంబునఁ బ్రోక్షితంబుగావించి యాపద్మంబునకుఁ బూర్వాది చతుర్దిశలయందును గ్రమంబుగఁ బ్రభూతను, విమలను, సారను, సమారాధ్యను బూజింపవలయును. పిమ్మటఁ బాదదేశంబునఁ గాలాగ్నిరుద్రుని, నాధారశక్తిని, దదనంతరము పృథ్వివి, రత్నద్వీప మును, సంకల్పవృక్షోద్యానమును, మణిమయగృహంబును, రక్త పీఠంబును బూజించి పూర్వదిక్కునుండి ప్రారంభించి పూర్వాదిభాగం బులఁ గ్రమంబుగ ధర్మజ్ఞానవైరాగ్యైశ్వర్యంబులను, నాగ్నేయాది కోణంబుల వరుసగా నధర్మాజ్ఞానావైరాగ్యానైశ్వర్యంబులను నాల్గిం టిని సమర్పింపవలయును. తరువాత మాయాబీజంబున నధోభాగం బును, విద్యాబీజంబున నూర్ధ్వభాగంబును నాచ్ఛాదింప వలయును. తరువాతఁ బూర్వాదిదిక్కులు నాల్గింటియందును, యథాక్రమంబుగ సత్వరజస్తమోగుణంబులను, మధ్యప్రదేశంబున దీప్తయు, సూక్ష్మయు, జయయు, భద్రయు, విభూతియు, విమలయు, నమోఘయు, వైద్యు తయు, సర్వతోముఖయు, నను దేవతలను బూజించి పిమ్మటఁ గందం బును, నాళంబును, సుషిరంబును, మూలంబును, బత్రంబును, గేసరం బులను, నంకురంబులను, దంతుకంటకంబులను, బంచగ్రంథివిశిష్టం బగుకర్ణికను, దత్సమీపదళకేసరస్థితులగు బ్రహ్మవిష్ణుమహేశ్వరులను, నాత్మను, నంతరాత్మను, జ్ఞానాత్మను, బరమాత్మను బూజించి సూర్య

భగవానుని యోగపీఠంబు నర్చింపవలయును. మూలమంత్రజ్ఞుండగు నభ్యాసకుండు మూలమంత్రంబుచే నాపీఠోపరిభాగంబున నక్షమాలాధరుండును, పాశహస్తుండును, ఖట్వాంగపాణియు, నంకుశకరుండును, శంఖచక్రపద్మహస్తుండును, సిందూరరక్తదేహుండును, వామార్ధనారీవిరాజితుండును, జతుర్ముఖుండును, ద్వాదశలోచనుండును, హృదయకమలశయానుండును, మండలమధ్యవర్తియు నగుసూర్యభగవానుని మూర్తినిసంకల్పించుకొని కుంభకంబును గావించి మూలమంత్రమూలమునుండి పింగళాపథమునం దాధారశక్తి నూర్ధ్వాభిముఖింగావించి పుష్పాంజలిమధ్యంబునకుం దెచ్చి "ఓంహ్రాంహ్రీం సః ప్రకాశశక్తిసహితంమార్తాండమావాహయామినమః" అనుమంత్రంబుచే నావాహనీముద్రాప్రదర్శనంబు చేసి యావాహనపూర్వకంబుగ స్థిరీకరణాదిముద్రలను యథావిధిగఁ బ్రదర్శింపవలయును. దేవీ! మంత్రాంతంబున "హ్రాంహ్రీంహ్రూం" అనుబీజాక్షరంబులతో నంగన్యాసంబు గావించి పంచోపచారకల్పనంబు చేయుచుఁ బద్మకేసరంబులయందు మూలమంత్రంబుచే మూడుసారులు షడంగపూజ గావింపవలయును. తరువాత ద్వితీయావరణంబున వైశ్వానరేశానరక్షోవాయువు లను చతుర్మూర్తులను యథాక్రమంబుగఁ బూజింపవలయును. అనంతరము పూర్వంబుమొదలుగ నుత్తరంబువఱకును గలదళంబుల మూలంబులయందుఁ గ్రమంబుగ నాదిత్యుని, భాస్కరుని, భానుని, రవిని బూజించి యీశానాదికోణంబులయందు వరుసగా నర్కుని, బ్రహ్మను, రుద్రుని, విష్ణుని బూజింపవలయును. తరువాతఁ దృతీయావరణంబున సోముని, నంగారకుని, సుబుద్ధియగుబుధుని, విశాలబుద్ధియగు బృహస్పతిని, తేజోనిధియగు భార్గవుని, శనైశ్చరుని, రాహువును, శత్రుభీకరుండగు కేతువును బూర్వాదిదళమధ్యంబుల నర్చింపవలయును. కాదేని ద్వితీయావరణంబున ద్వాదశాదిత్యులను, దృతీయావరణంబున శశిప్రభృతి

దేవగణంబులను బూజింపవలయును. దీనికి వెలుపల నలుదెసలను సప్తసాగరంబులను, గంగను, ఋషులను, దేవతలను, గంధర్వులను, పన్నగులను, నప్సరోగణంబులను, గ్రామణులను, యక్షులను, యాతుధానులను, ఛందోమయంబులగు సప్తాశ్వంబులను, వాలఖిల్యులను బూజింపవలయును. ఆవరణత్రయసమన్వితుండగు దివాకరునిట్లర్చించి యనహితచిత్తంబున మొదట మండలంబును దరువాతఁ జతురస్రంబును నంకితంబు చేసి తన్మధ్యప్రదేశంబునఁ బ్రస్థపరిమిత జలాధారంబగు తామ్రపాత్రమును స్థాపించి కుసుమాదిసువాసిత వినిర్మలజలంబులఁ బూరించి గంధపుష్పాదులచేఁ బూజింపవలయును. అనంతరము భూతలంబున మోకరించి యర్ఘ్యపాత్రంబును గరంబులం దాల్చి భ్రూమధ్యంబువఱకును దాని నెత్తిపట్టుకొని, సర్వసిద్ధిప్రదంబగుసవితృమంత్రము నుచ్చరించుచు,

క. సిందూర రుచిర తేజా
సుందరపరివేష వజ్ర ♦ శోభితభూషా
బృందారకాదికారణ
వందన మరవింద నేత్ర ♦ వరశతపత్రా !

అని నమస్కరించి

మంజరి. స్వర్ణపాత్రంబున ♦ స్వర్ణజలంబు
గుంకుమయును, గుశల్ - కుసుమాంజనంబుఁ
గుసుమమంజరులును ♦ గూర్చి తెచ్చితిని
నాయర్ఘ్యము గ్రహించి ♦ నను బ్రోవు దేవ !

అని యర్ఘ్యప్రదానంబు గావించి యేకాగ్రచిత్తంబున,

క. శివుఁడును సాంబుండు గణ
ప్రవరయుతుఁడు, బ్రహ్మవిష్ణు ♦ భవమూర్తియునై

భువనైకకారణంబగు
ప్రవిమలరవిమూర్తి కేను ♦ బ్రణతులొనర్తున్.

అని సాష్టాంగప్రణామంబు గావించి నిజాసనంబున నుపవిష్టుండై క్రమ్మర ఋష్యాదిన్యాసంబుచేసి కరంబులఁ గడిగికొని పూర్వోక్త విధివిధానంబున భస్మధారణంబు గావించి శివభావవృద్ధికొఱకు న్యాసాదులం గావింపవలయును. పిమ్మట గురుదేవుని బంచోపచారంబులచేఁ బూజించి "ఓం శ్రీగురుదేవేనమః" అను మంత్రంబునఁ బ్రణామం బాచరించి "ఓంగుం, గందుంక్షుం" అను బీజంబులఁ బూర్వసంఘటితంబులుగఁ జేసి నామాంశంబులఁ జతుర్థీప్రత్యయంబు జేర్చి భుజయుగ్మంబున గురుగణపతులను, నూరుద్వయమున దుర్గాక్షేత్రపాలకులను నుద్దేశించి కృతాంజలియై ప్రణామంబు గావింపవలయును. తరువాత షడంగన్యాస పూర్వకంబుగ నస్త్రమంత్రంబునఁ గరద్వయశోధనంబు గావించుకొనవలయును. పిమ్మట మంత్రపూర్వకంబుగ భూతలంబున ముమ్మారు పార్ష్ణి (కాలిమడిమ) ఘాతంబు గావించి భూసంబంధంబులగు విఘ్నంబులఁ దొలగించుటకై ముమ్మారు కరతాళంబు చేసి యూర్ధ్వంబునకు దృష్టిసారించి యంతరిక్షదివ్యవిఘ్నంబుల నపనయింపవలయును. తరువాత బ్రాణవాయు నిరోధంబు చేసి "సోహం" అను మంత్రముచే హృదయస్థంబగు జీవాత్మను సుషుమ్నాపథమునుండి మస్తకస్థిత సహస్రదళకమలకర్ణికాంతర్గతంబును, జైతన్యస్వరూపంబు నగు పరమాత్మతో సంయోగంబు గావించి తత్సమానంబుగ భావించి క్రమ్మర స్వస్థానంబునకుఁ గొనిరావలయును. తరువాత "యం" అను వాయుబీజంబును బదునాఱుసారులు జపించుచు రేచకంబును, "రం" అను అను నీయగ్నిబీజంబు నరువదినాలుగుసారులు జపించుచుఁ గుంభకంబును "వం" అను నీసలిలబీజంబును ముప్పదిరెండు పర్యాయములు జపించుచుఁ బూరకంబును

గావించి యేకాగ్రచిత్తంబున నకారాదివర్ణంబులచేతను, స్వకీయంబులగు వేదమంత్రంబులచేతను యథావిధిగఁ బ్రాణప్రతిష్ఠ గావింపవలయును. యోగరతుండగు సాధకుండు తదేకచిత్తంబుతో నాద్యంతంబులఁ బ్రణవసంయోగంబు గావించి పిమ్మట సంతర్మాతృకాన్యాసంబును, బాహ్యమాతృకాన్యాసంబును గావింపవలయును. తరువాతఁ బ్రాణాయామంబుచేసి ఋష్యాదిన్యాసంబు మరలఁ గావింపవలయును. ప్రణవంబునకు ఋషి బ్రహ్మ; ఛందంబు గాయత్రి; పరమాత్ముండగుసదాశివుండు దేవత. అకారము బీజము, ఉకారము శక్తి, మకారము కీలకము. మోక్షంబున వినియోగంబు. ఈ మంత్రానుసారంబుగ ఋష్యాదిన్యాసంబు చేసి ప్రణవంబు నుచ్చరించుచు వృద్ధాంగుళి మొదలుగఁ గరతలాంతంబువఱకును గరద్వయంబుచేఁ గరన్యాసంబు గావింపవలయును. తరువాత “అంనమః; ఉంనమః; మంనమః” అను నీమూడుమంత్రములచేతను యథాక్రమంబుగఁ గుడిచేతి బొటనవ్రేలుమొదలుగ నెడమచేతి చిటికెనవ్రేలువఱకును న్యాసంబుచేసి కరన్యాసంబు పూర్తిగావింపవలయును. మరల యోగియగువాఁడు “అంబ్రహ్మాత్మనేనమః” అను మంత్రంబుచే హృదయంబునను “ఉం విష్ణవేనమః” అను మంత్రంబుచే మస్తకంబునను, “మం రుద్రాయనమః” అను మంత్రంబుచే శిఖయందును న్యాసంబుచేసి వరుసగా నీమంత్రబులచేఁ గవచనేత్రాస్త్రన్యాసంబు గావింపవలయును. తరువాత నంగవక్త్రకళాభేదంబులచేఁ బంచబ్రహ్మలను శిరోవదనహృదయగుహ్యపాదదేశంబులయందు విన్యాసంబుచేసి కళాన్యాసంబుగావింపవలయును. మస్తకాది పంచస్థానంబులయందు నీశానునిపంచకళలను, బూర్వాదిచతుర్దిశలను చతుర్ముఖంబులయందుఁ బురుషుని చతుష్కళలను, హృదయము, కంఠము, స్కంధప్రదేశము, నాభికుక్షి, పృష్ఠము, వక్షస్థలంబు నను నీయెనిమిదింటియం దఘోరుని యష్టకళలను,

గుహ్యంబును, లింగంబును, నూరువులును, జానువులును, జంఘలును, గటిపశ్చాద్భాగంబును, బార్శ్వంబులు నను నీపదుమూడింటను వామ దేవుని త్రయోదశకళలను, పాదద్వయంబునను గరద్వయంబునను, హృదయంబునను, మస్తకంబునను, బాహుద్వయంబునను సద్యోజా తుని యష్టకళలను భావించి యిట్లు యథాక్రమంబుగ న్యాసంబు చే యుటయే కళాన్యాసంబు. ప్రణవజ్ఞుండగు సాధకుండీవిధంబుగా ముప్పది యెనిమిదికళలను న్యాసంబు చేసి బాహువులనుఁ గూర్పరంబులను, మణిబంధంబులను, బార్శ్వంబులను, నుదరంబునను, జంఘలను, బాదం బులను, బృష్ఠంబునను బ్రణవన్యాసంబు చేయవలయును. న్యాసదక్షుం డగు నుపాసకుం డిట్లు గావించి పిమ్మట హంసమంత్రన్యాసంబు చేయ వలయును.

—: శంఖపూజావిధానము :—

ఓ దేవీ ! సాధకుండు తనవామభాగంబునఁ జతురస్రంబగు మండలమును రచియించి ప్రణవమంత్రంబుచే నర్చించి తన్మధ్యంబున నాధారపాత్రతోఁగూడ నస్త్రమంత్రముచే శోధింపఁబడిన శంఖంబును స్థాపించి ప్రణవమంత్రంబునఁ బూజింపవలయును. పిమ్మట నాశంఖం బును జందనాది సువాసితంబగు విశుద్ధజలంబుచేఁ బూరించి గంధ పుష్పంబులచేఁ బూజించి యేడుసారులు ప్రణవమంత్రంబుచే నభిమం త్రించి యందు ధేనుముద్రను, శంఖముద్రను బ్రదర్శింపవలయును. ఆశంఖమున కెదుటఁ జతురస్త్రంబును, దానినడుమ నర్ధచంద్రంబును, దానికినడుమ ముక్కోణంబును, దానికి నడుమ షట్కోణవృత్తంబు నుగా నొకమండలంబు కల్పించి ప్రణవమంత్రంబుచే గంధపుష్పంబుల నర్చించి యామండలమధ్యంబున నాధారసహితంబుగా నర్ఘ్యపాత్రంబు నుంచి గంధపుష్పాదులచే నర్చింపవలయును. తరువాత నయ్యర్ఘ్యపా త్రమును బవిత్రజలంబులచేఁ బూరించి యందుఁ గుశాగ్రంబులను,

నక్షతలను, యవలను, ధాన్యంబును, దిలలను, ఘృతంబును, శ్వేత సర్షపంబులను, బుష్పంబులను, విభూతిని జేర్చి సద్యోజాతాది షడంగ మంత్రంబులను, ప్రణవమంత్రమును జపించుచు నాయర్ఘ్యపాత్రమును బుష్పాదులచేఁ బూజించి "హ్రూం" అను మంత్రంబుచే నభిమంత్రించి యస్త్ర మంత్రంబుచే నవగుంఠన పురస్సరంబుగ రక్షార్థంబు ధేను ముద్రం బ్రదర్శింపవలయును. తరువాతఁ బూజోపకరణంబులను దన్నును నస్త్రమంత్రంబుచే బ్రోక్షణంబు గావింపవలయును.

—: గురుపూజావిధానము :—

గిరిరాజతనయా! తరువాత నాపద్మంబున కీశానదిగ్భాగం బునంగల పద్మంబునందు "ఓంగుర్వాసనాయనమః" అను నీమంత్రంబుచే నాసనంబును సంకల్పించి గురుమూర్తిని దానియందు భావించి "ఓంగురుభ్యోనమః" అను మంత్రముచే గురూపదేశాను సారంబుగ నంధు గురుమూర్తికల్పనంబు చేయవలయును. తరువాత నావాహనపూర్వకంబుగ దక్షిణాభిముఖుండును, బ్రసన్నవదనుండును, సౌమ్యుండును, విశుద్ధస్ఫటిక నిర్మలుండును, వరదుండును, నభయ హస్తుండును, ద్వినేత్రుండును, శివమూర్తియు నగుగురుదేవుని ధ్యానించి గంధపుష్పాదులచే యథాక్రమంబుగఁ బూజింపవలయును.

—♦ గణసహితశివపూజావిధి. ♦—

ఆ పద్మంబునకు నైరుతీకోణంబునంగల పద్మంబున శుద్ధాసన స్థితుం డగుగణేశ్వరునిమూర్తిని సంకల్పించి "గణానాంత్వా" మొదలగు వేదమంత్రములచే నావాహనంబు గావించి నియతచిత్తంబున రక్తవర్ణుండును, స్థూలకాయుండును, సర్వాలంకార శోభితుండును, పాశాంకుశధరుండును, వరదండహస్తుండును, గజాననుండును, సర్వ విఘ్నహారప్రభుండు నగుగణేశ్వరుని ధ్యానించి గంధపుష్పాద్యుపచారంబులచేఁ బూజించి కదళీనారికేళాది ఫలంబులను, లడ్డుకాపూపా

భక్ష్యంబులను నివేదనంబు చేసి ప్రణామంబు గావింపవలయును. దానికి వాయుకోణంబునం గలపద్మంబును గార్తికేయాసనంబుగ భావించి యందా దేవునిమూర్తి నావాహనంబు చేసి ముందుగ స్కంద గాయత్రిని బఠించి తరుణతపనసన్నిభుండును, మయూరవాహనుండును, చతుర్బాహుండును, నవవర్ణాంగుండును, మకుటాదివివిధభూషణ భూషితుండును, వరదాతయు, నభయహస్తుండును, శక్తిధరుండును, కుక్కుటధారియు నగుకుమారుని ధ్యానించి షోడశోపచారంబులచేఁ బూజించి పూర్వద్వారంబునకు దక్షిణశాఖాతలంబున నంతఃపురాధి పతియును, సుమేరుసమకాంతియుతుండును, నానాలంకారభూషితుం డునుఁ జంద్రార్ధమౌళియు, మధురమూర్తియుఁ ద్రినేత్రుండును, చతు ర్భుజుండును, దీక్ష్ణశూల, మృగి, టంక, హేమవేత్రధరుండును, శశాంకవదనుండును నగునందీశ్వరుని బూజింపవలయును. తరువాత దానికుత్తరశాఖాతలంబునఁ బతిపాదసేవానిరతయు, జగన్మాతయుఁ, బతివ్రతయు, మరుత్కన్యయు, నందిభార్యయు నగుసుయశను విధివిధా నంబునఁ బూజించి యస్త్రమంత్రంబున శంఖజలంబుచేఁ బద్మంబును బ్రోక్షించుచు నాసనంబును, నాధారాదులను యథాక్రమంబుగఁ గల్పింపవలయును. భూమికధోభాగంబునఁ గల్యాణదాయినియు శ్యామవర్ణయు, నగునాధారశక్తిని దత్సమీపంబున నూర్ధ్వకంఠుండు ను, కుండలాకృతియు, ధవళవర్ణుండును, బంచఫణవిరాజితుండును, నభ్రంవిహుండును నగునంతదేవుని, దదుపరిసింహాకారంబును, చతు ష్పదవిశిష్టంబును నగుభద్రాసనంబును ధ్యానింపవలయును. ఆభద్రా సనంబునకు ధర్మజ్ఞానవైరాగ్యైశ్వర్యంబులు చతుష్పాదంబులు. ఆ పాదంబు లాగ్నేయాదికోణ చతుష్టయంబునఁ గ్రమంబుగ శ్వేతపీత రక్తశ్యామవర్ణంబుల విరాజిల్లుచుండును. ఆభద్రాసనంబునకుఁ బూ ర్వాది చతుర్దిశలను, నధర్మంబును, నజ్ఞానంబును, నవైరాగ్యంబును,

ననైశ్వర్యంబు నను మఱినాలుగుపాదంబులు గలవు. అయ్యనంత దేవుని
యంగప్రత్యంగములు రాజావర్తమణింబోలి సముజ్జ్వలంబులుగా భావిం
పవలయును. తరువాతఁ బద్మంబునకుఁ గ్రిందిదళంబులను, మీఁదిదళం
బులను, గంధంబును, నాళంబును, గేసరంబులను, గంటకంబులను,
గర్ణికను యథాక్రమంబుగ సంకల్పించి యర్చింపవలయును. పూర్వా
దిచతుర్దిశలయందలి దళంబులయం దష్టసిద్ధులను, గేసరంబులయందు
వామాద్యష్ట రుద్రులను, అష్టశక్తులను, గర్ణికయందు వైరాగ్యం
బును, బీజంబున నవశక్తిని, పూర్వాద్యష్టదిశలను, వామాద్యష్ట
రుద్రులను, బద్మమధ్యంబున మనోన్మనీశక్తిని, మూలంబున శివస్వ
రూపధర్మంబును, నాళంబున శివాశ్రయజ్ఞానంబును, వర్ణికోపరిభాగం
బున వహ్నిమండలంబును, సూర్యచంద్రమండలంబులను, సర్వాసనో
పరిభాగంబున సుఖమయంబును, దీప్తిశలంబును, విచిత్రపుష్పోజ్జ్వలం
బును, బరవ్యోమావకాశ విద్యాభాసురంబునగు తత్త్వత్రయంబును
సంకల్పించి యయ్యాసనంబును, మూర్తిని బుష్పవిన్యాసపూర్వకం
బుగ నాధారశక్తి మొదలుగ విశుద్ధజ్ఞానాసనపర్యంతంబును బ్రత్యేక
నామంబులను బ్రణవపూర్వకంబుగ నుచ్చరించుచు సాధకుండు పూజిం
పవలయును. ఎల్లయెడల నిదియే విధానంబని యెఱుంగునది. ముద్రా
భిజ్ఞుండగువాఁ డంగముఖకళాభేద విశేషంబులచేఁ బూర్వోక్తప్రకా
రంబునఁ బంచబ్రహ్మవిన్యాసంబు చేయుచుఁ గ్రమంబుగఁ దత్తన్ము
ద్రలం బ్రదర్శించుచు నాయామూర్తులయం దాయాదేవతావాహ
నంబు గావింపవలయును. తరువాతఁ బుష్పాంజలిం దాల్చి “సద్యో
జాతంప్రపద్యామిశివోమేస్తుసదాశివోమ్” అనుమంత్రంబు నుచ్చరిం
చుచు నాధారోద్ధితంబగు నాదంబును ద్వాదశ గ్రంథిభేదనంబున బ్రహ్మ
రంధ్రాంతపర్యంతంబు నుచ్చరించుచు నోంకారగోచరంబగు పరమా
త్మను ధ్యానింపవలయును. శుద్ధస్ఫటిక నిర్మలుండును, శాశ్వతుం

డును, బూర్ణుండును, సర్వలోకకారణుండును, సర్వలోకమయుండును, సూక్ష్మంబుకంటె సూక్ష్మతరుండును, మహత్తునకంటె మహత్తరుండును, సర్వవ్యాపియు, బహిరంతరవ్యాపకుండును, దుర్లభుండయ్యు భక్తసులభుండును, నాదిమధ్యాంత రహితుండును, బండితులకైన నగోచరుండును, సర్వరోగౌషధ స్వరూపుండును, వేదసారుండును, సర్వనియంతయు, బ్రహ్మవిష్ణు రుద్రేంద్రాది దేవతలకుఁగూడ నగోచరుండగు పరమాత్ముని భావంబున సంకల్పించుకొని ధ్యానంబు చేయవలయును. ఇట్లువహితచిత్తంబున ధ్యానించి వివిధముద్రాప్రదర్శనంబు గావించుచు నావాహనంబును, స్థిరకరణంబును, సన్నిరోధంబును, నభిముఖీకరణంబును, నమస్కారంబును గావింపవలయును. అనంతరము సదాశివుండును, బూర్ణుండును, నిష్కళుండును. శుద్ధస్ఫటికసంకాశుండును, సౌమ్యుండును, స్నిగ్ధకాంతియుతుండును, విద్యున్మండలోజ్జ్వలుండును, జటామకుటభూషితుండును, శార్దూలచర్మవసనుండును, నరుణపద్మదళసన్నిభకర చరణాధరుండును, స్మేరాననుండును, సర్వలక్షణలక్షితుండును, సువర్ణమణిమయాలంకారుండును, దివ్యాస్త్రధారియు, దివ్యగంధానులేపనుండును, బంచముఖుండును, దశహస్తుండును, జంద్రమౌళియుఁ, బ్రశాంతంబును, బాలాదిత్యసన్నిభంబును, నేత్రత్రయవిలసితంబును, నర్ధచంద్రకిరీటాలంకృతంబునగు మనోహరపూర్వముఖుండును, నీలమేఘమనోజ్ఞంబును, నారక్తనయనత్రయ విరాజితంబును, భీషణభ్రుకుటీయుతంబును, ఘోరదంష్ట్రాభీలంబును, గంపితాధరపల్లవశోభితంబును, దుర్నిరీక్ష్యంబునునగు భయంకరదక్షిణముఖుండును, ప్రవాళప్రభా శోభితంబును, భ్రమరకృష్ణచూర్ణకుంతలవిలసితంబును, విలాసపూర్ణంబును, ద్రిసయనంబును, నర్ధచంద్రభూషితంబును, నగు సుప్రసన్నోత్తరముఖుండును, బూర్ణచంద్రమండలసన్నిభంబును, నయనత్రయన ముజ్జ్వలంబును, నర్ధచంద్రమకుటాలం

కృతంబును, మందహాసమన్వితంబును, శోభామయంబునగు ప్రశాంత పశ్చిమ ముఖంబును స్ఫటికనిర్మలంబును, చంద్రరేఖాంకితంబును, విస్ఫారితనయనత్రయ శోభితంబు నగు నతిప్రశాంత పంచముఖంబును, శూలపరశు వజ్రఖడ్గానల విరాజిత దక్షిణపార్శ్వంబును, పినాకనా రాచఘంటా పాశాంకుశ విభాసిత వామపార్శ్వంబును, నగు సదాశివుని భావించి, నివృత్తికళామూలంబున జానుపర్యంతంబును, ప్రతిష్ఠాకళా మూలంబున నాభిపర్యంతంబును విద్యా కళామూలంబునఁ గంఠపర్యంతంబును, శాంతి కళామూలంబున లలాటపర్యంతంబును, శాంత్యతీత కళామూలంబున, నూర్ధ్వదేశ పర్యంతంబునుగాఁ బంచమూర్ధవ్యాపి యగుటచేఁ బంచకళా విలాసితునిగను, ముకుటంబున నీశానుండును, ముఖంబునఁ బురుషుండును, హృదయతలమున నఘోరుండును, గుహ్యదేశంబున వామదేవుండును, పాదదేశంబున సద్యోజాతుండునుగాఁ బంచమూర్తి ధరుండుగను, అష్టత్రింశత్కళా మయునిగను, మాతృకామయునిగను, నీశానాదిపంచ బ్రహ్మమయునిగను, నోంకారమయునిగను, హంసన్యాస మయునిగను, నకారాది పంచాక్షర మయునిగను, షడక్షరమయునిగను, షడంగునిగను, జాతిషట్క సమన్వితునిగను, సంకల్పించుకొని పురాణపురుషుండగు సదాశివు నిట్లు ధ్యానింప వలయును. ఓదేవీ! పార్వతీ! అనంతరము నావామపార్శ్వంబునందున్న నిన్ను "ఓం మనోన్మనీం గౌరీమావాహయః" అను మంత్రముచే భక్తిపూర్వకంబుగ నావాహనంబుచేసి యథాక్రమంబుగఁ బూజించి నమస్కారంబు గావింప వలయును. తరువాత నేకాగ్రచిత్తంబున నిన్ను ధ్యానింపవలయును. ధ్యానసమయంబున నీలోత్పలదళ సన్నిభంబును, విశాలలోచనద్వయ విలసితంబును, బూర్ణచంద్రానన శోభితంబును, నీలకుటిల కుంతల విరాజితంబును చంద్రరేఖాకిరీటాన్వితంబును, స్నిగ్ధోన్నత నిబిడవర్తుల పయోధర

విభాసితంబును, సూక్ష్మమధ్యంబును, స్థూలనితంబంబును నగు నీదివ్య మూర్తిని భావించి, నీవు సూక్ష్మపీతాంబర ధారిణివై సర్వాలంకారం బులందాల్చి, లలాటదేశంబునఁ దిలకంబు మెఱయ గబరీభరంబుగ విచిత్రకుసుమ మాలికలచే విలసిల్ల, ననవద్యసుందర శరీరిణివై కించిల్ల జ్జావనతవదనంబుతో, దక్షిణకర కమలంబునఁ గనక కమలంబుఁ దాల్చి, దండాకృతిక వామహస్తంబునానుకొని పద్మాసనంబున సుఖా సీనవై యున్నట్లుగా సంకల్పించుకొని ధ్యానింపవలయును దేవీ యిట్లు నిన్నను, నన్నును ధ్యానించి సాధకుండు సంయతచిత్తం బునఁ బ్రణవ మంత్రంబుచేఁ బ్రోక్షించి మనలను శంఖజలంబు లచే స్నానంబు సేయింపవలయును. తరువాత "భవేభవే నాతిభవే" అను మంత్రంబునఁ బాద్యంబును "వామాయనమః" అను మంత్రం బున నాచమనీయంబును. "జ్యేష్ఠాయనమః" అను మంత్రంబున శుభ్రవస్త్రంబును "శ్రేష్ఠాయనమః" అను మంత్రంబున యజ్ఞోపవీ తంబును. "రుద్రాయనమః" అను మంత్రంబునఁ బునరాచమనీయం బును "కాలాయనమః" అను మంత్రంబున దివ్యగంధంబును "కలవికర ణాయనమః" అను మంత్రంబున నక్షతలను "బలవికరణాయనమః" అను మంత్రంబునఁ బుష్పంబులను "బలాయనమః" అను మంత్రం బున ధూపంబును "బలప్రమథనాయనమః" అనుమంత్రంబున యత్ని పూర్వకంబుగ దీప నివేదనంబును గావింపవలయును. ఓవరవర్ణినీ! పిమ్మటఁ బంచబ్రహ్మషడంగమాతృకాప్రణవశివశక్తి బీజంబులచేఁ గ్రమంబుగ మన యిరువురికొఱకును ముద్రాప్రదర్శనంబు గావింప వలయును. ముందుగ నాకును, దరువాత నీకును బాద్యాద్యుపచారం బుల నాచరింపవలయును. నిన్నారాధించు సమయమున స్త్రీలింగ సంయోజనంబుగావింపవలయును. తరువాత యథాక్రమంబుగ నాధా రపంచకపూజ నారంభింపవలయును. విచక్షణుండగు సాధకుండు

పూర్వోక్తప్రకారంబున మరల గణేశకుమారులను బూజించి మండలంబునకు నీశాన్యంబునను, బూర్వదక్షిణోత్తర పశ్చిమంబులను బంచబ్రహ్మల నారాధించి యాగ్నేయాదికోణంబుల షడంగపూజయును, మధ్యప్రదేశంబున నేత్రపూజయును, బూర్వాదిచతుర్దిశల నస్త్రపూజయును గావింపవలయును. ఇది ప్రథమావరణంబు. ఇఁక ద్వితీయావరణంబున బూర్వదళంబుననంతుని, దక్షిణదళంబున సూక్ష్ముఁ, బశ్చిమదళంబున శివోత్తముని, నుత్తరదళంబున నేకనేత్రుని, నీశాన్యంబున నేకరుద్రుని, నాగ్నేయంబునఁ ద్రిమూర్తిని, నైరృతిని శ్రీకంఠుని, వాయుకోణంబున శిఖండేశుని బూజింపవలయును. తరువాత ద్వితీయావరణంబునఁ జెప్పంబడిన చక్రవర్తులను బూజింపవలయును. తృతీయావరణంబునఁ బూర్వద్వారమధ్యంబున వృషేశానుని, దానికి దక్షిణంబున నందీశుని, దానికుత్తరంబున మహాకాలుని బూజించి దక్షిణద్వారంబునకుఁ బశ్చిమభాగంబున భృంగీశ్వరుని, నాతనికిఁ బూర్వకోష్ఠంబున గంధాద్యుపచారంబులచే వినాయకుని, నాతని కుత్తరపశ్చిమకోణంబున వృషభుని, దక్షిణంబున గుహుని బూజింపవలయును. ఉత్తరద్వారంబునకుఁ బూర్వంబునఁ బ్రదక్షిణక్రమంబుగ భవుని, శర్వుని, నీశానుని, రుద్రుని, పశుపతిని, నుగ్రుని, భీముని, మహాదేవుని, బూజింపవలయును. చతుర్థావరణంబున "యోవేదాదౌస్వరః" అను మంత్రంబులచే నావాహనపూర్వకంబుగఁ బూర్వదిక్కునందలి పద్మకర్ణికాపీఠంబుననున్న మహేశ్వరునిబూజించి పూర్వదళంబున నీశ్వరుని, దక్షిణంబున విశ్వేశ్వరుని, నుత్తరంబునఁ బరమేశ్వరుని, బశ్చిమంబున స ర్వేశ్వరునిబూజింపవలయును. దక్షిణదిక్కర్ణికయందునుదళంబులయందును "ఆవోరాజానం" అను ఋగ్వేదమంత్రంబుచే నావాహన పూర్వకంబుగ గంధపుష్పాదులచే రుద్రునర్చించి పూర్వదళంబున శివుని, దక్షిణంబున హరుని, నుత్తరంబున మృడుని, బశ్చిమంబున భవుని

యథాక్రమంబుగఁ బూజింపవలయును. ఉత్తరపద్మంబున "ప్రతద్విష్ణు" అనుమంత్రంబులచే నావాహనపూర్వకంబుగ గంధపుష్పంబులచే విష్ణుదేవు నర్చించి కర్ణికమీఁదను, దళంబులయందును, బూర్వభాగంబున వాసుదేవుని, దక్షిణంబున ననిరుద్ధుని, నుత్తరంబున సంకర్షణుని, బశ్చిమంబునఁ బ్రద్యుమ్నుని బూజింపవలయును. తరువాత మంత్రజ్ఞుండగు సాధకుండు "హిరణ్యగర్భః సమవర్తత", అను మంత్రంబుచే నావాహనపూర్వకంబుగఁ బశ్చిమపద్మంబునఁ బ్రహ్మదేవు నర్చించి పూర్వభాగంబున హిరణ్యగర్భుని, దక్షిణంబున విరాజుని, నుత్తరంబునఁ బురుషుని, బశ్చిమంబునఁ గాలుని బూజింపవలయును. అనంతరము సకలోర్ధ్వం బగు పంక్తియందు బూర్వాది ప్రదక్షిణ క్రమంబునఁ బూర్వాది దిక్పాలకులను యథాక్రమంబుగఁ బూజింపవలయును. రాంతంబును, యాంతంబును, జ్ఞాంతంబును, లాంతంబును, శాంతంబును, అవర్గాదియు, షాంతంబును, సాంతంబును, బ్రణవంబును, శ్రీబీజంబు ననుసీపదియును క్రమంబుగ లోకపాలకులబీజంబు లగుచున్నవి. వీనిచే లోకపాలకులను బ్రత్యేకంబుగఁ బూజింపవలయును. నైరృతికోణమున కుత్తరంబునను, నీశానకోణంబునకు దక్షిణంబునను బ్రహ్మవిష్ణువులను విధివిధానంబునఁ బూజింపవలయును. అనంతరము బహిర్భాగస్థితంబులగు రేఖలన్నిటియందును బంచమావరణపూజ గావింపవలయును. అందీశాన్యంబునఁ ద్రిశూలంబును, బూర్వభాగంబున వజ్రంబును, నాగ్నేయంబునఁ బరశువును, దక్షిణంబున సాయకంబును, నైరృతిని ఖడ్గంబును, బశ్చిమంబునఁ బాశంబును, వాయుకోణంబున నంకుశంబును, నుత్తరంబునఁ బినాకంబును, బూజించి పశ్చిమాభిముఖుండై రౌద్రుండగు క్షేత్రపాలకు నర్చింపవలయును. ఈ సకలదేవతలను, గృతాంజలిపుటులై మందహాస వదనంబులతోఁ సాదరంబున మహాదేవిని

మహాదేవుని సర్వదా నిరీక్షించుచున్నట్లుగా భావింపవలయు ను. ఈవిధముగా నావరణపూజా సమాపనంబు చేసి వివిధవిఘ్నో పశాంతికై దేవదేవుని మరలఁ బూజించి ప్రణవంబును శివనామంబు నుచ్చరింప వలయును. ఈవిధంబుగ గంధాద్యుపచారంబులచే యథా విధిగ నర్చనంబు గావించి విధిపూర్వకంబుగ నైవేద్యంబును, బునరా చమనీయంబును, బూర్వోక్త ప్రకారంబున నర్ఘ్యంబును, బానీయం బును, నుపదంశంబును, దాంబూలంబును, నివేదనంబును సమర్పించి హారతి నొసంగి పూజాసమాప్తి గావింపవలయును. పిమ్మట మరల దేవిని, మహాదేవుని ధ్యానించి యష్టోత్తర శతమంత్రజపంబు చేయవల యును. అనంతరము పుష్పాంజలిబద్ధుండై లేచి మహాదేవుని ధ్యానిం చుచు "యోదేవానాం" అను మంత్రంబు మొదలు "యోవేదా దౌస్వరః" అను మంత్రంబు వఱకును బఠించి పుష్పాంజలి నొసంగి ముమ్మారు ప్రదక్షిణంబు చేయవలయును. తరువాతఁ బరమభక్తి పూర్వకంబుగ సాష్టాంగ ప్రణామంబు చేసి ప్రదక్షిణంబు చేసి నమ స్కారంబు గావింప వలయును. అనంతరం బాసీనుండై నామాష్టక మును బఠించుచు "ఓదేవా! సంపన్నంబైనను, నసంపన్నంబైనను నేనొనరించిన పూజాకార్యం బంతయు నీచేఁబరిగ్రాహ్యం బగుగాక యని ప్రార్థించుచు శంఖజలంబు చేతను బుష్పాంజలిచేతను దేవునర్చిం పవలయును. పిమ్మట నారాధ్యయగు దేవిని మరల నర్చించి యర్థసం పన్నం బగు నామాష్టకంబును బఠింపవలయును. శివుండును, మహే శ్వరుండును, రుద్రుండును, విష్ణుండును, బితామహుండును, సంసార వైద్యుండును, సర్వజ్ఞుండును బరమాత్మయు నను నీయెనిమిది నామం బులును ప్రధానంబు లైనవి. ఇవిగా నిశ్చయంబుగ శివప్రతిపాద కంబులు. వీనియందు మొదటియైదు నామంబులును, శాంత్యతీతాది క్రమంబుగఁ బంచోపాధి ధారణంబు లగుటవలన సదాశివాది సం

జ్ఞానమాత్రంబులగుచున్నవి. కాని, యుపాధినివృత్తి యైనచో నీ చెప్పంబడిన సంజ్ఞలును నివృత్తంబు లగుచున్నవి. ఏమనిన పదంబు నిత్యంబు. పదధారి యనిత్యుండు. పదపరివర్తనంబునఁ బదధారి దానినుండి ముక్తుండగును. కాని యాపరివర్తనంబునఁ బదధారికిఁ బూర్వవిధంబగునట్టి యుపాధి మరలఁ బ్రాప్తించుచున్నది. ఆ యైదు నామంబులు నాత్మాంతరాభిధానంబులని చెప్పంబడుచున్నవి. మిగిలిన మూడునామంబులును ప్రకృతిప్రభృతి సంపర్కంబునఁ ద్రివిధోపాధి వచనంబులచే శివప్రతిపాదకంబు లగుచున్నవి. ప్రథమం బగు శివనామం బనాదిమలసంశ్లేషప్రాగభావంబగుటవలన స్వభావముచే విశుద్ధాత్మ యని చెప్పంబడుచున్నది. మఱియు, శివరహస్యజ్ఞు లగు పండితులశేషకళ్యాణమయుండగుట కారణంబుగ నీశ్వరుని శివుండని యుగ్గడించుచున్నారు. మహదాదులగు నిరువదిమూడు తత్వంబులకంటెను ప్రకృతి శ్రేష్ఠయనియు, నాప్రకృతికంటెఁ బురుషుండు శ్రేష్ఠుండనియుఁ బురుషుం డిరువదియైదవతత్వం బనియు బుధులు నిర్దేశించి యున్నారు. వేదశాస్త్రంబు లెవ్వనిఁగూర్చి ప్రణవంబునకు వాచ్యవాచకస్వరూపుండనియు, వేదైకగమ్యుండనియు, యథార్థస్వరూపంబున వేదాంతప్రతిపాద్యుండనియు నిర్దేశించుచున్నవో యట్టి పురుషుండే ప్రకృతిలీనుండును, ప్రకృతిభోక్తయుఁ ప్రకృతికర్తయు నగుచున్నాఁడు. ప్రకృతికంటెను, ప్రకృతిలీనుండగు పురుషునికంటెను బరుండగునాతఁడే మహేశ్వరుండు. ప్రకృతి పురుషప్రవృత్తు లాతనియధీనములై యుండును. సత్వరజస్తమోరూపత్రిగుణతత్త్వంబు మాయామయంబు. మాయ ప్రకృతి యనియు, మాయ మహేశ్వరుండనియు నెఱుంగునది. నారాయణుండు మహేశ్వరసంపర్కంబుచేతనే మాయావిక్షోభంబు గావించుటకు సమర్థుం డగుచున్నాఁడు. దుఃఖంబును దూరంబు చేయువాఁడు గావున నాదికారణుండగు దేవునకు రుద్రుండను నామంబు కలిగెను.

భగవానుండగు శివుండు శరీరాదులయందును, ఘటాదులయందును, శివతత్త్వంబు మొదలు భూపర్యంతంబును సమస్తంబునందును వ్యాప్తుండై యుండుటచే నాతనికి విష్ణుండను నామం బయ్యెను. జగత్పితృస్వరూపులగు బ్రహ్మాదులకుఁ బితృస్వరూపుండగుటచే శివునకుఁ బితామహుండని పేరయ్యెను. నిదానజ్ఞుం డగు వైద్యుం డౌషధమును బ్రయోగించి రోగనివారణంబు గావించునట్లు భుక్తిముక్తులనొసంగి స్థూలసంసారనివారణంబు గావించువాఁడగుటచే భగవంతుం డగు శివునకు సంసారవైద్యుం డను నామము కలిగె. అనంతమాయావృతంబు లగు నల్పజీవగణంబులు శబ్దాదివిషయజ్ఞానసిద్ధికొఱకు శ్రవణాదులం గలిగియుండియు, స్థూలసూక్ష్మంబులను, భూతభవిష్యద్వర్తమానంబులను సంపూర్ణముగ దెలిసికొనఁజాలకున్నవి. కాని సదాశివుండు నిరింద్రియుం డయ్యు ననాయాసంబుగ సమస్తవిషయంబుల నెఱుంగువాఁ డగుటచే సర్వజ్ఞుం డయ్యెను. ఆతనియందు సర్వజ్ఞత్వాదిసకలగుణంబులు నిండియుండుటవలన నాతఁడు సర్వాత్ముండును, సర్వశ్రేష్ఠుండు నగుట కారణంబుగఁ బరమాత్ముం డగుచున్నాఁడు. ఈవిధంబుగఁ బ్రణవస్వరూపుండును, నవ్యయుండు నగు మహాదేవుని బ్రస్తుతించి యీశ్వరమస్తకంబున నర్ఘ్యప్రదానంబు చేసి మరల సమాహితభావంబునఁ బ్రణవమంత్రంబుచే నాతని నర్చింపవలయును. ఇట్లర్చించినతరువాతఁ గృతాంజలిపుటుండై పూజాపుష్పంబు గైకొని వామనాసాపథంబున నున్మనాంతంబు వఱకును (నాడీవిశేషము) శివునిం గొనిపోయి దక్షిణనాసాపథంబున దేవినూర్ధ్వంబునకుఁ గొనిచని సాధకుండు తాను శివున కభిన్నుండ నని భావింపవలయును. అనంతరము సకలావరణదేవతలను హృదయపద్మంబున భావించి యథాక్రమంబుగ మంత్రంబును గురువును బూజించి శంఖార్ఘ్యపాత్రమంత్రంబులను గ్రమంబుగ హృదయన్యాసంబులుగఁ జేయవలయును. మఱియు మహా

దేవుని సమక్షంబునఁ జండేశ్వరునకు నిర్మాల్యసమర్పణంబు గావింప వలయును. తరువాతఁ బ్రాణాయామంబు చేసి మరల ఋష్యాదిన్యాసంబు గావింపవలయును. పూర్వోక్తమండలంబునకుఁ గైలాసప్రస్తరం బనిపేరు. ఆమండలమును నిత్యంబు నర్చించుట శ్రేయోదాయకంబు. కాదేని బక్షంబునకుఁగాని, మాసంబునకుఁగాని, చాతుర్మాస్యాదిపర్వదివసంబునఁగాని, యాఱుమాసంబులకుఁగాని, వత్సరంబునకుఁ గాని సమర్చింప వలయును. అట్లర్చించుటకసమర్థుం డగువాఁడు నిత్య శివపూజం గావింప వలయును. అట్టి శివలింగపూజయందించుక విశేషంబు గలదు. శిష్యుండు దీక్షాదివసంబున గురువును లింగంబును బూజించి లింగపూజావ్రతనిష్ఠం గైకొని యాజీవనంబును శివలింగపూజం గావింతు నని గురుసన్నిధిని ముమ్మారు శపథంబు గావించి పూర్వోక్తవిధానంబున నిత్యలింగార్చనంబు జేయవలెను. లింగమస్తకంబున నర్ఘ్యోదకంబుచే నర్ఘ్యంబు సమర్పించి ప్రణవమంత్రంబుచే నర్చించి ధూపదీపనివేదనంబు చేసి యీశానకోణంబునందలి చండేశు నర్చించి నిర్మాల్యంబు నాతని కర్పింపవలయును. తరువాత వస్త్రపూతజలంబులచే శివలింగంబును, దేవిని బరిశుద్ధంబు గావించి ప్రణవబీజంబున లింగమస్తకంబునఁ బుష్పనిక్షేపంబు గావింపవలయును. తరువాత నాధారశక్తిమొదలు, మదీయ విశుద్ధవిద్యాసనంబువఱకును గల సమస్తంబును భావించి పరమేశ్వరుని యథాశక్తిసంపన్నంబగు పంచగవ్యంబుచేఁగాని, కేవలచందనాది సువాసిత విశుద్ధజలంబులచేఁగాని స్నానంబు చేయింపవలయును. స్నానంబునకు ముందుగఁ బావమానసూక్తంబులచేతను, రుద్రాధ్యాయంబుచేతను నీలసూక్తంబుచేతను, ద్వరితసూక్తంబుచేతను, లింగసూక్తాదిసూక్తంబులచేతను, శైవాథర్వశీర్ష ఋక్సామంబులచేతను, సద్యోజాతాది పంచమంత్రంబులచేతను, ప్రణవంబుచేతను, శివబీజోచ్చారణంబునను,

నభిషేకంబుగావింపవలయును. స్నానాంతరంబున వస్త్రంబుచే శివలింగ సమ్మార్జనంబుచేసి మస్తకంబునఁ బుష్పనిక్షేపంబు చేయవలయును. తరువాతఁ బీఠోపరిభాగంబున శివలింగంబునుంచి సూర్యాది దేవతా పూజ గావింపవలయును. పీఠంబున కధోభాగంబున నాధారశక్తిని, ననంతదేవుని, నూర్ధ్వభాగంబున సింహాసనంబును, నూర్ధ్వచ్ఛందంబును, బాదదేశంబున స్కందుని బూజించి లింగమూర్తిం గల్పించి పార్వతీ పరమేశ్వరులకుఁ బ్రీతిసాధనంబు గావింపవలయును. ఓపార్వతీ! అతి రహస్యంబగు నీవిషయంబును నీకిట్లు బోధించితిని. దీని నెవ్వరి కెఱిం గింపక యతిరహస్యంబుగ నుంపవలయును. కాని, మద్భక్తుండును, యమనియమాదిసంపన్నుండును, సంసారవిరక్తుండును, గురుభక్తుం డును, శాంతుండును, మత్సేవకుండు నగు నాతని కీయర్థము ననుగ్ర హింపవచ్చును. నాయాజ్ఞోల్లంఘనంబుగావించి మూఢుండగునెవ్వాండు దీనిని గోపనంబు గావింపకుండునో యట్టి శివాపరాధియగువాఁడు నిశ్చయముగ నరకగామి కాఁగలఁడు. దీనిని మద్భక్తునకుఁ బ్రసాదించు వాఁడు నాకుఁ బ్రీతిపాత్రుండగును. అని యిట్లు దేవదేవుం డెఱింగిం చుటయు మహాదేవి పరమానందహృదయయై వేదార్థప్రతిపాదకం బులగు వివిధస్తోత్రంబులచేఁ బరాత్పరుని బ్రస్తుతించి నాథుని శ్రీపాద పద్మంబులకు సాష్టాంగదండప్రణామంబులం గావించి యానందాను భూతిం గాంచెను.

ఓమునిశ్రేష్ఠులారా! ప్రణవార్థపరికాశకంబగు నీసర్వోత్తమ శివజ్ఞానం బతిగుహ్యంబైనది. దీనిమూలంబున మీకష్టంబు లన్నియును దూరీభూతంబులు కాఁగలవు. ఈపరమశివరహస్యంబు పార్వతి కుమా రుండగు స్కందునకును, స్కందుండు నందీశ్వరునకును, నందీశ్వరుండు సనత్కుమారునకును నెఱింగించిరి. మహాతేజుండును సర్వజ్ఞుండు నగు వ్యాసదేవుం డీరహస్యమును సనత్కుమారునివలనం బడయఁ

గలిగెను. నాకాతని యనుగ్రహముచే లభ్యంబయ్యెను. మునివరులారా! శివభక్తులును, శాంతచిత్తులును, నగు యతీంద్రులకు మీరు గూడ శివప్రియంబగు నీరహస్యంబు నుపదేశింపుఁడు. అని యిట్లు శౌనకాదిమహర్షులకుం జెప్పి సూతుండు తీర్థయాత్రార్థియై సమస్తభూమండలమును దిరిగి వచ్చుటకై వెడలిపోయెను.

## —♦ సూతునిపునరాగమనము. ♦—

అనంతరము పరమమునులు ప్రణవతత్త్వంబు నూహించుకొనుచుఁ బరస్పరము నతివిస్మయాక్రాంతులై వామదేవమతంబును సూతునివలనం దెలిసికొనఁజాలకపోయితిమనియు, భవసాగర తరణోపాయం బగునమ్మహాత్ముని పునర్దర్శనం బెప్పుడు లభించు ననియు, మన మహేశ్వరారాధన పుణ్యఫలంబున మునివరుండు సత్వరంబ సాక్షాత్కరించుఁగాక యనియు నివ్విధంబుగఁ జింతాకులస్వాంతులై మునులందఱును, ఋషిశ్రేష్ఠుం డగు వామదేవుని హృత్పుండరీకమధ్యంబునఁ బూజించుచు సూతునిప్రత్యాగమనంబునకై నిరీక్షించుచుండిరి. అంత నొక్కవత్సరమునకు మహర్షియగు సూతుండు మరలఁ గాశీధామంబున కేతెంచెను. ఆతఁడు వచ్చుటం గాంచి ఋషులు ప్రఫుల్లహృదయులై, ప్రత్యుత్థానంబుచేసి యాసనాద్యుపచారంబులచేనాతనిం బూజించుటయు మహర్షియగు సూతుండును మందహాసవదనారవిందంబున వారికిఁ బ్రత్యభివందనంబు గావించి పరమపవిత్రంబగు జాహ్నవీజలంబునం దోఁగి, తిలతండులంబులచే దేవర్షిపితృతర్పణంబులం దీర్చి తీరంబున కేతెంచి ప్రోక్షణపూర్వకంబుగ వస్త్రయుగళపరిధానంబు చేసి ద్విరాచమనంబు లాచరించి సద్యాదిమంత్రబులచే నుద్ధూలనాదిక్రమంబున భస్మంబు సిద్ధంబుచేసికొని రుద్రాక్షమాలాధారియై నిత్యకర్మసమాపనంబు గావించి భక్తిపూర్వకంబుగా భవానీవిశ్వేశ్వరులకును, హేరంబకుమారులకును, ప్రమథగణంబులకును బూజల

గావించి పునఃపునః స్తోత్రపాఠంబులతో నమస్కారంబు లాచరించి కాలభైరవుని విధివిధానంబున నర్చించి యాదేవునకు ముమ్మారు ప్రదక్షిణంబును, నమస్కారపూర్వకంబుగ నైదుసారులు మరలఁ బ్రదక్షిణంబు చేసి సాష్టాంగదండప్రణామంబు గావించెను. అనంతరము పంచాక్షరమంత్రంబు నష్టోత్తరసహస్రపర్యాయంబులు జపంబు చేసి మహేశ్వరుని సముఖంబున క్షమాప్రార్థనం బొనరించి, చండేశ్వరు నర్చించి, శక్తిమండపమధ్యంబున వేదపారగులగు మునివరులచే నిర్దిష్టంబగు నాసనంబున సుఖాసీనుం డగుటయు, మునులందఱు నాతనికి నమస్కరించి తమతమ యుచితాసనంబుల నాసీనులై యుండిరి. అప్పుడు శ్రేష్ఠుం డగుసూతుండు మునివరులంగూర్చి ధర్మభావోద్దీపకంబు లగువాక్యంబులం బ్రశంసించుచు నిట్లనియెను.

మునిశేఖరులారా! నేనిచ్చటనుండి వెడలి దక్షిణసముద్రతీరంబునకుంబోయి సుస్నాతుండనై కల్యాణమయి యగుకన్యాకుమారీదేవిని యథావిధిగఁ బూజించి, సువర్ణముఖీనదీతీరస్థంబును, నతిపవిత్రంబు నగుశ్రీకాళహస్తిశైలనామక నగరంబునకుం బోయి యటనున్న సువర్ణముఖీజలంబుల నవగాహనంబు చేసి దేవర్షితర్పణాంతంబున నతిపవిత్రాకారుండును, బశ్చిమవదనుండును, బంచవక్త్రుండును, సందర్శనమాత్ర సర్వపాపహరుండును నగుకాళహస్తినాథుని, మఱియు నాతని దక్షిణపార్శ్వవర్తినియుఁ, గళ్యాణదాయినియు నగుజ్ఞానప్రసూనకళికాదేవిని నతిభక్తిపూర్వకంబుగ నర్చించి పూజించి యష్టోత్తర సహస్రపర్యాయంబులు పంచాక్షరమంత్రజపంబును, జపసమాపనంబునఁ బ్రదక్షిణనమస్కారంబులను, గిరిప్రదక్షిణంబును బరమానందంబునఁ బ్రత్యహంబును గావించుచు సేవించుచు నందుంటిని. ఈ విధంబుగా నియమావలంబినై నేనాప్రధానక్షేత్రంబున నాలుగు మాసంబులు గడపితిని. తరువాతఁ బంచమమాసంబున జ్ఞానప్రసూన

కళికాదేవీప్రసాదంబున నొకనాఁడు కుశచర్మచేలమయంబగు సుఖాసనంబున వసియించి ప్రాణాయామంబు సేయుచు సమాధిమగ్నుండనై పరమానంద మయుండును, జిన్మయుండును, బూర్ణాత్ముండు నగు శివుండను నేనేయని భావించుకొనుచు ననుద్విగ్నమనంబున నున్న సమయంబున నున్నతకాయుండును, జర్మదండక మండలుధారియుఁ, గృపానిధియు నగునస్మద్గురువరుండు స్వయంబుగ హృత్పుండరీకమధ్యంబున నావిర్భూతుం డయ్యెను. నీలనీరదశరీరుండును, విద్యుత్పింగళజటాజూటుండును, త్రిపుండ్రలలాటుండును, రుద్రాక్షమాలాంగళుండును, రక్తోత్పలసన్నిభవిశాలలోచనుండును, భస్మధూసరితసర్వాంగుండును, సర్వలక్షణలక్షితుండునగు నాదివ్యమూర్తిం గాంచితిని. భగవానుండగు నమ్మహాభాగుండంతలోనే యంతర్హితుండగుటయు నేను గన్నులనువిప్పి విలపింప నారంభించితిని. అప్పుడు గిరినిర్ఝరులం బోలి నాకన్నీరు ప్రవహింపం దొడంగెను. ఆసమయంబునం దాకాశవాణి “ఓసూతా! నీవిప్పుడు వారణాసీధామంబునకుం బొమ్ము! అచ్చట నీచే నుపదేశంబుఁ గాంచిన మహామునులందఱును నీశుభాగమనంబునకై ప్రతీక్షించుచు నిరాహారులై నిష్పందభావులై యున్న వారని ప్రబోధించుటయు నేనును దత్క్షణంబ లేచి పార్వతీపరమేశ్వరులకు భక్తిపూర్వకంబుగఁ బ్రదక్షిణంబును, బండ్రెండుసారులు సాష్టాంగ దండప్రణామంబులును గావించి వారి శ్రీపాదంబులచెంత గుర్వాజ్ఞను నివేదించి యటనుండి యతిత్వరితంబుగ బయలుదేరి నలువది దినంబుల కిచ్చటికి రాఁగలిగితిని. ఇప్పుడు నేనేమిచేయవలయునో యనుగ్రహపూర్వకంబుగ నానతీయవలయును. అనుటయు నమ్మునివరులు పరమానందంబునఁ బారాశర్యునకుఁ బునఃపునః ప్రణామంబులాచరించుచు మునిశ్రేష్ఠుండగు సూతుంగాంచి యిట్లనిరి. ఓమహాత్మా! సూతా! నీవే మాకు శ్లాఘనీయుండగు గురుండవు. గురుండెన్నటికిని

శిష్యులయెడ రూక్షభావంబుఁ దాల్ప నేరఁడు గావున మేమందఱమును జనవుమెయి నిన్నడుగుచున్నవారము. పూర్వంబున నీవు విరజాహోమవిధానంబు నుపదేశించు సమయంబున వామదేవమతం బొండు గలదని సూచించి యున్నవాఁడవు. అది మాకిప్పుడు సవిస్తరంబుగ నెఱింగింపవలయునని కోరుచున్నవారము. అనుటయు మహర్షియగు సూతుండు పులకితశరీరుండై భక్తిపూర్వకంబుగఁ బార్వతీపరమేశ్వరులకును, వ్యాసదేవునకును బ్రణామంబు గావించి మునిగణంబుల కానందంబుఁగూర్చుచు గంభీరవాక్యంబులతో నిట్లనియెను.

—♦ కుమారవామదేవసంవాదము ♦—

ఓమునీంద్రులారా! మీకు నిత్యసుఖంబగుఁగాక! మీ యడిగిన ప్రశ్నం బతివిచిత్రంబైనది. గురుముఖంబున నాకది యవగతంబైనది. రహస్యభేదశంకావశంబున నేనింతవఱకును దానిని బ్రకాశింపజేయనైతిని. మీరు మహాత్ములును, దృఢవ్రతులును శివభక్తులును గావునఁ జెప్పందలంచితిని. పరమానందంబుతో నాకర్ణింపుఁడు:— పూర్వ కాలంబున రథంతర కల్పంబున మహా మునియగు వామదేవుండు పృథ్వీపర్యటనంబు సేయుచు నిజపదంబులచే ధరామండలమును బవిత్రంబుగ నొనరించుచు నానందంబునఁ గుమారశిఖరంబను సుమేరుదక్షిణశృంగంబునకు శిష్యసహితుండై విచ్చేసెను. ఆతఁడు స్వయంబుగ గర్భవాసయంత్రణావిముక్తుండై శివతత్త్వజ్ఞానవిదులకుఁ బరమగురుండై యుండెను ఆతని చిత్తంబెప్పుడును బరబ్రహ్మాయత్తంబై యుండును. వేదాగమపురాణేతిహాసాది సమస్తశాస్త్రంబులు నాతనికి నఖదర్పణసన్నిభంబులు దేవదానవమానవ ప్రభృతి జీవగణంబుల జన్మకర్మంబులాతని కవగతంబులు. అతని సర్వాంగంబును విభూతివిభూషితంబును, మస్తకంబు జటాజూట శోభితంబునై యుండును. ఆతడు నిరాశ్రయుండును, నిస్స్పృహుండును, నిర్ద్వంద్వుండును, నిర

హంకారుండును, నిర్భయుండును, దిగంబరుండునై యుండు. కావున నాతండు రెండవమహేశ్వరుండునుంబోలి చూపట్టుచుండును. ఆ కుమారశిఖరంబున జ్ఞానశక్తిధరుండును, సర్వదైత్యప్రమథనుండును, సర్వదేవతావంద్యుండును, శివతనయుండును, భగవానుండు నగు శిఖివాహనుం డవస్థితుండై యుండును. ఆసమీపంబున నాశ్చర్యగుణ సంపన్నంబగు స్కందసరోవరంబు విరాజిల్లుచుండును. దానియాకారంబు సాగరతుల్యంబును, నందలిజలంబగాధంబును, స్వచ్ఛంబును, శీతలంబును, మనోహరంబును, మధురంబునై యుండును. మహర్షి యగు వామదేవుండు శిష్యసహితుండై యందు స్నానం బాచరించి మునిగణారాధ్యుండును, బాలాదిత్యవిభుండును, గుమారశిఖరనాథుండును, శక్తికుక్కుటవరాభయహస్త చతుష్టయుండును, ముకుటాది భూషణభూషితుండును, మయూరసింహాసనస్థితుండును, శ్రేష్ఠశక్తిద్వయోపాసితుండు నగుస్కందదేవునిం దర్శించి పరమభక్తిపూర్వకంబుగఁ బూజాస్తవంబులఁ గావింపం దొడంగెను. దేవా! నీవు ప్రణవార్థస్వరూపుండవు. ప్రణవార్థప్రతిపాదకుండవు, ప్రణవాక్షరబీజస్వరూపుండవు. ప్రణవంబవగునీకు నమస్కారము. వేదాంతార్థస్వరూపుండును, వేదాంతార్థవిధాతయు, వేదాంతవిదులకు విదితుండును నగునీకుఁ బ్రణామంబులు. గుహుండును, బుద్ధిగుహాంతర్విరాజమానుండును, గుహ్యుండును గుహ్యాగమ విదుండును నగు నీకు వందనము. పరమాత్ముండవును, సూక్ష్మంబునకంటె సూక్ష్మతరుండవును, మహత్తుకంటె మహత్తరుండవును, స్కందుండవును, స్కందరూపుండవును, సిందూరారుణ తేజస్కుండవును, మందారమాలికామకుటుండవును, శివశిష్యుండవును, శివకుమారుండవును, శివునకుఁ గూడ శివప్రదుండవును, శివప్రియుండవును, నంబికాశంకరుల కానందనిధానుండవును, గాంగేయుండవును, గార్తికేయుండవును,

ధీమంతుండవును, మాతృకాతనయుండవును, మహత్స్వరూపుండవును, శరవణశయానుండవును, షడక్షరశరీరుండవు, షడర్థవిధాయకుండవును, షడాననుండవును, షడధ్వాతీతస్వరూపుండవును, ద్వాదశాక్షుండవును, ద్వాదశాయతబాహుండవును, ద్వాదశాయుధహస్తుండవును, ద్వాదశాత్ముండవును, చతుర్భుజుండవును, శాంతుండవును, శక్తికుక్కుటవరాభయహస్తుండవును, నసురనాశకుండవును, గజావల్లీమనోహరుండవును, గణాననానందగరిమానందితుండవు నగు నీకు నమస్కారంబు. దేవదేవా! దేవగణారాధితదివ్యపాదపంకజా! బ్రహ్మాదిదేవతలును, మహర్షులును, గిన్నరులును, నీయద్భుతచరిత్రములను రచియించి నిరంతరమును నిన్నుఁ గీర్తించుచుందురు. అట్టి మహాదేవశేఖరుండవగు నీకుఁ బ్రణామంబు. అని యిట్లు వామదేవుండు భగవానుండగు కుమారుని బ్రస్తుతించి ప్రదక్షిణంబు చేసి భూతలంబున సాష్టాంగదండప్రణామంబును గావించి మరలఁ బ్రదక్షిణంబును బ్రణామంబును గావించి వినయవినమ్రభావంబున నమ్మహాదేవుని పార్శ్వభాగంబున నిలువంబడుటగుటయు మహాదేవుండగు మహాసేనుం డాతనిం గాంచి యిట్లనియెను. మునివరా! భక్తిపూర్వకంబగు నీపూజకును స్తోత్రంబునకును నేను సంప్రీతుండ నైతిని. నీకు శుభంబగుఁగాక! ఇప్పుడు నావలనం గావలసిన దేదియో వచియింపుము. మునీంద్రా! నీవు యోగిగణంబులలోఁ బ్రధానుండవు; పూర్ణకాముండవు; నిస్పృహుండవు; నీవంటివానికిఁ గోరఁదగినఁదేదియు నుండ దని నేనెఱుంగుదును. అయినను సాధువులగువారు లోకహితార్థంబుగ సంచరించుచుందురు. ఓబ్రహ్మస్వరూపా! నీవు వినవలసిన దేదైనఁ గలదేని నన్నడుగుము. లోకహితంబుకొఱకు నేనిప్పుడే చెప్పెదను. ఇట్లు కుమారదేవుం డానతిచ్చుటయు, వామదేవుండు వినయావనతుండై ప్రేమగద్గదస్వరంబున నిట్లనియెను. దేవా! నీవు పరమైశ్వర్యప్రదా

తవు ; సర్వజ్ఞుండవు ; సర్వకర్తవు ; సర్వశక్తిధరుండ వగు పరమేశ్వరుండవు ; మేమల్పజీవులము. నిన్నుఁ బ్రశ్నించుటకు మాకు సామర్థ్యంబు లేదు. అయినను జ్ఞానకణప్రదానంబున నన్నుఁ గృతార్థునిం గావింపుము. నేను నీప్రేరణంబుననే ప్రశ్నించుచున్నాను. నాయవినయమును మన్నింపవలయును. దేవా ! సాక్షాత్సంబంధంబునఁ బరమేశ్వరప్రదర్శకంబగు ప్రణవంబు సర్వోత్కృష్టంబైనది. పశుపాశవిమోచకుండగు పశుపతి దీనికిఁ బ్రతిపాద్యుండు. ప్రణవమూలంబున నుపాసించినచో శివుండు సద్యఃప్రసన్నుండై జీవులకు మోక్షంబును బ్రసాదించును. అప్పుడే ప్రణవంబునకు వాచకత్వము సఫలంబగును. ఓంకారమే పరిదృశ్యమానంబగు విశ్వంబనియు, నదియే బ్రహ్మంబనియు, సమస్తంబును బ్రహ్మంబనియు సనాతనశ్రుతు లుద్ఘోషించుచున్నవి. ఓ దేవసేనానాయకా ! నీవు దేవతాపతివి ; దేవదేవుండవు; పూర్ణకాముండవు ; అట్టినీకు నమస్కారము. మహాసేనా ! అట్లయినచో నీజగంబున శివుండే యేకమాత్రవిద్యమానుం డగుచున్నాఁడు. నేనెప్పుడు నిదివఱకు సమస్త వ్యస్తభావములతోఁ బ్రణవార్థంబును వినియుండలేదు. అయ్యర్థంబు నుపదేశరూపంబుగను, సదాచారక్రమంబుగను నానతీయవలయును. నీవు సర్వజీవపాశమోచనకర్తవగు గురుండవు. కావున నీయనుగ్రహంబున నీయర్థంబు తేటపడుంగాక అని యిట్లు వామదేవుండు ప్రశ్నించుటయు భగవానుండగు స్కందుండు, అష్టత్రింశత్కళాపూర్ణులును, బ్రణవశరీరులునగు పార్వతీపరమేశ్వరుల కసంఖ్యప్రణామంబులు గావించి కల్యాణమయంబులగు వచనంబులతో జెప్పందొడంగెను. ఆవాక్యంబులు చతుర్వేదప్రకాశకంబులై యుండెను.

## —: ప్రణవోపాసనావిధానము :—

మహాత్మా ! వామదేవమునీంద్రా ! నీవు ధన్యుండవు ; శివభక్తశ్రేష్ఠుండవు. ఈజగంబున నీవెఱుంగని విషయంబులు లేవు.

అయినను లోకహితార్థివగు నీకుఁ జెప్పుచున్నాను. ఈజగంబునందలి సకలజీవులును, బరమేశ్వరుని యతివిచిత్రంబగు మాయచేఁ బ్రతారితులై నానాశాస్త్రంబులయందలి పరస్పర విరుద్ధంబులగు సిద్ధాంత దర్శనంబులచే మోహితులై సాక్షాత్సంబంధంబునఁ బ్రణవార్థస్వరూపుండగు మహేశ్వరు నెఱుంగంజాలకున్నవారు. కాని నేను నాదక్షిణ కరంబు నెత్తి ప్రతిజ్ఞాపూర్వకంబుగ వచియించుచున్నాను. సాక్షాత్సంబంధంబునఁ బ్రణవార్థస్వరూపుఁడుగా శివుండు కీర్తింపఁబడుచున్నాఁడు. ఆతఁడు వాఙ్మనంబుల కతీతుఁడు; ఆనందమయుఁడు. ఆతని నెఱింగినవారికి జన్మజరామృత్యుభయంబులు లేవు. ఆతనినుండియే ప్రథమంబున విష్ణురుద్రేంద్రాది దేవతలును, బంచభూతంబులును, బంచేంద్రియాదులును సమస్తజగంబులును నుత్పన్నంబులయ్యెను. ఆతఁడు స్వయంభువు. సూర్యచంద్రవిద్యుత్ప్రభ లాతని బ్రకాశింపఁజేయజాలవు; ఆతని తేజంబుచే నీసర్వజగంబును బ్రకాశితం బగుచున్నది. ఆతఁడు సకలైశ్వర్యసంపన్నుండగుటచే సర్వేశ్వరుండయ్యెను. ముముక్షువు లాతనిని వ్యోమచారియగు శంభుస్వరూపంబున ధ్యానించుచుందురు. ఆపురుషుని పరాశక్తి భావగమ్యంబును, మనోహరంబును, నిర్గుణంబును, స్వగుణంబుచే నిగూఢంబును, నిష్కలంబును, శివంబు నగుచున్నది. తద్రూపంబు స్థూలంబనియు, సూక్ష్మంబనియుఁ ద్రివిధంబు. ఎవ్వఁడు పూర్ణుండును, సర్వదేవాదిదేవుండును, సనాతనుండును, జ్ఞానక్రియాస్వరూప పరమాత్ముండు నని చెప్పంబడునో యట్టి దేవాదిదేవుని మూర్తియే సాక్షాత్సదాశివ స్వరూపంబు. సద్యోజాతాది పంచమంత్రంబులును, నివృత్త్యాది పంచకళలును నాతని శరీరంబు. ఆతఁడు వినిర్మలుండును, స్నిగ్ధప్రభామయుండును నైయుండును. ఆతఁడు పంచముఖుండు; దశహస్తుండు; పంచదశనయనుండు; ఆతని ముకుటంబున నీశానుండును, వదనంబునఁ బురు

షుండును, హృదయమునం దఘోరుండును, గుహ్యదేశంబున వామదేవుండును, జరణంబుల సద్యోజాతుండును విద్యమానులగుచున్నారు. ఆతఁడిట్టి రూపసంపన్నుండై సకలుండును, నిష్కలుండునై విరాజిల్లుచుండును. సర్వజ్ఞత్వాది శక్తిషట్కంబును నాతనికి షడంగంబులు. ఆతఁడు శబ్దాది శక్తిపూర్ణుండును, హృదయకమలవిరాజమానుండును నైయుండును. నిజశక్తియగు మనోన్మని యాతని వామభాగంబున శోభిల్లుచుండును. ఆతఁడే ప్రణవార్థంబును, మంత్రయంత్రాది షట్పదార్థంబుల సమస్తవ్యస్తభావంబులను వివరించెద నాకర్ణింపుము.

## —♦ నాందీశ్రాద్ధవర్ణనము. ♦—

ఓమునిచంద్రా! ఈజగంబునఁ జతుర్వర్ణంబులుగలవు. ఇది సర్వవిదితంబు. అందు మూడువర్ణంబులకు శ్రుతివిహితాచారవిధులున్నవి. శూద్రులు శ్రుతిబహిష్కృతులు. ఈ త్రివర్ణంబులను సేవించుటయే వారికిఁ బ్రధానధర్మంబు. బ్రాహ్మణాదివర్ణత్రయంబు నిజాశ్రమ ధర్మరక్షణంబు గావించుకొనుచు శ్రుతిస్మృతివిహితధర్మానుష్ఠానంబున మెలంగవలయును. దీని నన్యథాకరింపంజనదు. శ్రుతిస్మృత్యనుసారంబుగఁ గార్యకలాపంబు నిర్వర్తించుచు వర్ణాశ్రమంబుల యాచారకుసుమంబులచేఁ బరమేశ్వరార్చనంబు గావించినచో సిద్ధిలాభంబు గలుగును. అనేకులగు మునిప్రవరు లిట్లు గావించి సాయుజ్యలాభంబు నందంగలిగిరి. బ్రహ్మచర్యంబున ఋషులును, యజ్ఞంబున దేవతలును, స్వధామూలంబునఁ బితృదేవతలును బరితృప్తులగుదు రని శ్రుతులు చెప్పుచున్నవి. అట్లు వారికిఁ దృప్తిసాధనంబు గావించి మానవుండు ఋణత్రయవిముక్తుండై వానప్రస్థాశ్రమంబు నవలంబింపవలయును. ఆసమయంబున శీతోష్ణాది ద్వంద్వంబులను సహించుచు నింద్రియంబులను జయించి యాహారసంయమనంబు చేసి బుద్ధికి దార్ఢ్యంబును, నిశ్చలత్వంబును లభించుటకు యమనియమాది

యోగాభ్యాసంబు గావింపవలయును. ఇవ్విధంబుగఁ గ్రమంబున నాత్మశుద్ధి యైనంతనే సకలకర్మంబులకును జలాంజలి నొసంగి జ్ఞానపూజం గావించుచుండవలయును. శివైక్యంబును బ్రాపింపఁజేయు నిట్టిజ్ఞానపూజ జీవన్ముక్తిఫలప్రదం బగుచున్నది. విచక్షణుం డగుద్విజుండు శాస్త్రవిశారదుండును, వేదాంతజ్ఞుండును, యమనియమాది సంపన్నుండును, బుద్ధిమంతుండును నగునాచార్యుని దర్శించి ప్రణామపూర్వకంబుగ నాతని నెల్లవిధంబుల సంతుష్టుంగావించి గురునకును శివునకును నభేదంబు మనంబున నిశ్చయించుకొని ప్రణవోపాసనా విషయంబునఁ దనకుం గలకుతూహలము నాతని కెఱింగించి యాతని యాజ్ఞం గైకొని యాతనితోఁ గలసి పండ్రెండుదినంబులు దుగ్ధమాత్రపానంబున నుపవసించి యుండి శుక్లపక్షచతుర్థియందుఁగాని దశమియందుఁగాని యథావిధిగఁ బ్రాతఃస్నానంబు చేసి శుచియై నిత్యకర్మంబులం దీర్చి గురుదేవు నాహ్వానించి విధిపూర్వకంబుగ నాందీశ్రాద్ధంబు నారంభింపవలయును. అందు విశ్వేదేవతలు సత్యవసుసంజ్ఞలు గలవారు దైవశ్రాద్ధంబున బ్రహ్మవిష్ణుమహేశ్వరులను ఋషిశ్రాద్ధంబున దేవక్షేత్రమనుష్యజులను, దివ్యోపపాదుకంబను దేవశ్రాద్ధంబున వసురుద్రాదిత్యులను, మానుషశ్రాద్ధంబున సనకాది చతుర్మునులను, భూతశ్రాద్ధంబునఁ బంచమహాభూతంబులను, నింద్రియంబులను, స్వేదజంబులు, కండజంబులు, జరాయుజంబులు, నుద్భిజ్జంబులు, నను చతుర్విధభూతసమూహంబులను, పితృశ్రాద్ధంబునఁ బితృపితామహప్రపితామహులను, మాతృశ్రాద్ధంబున, మాతృ, పితామహీ ప్రపితామహీత్రయంబును, నాత్మశ్రాద్ధంబునఁ దన్నును, పితృమాతృపితామహపితామహీప్రపితామహులను, ప్రపితామహిని, మాతామహశ్రాద్ధంబున మాతామహప్రమాతామహ వృద్ధప్రమాతామహులను దేవతలుగాఁ బరిగణింపవలయును. ప్రతిశ్రాద్ధంబునను నిరువురు

బ్రాహ్మణులను మనంబున సంకల్పించుకొని పిమ్మట వారి నహ్వా
నంబు చేసి పాదంబులఁ గడిగి యాచమనంబు చేసి "సకలసంపల్లా
భంబులకు నిదానంబులును, విపన్నాశనకరంబులును, నపారంబగు
సంసారసముద్రంబునకు సేతురూపంబులు నగుబ్రాహ్మణ పాద రేణువులు
నన్నుఁ బవిత్రునిం గావించుఁగాక! విపత్తనియెడి గాఢాంధకారంబునకు
సూర్యకిరణస్వరూపంబులును, నభిమతార్థ ప్రదానంబునఁ గామధేను
స్వరూపంబులును, సర్వతీర్థజలంబులంబోలి పవిత్రస్వరూపంబులును
నగు విప్రపాదరజఃకణంబులు నన్ను రక్షించుఁగాక" అను వాక్యంబు
లను బఠియించుచు బ్రాహ్మణులకు సాష్టాంగదండప్రణామంబు చేసి
పూర్వాభిముఖుండై కూర్చుండి సదాశివపాదపద్మములను సంస్మరింప
వలయును. తరువాతఁ బవిత్రంబు ధరియించి యుపవీతియై దృఢాస
నంబున నుపవసించి ముమ్మారు ప్రాణాయామంబు చేసి తిథ్యాదుల
నుల్లేఖించి "మీయాజ్ఞాక్రమంబున వైశ్వదేవాదిగా మాతామహ
పర్యంతంబును మదీయసన్యాసంబున కంగభూతంబు లగు నష్టవిధశ్రా
ద్ధంబులను పార్వణవిధానంబున నాచరించుచున్నాఁడను" అని సంక
ల్పించి యుత్తరంబుగ దర్భలను విడువవలయును. అనంతరమున
నాచమనంబు చేసి వరణక్రమంబు నారంభింపవలయును. పవిత్ర
హస్తంబుతో నిమంత్రితులగు బ్రాహ్మణుల హస్తంబులను స్పృశించు
చు "విశ్వేదేవార్థమై మీరు క్షణకాలము ప్రసన్నులై యుండవలయు
ను" అని వారిని బ్రార్థింపవలయును. సకల శ్రాద్ధంబులయందు
నిదియే విధానం బని యెఱుంగవలయును. ఇవ్విధంబుగ వరణక్రియ
నిర్వర్తించి మండలరచనంబు చేసి యుత్తరంబు మొదలుగ దశామండ
లంబులం గావించి యమ్మండలోపరిభాగంబున బ్రాహ్మణులను సమా
సీనులం జేసి యక్షతలచే వారిచరణంబులను బూజించుచు "విశ్వేదేవ
స్వరూప బ్రాహ్మణులగు మీకిదె యాసనంబు" అని యుగ్గడించుచుఁ

గుశాసనం బొసంగి తానును గుశలను గరంబున దాల్చి "ఈనాందీ ముఖశ్రాద్ధంబున విశ్వేదేవార్థము మీరించుక సేపాగవలయును" అని నుడువుచు "మీరు మీయాసనంబులఁ బరిగ్రహింపుఁడు" అని చెప్ప వలయును. వారును "మేమియ్యాసనంబుల గ్రహించితి" మని చెప్ప వలయును. తరువాత "మీయనుగ్రహంబున శ్రాద్ధంబు సంపన్నం బగుఁగాక! సంకల్పసిద్ధి యగుఁగాక!" అని వారి సన్నిధిని బ్రార్థిం చుచుఁ బవిత్రంబులగు కదళ్యాదిపత్రంబులను బరిశుద్ధంబులుగఁ జేసి వానియం దన్నాదిభోజ్యద్రవ్యంబుల నుంచి యాపాత్రింబులకు నిమ్న భాగంబునఁ గుశలను బరచి యందు జలసేకంబు గావించి రెండుచేతు లతో నతిప్రయత్నంబున నాపత్రంబులను బట్టుకొని "పృథివీతేపాత్రం" ఇత్యాది మంత్రపఠనంబు సేయుచు దైవపక్షంబున దత్తత్పాత్రస్థితు లగు దేవతల నామంబులను జతుర్థ్యంతంబులుగఁ జేసి పఠించుచు నక్షతలను జలంబును గ్రహించి "స్వాహానమః" అని యుచ్చరించుచు దేవతల కన్నప్రదానంబు గావింపవలయును. సర్వవిషయంబుల నిట్లే విధియని యెఱుంగునది. తరువాత "ఎవ్వని పాదపద్మస్మరణంబునను, నెవ్వని నామకీర్తనంబునను నంగహీనంబగు కర్మగూడ సాంగంబగు చున్నదో యట్టి సదాశివునకును, భగవతికిని వందనంబులు" అని ప్రార్థించి "నేను గావించుచున్న యీనాందీముఖశ్రాద్ధంబు భవత్ప్రి సాదంబున సంపూర్ణంబగుఁగాక" మీరట్లు చెప్పవలయునని బ్రాహ్మ ణులను బ్రార్థింపవలయును. తరువాత "దనకరంబునందలి జలంబును వారిచేతులలో విడిచి సాష్టాంగప్రణామంబు చేసి లేచి "అమృతమగుఁ గాక" అని వచింపవలయును. తరువాత మనంబున సదాశివధ్యానంబు చేయుచు విధివిధానంబున రుద్రాధ్యాయంబును, జమకంబును, బురుష సూక్తంబును, సద్యోజాతాది పంచమంత్రింబులను బఠియింపవల యును. భోజనాంతంబున బ్రాహ్మణులచే రుద్రసూక్తమును బఠియిం

పఁజేసి యుత్తరాపోశనంబు నొసంగవలయును. తరువాతఁ బాదంబులఁ గడిగికొని పిండస్థానంబునకుం బోయి పూర్వాభిముఖుండై మౌనంబుదాల్చి ముమ్మారు ప్రాణాయామంబు చేసి "నాందీముఖ శ్రాద్ధంబున కంగంబగు పిండదానంబు చేసెదను" అని సంకల్పంబు చేసి దక్షిణాగ్రంబునుండి యారంభించి ప్రాగగ్రంబులుగాఁ దొమ్మిది జమిలిరేఖల నంకితంబు చేసి తన్మధ్యంబునఁ బంచదేవస్థానంబులను గుశాస్తరణంబు చేసి త్రిస్థానంబుల మౌనంబుతో నక్షతలను జలంబును విడిచి యితరస్థానంబులయందు "మార్జయంతాం మంత్ర పితరః" ఇత్యాదిమంత్రంబులచే జలాక్షతలను విడిచి దేవాదిస్థానంబులయందుఁగూడ నిట్లే కావింపవలయును. తరువాత నాయా దేవాదినామంబులను జతుర్థ్యంతంబులుగా నుచ్చరించుచుఁ బ్రత్యేక స్థానంబులఁ బిండప్రదానంబు గావింపవలయును. తరువాతఁ చిత్రాది పంచస్థానంబులయందును మౌనియై జలాక్షతలను విడిచి స్వకీయంబగు గృహ్యసూత్రోక్తప్రకారంబున వేఱు వేఱుగఁ బిండదానంబు చేసి షడ్గుణఫలసిద్ధికొఱకు మరల జలాక్షతలను విడువవలయును. తరువాత హృదయకమలమధ్యంబున భగవంతుండగు సదాశివుని ధ్యానించుచుఁ బూర్వోక్తప్రకారంబునఁ బ్రార్థింపవలయును. తరువాత బ్రాహ్మణులకు నమస్కారపూర్వకంబుగ యథాశక్తిని దక్షిణాదుల నొసంగి క్షమాప్రార్థనంబు చేయుచు వారిని బంపించి పిండంబును గోవుచే భుజింపఁజేయుటగాని, జలంబుల నిక్షేపించుటగాని చేయవలయును. ఇవ్విధంబుగ శ్రాద్ధసమాపనంబు చేసి పుణ్యాహవాచనపూర్వకంబుగ యథాయోగ్యులగువారితోఁ గలసి భోజనంబు గావింపవలయును. మరునాటియుదయంబున లేచి నిత్యకర్మలందీర్చి కర్మాంతంబువఱకు నుపవసించి విధిపూర్వకంబుగ నాయుష్కర్మంబు గావించుకొనవలయును. తరువాత స్నానంబుచేసి శుచియై మౌనంబు నవలంబించి

రెండుసారు లాచమనంబు చేసి యథావిధిగ భస్మధారణంబును, బుణ్యాహవాచనంబును జేయుచు దేహస్వభావశుద్ధికొఱకు వానిమూలంబున నాత్మప్రోక్షణంబు గావించుకొనవలయును. అనంతరము హోమంబుకొఱకును, నాచార్యదక్షిణకొఱకును ద్రవ్యాదులను సేకరించి యవశిష్టద్రవ్యంబులను, వస్త్రాదులను, సదాశివునకును, శివభక్తలగు బ్రాహ్మణులకును, గురురూపుండగు శివునకును దక్షిణలుగా నొసంగి సాష్టాంగదండప్రణామంబు గావింపవలయును. పిమ్మటఁ బ్రక్షాళితం బగు పవిత్రసూత్రంబును, కౌపీనంబును, దండాదులను, సమిధాదిహోమ ద్రవ్యంబులను గైకొని నదీతీరంబున కైనను, సముద్రతీరంబున కైనను, బర్వతంబున కైనను శివమందిరంబున కైనను, నరణ్యంబునకైనను, గోష్ఠంబునకైనను బోయి యందుత్తమస్థానంబున నుండి యాచమన పూర్వకంబుగఁ బ్రథమంబున మానసజపంబును, బిమ్మట "ఓం నమో బ్రహ్మణే" అను బ్రహ్మమంత్రమును ముమ్మారును జపింపవలయును. తరువాత "అగ్నిమీళేపురోహితం - అథమహావ్రతం - అగ్నిర్వైవేదానామవమః - ఇషేత్వోర్జేత్వా - అగ్నఆయాహివీతయే శన్నోదేవీరభీష్టయే" అను నీమంత్రంబులను బఠియింపవలయును. తరువాత మ-య-ర-స-త-జ-భ-న-గ-ల-అను నిట్టి సాంకేతికవర్ణమయచ్ఛందశ్శాస్త్రంబును, సంవత్సరంబును, బరివత్సరంబును, నిదావత్సరంబును, నుదావత్సరంబును, ననువత్సరంబు నను పంచవత్సరమయంబగు జ్యోతిశ్శాస్త్రంబును బఠియింపవలయును. అనంతరము వృద్ధిరాదైచ్" అను శిక్షాసూత్రంబును, బిమ్మట "అథాతోధర్మజిజ్ఞాసా" అను ధర్మసూత్రంబును "అథాతోబ్రహ్మజిజ్ఞాసా" అను బ్రహ్మసూత్రంబును బఠియింపవలయును. మఱియుఁ గేవల వేదాదిమంత్రంబులనైన బఠియింపవలయును. అనంతరము బ్రహ్మ, ఇంద్ర, సూర్య, సోమ, ప్రజాపతి, ఆత్మ,

అంతరాత్మ, జ్ఞానాత్మ, పరమాత్మ అను నామంబులను జతుర్థ్యంతంబులుగఁ జేసి ప్రణవపూర్వకంబులుగ నమోంతంబులుగ నుచ్చరించుచు బిడికెఁడు పేలపిండిని భక్షింపవలయును. తరువాత బ్రణవమంత్రంబుచే రెండుసారు లాచమనంబు చేసి నాభిని స్పృశించుచు, ఆత్మ, అంతరాత్మ, జ్ఞానాత్మ, ప్రజాపతిఅనునామంబులను జతుర్థ్యంతంబులుగఁ జేసి ప్రణవపూర్వకంబులుగను, నమోంతంబులుగ నుచ్చరించుచు మరలఁ జతుర్థ్యంతంబులగు నయ్యాత్మాదినామంబులను స్వాహాంతంబులుగఁ జేసి యుచ్చరించుచు జపంబు గావింపవలయును. తరువాత ఘృతంబును, దుగ్ధంబును, దధిని బ్రణవమంత్రోచ్చారణ పూర్వకంబుగ ముమ్మారు ప్రాశించి రెండుసారులు మరల నాచమనంబు చేసి పూర్వాభిముఖుండై కూర్చుండి ముమ్మారు ప్రాణాయామంబు గావింపవలయును.

## హోమాదివర్ణనము.

అనంతరము ద్విజుండు మధ్యాహ్నకాలంబున స్నానంబు చేసి నియతచిత్తుండై గంధపుష్పాక్షతాది పూజాద్రవ్యంబులం గైకొని నైరృతికోణంబున విధిపూజ్యుండును, భగవానుండు నగువిఘ్ననాయకుని బూజింపవలయును. అందుఁ బ్రథమంబున "గణానాంత్వా" అనుమంత్రముచే నావాహనంబు చేసి ధ్యానోక్తప్రకారంబున గజానన మూర్తిని సంకల్పించుకొని ధ్యానించి గంధాద్యుపచారంబుల నర్చించి పాయసంబును, మోదకంబులును, నారికేళంబులును, గుడప్రభృతి పదార్థంబులును నివేదనంబు గావించి ప్రణామంబుగావించి విఘ్నోపశాంతికొఱకుఁ బ్రార్థింపవలయును. అనంతర మాహవనీయాగ్నియందు గృహ్యసూత్రోక్తప్రకారంబున నాజ్యభాగాంతంబుగ హోమంబు చేసి స్రుక్పాత్రంబుచే "భూస్స్వాహా!" అనుమంత్రంబునఁ బూర్ణాహుతినిచ్చి శ్రద్ధాపూర్వకంబుగ నపరాహ్ణంబున గాయత్రీజపంబు చేయవలయును. అనంతరము స్నానపూర్వకంబగు సాయంసంధ్యావ

సానంబునం దాహవనీయాగ్నిచే నిత్యహోమంబుచేసి గురునియానతి ననుసరించి మౌనినై యయ్యగ్నియందు జరుపాకంబు చేసి "పరిణో రుద్రస్య" ఇత్యాది రుద్రసూక్తంబులచేతను, సద్యోజాతాది పంచమంత్రంబులచే హోమంబు గావించి యయ్యగ్నిమధ్యంబునఁ బార్వతీ పరమేశ్వరులమూర్తులను భావించి ధ్యానింపవలయును. తరువాత మంత్రపూర్వకంబుగ గౌరిని స్మరించుచు హోమంబు చేసి "అగ్నయేస్విష్టకృతేస్వాహా" అను మంత్రంబున నొక్కసారి యాహుతి నొసంగి యుదీచ్యకర్మంబు గావించి యగ్నికుత్తరభాగంబునఁ గుశచర్మచేలమయంబగు నాసనంబున వసించి మౌనినై యేకాగ్రచిత్తంబున బ్రాహ్మముహూర్త పర్యంతంబును గాయత్రీజపంబు గావింపవలయును. పిమ్మట జలావగాహనంబు చేసి యశక్తుండైనచో భస్మస్నానంబు చేసి యయ్యగ్నియందుఁ జరుపాకంబు చేసి యభిఘరించి యగ్నికుత్తరభాగంబునఁ గుశోపరిభాగంబున నుంచి మరల ఘృతంబుచే నభిఘరించి సప్తవ్యాహృతులను, రుద్రసూక్తంబును, సద్యోజాతాది పంచమంత్రంబులను బఠియించుచుఁ బుణ్యాహవాచనంబు చేసి యగ్నిముఖంబును, నుదీచ్యకర్మాంతంబున "ప్రాణాయస్వాహా" అను పంచమంత్రంబులచేతను నాహుతియు నొసంగి రుద్రసూక్తంబునను, సద్యోజాతాది పంచమంత్రంబులను, నిజశాఖానుసారంబుగ సమిదాజ్యచరుహోమంబు గావించి వ్యూహమంత్రంబులచే శక్తిసహితమహేశప్రభృతులకుఁ జతుర్వ్యాహాహుతి నొసంగి చరుఘృతంబులచే నగ్నియందాహుతి నొసంగవలయును. తరువాత నిజశాఖోక్తవిధంబున నాయాదేవతలకు మంత్రపూర్వకంబుగ నాహుతిదానంబు చేయవలయును. ఇది యగ్నిముఖాది హోమకార్య నియమంబు.

మునీంద్రా! అనంతరము ప్రకృత్యాది షడ్వింశతి తత్త్వమయంబగు నీదేహంబున లీనంబై యున్న యాత్మకుఁ బరిశుద్ధికొఱకు

"నాదేహమునంగల సకలతత్త్వంబులును విశుద్ధంబు లగుగాక" అని [పఠి]ంచి విరజాహోమంబు చేయవలయును. ఆసమయంబున నాత్మ[త]త్త్వశుద్ధికొఱకుఁ దైత్తిరీయారణ్యకంబునఁ జెప్పంబడిన "అష్టయోనీమష్టపుత్రాం" అను మంత్రంబు మొదలు "అథపురుషః సప్తపురుషః" అను మంత్రపర్యంతంబును బఠించి మౌనంబుతోఁ శివపాదపద్మస్మరణంబు చేయుచు, సాజ్యచరుమూలంబున హోమంబు చేయవలయును. పృథివ్యాది పంచతత్త్వంబులును, శబ్దాది పంచతత్త్వంబులును, వాగాదిపంచతత్త్వంబులును, శ్రోత్రాదిపంచతత్త్వంబులును, మస్తకంబును, పార్శ్వంబులును, పృష్ఠంబును, నుదరంబును, జంఘలును, ద్వగాది సప్తధాతువులును, ప్రాణాదిపంచవాయువులును, నన్నాది పంచకోశంబులును, మనంబును, శుక్రంబును, బుద్ధియు, నహంకారంబును, ఖ్యాతియు, సంకల్పంబును, గుణంబును, బ్రకృతియు నను నివి తత్త్వంబులును, విశేషతత్త్వంబులునై యున్నవి. భోగకర్తయగు పురుషుని భోగార్థంబుగ నంతరంగంబున నియతియుఁ, గాలంబును, రాగంబును, విద్యయుఁ, గళయు నను పంచతత్త్వంబులు ప్రకీర్తితంబులై యున్నవి. ఈయైదుతత్త్వంబులును, మాయనుండి యుత్పన్నంబులైనవి. మాయయే ప్రకృతి యని యెఱుంగుము. ఆప్రకృతినుండియే యీతత్త్వంబులు గలిగినవని శ్రుతులు చెప్పుచున్నవి. ఈపంచతత్త్వంబులును బంచకంచుకంబులని బుధులు నిర్దేశించియున్నారు. వీని నెఱుంగనిచోఁ గృతవిద్యుండు కూడ మూఢుం డగుచున్నాఁడు. నియతికధోభాగంబునను బ్రకృతికూర్ధ్వభాగంబునను బూర్వోక్తపురుషుండు కాకాక్షిన్యాయంబున నాశ్రయించి వాని పార్శ్వంబున నిరంతర వర్తమానుండై యుండును. శుద్ధవిద్యయు, మహేశ్వరుండును, సదాశివుండును, శక్తియు, శివుండు నను నీయైదును శివతత్త్వపంచకంబు. పృథివ్యాది శివపర్యంతంబునుగల సకల తత్త్వంబులయందును

స్వస్వకారణంబులను లయంబుచేసి వానికి విశుద్ధత్వంబు నాపాదింప వలయును. "పరస్మైశివజ్యోతిషే ఇదంనమమ-విచిత్ర్యైస్వాహా-కపోత్కాయస్వాహా - వ్యాపకాయ పరమాత్మనే ఇదంనమమ - శివజ్యోతిషేఇదంనమమ - విశ్వభూతాయ ఇదంనమమ - ఘనసోత్సుకాయ ఇదంనమమ - లోకత్రయవ్యాపినే పరమాత్మనే పరస్మై దేవాయ ఇదంనమమ - ఉత్తిష్ఠస్వవిశ్వరూపాయ ఇదంనమమ - ఓంస్వాహా - లోకత్రయవ్యాపినే పరమాత్మనేశివాయ ఇదంనమమ - అను నీయేకాదశ మంత్రంబులచేతను నాహుతినిచ్చుటయే యుద్దేశత్యాగం బని చెప్పంబడుచున్నది. తరువాత నిజశాఖోక్తవిధానంబునం బూర్వంబువలెనే ప్రధానకర్మంబులం బరిసమాప్తి గావించి ఘృతమిశ్రితం బగుచరుభోజనంబు గావించి గురువునకు సువర్ణాది దక్షిణల నొసంగి బ్రహ్మవిసర్జనంబు చేసి ప్రాతఃకాలంబున నిత్యహోమంబు చేయవలయును. అట్టిమునీంద్రుండు "సమారంసించంతుమరుతః" అను మంత్రంబును బఠియించుచు "యాతేఅగ్నే" ఇత్యాదిమంత్రంబులచే నగ్నియందు హస్తంబునుత్తప్తంబు గావించి యద్వైతధామంబున స్వకీయంబగునాత్మయం దగ్నినారోపణంబు గావించి ప్రాతస్సంధ్యావందనంబు సూర్యోపస్థానాంతంబుగం గావించి స్వయంప్రవిష్టుండై నాభిపరిమితస్థానంబున సావిత్రిని బ్రవేశింపం జేయవలయును. సాగ్నికుం డగునట్టి బ్రాహ్మణుండు శ్రౌతాగ్నియందుం బ్రాజాపత్యయాగంబు గావించి సర్వస్వంబును దక్షిణగానొసంగి యాత్మయం దగ్నినారోపించుకొని గృహస్థాశ్రమంబు విడిచి పరివ్రాజకాశ్రమంబు నవలంబింపవలయును. తరువాత గాయత్రిని దనయం దారోపించుకొనవలయును. గాయత్రి శంకరుని యర్ధస్వరూపంబగు సాక్షాద్భగవతీమూర్తి యని యెఱుంగునది. గాయత్రీదేవి పంచముఖి ; దశహస్త ; దశాయుధధారిణి ; పంచదశ నయనవిరాజిత చంద్రరేఖాకిరీటాలంకృత ; శుద్ధ

స్ఫటిక నిర్మలశరీరిణి ; హారకేయూరవలయకాంచీనూపురాద్యలంకార పరిశోభిత ; దేవమానవగంధర్వమునిదానవాదుల కారాధ్యయు, సర్వవ్యాపినియు, శుభదాయినియు, మనోహారిణియు, సదాశివుని ధర్మపత్నియునై విరాజిల్లుచున్నది. శివస్వరూపంబగు గాయత్రి నన్యవిధంబున భావించుపాపాత్ముండు కల్పకాలపర్యంతంబును మహాఘోరనరకగామి యగును. అట్టిగాయత్రి వ్యాహృతియం దావిర్భవించి వ్యాహృతియందే విలీనం బగుచున్నది. అట్టివ్యాహృతులు ప్రణవంబునుండి యుత్పన్నంబులై ప్రణవంబునందే విలీనంబు లగుచున్నవి. ప్రణవంబు సర్వదేవాది స్వరూపంబు, ప్రణవంబు శివవాచకం బనియు, శివుండే ప్రణవం బనియుఁ, బ్రణవంబే శివుండనియుఁ బరస్పరాభేదంబు నిర్దేశింపఁబడియెను. వాచ్యవాచకంబుల కత్యంతభేదంబు లేమింజేసి యతిశ్రేష్ఠులు గాయత్రిని శివవాచకప్రణవంబున విలీనంబు గావించి హృత్పద్మమధ్యంబునఁ బరమకారణుండును, నేకాక్షరుండును, భగవానుండు నగుశివు నుపాసించుచుందురు. అనంతరముపాసకుం డనువాకపాఠపూర్వకంబుగ నీషణత్రయంబును బరిత్యజించి, సృష్టిస్థితిలయక్రమంబున మంద్రమధ్యమతారస్వరంబులచేఁ బ్రణవోచ్చారణంబు సేయుచు జపంబు గావింపవలయును. పిమ్మట సన్యస్తమంత్రంబుల నుచ్చరించి ప్రణవంబును పఠింపవలయును. తరువాత సదాశివుని హృదయంబున ధ్యానించుచు త్రిస్వరంబులచేఁ బ్రణవజపంబును, ప్రైషమంత్రజపంబును గావించుచు నవహితచిత్తంబునఁబూర్వాదిగ్భాగంబున విధ్యుక్తంబుగ జలాంజలి విడువవలయును. పిమ్మట గాయత్రీమంత్రమూలంబున శిఖాయజ్ఞోపవీతంబులఁ బరిత్యజించి మంత్రపూర్వకంబుగ జలాంజలితో జలంబులఁ బ్రక్షేపింపవలయును. అనంతరము సన్యస్తమంత్రంబులతో ముమ్మారు జలపానంబు చేసి వచ్చి భూతలంబున వస్త్రపరిత్యాగ పూర్వకంబుగ నుత్తరాభిముఖంబుగఁ గాని,

పూర్వాభిముఖంబుగఁగాని, సప్తపదంబుల కధికంబుగఁ బరిక్రమింపవలయును. ఈవిధంబుగఁ గొంతదూరమేగినపిమ్మట నాచార్యుండు లోకవ్యవహారార్థము కౌపీనమును దండమును బరిగ్రహింపుమని చెప్పుచు నాతనికిఁ గౌపీనంబును దండంబు నొసంగవలయును. అనంతరముపాసకుం డాచార్యానుమతంబున సూత్రకౌపీనకాషాయవసనంబులం దాల్చి రెండుసారులాచమనంబు చేసినపిమ్మట నాచార్యుండాతని శిష్యునిగాఁ బరిగ్రహింపవలయును. అనంతరము శిష్యుండు మంత్రపూర్వకంబుగ నాచార్యుని బ్రార్థించుచు దండపరిగ్రహణంబు చేసి గురుపార్శ్వంబున నుండి శివపాదపద్మస్మరణంబు సేయుచు ముమ్మారు సాష్టాంగ దండప్రణామంబు గావించి లేచి గురుపాదపద్మసమీపంబునఁ గృతాంజలిపుటుండై నిలిచియుండవలయును. గురుండు కార్యారంభమునకు ముందుగనే గోమయంబుచే నామలకసమానంబులగు కొన్ని గోమయపిండంబులం గావించి సూర్యకిరణంబులచే నెండించి హోమారంభసమయంబున నగ్నిమధ్యంబునందుంచి హోమావసానంబున వానిభస్మంబును సంగ్రహించి యుంచుకొని తరువాత విరజాహోమాగ్నియందలి భస్మంబునుగూడఁదీసికొని యాభస్మద్వయమూలంబునను నప్పుడగ్నిరిత్యాది మంత్రపూర్వకంబుగ శిష్యుని సర్వాంగంబులను విలేపనంబు గావించి యీశానాది పంచమంత్రంబులచే మస్తకంబున విలేపించి మంత్రపూర్వకంబుగఁ ద్రిపుండ్రధారణంబు చేయింపవలయును. అనంతరముగురుండు హృదయకమలవిరాజమానులగు నుమామహేశ్వరులను ధ్యానించుచు శిష్యమస్తకంబున హస్తంబునుంచి ప్రీతుండై శిష్యుని దక్షిణకర్ణంబున ఋష్యాదిసహితంబుగఁ ద్రివిధంబుగఁ బ్రణవోచ్చారణంబు గావించి పూర్వోక్తంబులగు షడ్విధార్థంబులతోడను బండ్రెండుసారులు ప్రణవార్థంబు నుపదేశింపవలయును. అప్పుడు శిష్యుండు గురునకుఁ బ్రణామంబు చేసి వేదాంతా

ర్థానుసారంబుగ నిత్యంబును గురునియధీనంబునం దుండి శ్రవణమన నాదులచే శివజ్ఞానపరాయణుండు గావలయును. గురుండు ప్రాతః కృత్యంబుమొదలుగ జపపర్యంతంబునుగల సమస్తకార్యంబులును, బూజయును, నాతనిచేఁ జేయింపవలయును. శిష్యుండు కైలాసప్రస్తర నామకం బగుమండలంబున సాక్షాత్సదాశివుం డానతిచ్చినవిధానంబు ననుసరించి నిత్యంబు శివపూజను గావింపవలయును. అశక్తుండైనచోఁ గురుదేవునిపీఠంబునఁ బూజింపంబడుచున్న స్ఫటికలింగంబును బరిగ్రహించి "మస్తకచ్ఛేదనంబునకైనను, బ్రాణత్యాగంబునకైనను నంగీకరింతును, గాని మహాదేవునిపూజ గావింపకుండ నేనెన్నండును భుజియింపఁబోను" అని ముమ్మారు గురుసన్నిధానంబున శపథంబు గావించి యాస్ఫటికలింగంబు నేకాగ్రచిత్తంబునఁ బరమభక్తితోఁ బంచావరణపూజాక్రమంబు ననుసరించి నిత్యంబును బూజించుచుండవలయును.

## —♦షడ్విధార్థపరిజ్ఞానము♦—

వామదేవమునీంద్రా! సువ్రతా! ప్రణవార్థజ్ఞానంబును గుఱించి నీవు సంప్రశ్నించితివి. ఐక్యజ్ఞానపూర్వకంబుగ షడ్విధార్థంబుల నెఱింగించెద నాకర్ణింపుము. అందుఁ బ్రథమంబు మంత్రంబును, ద్వితీయంబు యంత్రంబును, తృతీయంబు దేవతయుఁ, జతుర్థంబు ప్రపంచంబును, బంచమంబు గురుండును, షష్ఠంబు శిష్యుండనియు నీషడర్థంబులును బ్రకీర్తితంబు లగుచున్నవి. అందు మంత్రంబు ప్రథమపంచమ స్వరంబులును, బవర్గాంతవర్ణంబును, బిందువును, నాదంబును ననుపంచవర్ణసమన్వితం బైనదని వేదంబు చెప్పుచున్నది. సకలవర్ణసమవాయంబు నాదంబు. అవశిష్టంబులగు బింద్వాదిచతుర్వర్ణంబులును, వ్యష్టిరూపంబున శివవాచకంబగు ప్రణంబున సంసిద్ధంబులై యున్నవి. శివలింగమే యంత్రస్వరూపము. అన్నిటికంటెఁ గ్రిందుగాఁ

బీజము చేర్పరింపవలయును. దానిపైఁ బ్రథమస్వరంబును (అ) దాని పై నుకారంబును, దానిపై మకారంబును, దన్మస్తకంబున బిందువును, దానిపై నర్ధచంద్రాకారంబున నాదంబును లిఖింపవలయును. ఈ విధంబున యంత్రమును లిఖియించి యోంకారంబుచేఁ బరివేష్టితంబు గావింపవలయును. ఇఁక దేవతావిషయంబున శివోక్తానుసారంబుగాఁ జెప్పెద నాలకింపుము. ప్రణవమంత్రంబు పంచబ్రహ్మవాచకం బని శ్రుతులు చెప్పుచున్నవి. అట్టిసద్యోజాతాదిపంచబ్రహ్మస్వరూపం బిం ద్రియంబుల కగోచరంబైనది. పంచబ్రహ్మలును మహాదేవుని మూర్తివిశేషంబులు. శరీరంబునకును శరీరికిని విశేషభేదంబు లేదు గావున శివవాచకంబగుప్రణవమంత్రంబు శివమూర్తివాచకంబును నగుచున్నది. ఈశానాదిక్రమంబుగ శివమూర్తింగూర్చి యిదివఱకే చెప్పంబడియెను ఇఁకఁ బంచముఖంబులంగూర్చి చెప్పెదను వినుము. పంచమవర్ణంబుమొదలు ప్రథమవర్ణపర్యంతంబును, సద్యోజాతంబు మొదలీశానపర్యంతంబును మహాదేవునిముఖంబులుగా నిర్దేశింపఁబడి యెను. పురుషుండుమొదలుగ సద్యోజాతపర్యంతంబును గలచతుర్బ్రహ్మలును, భగవానుండగుశివునకుఁ జతుర్వ్యూహంబులు. ఈశాననామకుం డగుప్రధానబ్రహ్మ పంచబ్రహ్మసమష్టియనియు ; బురుషుండుమొదలు సద్యోజాతపర్యంతంబును బంచబ్రహ్మవ్యష్టియనియు శ్రుతి ప్రసిద్ధంబు. అనుగ్రహామయం బగునీచక్రమే సృష్టిమొదలు పంచార్థంబులకును గారణం బగుచున్నది. అనుగ్రహంబు రెండువిధంబులు. అం దొకటి తిరోభావాదిగోచరంబును, రెండవది సాయుజ్యాదిముక్తికారణంబు నగుచున్నది. ఈయనుగ్రహంబుచేతనే సృష్ట్యాదిపంచకార్యంబులును జరుగుచున్నవి. పంచకార్యంబులయందును సద్యాదిపంచబ్రహ్మలు ప్రకీర్తితు లగుచున్నారు. అనుగ్రహామయంబగు నీచక్రంబున కధీశ్వరుండు సదాశివుండు. ఆచక్రంబు శాంత్యతీతకళామయం బగుపరమ

పదం బని చెప్పంబడుచున్నది. ప్రణవపరాయణులును, విశుద్ధాత్ము లును, సదాశివోపాసకులు నగు యతులకే యీపరమపదంబు ప్రాప్యంబగుచున్నది. మునీంద్రు లీపరమపదంబును బొంది బ్రహ్మస్వరూపుండును, భగవానుండు నగుసదాశివునితో నేకీభవించి యక్షయసుఖంబు లనుభవించుచు మహాప్రళయకాలంబున శివసాయుజ్యంబు నందుచుందురు. వారందఱును మహాప్రళయకాలంబున మృత్యుంజయులై సదాశివైశ్వర్యసమష్టిస్వరూపంబగు బ్రహ్మలోకంబున నవస్థితులై యుందురని సనాతనశ్రుతులు చెప్పుచున్నవి. సదాశివుండు సకలైశ్వర్యసంపన్నుండని యథర్వోపనిషత్తు చెప్పుచున్నది. ఆతఁడు సకలైశ్వర్యప్రదాతయని పండితులు వక్కాణించుచున్నారు. చమకాధ్యాయంబునఁ బ్రతిపాద్యంబగు సదాశివపదంబు సర్వప్రధానంబు. ఈ సమస్తజగంబును నీశానాది పంచబ్రహ్మపరివ్యాప్తంబుగఁ గానవచ్చుచున్నది. పంచబ్రహ్మలనుండియు, సూక్ష్మభూత స్వరూపంబులును, గారణరూపంబునఁ బ్రసిద్ధంబులునగు నివృత్త్యాదికళ లుత్పన్నంబుల య్యెను. పరిదృశ్యమానంబగు నీ స్థూలప్రపంచమునం దీశానాది పంచ బ్రహ్మలును బంచవిధంబుల నవస్థితులై యున్నవారు. మునీంద్రా! వాక్కును, శ్రోత్రంబును, శబ్దంబును, నాకాశంబును, బురుషుండు నను నీయైదును నీశానరూపబ్రహ్మయందుఁ బరివ్యాప్తంబులై యుండును. త్వక్పాణిస్పర్శవాయుప్రకృతులను నీయైదును బురుషరూపబ్రహ్మంబునఁ బరివ్యాప్తంబులు. నయనపాదరూప తేజోహంకారంబు లైదును, నఘోరబ్రహ్మయందును, రసనాపాయురసజలబుద్ధ్యాదులైదును, వామదేవబ్రహ్మయందును, మనంబును, నాసికయు, నుపస్థయు, గంధంబును, భూమియు నను నీయైదును, వామదేవ బ్రహ్మయందును వ్యాప్తంబులై యుండును. అది కారణంబుగ నీజగంబంతయుఁ బంచబ్రహ్మమయం బగుచున్నది. పంచవర్ణసమష్టియగు నాదరూపంబును,

బింద్వాదిచతుర్వర్ణంబులును శివవాచకప్రణవంబుగా యంత్రరూపం బుపదేశింపంబడియెను. భగవానుండగు శివుని యుపదేశానుసారం బుగ యంత్రరూపంబును భావింపవలయును. ఆకాశాధిపతియగు సదాశివుండు సమష్టిస్వరూపుండును, మహేశ్వరరుద్రవిష్ణుబ్రహ్మలు సదాశివుని వ్యష్టిస్వరూపులు నగుచున్నారు. సదాశివుని సహస్రాంశంబునుండి మహేశ్వరుం డుత్పన్నుం డయ్యెను. ఆతఁడు పురుషున కభిన్నుండై వాయువున కధిపతి యయ్యెను. ఆతని వామభాగంబున మాయాశక్తివిరాజమాన యగుచుండును. ఆతండు సకళుండును క్రియాధికుండునై యుండును. ఈశుండును, విశ్వేశ్వరుండును, బరమేశ్వరుండును, సర్వేశ్వరుండు నీమహేశ్వరునకు వ్యష్టిస్వరూపులు. దీనినే తిరోభావచక్రం బందురు. తిరోభావంబు ద్వివిధంబు. అందొకటి రుద్రాదిగోచరంబును, రెండవది పాపపుణ్యంబులయందు సమబుద్ధి గలుగునంతవఱకును జీవులకు దేహభావంబుచే భోగానురాగంబులం గల్పించునదియునై యున్నది. ఆ తిరోభావమే పాపపుణ్య సమభావావస్థ కలిగినచో ననుగ్రహమయంబుగఁ బరిణమించుచున్నది. విలోమక్రమంబునఁ బూర్వంబునఁ జెప్పంబడిన సర్వేశ్వరుండు మొదలుగ నీశపర్యంతంబును గల నలువురును దానికి దేవతలుగాఁ బరిగణింపఁబడుచున్నారు. తిరోభావచక్రము శాంతికళామయంబు. దాని కధీశ్వరుండు మహేశ్వరుఁడు. అదియే సర్వోత్కృష్టపదంబు. మహేశ్వరభక్తులగు శైవుల కీపదంబు లభియించు. ఇదియే వారికి సాలోక్యాది క్రమంబున ముక్తిప్రదానంబు గావించుచున్నది. మహేశ్వరుని సహస్రాంశనుండి యఘోరముఖుండును, గౌరీవామభాగుండును, సర్వసంహారకుండును, తేజస్తత్త్వాధీశ్వరుండు నగు రుద్రదేవుం డుత్పన్నుండయ్యెను. శివుండును, హరుండును, మృడుండును, భవుండునను నీనలువురును రుద్రదేవుని వ్యష్టిస్వరూపులు. దీనినే సంహార

చక్రం బందురు. ఈచక్రం బతివిచిత్రంబు. నిత్యంబును, నైమిత్తికంబును, మహాప్రళయంబు నని సంహారచక్రంబు త్రివిధంబు. విధాతృండు పరబ్రహ్మంబున లయంబు గాంచుటగే మహాసంహారంబని శ్రుతులు చెప్పుచున్నవి. అమితతేజుండగు రుద్రదేవుండు కఠోరగర్భయాతనాదిదుఃఖక్లాంతులును ననాత్మజ్ఞులు నగు జీవుల కర్మపరిపాకంబు కొఱకు సంహారంబును మూడువిధంబులుగాఁ గల్పించియుండెను. నిత్యనైమిత్తిక మహాప్రళయంబు లాతనివలననే కలుగుచున్నవి. సంహారకాలంబునందును భగవానుని సృష్టిస్థితి విలయతిరోభానుగ్రహంబులను పంచకార్యంబులును సూక్ష్మభావంబున విద్యమానంబు లగుచుండును. భవుండును, మృడుండును, హరుండును, శివుండును నీ సంహారచక్రంబునకు దేవతలై యున్నారు. ఇది విద్యారూపకళామయంబు. దీనికధిష్ఠాత రుద్రదేవుండు. ఇదియే నిరామయపదంబు. రుద్రసేవాపరులగు భక్తులకీపదంబు లభియించును. ఇదియే వారికి సాలోక్యాది క్రమంబున ముక్తి నొసంగుచున్నది. రుద్రమూర్తి సహస్రాంశమునుండి వామదేవచక్రోత్పన్నుండును, జలతత్త్వనాయకుండును, రమావామభాగుండును, సర్వరక్షకుండు నగు విష్ణుదేవుం డుత్పన్నుండయ్యెను. వాసుదేవుండును, ననిరుద్ధుండును, సంకర్షణుండును, బ్రద్యుమ్నుండును విష్ణునకు వ్యష్టిస్వరూపులు. దీనికి స్థితిచక్రంబని పేరు. ఇది పరమోత్కృష్టంబైనది. సృష్టంబగు జగంబును, సృష్టికర్తలగు బ్రహ్మదుల స్థితిని, ప్రారబ్ధంబు నశియింపని జీవులను బరిపాలించుట రక్షామూర్తియగు విష్ణుదేవుని కార్యంబు. ఈస్థితిచక్రమధ్యంబునఁ గూడ భగవానుండగు విష్ణుదేవుని పూర్వోక్తసృష్ట్యాది పంచకార్యంబులును వర్తమానంబులై యుండును. ప్రద్యుమ్న సంకర్షణానిరుద్ధవాసుదేవులు దీనికి దేవతలు. ఈ స్థితిచక్రంబు ప్రతిష్ఠాకళాసమన్వితంబును, జనార్దనాధిష్ఠితంబునై పరమపదంబున సుప్ర

సిద్ధంబై యుండును. విష్ణుపాదభక్తు లగువైష్ణవుల కీపదంబు లభియించును. ఇది వారలకుఁ గ్రమముక్తినొసంగుచున్నది. విష్ణుదేవుని సహస్రాంశంబునుండి సద్యోజాతముఖుండును, పృథ్వీతత్వాధినాథుండును, వాణీవామభాగుండును, సృష్టికర్తయు, జగత్ప్రభుండును, నగు పితామహుండుత్పన్నుండయ్యెను. హిరణ్యగర్భుండును, విరాటుండును, పురుషుండును గాలుండును నాతనికి వ్యష్టిస్వరూపులు. దీనినే సృష్టిచక్రం బందురు. ఈచక్రంబు స్వాయంభువ భృగుప్రభృతి మునిగణసేవ్యంబైనది. ప్రకృతిలీనుండగుజీవుని గర్మభోగంబుకొఱకు వెలువరించి భోగసాధనంబు లగుపుత్రకళత్రాదులతో సంయోగంబు గావించుటయే సృష్టి యగుచున్నది. ఈసృష్టియే పితామహుని కార్యంబు. ఈసృష్టికాలంబునఁగూడ భగవానుండగు పితామహుని పంచకృత్యంబులు విద్యమానంబు లగుచుండును. కాలుండును, పురుషుండును, విరాటుండును, హిరణ్యగర్భుండును దీనికి దేవతలు. ఈ సృష్టిచక్రంబు నివృత్తిరూపకళామయం బని పండితులు చెప్పుదురు. దీనికధిదేవత పితామహుండు. ఇది శోభనపదంబు. బ్రహ్మార్పితహృదయులగు బ్రహ్మణ్యులీపదంబు గాంతురు. ఇదియే వారికిఁ గ్రమముక్తినొసంగుచున్నది. మహేశ్వరాదికంబులగు నీనాలుగుచక్రంబులును బరస్పరాసంబంధంబునఁ బ్రణవంబునకు వాచకంబు లగుచున్నది. ఇది శ్రుతిప్రసిద్ధంబగుజగచ్చక్రంబు. దీనిని బంచారచక్రం బనికూడ శ్రుతులు చెప్పుచున్నవి. భగవంతుండగు సదాశివునిశక్తిచే విజృంభితంబగు నిత్యైకచక్రంబు సృష్ట్యాదిపంచావయవసంపన్నంబగుటచేఁ బంచారచక్రంబని చెప్పంబడుచున్నది. ఇది నిరవధికసృష్టిలయంబుల నుద్భావనంబు గావించుచు వహ్నిచక్రంబునుం బోలిపరిభ్రమించుచుండునుగావున దీనికిఁజక్రంబనియు, సృష్ట్యాదిస్థూలకార్యసంపాదకంబగుటచేఁ బృథుచక్రంబనియు నామంబులు నిర్దేశింపబడియెను. ఈ

చక్రంబు హిరణ్మయుండును, నమితతేజుండును, భగవానుండు నగుశంభునిశక్తినుండి (యుత్పన్నంబగుటచే హిరణ్యజ్యోతినామంబున విఖ్యాతం బయినది. ఇది జలావృతంబును, జలంబనలావృతంబును, ననలం బనిలావృతంబును, ననిలం బాకాశావృతంబును, నాకాశం బహంకారావృతంబును, నహంకారంబు మహదావృతంబును, మహత్తు ప్రకృత్యావృతంబు నై యుండును. ఈచక్రరక్షణంబున కీసప్తావరణంబులును గలవని యాస్తికులు చెప్పుచున్నారు. చక్రంబుకంటె జలంబు దశగుణాధికంబును, నిట్లే తక్కినవన్నియును బరస్పరంబు దశదశగుణాధికంబు లనియు నెఱుంగునది. ఏకమాత్రుం డగుశివుండు శక్తింగూడి సలిలమధ్యంబునందుండి సృష్టిస్థితిలయానుగ్రహ తిరోభావంబు లను పంచకృత్యంబులఁ బ్రకాశింపఁజేయుచు నవిరతలీలామయుండై విరాజిల్లుచుండును. వేయేల. ఈనిఖిలంబగు జగంబున శివశక్తిభిన్నం బగునది యద్దియును లేదు. అని సుబ్రహ్మణ్యేశ్వరుండు ప్రబోధించుటయు వామదేవమునీంద్రుండు భక్తిపూర్వకంబుగఁ బరమాత్మవిషయంబున సందేహనివారణంబుగావించుకొనం దలంచి యిట్లనియెను. ఓపరమానందమయా! నీవదనవినిర్గతప్రణవార్థంబు నాలించు నాసంశయంబు దూరంబయ్యెను. మఱియును నాకు జ్ఞానలాభం బయ్యెను. సదాశివునినుండి కీటకపర్యంతంబును నీజగంబంతయును, స్త్రీపురుషరూపంబునఁ గానంబడుచున్నది. ఈ జగంబునకు సనాతన కారణుండగువాఁడు, స్త్రీయో, పురుషుండో, క్లీబుండో, మిశ్రుండో, కాక తదన్యుండో యను విషయంబుననాకుమహత్తరంబగు సందేహంబు గలుగుచున్నది. వివిధశాస్త్రంబులయందలి వివిధమతంబులచే ముగ్ధులగు పండితు లివ్విషయంబున వివిధతర్కంబులం గావించుచున్నవారు. సృష్టివిషయంబున శ్రుతులయందుఁగల పరస్పర విరుద్ధభావంబులను సమన్వయించి ప్రబోధింపవలయును. “ నేను తెలిసికొనుచున్నాను,

అనుభావంబు సర్వ వ్యవహారంబులయందును గానవచ్చుచున్నది. అది యెల్లజీవులకు ననుభవసిద్ధంబు. అది దేహేంద్రియ మనోబుద్ధ్యహంకారంబులలో దేనినుండి యుత్పన్నంబైనదియో, కాదే నదియే యాత్మస్వరూపంబో యను విషయంబ వేద్యంబై యున్నది. ఇవ్విషయంబున ననేక విచిత్రవాదంబులు గలవు. దేవా! అజ్ఞానజనితంబగు సంశయ విషవృక్షంబును పెకలించి నాహృదయ క్షేత్రంబున శివాద్వైత కల్పవృక్షంబు నాటుకొనునట్లు దయాపూర్వకంబుగ జ్ఞానోపదేశంబు గావింపుము. అనుటయు భగవానుండగు స్కందుండు మందహాసంబు చేయుచు నిగూఢ తత్త్వంబు నీవిధంబుగఁ బ్రబోధింపఁ దొడంగెను. మునిచంద్రా! ఈరహస్యంబు నాజనకుండగు శంకరుండు మాతల్లికిఁ బ్రబోధించియున్నాఁడు. మాతృస్తన్యపానంబు సేయుచు నేను దానిని విని యుంటిని. జగత్కర్తయగు సదాశివుని యస్తిత్వముం గూర్చి శాస్త్రంబులయందు బహువాదంబులు గలవు. నీవుపదేశించిన శిష్యులలో నీయంతటివా రెంతమంది కాఁగలిగిరి? పూర్వకాలంబున గౌతమ దధీచి నందికేశ్వరాదులగు వాగ్గురుమునులు శివనిందా పరాయణులగు వారిని శపించుటచే వారు నేఁటివఱకును గపిలాదిముని ప్రణీతంబులగు నిరీశ్వరసాంఖ్యాది శాస్త్రంబులలోఁబడి పరిభ్రమించుచున్నారు. వారు వేదవిరుద్ధ సిద్ధాంతవాదులు వారి వార్తలను వినుటవలనఁ బ్రయోజనంబు లేదు. పరమేశ్వరుని యస్తిత్వవిషయంబునఁ బ్రతిజ్ఞయు, హేతువును, నుదాహరణంబును, నుపనయంబును, నియోగంబు నను నీ పంచాంగంబులును ననుమాన ప్రయోగంబున కవకాశంబు లగుచున్నవి. ధూమదర్శనంబునఁ బర్వతంబున వహ్నికలదని యూహించినట్లు ప్రత్యక్షంబగు జగంబును గాంచి పరమేశ్వరుని భావింపవలయును. ఈజగంబు స్త్రీపురుషరూపంబున విరాజిల్లుచుండుట ప్రత్యక్షంబు. దేహపిండంబునందలి షట్కోశంబులయందును, మజ్జాస్థి

స్నాయువులు జనకాంశచే నుత్పన్నంబులును, చర్మమాంస రుధిరకోశంబులు జనన్యంశ సంభూతంబులునై యుండు నని శ్రుతులు చెప్పుచున్నవి. కావున సకలదేహంబులయందును, స్త్రీ పురుష భావంబులు సమ్మిళితంబులై యున్నవని యెఱుంగవలయును. పరమేశ్వరుండుకూడ నిట్లే స్త్రీపురుషభావంబున నున్నవాఁడని పండితులు గ్రహించియున్నవారు. వేదములు బ్రహ్మను సచ్చిదానంద స్వరూపునిగా నిర్దేసించుచున్నవి. ప్రకాశవాచకంబగు సచ్ఛబ్దంబు పుంలింగంబును, జ్ఞానవాచకంబగు చిచ్ఛబ్దంబు స్త్రీలింగంబును గావున నియ్యుభయ స్త్రీపురుష సమ్మేళనంబును జగత్కారణంబగుచున్నది. సచ్చిదాత్మకంబగు నవ్యేక స్వరూపంబునందే శివశక్తిభావంబు వ్యవహరింపబడుచున్నది. తైలవర్తికాదుల మాలిన్యంబుచేఁ బ్రకాశంబునకును మాలిన్యంబును, జితానలాదులయం దశిశత్వంబును గానంబడుచున్నది. అట్టిమాలిన్యంబులను దొలఁగించు ప్రకాశరూపుండు గావుననే శివుఁడని శ్రుతులు చెప్పుచున్నవి. "నేను బలవంతుఁడను, శక్తిమంతుఁడను" అను వ్యవహారంబున జీవులయందు చిచ్ఛక్తి యస్తిత్వంబు గోచరించుచున్నది. ఆచిచ్ఛక్తి సహజదుర్బల యగుటచేఁ దన్నివారణంబుకొఱ కీశ్వరునియందు శక్తిత్వంబు సార్వకాలికం బగుచున్నది. ఈవిధంబుగాఁ బరమాత్మయందు శక్తిత్వంబును శివత్వంబును గోచరించుచున్నది. అట్టిశివశక్తి సంయోగంబున నుత్పన్నంబగు నిత్యానందంబు నభిలషించి యనఘాత్ములగుమునీంద్రులు శివునియందుఁ జిత్తసమర్పణంబుఁ గావించి యహామయుండగు శివునిం బొందుచుందురు. ఉపనిషత్తులయందు బ్రహ్మశబ్దంబునకు శివశక్తిస్వరూపంబున నిత్యుండనియు, ముక్తుం డనియు, శుద్ధస్వభావుం డనియు నర్థంబు నిర్దేశింపఁబడియెను. పంచబ్రహ్మమయుండగు సదాశివుండే బ్రహ్మశబ్దంబుచే నాఖ్యాతుం డగునట్లే ప్రతీయమానం బగు నీవిశ్వంబును బ్రహ్మశబ్దంబుచే వ్యవహృ

తం బగుచున్నది. ఇఁకఁ బ్రతిలోమాత్మం బగు హంసమంత్రముం గూర్చి చెప్పెద నాలకింపుము. "సోహం" అను మంత్రమునందలి సకారంబును హకారంబును విడిచినచో "ఓం" అను స్థూలమహా మంత్రం బగును. అది శివశక్తి వాచకంబు. అకారంబునందలి యను స్వారంబును, నాదియందు హకారంబును గలసినచో "హం" అగుచున్నది. అట్లే అకారమునందలి విసర్గయును, నాదియందు సకారంబును గలసి "సః" అగుచున్నవి. ఈయుభయసంయోగంబున "హంసః" అగుచున్నది. దానిని వ్యతిరేకంబుగఁ బఠియించినచో "సోహం" అగుచున్నది. ఇయ్యుద్ధారంబు సూక్ష్మం బగుటచే నిమ్మహామంత్రంబును సూక్ష్మంబని యందురు. సకారంబు మహామంత్రవాచ్యుండును, శక్త్యాత్మకుండునగు శివున కర్థం బగుచున్నది. గురూపదేశసమయంబున నీమంత్రంబు "నేనే శక్త్యాత్మకుం డగు శివుండను" అనునట్లు జీవపరంబగుచున్నది. అప్పుడు జీవుండు శక్తిస్వరూపుండగు శివాంశయగుచున్నాఁడు. శివైక్యానుభావవశంబున జీవుండు శివసాదృశ్యప్రాప్తుండగును. వేదవాక్యంబులందుఁ బ్రజ్ఞానమే బ్రహ్మయని చెప్పంబడుటచే బ్రహ్మశబ్దార్థంబు ప్రజ్ఞానంబుగాఁ దోఁచుచున్నది. ఆ ప్రజ్ఞానశబ్దంబు చైతన్యంబునకుఁ బర్యాయ శబ్దంబు. చైతన్యమే యాత్మస్వరూపంబని శైవాగమప్రథమసూత్రంబునం దున్నది. విశ్వసంబంధ సర్వజ్ఞానక్రియాత్మకంబు చైతన్యంబు. "జ్ఞానమేబంధము" అనునది శివాగమద్వితీయసూత్రంబు. జ్ఞానం బనిన విశ్వసంబంధకించిజ్జ్ఞానక్రియాత్మకం బని యెఱుంగునది. భగవానుండగు శివుండిట్టి జ్ఞానపదంబుచే జీవలక్షణంబు నానతిచ్చియున్నాఁడు. చైతన్యజ్ఞానంబులు మాయాశక్తికిఁ బ్రథమచేష్టాస్వరూపంబులు. శ్వేతాశ్వతరశాఖయందీమాయాశక్తి స్వాభావికజ్ఞానబలక్రియారూపంబున వర్ణింపఁబడియున్నది. జ్ఞానంబును, గ్రియయు, నిచ్ఛయు నను నీమూఁడును శంభునకు

దృష్టిత్రయంబు. ఆదృష్టిత్రయంబును మనోమధ్యగతంబై దేహము నందుఁ బ్రవేశింపఁగనే "చేయుచున్నాను, తెలిసికొనుచున్నాను" అను జ్ఞానంబు జీవునకుఁ గలుగుచున్నది. ఆత్మస్వరూపం బివ్విధంబుగఁ బ్రదర్శింపఁబడియెను. ఇఁక బ్రణవంబునకును, బ్రపంచమునకును, గల యేకత్వమును నిరూపించుటకై ప్రపంచార్థంబు చెప్పెదను. సనాతనశ్రుతులయందు సమస్తంబు నోంకారస్వరూపం బనియు నట్టి పరమాత్మయం దాకాశం బుత్పన్నం బయ్యెననియు నివ్విధంబుగ జగత్సృష్టిక్రమంబు నిర్దేశింపఁబడియెను. శివశక్తిసంయోగంబే పరమాత్మయని నిశ్చయింపఁబడియెనుగదా! ఆమాయాశక్తినుండి చిచ్ఛక్తియు, దానినుండి యానందశక్తియు, దానినుండి యిచ్ఛాశక్తియు, దానినుండి జ్ఞానశక్తియు, దానినుండి క్రియాశక్తియు నివ్విధంబుగాఁ బంచశక్తులు నుత్పన్నంబు లయ్యెను. ఆపంచశక్తులనుండిగా నివృత్త్యాదిపంచకళలు నుదయించెను. చిచ్ఛక్తినుండి నాదంబును, నానందశక్తినుండి బిందువును, నిచ్ఛాశక్తినుండి మకారంబును, జ్ఞానశక్తినుండి ఉకారంబును, క్రియాశక్తినుండి అకారంబునుగా విలోమక్రమంబునఁ బ్రణవవర్ణంబులు జనియించెను. మరల శివునినుండి యీశానుండును, వానినుండి పురుషుండును, వానినుండి యఘోరుండును, వానినుండి వాముండును, వానినుండి సద్యోజాతుండును నావిర్భూతులైరి. అకారాదిమాతృకలనుండి ముప్పదియెనిమిదికళలు జనియించెను. ఈశానునినుండి శాంత్యతీతకళయుఁ, బురుషునినుండి శాంతికళయు నఘోరునినుండి విద్యాకళయు, వామునినుండి ప్రతిష్ఠాకళయు, సద్యోజాతునినుండి నివృత్తికళయు నుదయించెను. ఈశానచిచ్ఛక్తులును, బురుషానందశక్తులును, నఘోరేచ్ఛాశక్తులును, వామదేవజ్ఞానశక్తులును, సద్యోజాతక్రియాశక్తులు నను నీయైదును శివమిథునంబులు. వీరలే యనుగ్రహాదిపంచకృత్యంబులకును గారణస్వరూపులని నిర్దిష్టం

బయ్యెను. కళాపంచకంబును, వర్ణపంచకంబును, వాచ్యవాచకసంబంధ వశంబున మిథునభావంబు నందుటయు నమ్మిథునంబులనుండి క్రమంబుగ నాకాశాది పంచమహాభూతంబులు నుత్పన్నంబులయ్యెను. కావుననే యమ్మహాభూతంబు లీశానాదిమయంబు లనియుఁ, జిచ్ఛక్త్యాదిమయంబు లనియుఁ జెప్పంబడుచున్నవి. ఆకాశంబునకు శబ్దంబును, వాయువునకు శబ్దస్పర్శంబులును, వహ్నికి శబ్దస్పర్శరూపంబులును, జలంబునకు శబ్దస్పర్శరూపరసంబులును, బృథ్వికి శబ్దస్పర్శరూపరసగంధంబులును గుణంబులైనవి. ఇందధికగుణ విశిష్టంబగునది వ్యాపకంబును, నల్పగుణ విశిష్టం బగునది వ్యాప్యంబు నగుచున్నది. ఈపంచభూతంబులనే ప్రపంచంబందురు. ఈప్రపంచసమష్టియే విరాట్స్వరూపంబనియును, బ్రహ్మాండమనియుఁ జెప్పంబడుచున్నది. పృథ్వీతత్త్వంబు మొదలు శివతత్త్వంబువఱకును గల తత్త్వంబులన్నిటిని శక్తియుక్తపరమేశ్వరునియందు లీనంబులుగఁ జేసి జీవుండును విలీనుండగుచున్నాఁడు. మరల సృష్టికాలంబున మాయాశక్తి మూలంబున బహిర్గతుండై స్థూలప్రపంచస్వరూపంబున బ్రళయకాలపర్యంతంబును సుఖావస్థానంబుగాంచును. స్వేచ్ఛావశంబున జగత్సృజనంబున కుద్యుక్తుం డగునప్పటి పరమేశ్వరుని ప్రథమచేష్టను శివతత్త్వం బని చెప్పుదురు. సృష్ట్యాది సకలకార్యంబులయందునను వృత్తివశంబునంగలుగు నిచ్ఛయే యిచ్ఛాశక్తితత్త్వంబు. జ్ఞానక్రియాశక్తులయందు జ్ఞానాధిక్యంబు సదాశివతత్త్వం బనియు, గ్రియాధిక్యంబు మహేశ్వరతత్త్వం బనియు, నుభయసమత్వంబు విశుద్ధజ్ఞానశివతత్త్వం బనియు నెఱుంగవలయును. ఎప్పుడు శివుండు స్వాంశంబులగు తత్త్వంబులను మాయోత్పన్నంబులుగా భావించి మాయాబలంబునఁ దనపరమైశ్వర్యరూపమును సమావృతంబు గావించుకొని నిఖిలపదార్థసంగ్రహణంబు గావించునో యప్పుడాతనికిఁ బురుషాఖ్య కలుగుచున్నది. అందువలననే

యాతఁడు సృజించి సృష్టియందాతఁడు ప్రవిష్టుండగుననుశ్రుతిపాఠి దుర్వ్యాఖ్యాతం బయ్యెను. అయీశ్వరుండే సంసారబద్ధుం డగును, మాయా ముగ్ధుండు నగు జీవుండు ఈ జగంబు శివభిన్నంబు గాదనియుఁ, దానీ జగంబునకు భిన్నుండననియు భావించు పురుషుం డింద్రజాల కుని మాయలం బడని యోగిపురుషునిం బోలి మాయామోహ ముగ్ధుండు గానేరఁడు. గురూపదేశంబున శివతత్త్వంబు నెఱింగిన శిష్యుండు జ్ఞానమయ శివస్వరూపుం డగుచున్నాఁడు. సర్వకర్తృ త్వంబును, సర్వజ్ఞత్వంబును, సంపూర్ణత్వంబును, నిత్యత్వంబును, వ్యాపకత్వంబు ననునివి శివుని పంచశక్తులు. నిగూఢ రూపంబున నిరంతర ప్రతీయమానంబులగు వీని తేజంబుచేఁ ప్రభాకరుండును దిరస్కృతుం డగుచున్నాఁడు. కళయును విద్యయు, రాగంబును, గాలంబును, నియతియు ననునివిజీవపంచతత్త్వంబులు వానిలోఁ గించి త్కర్తృత్వ హేతుకం బైనది కళయనియు గించిత్తత్త్వైక సాధనం బైనది విద్యయనియు, విషయానురంజకంబైనది రాగంబనియుఁ జెప్పం బడుచున్నవి. ప్రాదుర్భావతిరోభావసమన్వితంబును భావాభావపదార్థ క్రమపరిచ్ఛేదకంబును, బృధివ్యాదిభూతంబులకాదియునైనది కాలంబు. కర్తవ్యాకర్తవ్యనియమంబునియతి. ఈనియతిమా యీశ్వరశక్తి. ఈని యతిని ద్యజించినచో జీవుఁడధఃపతితుండగును. ఈచెప్పంబడిన కళా దిపంచతత్త్వంబులును, బంచకంచుకంబులనియు, నంతరంగసాధనంబుఁ లనియుఁ జెప్పంబడుచున్నవి. అని కార్తికేయుం డుపదేశించుటయు వామదేవుం డిట్లనియెను. దేవదేవా! పురుషుండు నియతికధోభాగం బునను, బ్రకృతికుపరిభాగంబునను నున్నవాఁడని యానతిచ్చియుంటివి. అట్టి పురుషుండు మాయాబలంబున సంకుచితరూపుండై మాయకధో భాగంబున నున్నవాఁడని యిప్పుడు విపరీతంబుగ నానతిచ్చుటకుఁ గార ణంబేమి! అనిప్రశ్నించుటయుఁ గార్తికేయుం డిట్లనియెను. మునీంద్రా!

ఇది యద్వయంబగు శివాగమంబు గావున ద్వైతవాదంబు నంగీకరింపఁ జాలదు. సర్వజ్ఞుండును, సర్వకర్తయు నగు శివుండే స్వయంబుగా నిజ మాయాబలంబున సంకుచితరూపుండై పురుషరూపంబున నావిర్భూతుం డగును. అట్టి పురుషుండు ప్రకృతిస్థుండై కళాది పంచతత్త్వబలంబున భోక్తృరూపంబునఁ గల్పితుండై ప్రకృతి గుణానుభోగంబు గాంచుచుం డును. ఇట్లు పురుషుండు నిజరూపంబు సంకుచితంబు గావించుకొని స్థాన ద్వయమధ్యవర్తియై యుండును. అందువలనఁ బ్రథమోక్తికి విరోధం బేమియును లేదు. జ్ఞానాది సమష్టి రూపపరిణతంబును, సత్త్వాదిగుణ సాధ్యంబును, బుద్ధిత్రయాత్మకంబు నగుచిత్తంబు ప్రకృతితత్త్వంబు. అదిసత్త్వాది కారణంబులనుండి యుత్పన్నంబైనది. సత్త్వరజస్తమో గుణంబులు ప్రకృతిజన్యంబులు. ఆగుణంబులనుండి వస్తుగ్రాహిణియగు బుద్ధియు, బుద్ధినుండి యహంకారంబును జనియించెను. అహంకారంబు జీవనంబనియు, సంరంభం బనియు, గర్వంబనియు మూఁడువిధంబులు. సత్త్వాదిగుణభేదంబున నయ్యహంకారంబు తైజసాదిభేదంబులచేఁ ద్వివిధంబుగ విభక్తంబయ్యెను. తైజసాహంకారంబునుండి మనంబును, జ్ఞానేంద్రియంబులును జనియించెను. అందు సంకల్పవికల్పాత్మకంబై నది మనంబు. చక్షువులును, కర్ణంబులును, నాసికయు, జిహ్వయుఁ, ద్వక్కు ననునివి జ్ఞానేంద్రియంబులు. రూపంబును, శబ్దంబును, గంధం బును, రసంబును, స్పర్శంబు ననునివి జ్ఞానేంద్రియ విషయంబులు. వైకల్పికాహంకారంబునుండి వాక్కును, పాణియుఁ, పాదంబును, పాయువును, నుపస్థయు నను కర్మేంద్రియంబులు కలిగెను. ఉక్తియు, గ్రహణంబును, గమనంబును, త్యాగంబును, నానందంబు ననునివి వానికిఁ గార్యంబులు. భూతాదికాహంకారంబునుండి సూక్ష్మంబులగు పంచతన్మాత్రలుదయించెను. ఈపంచతన్మాత్రలనుండి యాకాశంబును వాయువు, నగ్నియు, జలంబును, క్షితియు నను పంచభూతంబులు

గలిగెను. అవకాశప్రదానత్వంబును, వహనంబును, పాచనంబును, సంరంభంబును, ధారణంబు ననునివి క్రమంబుగ నీయైదింటికిని వ్యాపారంబులు. అని కుమారుండు బోధించుటయు వామదేవుండు దేవా! నీవిదివఱకు అకారంబాత్మతత్వంబనియు ఉకారంబు విద్యాతత్త్వంబనియు మకారంబు శివతత్త్వంబనియు, బిందునాదంబులు సమస్తతత్త్వంబనియు, బ్రహ్మవిష్ణురుద్రమహేశ్వరసదాశివులు క్రమంబుగ వీని కధిదేవత లనియు, వీరు సదాశివమూర్తులనియుఁ దత్తత్కళలనుండియే భూతసృష్టి యయ్యెననియు నానతిచ్చితివి. ఇప్పుడు తన్మాత్రలనుండి భూతసృష్టి యయ్యెనని చెప్పుచుంటివి. ప్రభూ! నాకీవిషయంబున సంశయము కలుగుచున్నది. కరుణాళుండవై ప్రబోధింపవలయును. అని ప్రార్థించుటయుఁ గార్తికేయుం డిట్లనియెను. మునీంద్రా! కళాజన్యంబునని మున్ను చెప్పిన స్థూలప్రపంచరూపంబు లగు పంచభూతంబులును, భూతనాథుండగు పరమేశ్వరుని శరీర స్వరూపంబులే. శివతత్త్వంబుమొదలు పృథ్వీతత్త్వపర్యంతంబును గల సర్వతత్త్వంబులును దన్మాత్రలనుండియే క్రమంబుగ నుత్పన్నంబు లయ్యెనని చెప్పితినని యెఱుంగుము. ఓబ్రహ్మవిద్వరా! తన్మాత్రలును, గళలును భూతపంచకంబున కుత్పాదకంబులని చెప్పుటచే నయ్యుభయంబు నేకస్వరూపంబేయనియు, వానికిభేదంబు లేదనియు గ్రహింపవలయును. స్థూలసూక్ష్మాదికం బగునీవిశ్వంబునఁ జంద్రసూర్యాది గ్రహంబులును, నక్షత్రమండలంబులును, దదితరజ్యోతిర్మండలంబులును, బ్రహ్మవిష్ణుమహేశాది దేవతలును, భూతజాలంబును, నింద్రాదిదిక్పాలక వర్గంబును, బితృదేవతలును, దేవతలును, దైత్యులును, రాక్షసులును, మానవులును, దదితరంబులగు పశుపక్షికీటపన్నగాదులును, దరుగుల్మలతాదులును, సుమేరుప్రభృతి పర్వతంబులును, గంగాది పుణ్యనదులును, సప్తసాగరంబులును, మహర్షులును మొదలుగాఁగల

సర్వంబును వానినుండియే పుట్టి వానియందే ప్రతిష్ఠితంబులై యున్నవి. శివశక్తిమయస్త్రీపురుషరూపం బగునీవిశ్వంబు భవాదృశులగు శివతత్త్వజ్ఞానులగు పండితులకు సర్వదా సముపాస్యంబైనది. సమస్తంబును బ్రహ్మంబనియు సమస్తంబు సుబ్రహ్మమయంబనియు నిట్టిజ్ఞానంబున నుపాసించుట కర్తవ్యం బని శ్రుతులు చెప్పుచున్నవి. కావున భగవానుం డగుసదాశివుండు పరిదృశ్యమానం బగునీప్రపంచస్వరూపుండు. అష్టత్రింశత్కళాన్యాససామర్థ్యంబున నేకస్వరూప విరాజమానుండగు శివునకుం దనకును భేదంబు లేదను భావంబు దృఢంబైనచో నట్టివాఁడు ప్రపంచ దేవతాయంత్రమంత్రగురుస్వరూపుం డగుశివస్వరూపుం డగుచున్నాఁడు. ఇవ్విధంబుగ గురుకృపావశంబున నిఖిలబంధోత్పాటనంబు గావించి శివసదాశక్తుం డగుశిష్యుండు సర్వత్రపూజ్యుండగును. ఈ జగంబునందలి సకలవస్తువులును వానివానిప్రధానగుణసంపర్కంబునఁ బ్రణవార్థప్రకాశకంబు లగుచున్నవని శివుం డానతిచ్చియున్నాఁడు. ఇయ్యది రాగాదిదోషశూన్యంబును, వేదసారంబు నగుపరమరహస్యంబు. మునివరా! ఎవ్వండు మదాతిరేకంబున నియ్యుత్తమోపదేశంబు నన్యథాభావించు యట్టివాఁడెంతవాఁడైనను శత్రువులకుఁ గాలాగ్నితుల్యంబగు మదీయశక్తిమూలంబున నేనాదురాత్ముని మస్తకచ్ఛేదనంబు గావించెదను. నీవు శివాద్వైతజ్ఞాననిధానుండవు. నీకటాక్షపాతంబున జీవుండు జీవప్రధానుండగును. కావుననే నేను నీకీరహస్యము నెఱింగించితిని. నీవును శ్రద్ధాభక్తులుగలవానికి దీనిను పదేశించుచు లోకరక్షార్థంబు చరియించుచు నక్షయసుఖలాభంబు నందుము. అని యానతిచ్చుటయు సుబ్రహ్మణ్యాబోధితంబగు నద్భుతమహింబు నాలించి వామదేవుం డద్దేవునకు సాష్టాంగప్రణామంబులు గావించి కార్తికేయచరణకమలంబుల భృంగాయమానుం డయ్యెను.

—:యోగపట్టాది కథనము:—

కార్తికేయుండు మరల నిట్లని చెప్పం దొడంగెను. వామదేవ మునీంద్రా! గురుత్వలాభంబునకు నిదానభూతంబైన యోగపట్టంబునుంగూర్చి చెప్పెద నాలకింపుము. వైశాఖ శ్రావణాశ్వీజ కార్తిక మార్గశీర్ష మాఘంబులలో నేమాసంబునందైన శుక్లపక్షంబున శుభదినంబులయందుఁగాని, పంచమినిగాని, పూర్ణిమనుగాని శిష్యుండు ప్రాతఃకృత్యంబులం దీర్చి యాచార్యానుమతంబు గాంచి స్నానంబు చేసి నియతచిత్తంబున నాననశుద్ధుండై వస్త్రంబుచే గాత్రమార్జనంబు గావించుకొనుచు ద్విగుణసూత్రబద్ధంబగు కౌపీనంబును వసనంబును, నుత్తరీయంబును దాల్చి పాదప్రక్షాళనంబు చేసికొని రెండుసారు లాచమించి సద్యోజాతాది మంత్రంబులచే భస్మగ్రహణంబుచేసి క్రమవిధానంబున దానిని ధరించి గురుదేవునిచే నీతుండై సుందరమండపంబు కడకుం బోయి గురుప్రదత్తంబగు చేలాజినకుశోత్తరాసనంబునఁ బూర్వాభిముఖుండై కూర్చుండవలయును. అనంతరము గురుదేవుం డాధారసహితంబగు శంఖంబును గ్రహించి యస్త్రమంత్రంబుచే దానిని శోధించి యాత్మాభిముఖంబుగ స్థాపించి పుష్పాదులచేఁ బూజించి యస్త్ర కవచమంత్రపూతంబులగు జలంబులచే దానిని నిండించి షడంగోక్తక్రమంబునఁ బూర్వంబువలెనే పూజించి యేడుసారులు ప్రణవంబుచే నభిమంత్రించి గంధపుష్పాదులచే మరల నర్చించి ధూపదీపంబులు సమర్పించి యస్త్రమంత్రంబున రక్షాముద్రయుఁ, గవచమంత్రంబున నవకుంఠనపూర్వకంబులగు ధేనుశంఖముద్రలను బ్రదర్శింపవలయును. శంఖదక్షిణభాగంబున మండలరచనంబు చేసి విశేషార్ఘ్యోక్తవిధిం గావించి గంధపుష్పాదులచేఁ బూజించి మండలమధ్యంబున నాధారసహితంబును, శోధితంబును, దంతుపరిష్కృతంబును, ధూపితంబును, సువాసిత శుద్ధజలపరిపూరితంబును, బంచత్వక్పంచపల్లవ

సమన్వితంబును, బంచవిధమృత్తికాయుతంబును, సుగంధకలితంబును, నలంకృతంబును నగుఘటంబును స్థాపించి వస్త్రంబునను, నామ్రపల్లవంబులను, నారికేళంబునను, బుష్పంబులను నలంకరించి తన్మధ్యంబున నింద్రనీలంబును, మాణిక్యంబును, సువర్ణంబును, బ్రవాళంబును, గోమేధికంబును ననుపంచరత్నంబులను ద్రదభావంబునఁ గేవలసువర్ణంబును నిక్షేపించి మంత్రపూర్వకంబుగ నాధారశక్తిని బూజించి పిమ్మట నావరణదేవతాసహితుం డగుశంభు నావాహనంబు చేసి పూజించి పూర్వంబువలెనే పాయసాదులను నివేదించి తాంబూలంబు నొసంగి శర్వాదినామార్చనాంతంబున నాస్థాపితఘటంబు నష్టోత్తరశతప్రణవోచ్చారణంబున నభిమంత్రించి పంచబ్రహ్మాదిదేవతల నందుఁ బూజించి ముద్రాప్రదర్శనంబు గావించి ధూపదీపంబుల సమర్పించి ధేనుయోగముద్రలను బ్రదర్శించి దర్భలచే మస్తకాచ్ఛాదనంబు గావించి మండపంబున కీశాన్యదిగ్భాగంబునఁ జతురస్రంబును గల్పించి యందాసనంబును గల్పించి యందుశిష్యుని గూర్చుండఁజేసి పూర్ణకుంభమునెత్తి స్వస్తివాచనపూర్వకంబుగఁ బ్రదక్షిణక్రమంబున శిష్యమస్తకంబున నేడుసారులు ప్రణవమంత్రంబు నుచ్చరించుచు గురుండు వేదమంత్రంబులచే నభిషిక్తుం గావింపవలయును. తరువాత శంఖజలంబుచేఁ బరివేష్టితునిం గావించి శిష్యునకుఁ జరుదీపంబులను బ్రదర్శింపవలయును. అనంతరము శిష్యుండు వస్త్రంబుచే గాత్రమార్జనంబు చేసికొని నూత్నసూత్రకౌపీనంబును వస్త్రయుగళంబును దాల్చి పదప్రక్షాళనంబుచేసికొని ద్వివారము లాచమించి భస్మధారణంబు చేయవలయును అప్పుడు గురుండు శిష్యునిహస్తమును బట్టుకొని మండపమధ్యస్థితాసనంబునఁ గూర్చుండఁజేసి యాత్మజ్ఞానాభిలాషియుఁ, బూర్వాభిముఖంబుగ సుఖాసీనుండునగు శిష్యునింగూర్చి నీయాత్మనిర్మలంబగుఁగాక యని యాశీర్వదించి గురుండు తన్ను శివునిగా భావించుకొని సమాధి

స్థుండై ముహూర్తకాలం బేకాగ్రచిత్తంబుననుండి నేత్రోన్మీలనంబుగా వించి స్థిరభావంబున శిష్యునిపై దృష్టిప్రసారంబు చేసి భస్మలిప్తంబగు నిజహస్తంబు తదీయమస్తకంబున విన్యస్తంబుగావించి శిష్యుని దక్షిణ కర్ణంబున 'హంసఃసోహం' అను మంత్రంబును విస్పష్టంబుగనుపదేశించి తదర్థంబును ప్రబోధింపవలయును. తరువాత ప్రజ్ఞానం బ్రహ్మేత్యాది శ్రుతివాక్యంబులకు యథాక్రమంబుగ నర్థంబును బ్రబోధింపవలయును. తరువాత నస్త్రమంత్రోచ్చారణ పూర్వకంబుగ నాధార సహితంబగు శంఖంబును గ్రహించి భస్మశోధనంబు గావించి శిష్యుని పురోభాగం బునఁ జతురస్రమండలంబున జలపూర్ణంబగు నాశంఖమును స్థాపించి ప్రణవమంత్రంబుచే గంధపుష్పాదుల నర్చించి యస్త్రమంత్రంబున శోధించి ప్రణవమంత్రంబునఁ బూజించి సప్తప్రణవోచ్చారణంబున జలంబును బూతంబుగావించి నీవు దృఢాత్ముండవై భయశూన్యుండ వగుమని శిష్యునకు బోధించి గురుండు శిష్యుని సాక్షాద్దేవస్వరూపుని గాభావించి యర్చింపవలయును. ప్రథమంబున శిష్యుని సుఖాసనపూ జయుఁ గ్రమంబుగా శివాసనకల్పనంబును, శివమూర్తిభావనంబును గావించి శిష్యమస్తకంబునను, ముఖంబునను, హృదయంబునను, గుహ్యంబునను, పాదదేశంబునను బంచబ్రహ్మవిన్యాసంబు చేసి యా యాస్థానంబులయందు దేహంబునం షట్త్రింశత్కళాన్యాసంబు గావించి ముద్రాప్రదర్శనంబును, షడంగన్యాసంబును, ఆసనాదిషోడశోప చారకల్పనంబును, మంత్రపూర్వకనివేదనంబును, పూర్వోక్తనామాష్ట కంబుచేఁ బూజయును గావించి వేదమంత్రపాఠంబు చేయవలయును. పిమ్మట సుగంధకలితంబులగు కహ్లారాదిపుష్పంబులచేఁ గూర్పంబడిన యాగుల్ఫలంబితంబగు పుష్పమాలికచే శిష్యునికంఠంబు నలంకరింపవల యును. తరువాత నిజసంప్రదాయానుసారంబుగ శ్రీపాదసంజ్ఞకంబగు తిలకంబు నుంచి చందనంబుచే నాతని సర్వాంగంబును విలేపింపవల

యును. అనంతరము ఛత్రంబును, పాదుకలును, దూర్వాకల్పవికల్పనంబును, శివమంత్రాదివ్యాఖ్యాకర్తృత్వంబును, గర్భారంభంబున నాచార్యపీఠగ్రహణార్హత్వంబును శిష్యునకు బ్రసాదింపవలయును. గురుండిట్లు శివస్వరూపుం డగు శిష్యు ననుగ్రహించి "నేను సాక్షాత్సదాశివుండ నని సమాధిస్థుండవై సర్వదా భావింపవలయును" అని శిష్యునకుపదేశించి స్వయంబుగ నమస్కారంబు గావింపవలయును. తరువాత నితరులందఱు నాతనికి సంప్రదాయానుసారంబుగఁ బ్రణామంబులఁ గావింపవలయును. పిమ్మట శిష్యుండు లేచి నిజగురునకును, గురునిగురునకును, దనగురుని శిష్యులకును నమస్కారంబు గావింపవలయును. అప్పుడు గురుదేవుం డాతనిం గాంచి వత్సా! నేఁడుమొదలు నీవు లోకానుగ్రహరతుండ వగుము. సంవత్సరపరీక్షంగావించిన వెనుక విధిమతంబుగ శిష్యపరిగ్రహణంబు గావించుచుండుము. రాగాదిదోషపరిత్యక్తుండవై శివధ్యానపరాయణుండవగుము. సాధుసహవాసంబు చేయుము. అసత్సంగంబు గావింపవలదు. ప్రాణసంకటసమయంబునందైనను శివపూజ గావింపకుండ భుజియింపకుము. గురుభక్తి నాశ్రయించి సుఖవగుము. అని యిట్లు సమాదరపూర్వకంబుగ నుపదేశంబు గావించి శిష్యుని దనయంతవానిగాఁ జేయవలయును. ఇది యోగపట్ట విధానంబు. ఇక యతీంద్రులకుఁ బరమపావనంబులగు క్షౌరస్నానంబులం గూర్చి చెప్పెద నాకర్ణింపుము. పిమ్మట శిష్యుండు గురునకు సాష్టాంగదండప్రణామంబు గావించి తదీయాజ్ఞానుసారంబుగ మస్తకప్రక్షాళనంబు చేసికొని యాచమనంబు చేసి వస్త్రసహితుండై క్షౌరకార్యంబు గావించుకొనవలయును. ముందుగా మృత్తికాజలంబులచే వస్త్రప్రక్షాళనంబు గావించుకొని పూర్వస్థాపితంబులును, జలప్రోక్షితంబులు నగుక్షురాదులను గరద్వయంబున మృత్తికాలేపనంబు గావించుకొని ప్రక్షాళనంబు చేయుమని క్షౌరకునకుఁ

జెప్పి యాతనికి మృత్తికనిచ్చి శివనామంబు నుచ్చరించుచు నంగుష్ఠానామికామూలంబున నభిమంత్రితంబులగు నిజనేత్రంబుల నాచ్ఛాదనంబు చేసికొని యస్త్రమంత్రంబుచే నున్మీలనంబు గావించి క్షౌరాది సాధనంబులను గాంచుచుఁ బండ్రెండుసారు లస్త్రమంత్రంబుచే వాని నభిమంత్రించి మంత్రపూర్వకంబుగ జలప్రోక్షితంబులుగాఁ జేయవలయును. తరువాతఁ బ్రణవోచ్చారణ పూర్వకంబుగ క్షౌరంబును గ్రహించి దక్షిణభాగంబునందలి కతిపయకేశచ్ఛేదనంబు గావించిన పిమ్మట క్షురకుండు సమస్తకేశచ్ఛేదనంబును గావించి యాకేశంబులను బాత్రోపరిభాగంబున నుంచవలయును. కాని, వానిని గ్రిందఁ బడనీయఁగూడదు. అనంతరము శ్మశ్రువును, కరపాద నఖంబులను కర్తనంబు గావించుకొనవలయును. తరువాత శిష్యుండు బిల్వాశ్వత్థ తులసీవృక్షమూలంబులంగల మృత్తికను గ్రహించి పండ్రెండుసారులు జలంబుల మునిఁగి తీరంబునకు వచ్చి కూర్చుండి విశుద్ధస్థానంబునందున్న యామృత్తికను మూడుభాగంబులుగఁ జేసి యందొకభాగంబును మరల మూడుభాగంబులుగఁ జేసి యస్త్రమంత్రంబుచేఁ బ్రోక్షణాభిమంత్రణంబు గావించి యందొకభాగంబును గైకొని యన్యహస్తంబునందుంచి పండ్రెండుసారులు కరద్వయంబున మర్దించి ప్రత్యేకంబుగ జలంబులచేఁ గడిగి మరల నేకభాగంబు దీసికొని పాదద్వయంబునను, మఱియొకభాగంబును ముఖంబునను లేపనంబు చేసికొని క్రమప్రకారంబున మరల జలంబుల స్నానంబు గావింపవలయును. తరువాత నేకభాగంబగు మృత్తికచే మస్తకంబున ముఖపర్యంతంబును బండ్రెండుసారులు విలేపించుకొని మరలమరల మునుంగుచుఁ దీరంబునకు వచ్చి పదునాఱుసారులు గండూషంబును రెండుసారు లాచమనంబును జేసి ప్రణవోచ్చారణంబు చేయుచు నెనిమిదిపర్యాయంబులు ప్రాణాయామంబు చేసి మిగిలిన యేకభాగంబగు మృత్తికను

మూడుభాగంబులుగా జేసి యందొక భాగంబుచే గటి పాదశౌచంబు
గావించుకొని ప్రణవమంత్రంబుచే రెండుసారులాచమించి మౌనియై
యాఱుసారులు ప్రాణాయామంబు చేసి క్రమ్మర రెండవభాగంబగు
మృత్తికను నిజోరుదేశంబునఁ ద్రిభాగంబులుగాఁ జేసి ప్రణవప్రోక్ష
ణంబును నభిమంత్రణంబును గావించి యందొకభాగంబుచేఁ బాణిద్వ
యంబును లిప్తంబుగావించి సూర్యుని దర్శించి యింకొకభాగంబుచే
వ్యత్యస్తపాణిమూలంబున మస్తకమునుండి పాదంబులవఱకును బూసి
కొని తృతీయభాగంబును గ్రహించి లేచి దండంబును బట్టుకొని శివుని
గురుని స్మరించుచు సాష్టాంగంబుగ ముమ్మారును, బంచాంగముగ నొక
మారును బ్రణామంబు చేసి లేచి వందనంబు గావించి జలంబులఁ బ్రవే
శించి నిమగ్నోన్మగ్నుండై యామృత్తికను స్కంధస్థాపితంబు గావించి
పూర్వోక్తవిధానంబున విలిప్తంబు గావించుకొని యవశిష్టాంశంబును
జలమిశ్రితంబు గావింపవలయును. తరువాత ముమ్మారు ప్రణవోచ్చా
రణంబు చేయుచు స్నానంబు చేసి శివపాద పద్మస్మరణానంతరంబున
ద్వాదశవారంబులు ప్రణవమంత్రంబుచే శంఖముద్రా మూలంబున
నభిషేకంబు చేసి తీరంబునకు వచ్చి కరపాదశోధనంబు గావించి
మరలఁ జేతులు గడిగికొని ప్రణవంబుచే రెండుసారు లాచమించి
యంగోపమార్జనంబు గావించి భస్మత్రిపుండ్రధారణంబుచేసి మాధ్యా
హ్నికంబు దీర్చి గురుతీర్థవందనంబు గావించి మహేశ్వరునకుఁ బ్రణ
మిల్లి పంచావరణక్రమంబునఁ గల్పింపఁబడిన మండలంబున బరమేశా
నపూజానంతరంబున యథోచితంబగు భిక్షం గైకొనవలయును. కాని
దూషితజనాన్నంబు గ్రహియింపఁజనదు. వామదేవమునీంద్రా! యతు
లకుఁ గర్తవ్యంబులైన పవిత్రంబులగు క్షౌరస్నానంబుల నెఱింగించి
తిని. ఇఁకనేమి వినఁదలంచితివో యడుగు మని కార్తికేయుం డాన
తిచ్చెను.

## —♦ ముక్త్యుపాయవర్ణనము ♦—

తదనంతరంబ వామదేవుం డో దేవదేవా! యతీంద్రులయంత్యేష్టికర్మంబునుంగూర్చియు వారిముక్త్యుపాయముంగూర్చియు సవిస్తరంబుగ నెఱింగింపు మని ప్రార్థించుటయు శక్తిధరుండును, దైత్యహరుండు నగు సుబ్రహ్మణ్యేశ్వరుండు సాదరావలోకనంబుల సమ్మునిశ్రేష్ఠుం గాంచుచు నిట్లనియెను. మునీంద్రా! భగవానుండును, సర్వజ్ఞుండును బినాకపాణియు నగు మహాదేవుండు ఋభుండను శివయోగికి జెప్పినవిధంబునఁ బరమగుహ్యంబగు నీవిషయంబును జెప్పెద నాలింపుము. మహావీరుండగు యతీంద్రుండు సమాధిస్థుండై స్వకీయదేహంబున శివభావంబు గాంచువాఁడు సంపూర్ణశివతత్త్వలాభప్రాప్తుండగుచున్నాఁడు. దృఢచిత్తంబున సమాధిలాభంబును బడయఁజాలనివాఁడు వేదాంతకథితంబును, జ్ఞాతృజ్ఞానజ్ఞేయరూప పదార్థత్రయజ్ఞాననిర్వాహకంబగు యోగవిషయంబును, గురుముఖంబున విని యమనియమాదుల నభ్యసించి ప్రణవాసక్తచిత్తంబున నిత్యంబును శివధ్యానరతుండు గావలయును. అట్టివాఁడు శరీరదౌర్బల్యవశంబున నధీగుండై దేహత్యాగంబు గావించిన యెడల నాతనిం గొనిపోవుటకు సదాశివానుగ్రహంబున నతివాహికరూపిణులగు పంచవిధదేవతలు నందీశ్వరునిచేఁ బంపఁబడుదురు. అనలాభిమానినియుఁ, దేజోమాత్రాభిమానినియుఁ దివాభిమానినియు, శుక్లపక్షాభిమానినియు, నుత్తరాయణాభిమానినియు నను నీదేవతలు పంచవిధంబుల ననుగ్రహాత్మకలై యుందురు. ధూమ్రవర్ణయుఁ గృష్ణపక్షాభిమానినియు, దక్షిణాయనరూపయు, దమస్వినియు నరాత్రిదేవత కర్మానుష్ఠాన తత్పరులను స్వర్గంబునకుఁ గొనిపోవును. అక్కడఁ బుణ్యక్షయంబైనతోడనే వారు క్రమ్మర మానవలోకంబును బొందుచుందురు. అతివాహికలగు నా దేవతామూర్తులు భూతలంబునుండి యగ్న్యాదిక్రమంబునఁ బంచవిధ

మార్గంబులను విభాగించుకొని యతులు మొదలగువారిని సదాశివ పదంబునకుఁ గొనిపోయి మహాదేవుని పాదంబులకు నమస్కరించి యా దేవుని పశ్చాద్భాగంబున ననుగ్రహాకార్యనియోజితులై యుందురు తరువాత సదాశివుండు సమాగతుండగు నయ్యతిపురుషుంగాంచి యాతండు విరక్తుండని తోఁచినచో నాతనికి మహామంత్రతాత్పర్యంబు నుపదేశించి యాయుధాలంకార సహితంబగు స్వస్వరూపంబు నాతనికిఁ బ్రసాదించి గణాధిపత్యంబు నిచ్చి కామగమనంబును, సర్వకామప్రదంబును, సర్వాంగసంపన్నంబును, శ్రేష్ఠంబునగు విమానంబు నాతని కొసంగును. అయ్యతి యవిరక్తుండని తోఁచినచో సారూప్యంబును బ్రసాదించినపిమ్మట రుద్రకన్యాసమావృతంబును నృత్యగీత మృదంగవాద్యధ్వని మనోహరంబును, గోటిసూర్యప్రభామయంబును, గోటిచంద్రశీతలంబును, మనోవేగంబును, గామగమనంబును నగు విమానంబు నిచ్చి యాతని భోగభిలాష చరితార్థంబైనపిమ్మట నాతనికిని భోగవాంఛాక్షయ సాధనంబు గావించును. పిమ్మట నాతనికిఁ బ్రకృత్యాది దుర్గమకాంతారంబులను దహించుటయందుఁ బ్రళయానల సన్నిభంబును, శక్తిమంతంబును, దీవ్రతరంబునగు మహావాక్యతాత్పర్యంబు నుపదేశించి స్థిరసమాధిస్థుండగు శిష్యునిగాఁ జేసి యా జగద్గురుండు సర్వక్రియాసమర్థంబులగు దివ్యశక్తుల నాతని కొసంగి పునరావృత్తి రహితంబగు పరముక్తి ప్రదానంబు గావించును. కావుననే యీపరమపదంబు సకలైశ్వర్య సమష్టిస్వరూపంబనియుఁ బ్రధానముక్తిస్థానంబనియు వేదాంతశాస్త్రనిర్దిష్టంబయ్యెను. సత్సంప్రదాయసంపన్నుండగు యతీంద్రుండు ముమూర్షుండు నవశేంద్రియుండునై పడినప్పుడు యతీంద్రు లాతని నలువంకలను గూర్చుండి సమాహితచిత్తంబునఁ గ్రమంబుగఁ బ్రణవాదిమంత్రంబులను దాత్పర్యసహితంబుగ నుపదేశించి యాతని ప్రాణనిర్గమపర్యంతంబును నాత్మాను

రూపంబులగు నుపదేశవాక్యంబుల నుచ్చరించుచుండవలయును. ఇయ్యనుష్ఠానసంస్కారంబునకుఁ గ్రమంబని పేరు. సర్వకర్మపరిత్యాగపూర్వకంబుగ మహాదేవ శరణాపన్నులగు యతీంద్రులకు దేహసంస్కారంబు లేకున్నను దుర్గతులు కలుగనేరవు. అట్టి యతీంద్రుని మృతదేహంబును దూషితంబుచేయు రాజునకు రాజ్యనష్టంబగుటయేగాక యందలి ప్రజలకు మహాత్తమంబగు దుఃఖంబు సంభవించును. తద్దోషపరిహారార్థంబు మంత్రపూర్వకంబుగా నయ్యతిదేహంబును గర్తంబుననుంచి పూడ్పింపవలయును. ఆయతికి గృహస్థాశ్రమమునందలి పుత్రులున్నచో నట్టిపుత్రులామృతదేహంబున కభ్యంగనంబు గావించి యథాన్యాయంబుగ సంస్కారంబు గావింపవలయును. సమ్ముఖంబున శంఖస్థాపనంబుచేసి యథాక్రమంబుగ శ్రీరుద్రచమకద్వయంబును, రుద్రసూక్తంబును బఠించుచు మృతదేహము నభిషేకించి మస్తకంబునఁ బుష్పంబులనుంచి ప్రణవంబు నుచ్చరించుచు బ్రణవంబుచే సమ్మార్జనంబు చేసి పూర్వకౌపీనంబును దీసి యన్యంబగు నూతనకౌపీనంబు నలంకరించి విధివిధానంబున భస్మంబుచే సర్వాంగంబును విలిప్తంబు గావించి చందనత్రిపుండ్రతిలకంబు నుంచి యురంబును, గళంబును, శిరంబును, బాహువులను, బ్రకోష్ఠంబులును గర్ణంబులును బుష్పమాలికలచే నలంకరించి రుద్రాక్షమాలికలవైచి గంధధూపంబులచేఁ బరిమళింపఁజేసి తద్దేహంబును బల్లకియందుంచి ప్రణవయుక్తంబులగు పంచబ్రహ్మమంత్రంబుల నుచ్చరించుచు నారథంబును యథావిధిగఁ బూజించి సుగంధకుసుమమాల్యంబులచే దాని నలంకరించి నృత్యగీతవాద్యంబులతోడను, వేదపాఠంబులతోడను రథంబును గ్రామప్రదక్షిణంబు చేయించి గ్రామ పూర్వభాగంబునఁగాని, యుత్తరంబునఁగాని, పవిత్రస్థానంబునఁ బవిత్రవృక్షసమీపంబున దండప్రమాణంబగు నొకగర్తంబును ఖననంబుఁ గావించి ప్రణవంబును, వ్యాహృతులను

నుచ్చరించుచు యథాక్రమంబుగఁ బ్రోక్షించి యందు శమీ పత్రంబులను గుశలను బరచి యుపరిభాగంబున నుత్తరాగ్రంబులుగా దర్భలను బీరవస్త్రంబును మృగచర్మంబును గుశలను నొకదానిపై నొకటిగఁ బఱచి ప్రణవంబును వేదమంత్రంబుల నుచ్చరించుచు మృతదేహంబును బంచగవ్యంబుచేఁ బ్రోక్షితంబు గావించి రుద్రసూక్తంబును బ్రణవంబును బఠియించి యభిషేకంబు గావింపవలయును. తరువాత శంఖజలంబుచే మరల నభిషేకించి మస్తకంబునఁ బుష్పంబులనుంచి ప్రణవోచ్చారణంబు సేయుచు స్వస్తివాచనంబు చేసి యాదేహంబు నెత్తిగర్తమధ్యంబునఁ బూర్వాభిముఖంబుగ యోగాసనంబున సంస్థాపింపవలయును. తరువాత గంధపుష్పాలంకరణంబు చేసి మంత్రపూర్వకంబుగ ధూపం బొసంగి దక్షిణహస్తంబున దండంబును వామహస్తంబున మంత్రపాఠపూర్వకంబుగ జలపూర్ణకమండలువు నుంచి మంత్రపూర్వకంబుగ మస్తకస్పర్శనంబు సేయుచు జపంబు చేసి బ్రూమధ్యప్రదేశంబును స్పృశించి రుద్రసూక్తంబును జపింపవలయును. తరువాత మంత్రోచ్చారణంబు సేయుచు నారికేళంబున మస్తకంబును భేదించి యాగర్తంబును పూరింపవలయును. పిమ్మటఁ బంచబ్రహ్మమంత్రంబులను బఠించుచు గర్తస్థానంబును స్పృశించి జపంబు చేయవలయును. తరువాత సంసారవైద్యుండును, సర్వజ్ఞుండును, నపరాధీనుండును, సర్వానుగ్రహకారియుఁ బరాత్పరుండును, మంగళమయుండు నగుమహాదేవుని స్మరియించుచు "యోవేదానాం" అను మంత్రంబు మొదలు "యఃపరఃపరమేశ్వరః" అను మంత్రంబువఱకును జపించుచు మూరెఁడెత్తును, రెండుమూరల విశాలంబు నగుచతుష్కోణ మృణ్మయపీఠంబును గల్పించి గోమయంబుచే నలికి మధ్యదేశంబున గంధాక్షతలతోఁ గూడిన సుగంధపుష్పంబులను, బిల్వదళంబులను దులసీదళంబులను జేర్చి పూజింపవలయును. పిమ్మటఁ బ్రణవయుక్తంబుగ ధూపదీపంబు

లను ఘృతంబును నొసంగి యైదుసారులు ప్రదక్షిణ నమస్కారంబులు చేసి పండ్రెండుసారులు ప్రణవంబును జపించి ప్రణామంబు గావింపవలయును. అనంతరము ప్రణవంబు నుచ్చరించుచు యథాక్రమంబుగ దిగ్విదిక్కులయందు బ్రహ్మార్ఘ్యదానంబు చేయవలయును. ఇట్లు దశదివసపర్యంతంబును నియమపూర్వకంబుగ వేదికను బూజింపవలయును. ఏకాదశదివసంబున వేదిని సమ్మార్జనంబు గావించి యుపలేపనంబు చేసి పుణ్యాహవాచనపూర్వకంబుగాఁ బశ్చిమంబునుండి పూర్వదిక్పర్యంతంబును యథాక్రమంబుగఁ బంచపర్యాయంబులు సంప్రోక్షణంబు గావించి యుత్తరాభిముఖుండై మధ్యభాగంబునఁ బ్రాదేశమాత్రంబగు నొకచతుష్కోణంబును రచియించి యథాక్రమంబుగ బిందువును త్రికోణసహితంబుగా షట్కోణంబును వృత్తంబునగు మండలంబును రచియించి పూజాపద్ధతి ననుసరించి సమ్ముఖంబున శంఖస్థాపనంబు చేసి ప్రాణాయామంబు చేసి సంకల్పంబు గావించి కుశత్యాగంబు చేసి జలంబుల స్పృశించి పశ్చిమదిక్కునుండి యుద్వాసనాక్రమంబున నాలుమండలములను గల్పించి మధ్యభాగంబునఁ బీఠంబుగాఁ బుష్పనిక్షేపంబు చేసి మంత్రోచ్చారణపూర్వకంబుగ నగ్నిరూపాతివాహిక దేవత నావాహనంబు చేసి యిట్లే తక్కిన దేవతలనుగూడఁ గ్రమంబుగ నావాహనంబు చేసి ప్రతిదేవతకును సమాదరపూర్వకంబుగ స్థాపనాది ముద్రాప్రదర్శనంబు చేసి యంగన్యాసంబును ధ్యానంబును గావింపవలయును. అయ్యాతివాహిక దేవతలు, పాశాంకుశ వరాభయహస్తలును, చంద్రకాంత మణిప్రభా విరాజితలును, రక్తాంగుళీయ ప్రభావిభాసితలును, రక్తాంబరధారిణులును, రక్తాధరలును, రక్తారుణ కరచరణ పంకజలును, మణిమకుట ధారిణులును, చంద్రరేఖాలంకృతలును, రత్నకుండల ప్రభారంజిత గండభాగలును, పీనోన్నతపయోధరలును, హారకేయూర కటకకాంచీదామ మనోహారిణులును, దను

మధ్యలును, బృథునితంబలును, మణిమయ మంజీరశింజితపదకంజాతలును, సర్వానుగ్రహమూర్తులును, శక్త్యాత్మక విగ్రహాలును, సదాశివసమానులునుగా భావించి యనుగ్రహదాయిను లగు నీదేవమూర్తులను ధ్యానించుచు శంఖజలంబులచేఁ బాద్యంబొసంగి హస్తంబున నాచమనీయంబును మస్తకంబునం దర్ఘ్యంబును, శంఖ జలంబుచే స్నానంబును గావింపవలయును. పిమ్మటఁ దివ్యంబును నరుణంబునగు నుత్తరీయప్రదానంబు చేసి యమూల్యముకుటాది సకలాభరణంబుల సమర్పించి సువాసితగంధంబును శోభితాక్షతలును, సురభిళపుష్పంబులను నొసంగి సుగంధధూప ఘృతదీపంబుల నివేదించి పాద్యాదులను మంత్రపూర్వకంబుగ నొసంగవలయును. దీపదానంబునకుఁ బిమ్మట ఘృతమధుశర్కరాసహితంబును బక్వకదళిపిష్టకమిశ్రితంబును, సువాసితంబు నగుపరమాన్నంబును గదళీపత్రంబునందుంచి ప్రత్యేకంబుగ మంత్రపూర్వకంబుగ నివేదింపవలయును. అనంతరము మంత్రయుక్తంబుగఁ బానీయంబిచ్చి స్నానశుద్ధిం గావించి గండూషంబును, నాచమనంబును నర్ఘ్య ప్రదానంబును గావింపవలయును. తరువాతఁ దాంబూలంబును, ధూపంబును, దీపంబును, నొసంగి ప్రదక్షిణ నమస్కారంబులు చేయవలయును. ఇట్లు పూజించినపిమ్మట నంజలిన్యస్త మస్తకుండై యోమాతృదేవతలారా ! మీరు సుప్రసన్నలై శివపదలాభార్థియు, రక్షణీయుండు నగునీయతిని పరమేశ్వర పాదపద్మ సన్నిధానంబునఁ జేర్పవలయు నని ప్రార్థించి యాదేవతలనందఱను యథాస్థానంబున విసర్జనంబు గావింపవలయును. తరువాత దేవతా ప్రసాదంబగు నన్నంబును గ్రహించి కన్యకాములకు దానంబు చేయవలయును. కాదేని గోవునకుఁ బెట్టుటయైనను, జలమధ్యంబున నిక్షేపించుటయైనను గావింపవలయును. కాని మఱియెచ్చటను విడువఁ దగదు. ఆయతి నుద్దేశించి యాస్థానంబుననే పార్వణశ్రాద్ధంబు గావిం

పవలయును. యతీంద్రుల కెచ్చటను నేకోద్దిష్టంబు విధింపఁబడలేదు. ఇఁకఁ బార్వణశ్రాద్ధంబునుగూర్చి చెప్పెదను వినుము. శ్రాద్ధకర్త యగువాఁడు స్నానానంతరంబున నుపవీతుండై పవిత్రంబును దాల్చి సంకల్పంబు గావించి యుత్తర భాగంబునఁ దర్భలను బఱచి యాచమనంబు చేసి సాభ్యంగకృతమజ్జనులును, శివభక్తులు నగు నలుఁవురు బ్రాహ్మణులను నిమంత్రితులం గావించి వారిలో నొక్కని విశ్వదేవుని గను, నొక్కని నాత్మస్వరూపునిగను, నొక్కని ననంతరాత్మస్వరూపునిగను, నొక్కని బరమాత్మస్వరూపునిగను భావించి యాదరపూర్వకంబుగ వరణంబు గావించి వారిపాదంబుల గడిగి పూర్వాభిముఖుండై కూర్చుండి గంధాదులచే వారి నలంకరించి మహాదేవసమ్ముఖంబున భోజనంబు సేయింపవలయును. తరువాత భూప్రదేశంబును గోమయంబుచే నలికి పూర్వాగ్రంబులుగ నందు దర్భలను బరచి ప్రాణాయామపూర్వంబుగ సంకల్పించి మండలత్రయార్చనంబు చేసి యాత్మాంతరాత్మాపరమాత్మలకుఁ బిండకుశోదకదానంబు గావింపవలయును. తరువాత లేచి ప్రదక్షిణనమస్కారంబులు చేసి బ్రాహ్మణులకు యథావిధిగ దక్షిణల నొసంగవలయును. ఆస్థానంబునం దాదినంబున నారాయణబలి నొసంగవలయును. రతూర్థంబు సకలకార్యంబులయందును విష్ణుపూజ శాస్త్రంబులఁ జెప్పంబడుచున్నది. విష్ణుపూజాంతంబునఁ బాయసాన్ననివేదనంబు చేసి వేదపారగులగు ద్వాదశ బ్రాహ్మణులను నిమంత్రించి వారిని గేశవాదిద్వాదశనామంబులచే నర్చించి ఛత్రపాదుకావస్త్రాది దానంబులు గావింపవలయును. తరువాత భూతలంబునఁ బూర్వాగ్రంబులుగా దర్భలను బఱచి మంత్రపూర్వకంబుగఁ బాయసాన్నంబుచే బలిప్రదానంబు గావింపవలయును. ద్వాదశదినంబునఁ బ్రాతఃకాలంబున లేచి స్నానాదిక్రియల నిర్వర్తించి శివభక్తుండగు యతినిగాని, శివప్రియులగు బ్రాహ్మణులనుగాని

నిమంత్రించి మధ్యాహ్నమునం దాహ్వానించి సుగంధ ద్రవ్యంబులచే నభ్యంగంబును స్నానంబును జేయించి పరమేశ్వర సమీపంబునం గూర్చుండఁజేసి పూర్వోక్త పంచావరణప్రకారంబునం బూజింపవల యును. తరువాత ముమ్మారు ప్రాణాయామంబును బృహత్సంకల్పం బును గావించి "ఇచ్చట నాగురుని బూజించెదను" అని దర్భస్ప ర్శంబు చేసి పాదంబులఁ గడిగికొని మౌనియై యాచమనంబు చేసి యతినిగాని, బ్రాహ్మణులనుగాని భస్మభూషితులం గావించి వివిధాస నంబులయందు వారిని బూర్వాభిముఖులుగా గూర్చుండఁజేసి యందెన మంద్రను బూర్వోక్త సదాశివ మహేశ్వరాది స్వరూపులుగను, మిగి లిన నలువురను గురుపరమగురుపరాపరగురుపరమేష్ఠి గురుస్వరూపం బున ధ్యానించి శక్తిసహితులుగా భావించి ధ్యానానుసారంబుగ వారిని సంబోధించి వారివారి కనుగుణంబులగు నాసనాదులను సమర్పించి ప్రణవ యుక్తంబుగ సకల నామంబులను ద్వితీయాంతంబులుగ నుచ్చరించుచు "ఆవాహయామినమః" అని యావాహనంబు చేయుచు నర్ఘ్యోదకంబులచేఁ బాద్యాచమనార్ఘ్యంబులను, వస్త్రగంధా క్షతలను సమర్పించి సురభికుసుమంబులచే నలంకరించి దీపధూప దానంబు చేసి సమస్తవిధంబులఁ బూజించి నమస్కారపూర్వకంబుగ లేచి కదళీపత్రంబులను బఱచి జలంబుచే వానిని బరిశుద్ధంబులుగఁజేసి వానియందు విశుద్ధాన్నంబును, పాయసాపూపసూపవ్యంజనాదులను, ఫలాదులను వడ్డించి ప్రతిపాత్రంబునొద్దను బీఠంబులనుంచి "పృథ్వీహ వ్యంరక్షస్వ" అను మంత్రంబునఁ గరస్పర్శంబు చేసి లేచి యాపోశ నంబు వడ్డించి వారియెదుట నిలిచి యంజలిహస్తుండై "సదాశివప్ర భృతిదేవతలారా! మీరు నాయెడల సంప్రీతహృదయులును, వర తదూళు నయ్యెదరుగాక" అని ప్రార్థించి "యేదేవాః" ఇత్యాది దీనిని ఋషులను జపించి యక్షతలతో జలంబును విడువవలయును.

తరువాత వారికి నమస్కరించి వారిని ప్రసన్నులం గావించుకొని గణపతిమంత్రంబు మొదలు వేదాదిమంత్రంబును, రుద్రాధ్యాయంబు నందలి రుద్రచమకద్వయంబును, రుద్రసూక్తపంచకంబును బఠింపవలయును. బ్రాహ్మణభోజనానంతరమున రుద్రాధ్యాయ మంత్రంబుల బఠింపవలయును. తరువాత బ్రాహ్మణుల కుత్తరాపోశనం బొసంగి వారు లేచి పరిశుద్ధులై వచ్చినపిమ్మట నాసనంబులయం దభిముఖంబుగ గూర్చుండఁజేసి తాంబూలంబును దక్షిణయును బాదుకలను, ఛత్రంబును, వ్యజనంబును, బీఠంబును, వంశదండంబును వారికి సమర్పించి ప్రదక్షిణ నమస్కారంబులుగావించ వారిని సంతుష్టులం జేసి వారివలన నాశీర్వాదంబువడసి మరల వారికి నమస్కారంబునుజేసి ప్రార్థించి సదాశివస్వరూపులారా ! మీరు సంప్రీతచిత్తులై యథా సుఖంబుగ వేంచేయుఁ డని వారల నంపించుచు ద్వారదేశంబువఱకును వారిననుగమింపవలయును. తరువాత బ్రాహ్మణులాతనికి సెలవొసంగుటయుఁ దిరిగివచ్చి యజమానుండు బంధువులు బ్రాహ్మణులు, నతిథులు, దీనులు, ననాథులు, నగువారితోఁగూడి భోజనంబు గావింపవలయును. ప్రతివత్సరంబు నీవిధంబుగ నియమపూర్వకంబుగ గురునారాధించువాఁడిహలోకంబున మహద్భోగంబుల ననుభవించి యంతంబున శివలోకప్రాప్తుం డగును అని యిట్లు స్కందదేవుండు శిష్యుండగు వామదేవునకు బ్రబోధించిమునీంద్రా! పరమగుహ్యంబును బవిత్రంబునగు నీవేదాంతసిద్ధాంతమును నీవునాయొద్ద శ్రద్ధాపూర్వకంబుగ నుపదేశంబు గాంచితివి గావున నింతటినుండి పండితులు దీనిని వామదేవమతంబుగా గ్రహింపుచుందురుగాక ! ఈక్రమంబు ననుసరించి యతీంద్రుఁడు నేను శివస్వరూపుండనైతినని భావించినచో సకలనదులును సముద్రగామినులగునట్లే పితామహాది విభాగంబులనుండి ముక్తుండై శివుని విలీనుండగుచున్నాఁడు. అని యిట్లు కుమారుండు వామదేవ

హించి సర్వదేవతావంద్యులగు జననీజనకులను స్మరించుకొనుచుఁ గైలాసపర్వతంబునకుఁ బ్రయాణంబయ్యెను. వామదేవుండును శిష్య సహితుండై కార్తికేయు ననుసరించి కైలాసంబునకుం బోయి పార్వతీ పరమేశ్వరులం దర్శించినంతనే భక్త్యావేశంబున నాతని సర్వాంగంబులును గంపితంబులు గాఁజొచ్చెను. అప్పుడాతఁడు పరవశుండై వారి చరణకమలసన్నిధానంబునం బడి మాటిమాటికిఁ బ్రణామంబు లాచరించుచు వేదసమ్మతంబులును, భక్తిరసపూర్ణంబులు నగు వివిధస్తోత్రపాఠంబులచే స్తవంబు గావించి మస్తకంబునఁ బార్వతీ పరమేశ్వరుల పాదపద్మంబుల నుంచుకొని సంపూర్ణానుగ్రహలాభంబు గాంచి యాకైలాసపర్వతమునందే సుఖంబుగ నివసించియుండెను.

ఓమునీంద్రులారా! మీరును నట్లే ప్రణవవాచకుండగు మహేశ్వరు నెఱింగి యీకాశీధామమునందే సుఖంబుగ నుండి విశ్వేశ్వరుని పాదసేవనంబున సాయుజ్యరూపంబును, సర్వోత్తమంబును, నతులంబు నగు ముక్తిలాభంబు నందుఁడు. నేను గురుపాదపద్మసేవార్థినై బదరి కాశ్రమంబునకుం బోయెదను. పునస్సందర్శన సంభాషణంబులు లభియించుంగాక! అని చెప్పుటయు మునీంద్రులు సూతునకు మాటి మాటికి నమస్కరించుచుఁ బరమానందగద్గదస్వరంబున నిట్లనిరి. మహాభాగా! నీ యనుగ్రహంబున మా చిత్తవిభ్రాంతులు తొలఁగి పోయినవి. అనుటయు సూతుండు వ్యాసాదేశక్రమంబున నిట్లనియెను. మునివరులారా! నాస్తికులును, శ్రద్ధాహీనులును, భక్తిశూన్యులును, శుశ్రూషారహితులు నగువారి కీపురాణార్థం బెప్పుడును జెప్పంజనదు. మహాత్ముండగు వేదవ్యాసుం డనేకపురాణంబులను, ననేకేతిహాసంబులను, సకలవేదార్థంబులను బరిశోధించి యందలిసారంబు నుద్ధరించి తద్రూపంబుగఁ నీ మహా పురాణంబును రచియించి యున్నాఁడు. దీనిని వినుటవలన నభక్తునకు భక్తిప్రాప్తియగును. భక్తునకు భక్తి

తరువాత వారికి నమస్కరించి వారిని బ్రసన్నులం గావించుకొని గణపతిమంత్రంబు మొదలు వేదాదిమంత్రంబును, రుద్రాధ్యాయంబు నందలి రుద్రచమకద్వయంబును, రుద్రసూక్తపంచకంబును బఠింపవలయును. బ్రాహ్మణభోజనానంతరమున రుద్రాధ్యాయ మంత్రంబుల బఠింపవలయును. తరువాత బ్రాహ్మణుల కుత్తరాపోశనం బొసంగి వారులేచి పరిశుద్ధులై వచ్చినపిమ్మట నాసనంబులయం దభిముఖంబుగ గూర్చుండఁజేసి తాంబూలంబును దక్షిణయును బాదుకలను, ఛత్రంబును, వ్యజనంబును, బీఠంబును, వంశదండంబును వారికి సమర్పించి ప్రదక్షిణ నమస్కారంబులుగావించ వారిని సంతుష్టులం జేసి వారివలన నాశీర్వాదంబువడసి మరల వారికి నమస్కారంబునుజేసి ప్రార్థించి సదాశివస్వరూపులారా! మీరు సంప్రీతచిత్తులై యథా సుఖంబుగ వేంచేయుఁడని వారల నంపించుచు ద్వార దేశంబువఱకును వారిననుగమింపవలయును. తరువాత బ్రాహ్మణులాతనికి సెలవొసంగుటయుఁ దిరిగివచ్చి యజమానుండు బంధువులు బ్రాహ్మణులు, నతిథులు, దీనులు, ననాథులు, నగువారితోఁగూడి భోజనంబు గావింపవలయును. ప్రతివత్సరంబు నీవిధంబుగ నియమపూర్వకంబుగ గురునారాధించువాఁడిహలోకంబున మహాద్భోగంబుల ననుభవించి యంతంబున శివలోకప్రాప్తుం డగును అని యిట్లు స్కందదేవుండు శిష్యుండగు వామదేవునకు బ్రబోధించిమునీంద్రా! పరమగుహ్యంబును బవిత్రంబునగు నీవేదాంతసిద్ధాంతమును నీవునాయొద్ద శ్రద్ధాపూర్వకంబుగ నుపదేశంబు గాంచితివి గావున నింతటినుండి పండితులు దీనిని వామదేవమతంబుగా గ్రహించుచుందురుగాక! ఈక్రమంబు ననుసరించి యతీంద్రుఁడు నేను శివస్వరూపుండనైతినని భావించినచో సకలనదులును సముద్రగాములగునట్లే పితామహాది విభాగంబులనుండి ముక్తుండై శివుని విలీనుండగుచున్నాఁడు. అని యిట్లు కుమారుండు వామదేవ

హించి సర్వదేవతావంద్యులగు జననీజనకులను స్మరించుకొనుచుఁ గైలాసపర్వతంబునకుఁ బ్రయాణంబయ్యెను. వామదేవుండును శిష్యసహితుండై కార్తికేయు ననుసరించి కైలాసంబునకుం బోయి పార్వతీ పరమేశ్వరులం దర్శించినంతనే భక్త్యావేశంబున నాతని సర్వాంగంబులును గంపితంబులు గాఁజొచ్చెను. అప్పుడాతఁడు పరవశుండై వారి చరణకమలసన్నిధానంబునం బడి మాటిమాటికిఁ బ్రణామంబు లాచరించుచు వేదసమ్మతంబులును, భక్తిరసపూర్ణంబులు నగు వివిధస్తోత్రపాఠంబులచే స్తవంబు గావించి మస్తకంబునఁ బార్వతీ పరమేశ్వరుల పాదపద్మంబుల నుంచుకొని సంపూర్ణానుగ్రహలాభంబు గాంచి యా కైలాసపర్వతమునందే సుఖంబుగ నివసించియుండెను.

ఓమునీంద్రులారా! మీరును నట్లే ప్రణవవాచకుండగు మహేశ్వరు నెఱింగి యీకాశీధామమునందే సుఖంబుగ నుండి విశ్వేశ్వరుని పాదసేవనంబున సాయుజ్యరూపంబును, సర్వోత్తమంబును, నతులంబు నగు ముక్తిలాభంబు నందుఁడు. నేను గురుపాదపద్మసేవార్థినై బదరికాశ్రమంబునకుం బోయెదను. పునస్సందర్శన సంభాషణంబులు లభియించుంగాక! అని చెప్పటయు మునీంద్రులు సూతునకు మాటిమాటికి నమస్కరించుచుఁ బరమానందగద్గదస్వరంబున నిట్లనిరి. మహాభాగా! నీ యనుగ్రహంబున మా చిత్తవిభ్రాంతులు తొలఁగి పోయినవి. అనుటయు సూతుండు వ్యాసాదేశక్రమంబున నిట్లనియెను. మునివరులారా! నాస్తికులును, శ్రద్ధాహీనులును, భక్తిశూన్యులును, శుశ్రూషారహితులు నగువారి కీపురాణార్థం బెప్పుడును జెప్పంజనదు. మహాత్ముండగు వేదవ్యాసుం డనేకపురాణంబులను, ననేకేతిహాసంబులను, సకలవేదార్థంబులను బరిశోధించి యందలిసారంబు నుద్ధరించి తద్రూపంబుగఁ నీ మహాపురాణంబును రచియించి యున్నాఁడు. దీనిని వినుటవలన నభక్తునకు భక్తిప్రాప్తియగును. భక్తునకు భక్తి

వృద్ధియగును. దీని నొక్కసారి విన్నంతమాత్రమున సర్వపాపంబులును భస్మీభూతంబులగును. రెండుసారులు వినినచో నెట్టివానికైనను భక్తి యుదయించును. మూడుసారులు విన్నచో నిస్సంశయముగ భక్తి వర్ధిల్లును. నాలుగుసారులువిన్నచో జ్ఞానచక్షులాభంబున సాక్షాన్మహాదేవ సందర్శనంబు లభియించును. ఇంకొకసారి విన్నచో నిస్సంశయముగ సోహంతత్త్వదర్శనంబగును. కావున భుక్తిముక్తిఫలసిద్ధికై సముత్సుకులగు వారీపురాణంబును దఱచుగ వినుచుండుట శ్రేయంబు. ఈపురాణంబును బంచవారంబు లాకర్ణించినచో సర్వశ్రేష్ఠఫలంబులును లభియించుననియు నట్టివానికి దుర్లభంబెద్దియును గలుగదనియును భగవానుండగు వేదవ్యాసమునీంద్రుండు వచియించియున్నవాఁడు. పురాతన మునీంద్రు లీపురాణంబును బంచవారంబులు విని సాక్షాన్మహాదేవ సాక్షాత్కారంబును బరమపదలాభంబును గాంచియున్నారు. అని సూతుండు చెప్పుటయు మునీంద్రులందఱును శివతత్త్వంబే పరమోత్కృష్టంబని గ్రహించి పరమానందంబుతో స్తవంబులను శివభజనంబులను గావించిరి. ఈపురాణంబు నెవ్వరు వినియెదరో వారికి సర్వాభీష్టంబులు సిద్ధించును. మహాదేవునియందుఁ బరమంబగు భక్తి లాభంబు గలిగి యంతంబున ముక్తిలాభంబగును :—

"అంతే భక్తిం పరాం ప్రాప్య ముక్తిం వై ప్రాప్నుయాత్పునః
శివే భక్తిః శివే భక్తిః శివే భక్తిర్భవే భవే"

కైలాససంహితసమాప్తము.

## ఈనిలయము నందీవరకుఁ బ్రకటింపఁబడి సిద్ధముగనున్న గ్రంథములు.

| నెం | | చందాదారులకు | | | ఇతరులకు | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | దుర్గేశనందని (క్యాలికో) | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 2 | వసుమతీవసంతము | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 5 | సీతారామ | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 6 | నూర్జహాను | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 7 | రాజసింహ | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 10 | మనోరమ (క్యాలికో) | 1 | 0 | 0 | 1 | 12 | 0 |
| 13 | ప్రమదావన | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 14 | వంగవిజేత | 1 | 0 | 0 | 1 | 5 | 0 |
| 17 | దృఢప్రతిజ్ఞ | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 18 | మరకతమంజూష | 1 | 0 | 0 | 1 | 5 | 0 |
| 19 | శ్రీ | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 20 | పరమరహస్యము | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 21 | శ్రీకృష్ణచరిత్రము | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 22 | ప్రతిజ్ఞాపాలనము | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 23 | శ్యామల | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 24 | మాతృమందిరము | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 25 | నీలాంబరి | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 26 | వీరపూజ (క్యాలికో) | 1 | 0 | 0 | 1 | 12 | 0 |
| 27 | అపరాజిత ,, | 1 | 0 | 0 | 1 | 12 | 0 |
| 28 | మాయావి ,, | 1 | 0 | 0 | 1 | 12 | 0 |
| 29 | పూర్ణానందము | 1 | 0 | 0 | 1 | 8 | 0 |
| 30 | శివపురాణము ప్రథమసం॥ | 1 | 0 | 0 | 1 | 8 | 0 |

### అనుబంధగ్రంథములు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | రాధారాణి | 0 | 4 | 0 | 0 | 6 | 0 |
| 2 | యుగళాంగుళీయకము | 0 | 3 | 0 | 0 | 4 | 0 |
| 3 | రాజభక్తి | 0 | 6 | 0 | 0 | 8 | 0 |
| 4 | లీల | 0 | 4 | 0 | 0 | 6 | 0 |
| 6 | ఇందిర | 0 | 3 | 0 | 0 | 4 | 0 |
| 13 | సీతావనవాసము | 0 | 10 | 0 | 1 | 0 | 0 |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 18 కృష్ణకాంతునిమరణశాసనము | 0 | 12 | 0 | 1 | 0 | 0 |
| 21 ఉన్మత్త | 0 | 2 | 0 | 0 | 2 | 6 |
| 26 భారతీయులయుపనివేశములు | 0 | 2 | 0 | 0 | 2 | 6 |
| 28 హారావళి (2 భాగము) | 0 | 3 | 0 | 0 | 4 | 0 |
| 29 విషవాహిని | 0 | 2 | 0 | 0 | 3 | 0 |
| 30 మాధవసేనుఁడు | 0 | 6 | 0 | 0 | 8 | 0 |
| 31 హైమవతి | 0 | 2 | 0 | 0 | 3 | 0 |
| 32 సమస్య | 0 | 2 | 0 | 0 | 3 | 0 |
| 33 అనాథప్రేతము | 0 | 1 | 0 | 0 | 1 | 0 |
| 34 బ్యారిష్టరు | 0 | 1 | 0 | 0 | 1 | 0 |
| 35 సన్యాసిని | 0 | 2 | 0 | 0 | 3 | 0 |
| 36 శాకము | 0 | 1 | 0 | 0 | 1 | 0 |
| 37 ఇదియొకచిత్రము | 0 | 1 | 0 | 0 | 1 | 0 |
| 38 ప్రేమాంజలి | 0 | 1 | 0 | 0 | 1 | 0 |
| 39 బాలునివీరత్వము | 0 | 1 | 0 | 0 | 1 | 0 |
| 40 జాతీయగీతము | 0 | 1 | 0 | 0 | 1 | 0 |
| 41 మాయావిని | 0 | 8 | 0 | 0 | 12 | 0 |
| 42 భారతవీరుఁడు (అర్జునుఁడు) | 0 | 12 | 0 | 1 | 0 | 0 |
| 43 నీతిముక్తావళి | 0 | 4 | 0 | 0 | 6 | 0 |
| 44 నీతికథాముక్తావళి | 0 | 6 | 0 | 0 | 8 | 0 |
| 45 బాలగీతావళి 1వ భాగము | 0 | 1 | 0 | 0 | 1 | 6 |
| 46 బాలగీతావళి 2వ ,, | 0 | 1 | 6 | 0 | 2 | 0 |
| 47 బాలగీతావళి 3వ ,, | 0 | 2 | 0 | 0 | 2 | 6 |
| 48 బాలగీతావళి 4వ ,, | 0 | 2 | 0 | 0 | 3 | 0 |
| 49 తులసీమహాత్మ్యము (పద్య కావ్యము) | 0 | 4 | 0 | 0 | 6 | 0 |
| 50 ప్రణయప్రతిమ | 0 | 10 | 0 | 0 | 12 | 0 |
| 51 లక్షరూపా | 0 | 10 | 0 | 0 | 12 | 0 |
| [illegible] | 0 | 10 | 0 | 0 | 12 | 0 |